# శంకరాద్వైత వ్యాసమాల


రచయిత :

**త్రిపురనేని విష్ణుశంకరరావు**

గుడివాడ. (కృష్ణాజిల్లా)

ప్రథమ కూర్పు :  500 కాపీలు
అక్టోబరు 1989

ద్వితీయ కూర్పు : 1000 కాపీలు
జనవరి 2013

కాపీరైటు మరియు ప్రాప్తిస్థానం :
రంగా & కో., గుడివాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

**ముద్రణ: శ్రీనివాస ప్రింటర్స్, విజయవాడ - 3.  ఫోన్: 0866-2576157**

**Sankaraadvaita series (3 books) are available at http://www.sankaraadvaita.com**

# శంకరాద్వైత వ్యాసమాల

గ్రంథకర్త : త్రిపురనేని విష్ణుశంకరరావు.

## అంకితము

నాకు జ్ఞానచక్షువు నొసంగిన గుడివాడ ప్రణవాశ్రమాధిపతులు,
అద్వైత సాగరమును పుక్కిటబట్టిన, అపరాగస్త్య మహర్షులైన
**బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వామివారి**
పాదపద్మములకు వినయవిధేయతాభక్తి పురస్సరముగా యీ
శంకరాద్వైత వ్యాసమాల అంకితమీయబడినది.




**రచయిత:**

**త్రిపురనేని విష్ణుశంకరరావు**



వీరి ధర్మపత్ని:

**త్రిపురనేని ధనలక్ష్మి**


శంభుడు
మణయ్య
త్రిపురనేని గోపాలరావు
రామస్వామి
రామయ్య
చలమయ్య
వెంకటాద్రి
మాధవరావు
శేషాద్రి
గోపయ్య
భార్య తులశమ్మ
(రచయిత, మాతాపితలు)
జానకిరాముడు
కేశవరావు
నారాయణరావు
శివరామయ్య
విష్ణుశంకరరావు, భార్య ధనలక్ష్మి
(రచయిత)
గోపీచంద్
గోవర్ధనచంద్
భార్య లీలాకుమారి
కస్తూరి
భర్త శిరిపురపు అంకయ్య
వెంకట రవి
నాగేశ్వరరావు
సచ్చిదానంద్
భార్య కేథరిన్
రోహన్
ఓర్లా

## మా గురుదేవులు



**బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వామివారు**
**శ్రీ ప్రణవాశ్రమము**
**గుడివాడ**

### శ్రీ ప్రణవానంద యతీంద్రులు

## గురుస్తుతి

అణుమాత్రమ్మును వేదవిద్య నెరుగంగా లేని మూఢుండ, స
ద్గుణ రాశీ, పరమార్థ తత్త్వమును నాతో నిట్టె పక్కించితే
ప్రణతుల్ చేతు నిరంతరమ్మును భవత్ పాదాబ్జయుగ్మానికో
ప్రణవానంద యతీశ్వరా, గురు వరా పాండిత్య రత్నాకరా.

ప్రణవాకారము సర్వ దేవతలకున్ భద్రాసనం బారయన్
ప్రణవోపాసన ముత్తమోత్తమము సర్వంబద్ధి సంధించుటన్
ప్రణవానందము జన్మ సార్థక మొనర్పంజాలు మార్గమ్ము శ్రీ
ప్రణవానంద యతీంద్రు సంస్మరణ సౌభాగ్యంబు చేకూర్చుగా

ఎందరు లేరు స్వాములు మరెందరు లేరు యతీశ్వరోత్తముల్
పొందుగ కావి గట్టి తమ పొట్టకు పట్టెడు కూడులేక తా
మెందును నిల్వ నీడగన కిమ్మహి బాధల కుందు వారు నీ
చందపు రాజయోగి గుణసాగరు డింకొక డేడి ధారుణిన్.

ఏదియో సాకు కల్పించి, తృప్తి లేక
బాధ పెట్టి ధనము గుంజు, బాధ గురువు
ఖ్యాతి లాభ పూజలు ధనకాంక్ష లేక
బోధ చేయును జ్ఞానమ్ము బోధ గురువు

నిన్ను పోలిన వ్యక్తిని నేను గాన
నిర్భయం బది యెల్లను నీదు సొమ్ము
దైన్య మెరుగని లోక సన్మాన్యు డీవు
స్వామి శ్రీ ప్రణవానంద సంయమీంద్ర.

దేని తెలిసిన సర్వమ్ము తెలియనగునొ
దేని తెలియక నేదియున్ తెలియరాదొ
ఏది పరాపర విద్యల కెడుగడయొ
దాని బోధించు నతడే యదార్థ గురుడు
వాని కొనరింతు పాదాభివందనమ్ము.

# అభిప్రాయములు

## ఆదరవాక్యాలు

- శ్రీశ్రీశ్రీ స్వామి సర్వేశ్వరానంద

శంకరాద్వైత వ్యాసమాల - ఆత్మీయులు శ్రీ విష్ణుశంకరరావు గారు శ్రద్ధాతత్పరులై గురుసన్నిధిని శ్రవణము చేసి మననము చేసుకొన్న విషయాలను ప్రజ్ఞయందు నిలుపుకొని అద్వైతానందము ననుభవించుతూ ఏతదానందము జిజ్ఞాసులోకమునకు ఉదారమతితో అందచేసి ధన్యులయ్యారు.

భయహేతువగు ద్వైత దృష్టిని దూరంచేసి అభయము ప్రసాదించు అద్వైత జ్ఞానము ఈ వ్యాసముల యందు నిండుగా కనిపించుటచే ఈ వ్యాసమాలకు శంకరాద్వైత వ్యాసమాల అను నామము సార్ధకత అని చెప్పవచ్చు. ఆదిశంకరుల అద్వైత సిద్ధాంతమును, క్షుణ్ణంగా అధ్యయనం చేసి శాస్త్రార్ధములను లౌకికోదాహరణముల ద్వారా సర్వానుభవమునందించు ప్రజ్ఞగల మహానుభావులు.

బ్రహ్మలీనులు గుడివాడ ప్రణవానందాశ్రమ స్థాపకులు వేదాంతకేసరి యను బిరుదునందిన ప్రణవానందస్వాములు వీరికి గురువుగారుగా ఉండుట వీరి బహుపుణ్య భాగ్యమని చెప్పవచ్చు. అంతియేగాదు. ఆంధ్రావనియందు పరివ్రాజక శిరోమణులగు మహానుభావులందరి ద్వారా చక్కటి ఆధ్యాత్మ విద్యను సారభూత విషయాలన్నిటిని గ్రహించి తనబుద్ధి వైశారద్యమున ఈ వ్యాసమాలను గూర్చినారు. శంకరుని నామముతో తన నామము అన్వర్ధముగా నుండుటచే ఈ వ్యాసమాల శంకరాద్వైత వ్యాసమాలగా ప్రకటన చేశారు. అభేద దర్శనమ్ జ్ఞానమ్ - జ్ఞానాదేవతు కైవల్యమ్ అన్న శ్రుతి వాక్యతాత్పర్యమును అవస్థాత్రయ వివేకము ద్వారా చక్కగా మననము చేసుకున్నవారు. వీరు జాగ్రత్ స్వప్న సుషుప్తి అను మూడవస్థలలోను శబ్ద, స్పర్శ, రూప, రస, గ్రంధాదులైన జ్ఞేయ పదార్ధములు ప్రతిదినమునకు తెలియవచ్చు చుండునో అవి పరస్పరము వేరుగా

నున్నప్పటికిని అన్నిటియందు అవి ఏక రూపముగనే వ్యాప్తములుగా నుండును గాబట్టి వానియొక్క జ్ఞానము పరస్పరము వేరుగానుండదని చక్కటి జ్ఞానమును ఈ వ్యాసములయందు వ్యక్తము చేయగల్గినారు. సర్వానర్థదాయకమగు నహంకారమునకు దాని ధర్మములైన కర్తృత్వభోక్తృత్వాదులకు ఆత్మ ద్రష్టమై ఉన్నదను అనుభవమును సదృష్టాంతమున ఇందు నిరూపణ చేయగల్గినారు. అసంగోహ్యాయం పురుషః అన్న శ్రుతి వాక్యమును బాగా నెమరువేసుకొని ఆకాశాది భూపర్యంతము అహం మొదలు దేహ పర్యంతము సర్వత్రావ్యాపించి అఖండైక రసమై వెలుగొందు ప్రజ్ఞయే తన నిజ స్వరూపమని మహావాక్య తాత్పర్యమును ఇందురూఢి పరచగల్గినారు. ఈనాడు ఎన్నియో శాస్త్రాలు ఎందరో మహాత్ములు భిన్నభిన్న భావనల వ్యక్తం చేస్తూ ఆత్మవిద్యను కలుషిత మొనర్చుట గుర్తించి, పరంపర శ్రుతియుక్తి అనుభవములద్వారా గురుకృపనంది తాజీర్ణించుకొని వ్రాసిన ఈ వ్యాసమాల జిజ్ఞాసువులకు ఆదరణీయమైనదని తలుస్తాను. ఆత్మ సత్తు, చిత్తు, ఆనందము, బ్రహ్మము, కూటస్థము, సాక్షి, ద్రష్ట, ఉపద్రష్ట, ఏకము, స్వయం ప్రకాశము అను నిటువంటి విధేయ లక్షణములచేతను, అనంతము, అఖండము, అసంగము, అద్వితీయము, నిర్వికారము, అప్రమేయము, అవ్యయము, అక్షరము, అజము, నిరాకారము అను నిటువంటి నిషేధ లక్షణములచేతను, చక్కగా ఆత్మ స్వరూపానుభవమును బుద్ధి ద్వారా ధారణ చేసిన ఉత్తమ గృహస్థులు. వీరు సదా సాధుసేవారతులై శాంతి దాంతి ఉపరతి మొదలుగాగల దైవీగుణములను హృదయంలో పాదు కొల్పుకొని వారి అనుభూతిని అనేకవిధ వ్యాస పరంపరల ద్వారా అద్వైతానుభూతిని ఈ గ్రంథము ద్వారా వ్యక్తము చేసుకొని తమ జన్మనుసార్థకము చేసుకొన్నారు. వీరి జన్మచే వారి కులము వంశము పావనము. బ్రహ్మవిదులు వీరిని సదా ఆశీర్వదిస్తూ వీరి బ్రహ్మానుభవమును మరింత కొంగ్రొత్త పోకడలచే విస్తరించు గ్రంథములు వెలువడ చేయుదురు గాక.

ఇతి శివమ్.

**స్వామి సర్వేశ్వరానంద.**

## శ్రీ భూమానంద భారతీస్వామి

గౌరవ అధ్యక్షులు:
అఖిలాంధ్ర సాధుపరిషత్తు, (రిజిష్టర్డు నెం.69/65)
కేంద్రము: నాజరుపేట, తెనాలి - 522 201.

**బ్రహ్మవిద్యాశ్రమము, కల్యాణదుర్గం - 515 761. అనంతపురం జిల్లా**

### అనుభూతి వాక్యములు

**"అధ్యాత్మ విద్యా విద్యానాం"** విద్యలలో ఆధ్యాత్మ విద్యతానని భగవంతుని మాట. భారతదేశం బ్రహ్మవిద్యకు మూలకేంద్రము. అనాదినుండి ఎందరెందరో మహామనీషులు సత్యాన్వేషణ తత్పరులై అంతర్ముఖ బుద్ధిచే దివ్యానుభూతి పొంది, తదనుభవమును గ్రంథరచనద్వారా లోకమునకు వెలుగుబాట చూపియున్నారు.

సుమారు పండ్రెడు శతాబ్దముల క్రితమే అద్వైతానుభూతి పొంది **"బ్రహ్మైవసత్యమ్"** అను పరమ సత్య వేదాంత డిండిమమును ఆసేతు హిమనగర పర్యంతము మ్రోగించి దేశము యొక్క నాలుగుదెసల చతుర్విధాశ్రమములను నెలకొల్పి **"నహిజ్ఞానేన సదృశం"** ఆత్మజ్ఞానముతో సమమైనది యింకొకటి లేదని పృధివీ జనులను అజ్ఞాన నిద్రనుండి మేల్కొల్పిన, అపర శంకరుడు, అసమాన మేధావి శ్రీ మచ్ఛంకర భగవత్పాదులు. శ్రీవారి భాష్య రచనలే అద్వైత మార్గావలంబులందరికి పరమ ప్రమాణములు. "మహాజనోయేన గతస్సపంథా" మహాజనుల అడుగుజాడలే మన అందరికిని అనుసరణీయములు. అస్తు.

అకస్మాత్తుగా ఇపుడిపుడే "శ్రీ శంకరాద్వైత వ్యాసమాల" అను పుస్తకము నాచేతికందిన వెంటనే స్థాలీపులాకన్యాయంగా ఆమూలాగ్రము పరిశీలించితిని. వెన్వెంటనే నా హృదయాంతరాళమున దాగియున్న అద్వైత వాసనానది పొంగి పొరలుటచే వృత్తి బ్రహ్మాకారమై బాహ్యమును మరచి తల్లీనుడనై తన్మయమొంది, కొంతసేపటికి మరల

తెప్పరిల్లుకొని ధన్యధన్యుడనని ఆనందించితిని. సీతారామాంజనేయ సంవాదము, వేదాంత పంచదశి, విచార సాగరము ఇత్యాది వేదాంత గ్రంథకుసుమ సారసర్వస్వము తన మేధాబలమున తేనెటీగలవలె ఒకచోటకూర్చి అద్వైత మకరంద పానమున అధికార హృదయముకల జిజ్ఞాసువులనందరిని భవరోగ విముక్తుల జేయుటకై ఈ గ్రంథరచన సాగించిన గుడివాడ త్రిపురనేని విష్ణుశంకరరావుగారి వేదాంతానుభవ కృషి మిక్కిలి ప్రశంసనీయము. శాస్త్రసమ్మత స్వానుభవ గ్రంథమగుటచే ముముక్షువు లందరికి ఆవశ్య పఠనీయము, పరమ ప్రమాణ ప్రకరణ గ్రంథమని చెప్పక తప్పదు.

ఈ గ్రంథకర్తయగు త్రిపురనేని విష్ణుశంకరరావుగారిని నేనొకపరి ఏలూరు పట్టణమున బ్రహ్మవిద్యా గురుకులాశ్రమమున చూసినట్లు జ్ఞప్తియున్నది. పరమ సాత్వికులు, పవిత్రప్రేమ హృదయులు, సదాచార సద్గుణ సంపత్తి కలవారు, వినమ్రతతో కూడిన గురుదైవభక్తి, సాధుసేవ, సద్గ్రంథ పఠన, ఉపన్యాసధోరణి, ఆధాత్మ విద్యా ప్రచారాసక్తి కలిగిన ఋషితుల్య సద్గృహస్థులు - అపరోక్షానుభవ బ్రహ్మజ్ఞాని. వీరికి పరమేశ్వరుడు, సద్గురువులు ఇతోధిక గ్రంధరచనా సామర్థ్యము, ఆయురారోగ్యాదు లొసంగి సర్వదా అనుగ్రహింతురు గాక!

ఓం ఇతి శివమస్తు.

**శ్రీ భూమానంద భారతీస్వామి.**

గౌరవాధ్యక్షులు: అఖిలాంధ్ర సాధు పరిషత్తు.

## శ్రీ రామకృష్ణానందస్వామి

ఎడిటర్: "గీతావాణి"

శ్రీ భూమానందాశ్రమము - గండిక్షేత్రం

# శంకరాద్వైత వ్యాసమాలకు నా అభినందనము

శంకరాద్వైతమునందు ప్రబలనిష్ఠావంతుడగు మహాత్ముడు బ్రహ్మలీన శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వాములవారు. గుడివాడలోని శ్రీ ప్రణవాశ్రమమునకు వారు సంస్థాపకులు. వారి జీవితకాలములో అనేకమంది జిజ్ఞాసువులు వారి బోధను శ్రవణం చేసి తరించినారు. అట్టి వారిలో యీ త్రిపురనేని విష్ణుశంకరరావుగారొకరు. అనుభవి గురువునుండి అధికారి జిజ్ఞాసువు పొందిన అమృత ప్రసాదమీ గ్రంథము. మా గీతావాణి ప్రతికలోను, యదార్థభారతి, శాంతి పత్రికలలోను వీరి యీ వ్యాసాలు కొన్ని ప్రకటింపబడినవి. "వాసుదేవ మననము" లాంటి గ్రంథములవలె యీ గ్రంథము జిజ్ఞాసువులకు పఠనీయ గ్రంథము.

వీరు ఇలాంటి గ్రంథములను రచించి ప్రకటించి గురుసేవను సఫలము చేయ గల్గుదురని, భక్త లోకమునకు సదుపకారము నాచరింపగల్గుదురని, సారస్వత ప్రపంచమునకు సమున్నత సేవను చెల్లించగల్గుదురని ఆశించుచు వారికి నా శుభాశీస్సుల నందించుచున్నాను.

**శ్రీ రామకృష్ణానందస్వామి**

గీతావాణి.

# కిం చిత్ పరిచయము

వ్యాసాశ్రమాధిపతులు శ్రీ విద్యానంద స్వాములవారు తమ ఆశ్రమ మేనేజరు పూర్ణానంద స్వాములవారు ద్వారా గ్రంథముపై పంపించిన అభిప్రాయము.

పరిశుద్ధాత్మ స్వరూపులగు ప్రియాత్మ బంధువులారా! శ్రీమాన్ త్రిపురనేని విష్ణుశంకరరావుగారు బ్రహ్మీభూతులైన పూజ్యపాదులగు శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వాముల వారి ప్రియశిష్యులు. శ్రీ స్వాములవారు కృష్ణాజిల్లా గుడివాడ యందలి ప్రణవాశ్రమాధీశ్వరులు. మహానుభావులు. శ్రీవారి సన్నిధిలో శ్రీ విష్ణుశంకరరావుగారు 30 సంవత్సరములు మిక్కిలి జిజ్ఞాసతో ఆదరభావముతో వేదాంత శ్రవణము గావించిరి. తరువాత శ్రీ రావుగారు ఉత్సాహభరితులై తాను శ్రవణము గావించిన అద్వైత వేదాంత విషయములను తనకు, లోకమునకు ఉపకారకములగునటుల 30 వ్యాసములతో "శంకరాద్వైత వ్యాసమాల" అనెడి నామముతో ఒక గ్రంథమును రచించిరి. ఇందు 1) కర్మములు, 2) అజ్ఞానము - భ్రాంతులు, 3) ధ్యాన జ్ఞాన భేదములు మొదలగు శీర్షికలతో ముప్పది వ్యాసములు కలవు. మరియు గ్రంథాంతమున "ప్రతిదిన స్మరణీయములు" అనెడి హెడ్డింగులో 1) గాయత్రీ మంత్రము, 2) ప్రాతఃస్మరణము, 3) బ్రహ్మానుసంధానము, 4) దక్షిణామూర్తి స్తోత్రము, 5) సర్వశాస్త్ర సారము అను విషయములు కలవు. చివరిలో మృత్యుంజయ మహామంత్రము కూడా వున్నది.

పై వ్యాసములలో కొన్ని యదార్థభారతి, గీతావాణి, శాంతి పత్రికలయందు ప్రకటితమైనవి. మహోదయులగు జిజ్ఞాసువులారా! ముముక్షువులారా! శ్రీయుతులు విష్ణుశంకరరావుగారు శ్రద్ధతో, భక్తితో పూజ్య శ్రీశ్రీశ్రీ ప్రణవానంద గురుదేవుల సన్నిధిలో శ్రవణ మొనరించి సంపాదించిన ఈ అద్వైత వేదాంత విషయములను మిగుల ఆదరముతో పఠించి వేదాంత జీవితములో ఉన్నతిని బొందుదురు గాక.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు, ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

ఓమ్ తత్సత్ ఓమ్.

ఇట్లు
**శ్రీ విద్యానందస్వామి.**

# పరిచిత వ్యాహృతులు

-సుంకర శివరామయ్య చౌదరి

ఓం శ్రీ: ఓం శ్రీ: ఓం శ్రీ:

శ్రీ త్రిపురనేని విష్ణుశంకరరావుగారు వారి శంకరాద్వైత వ్యాసమాలను నాకు అమూలాగ్రముగ చదివి వినిపించిరి. ఆనంద పరాకాష్టనందుకొంటిని. దుర్వ్యాహ్యామగు జటిలమగు అద్వైత సిద్ధాంతమును, ఎట్లు తమ ప్రసంగ ప్రబోధ ప్రవచనములలో సామాన్య శ్రోతలకు గూడ హితమిత మృదుమధుర వచనములతో అందించునట్లు యీ వుద్గ్రంధమును కూడ తమ చిక్కని, చక్కని లలితపద బంధురావళితో పాఠకులకు అందించిరి. ఇది వారి వాఙ్మయ తపస్సు.

పరమేశ్వరుని సృష్టియంతయు ప్రణవరూపమగు ఓంకార పరబ్రహ్మమే. ఈ సృష్టిలో నరజన్మ దుర్లభము. అందున పండితుడగుట, మీరు అద్వైత పండితుడగుట దురాపము.

**ఈ జన్మమిక దుర్లభమురా, సాజన్మ సాకార సద్గురుని గనరా,**
**నరజన్మమిక దుర్లభమురా, చంచలంబగు జగతిలోపల,**
**శాశ్వతం బొకటేదిరా, కన్నుమూసి తెరచులోపల,**
**కలియుగంబు మాయరా, ఆత్మయొక్కటే అంతటాతానై వెలుగొందురా.**

ఇట్టి ఆత్మతత్త్వ మెరిగిన మహామనీషి - టి.వి. శంకరరావు గారు. కాగడా తలక్రింద చేసినను దాని జ్వాలలు ఉప్పరంబునకు ఎగయునట్లు, ఉన్నతుడు ఎన్ని విఘ్నములు సంభవించినను, ఉన్నతోన్నత పథములకే పయనించును.

స్వార్ధమును వీడి పరార్ధముకొరకు పాటుపడువారు ఉత్తములు. స్వంతలాభమును కొంతమానుకొని, పరులకై పాటుబడువారు మధ్యములు, స్వార్ధమునకై పరులను

బలియిచ్చువారు అధములు. కుడిచి కూర్చుండి నిష్కారణముగ పరులకు అపకృతి చేయువారిని ఏమని పిలువవలయునో తెలియదన్నారు భర్తృహరి. ఇందు యీ రచయిత ప్రథమశ్రేణికి చెందిన ధీరోదాత్తులు, అతిగంభీరులు.

**"త్యాగేనైతేన అమృతత్వమానశు:"** అనునట్టి త్యాగమాయనిది. తమ సంపదలను పరోపకృతికొరకు సాధువులు వినియోగింతురు. ఇట్టి కోవకు చెందినవారు వీరు.

**అయం నిజ: పరశ్చేతి భావనా లఘుచేతసాం,**
**ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకం.**

అనునట్టి మంచి మానవత్వ మాయనిది.

వీరు త్రిపురనేని వంశీయులు. అందులో శ్రీ రామస్వామి చౌదరిగారు జగమెరిగిన బ్రహ్మజ్ఞాని. కృష్ణా మండలాంతర్గతమగు అంగలూరు వీరి జన్మభూమి. తులశమ్మ, గోపయ్యలు వారి తలిదండ్రులు. శ్రీ గోపయ్యగారు శివాలయ ధర్మకర్త, భగవద్భక్తులు. తులశమ్మగారు అతిథి అభ్యాగతుల ఆరాధకురాలు. ఈ దంపతులకు శివరామయ్య జ్యేష్ఠపుత్రుడు. ద్వితీయపుత్రుడు మన గ్రంథకర్త విష్ణుశంకరరావుగారు. విష్ణుశంకరరావు గారి ధర్మపత్ని ధనలక్ష్మి. వీరిరువురు మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష యను సుగుణములకు ఆటపట్టులై యున్నారు. **"పరసుఖ సంతుష్టి: ముదితో"** అనగా ఇతరులకు ప్రకృతిచేసి వారినానందపెట్టి దానితో వీరానందపడుటయే ముదిత యనబడును. దీనికి వారి జీవితచర్యలే ఉదాహృతులు కాగలవు. ఈ దంపతులకు గోవర్ధనచంద్ అను పుత్రుడు. వీరి సతీమణి శ్రీమతి లీలాకుమారి. వీరుభయులు ఉన్నతోన్నత వైద్యవిద్య నభ్యసించి ఇంగ్లండులో జనతకుపయోగపడుచు ఉద్యోగములు చేయుచుండిరి. వీరికి సచ్చిదానంద అను పుత్రుడు గలడు.

వీరీ గ్రంథమున జిజ్ఞాసగల ముముక్షువులకు వేదాంతవీధుల విహరించడానికి రుచికరమగు, అమృతపాథేయమందించిరి. వాసనా క్షయము మొదలుకొని, షడ్లింగసహిత మహావాక్య మహదర్థ వివరణము ఇందు పొందుపరచబడినది. జీవన్ముక్తస్థితిని గూర్చి

వివరింపబడినది. అద్వైత ప్రక్రియకు కావలసిన అన్ని విషయములు, ఇందు ముత్యాలు గ్రుచ్చిన మాలవలె వివేచింపబడి యున్నది గాన ఈ గ్రంథమునకు "శంకరాద్వైత వ్యాసమాల" యను నామము అన్వర్థమైనది. సాధన చతుష్టయ సంపత్తి గలిగిన జిజ్ఞాసువులు, ఈ గ్రంథమును ఆమూలాగ్రముగా చదివి మననము చేసికొన్నచో విదేహ ముక్తులగుదురని యనుటకు నాకెట్టి సంశయమును లేదు.

**శంకరాద్వైత వ్యాసముల్ (గద్యముల్) శంకలుడిపి**
**సర్వవేదాంత సిద్ధాంత సత్యములను**
**ఆరు రుక్షుల కందించు ఆత్మనలర**
**ఏ తదమృత మాస్వాదింపుడేపు మీర.**

ఇట్లు,
విద్వాన్ విద్యాపద్మ వైద్యమిత్ర కవిమిత్ర,
**సుంకర శివరామయ్య చౌదరి**

# మిత్రుని అభిప్రాయం

శ్రీ విష్ణుశంకరరావుగారు నా బాల్యమిత్రులు, సరసులు. సరసులు అంటే, వారు వాదం కోసమే వాదించరు. సారాన్ని గ్రహించడానికే సంభాషిస్తారు. ఇట్టి వీరు, తాను అపుడపుడుగా వ్రాసిన వ్యాసమాలను చూడమని ఒక స్నేహితునిగా నాకు పంపారు. కావున వీరు గ్రహించిన సత్యమేమిటో మనమించుక చూద్దాం.

వీరు ఈ వ్యాససంపుటి కిచ్చిన నామధేయం "శంకరాద్వైత వ్యాసమాల" సామాన్యంగా పాఠకులు ఆదిశంకరాచార్యుని అద్వైతమును గురించి వ్యాసమాల అనుకుంటారు. కాని దీనిలో బహువిధ అద్వైతాలు చర్చించబడినవి. కాబట్టి వివిధాద్వైతాలను విష్ణుశంకర రావులోని "శంకరుడు" అర్థం చేసుకున్న ప్రకారమే ఈ అద్వైత మాల - అని మనం అనుకోవాలి.

ఈ "శంకరుని" ప్రకారమేదో ఇపుడు పరికించుదాం:

మాయా = మా + యా = విచారించినపుడు ఏది లేదో, అది "మాయా" అని శ్రీశంకరాచార్యుడు. ఈ నిర్వచనం నివ్వడంతో పాటు శంకరరావుగారు ఈ రెండవ నిర్వచనం కూడ ఇచ్చారు. మాయా = మా + యా = యా మినోతి, సామాయా అనగా ఏది బ్రహ్మమూలంలోని ఒకానొక సత్యంను కొలిచి నిర్ణయించి, అభివ్యక్తం చేస్తుందో అది మాయ. **"సంభవామి ఆత్మమాయయా"** (గీత: 4-6) అనే పదంలో మాయ భగవంతునికి అభివ్యక్తి సాధనమని గీతాకారుడు కూడ తెలుపుతున్నాడు. పోతే శంకరరావుగారు దీనివైపుకే మొగ్గు చూపారు. గాన ఈ అద్వైతాన్నే వారు సారంగా గ్రహించారని మనం అర్థం చేసుకోవాలి.

తర్వాత **"స్వస్వరూపాను సంధానం భక్తి:"** అనే శంకరాచార్య భక్తి నిర్వచనాన్ని రచయిత ఉదాహరించారు. భక్తుడు అనుసంధించేది (అన్వేషించేది) తన స్వరూపమే

గాన, ఈ భక్తిలో ద్వైతం లేదు. ఇది కూడ వీరికి నచ్చిన అద్వైతమే. ఇట్టి భక్తి కూడ వీరికి అభిమాన పాత్రమే.

మహాత్ములు, అవతారాలు చెప్పింది చెప్పడానికే రారు. ప్రపంచాన్ని గమ్యం దిశగా మరికొంత ముందుకు నడపడానికి వస్తారు అందుచేత పాతవారు చెప్పింది సత్యమే అయినా, క్రొత్త వారు చెప్పేది అధికతర సత్యం గాన, ఈ నూతన భవ్యతరసత్యాన్ని గ్రహించడానికి జిజ్ఞాసువులు సుముఖంగా ఉండాలి. అట్టి సుముఖత శ్రీ శంకరరావు గారిలో కన్పించడం ముదావహం. అందుకు వారిని అభినందించుతున్నాను.

**చెలసాని నాగేశ్వరరావు**

## Preface to the Second Edition

As the late author originally did not intend to write Sankaraadvaita Vyaasamaala 2 & 3, the first volume was not designated as Sankaraadvaita Vyaasmala-1. The late author has given the reasons in the second volume for writing the other two books. As the present intention was to reprint exactly as they were, the second and third books were reprinted exactly the same. Very slight modification was done in the presentation in the first book and these few lines are added here. These three books are now available on the web at http://www.sankaraadvaita.com

On behalf of the late author, I would like to thank Mr.Chakka Pandu Ranga Rao, who has the copyright, for allowing the three volumes to be reprinted and for his advice. My sincere thanks go to Mr.Mamidi Narendra Babu without whose help, the reprinting would have been impossible. Also, I would like to thank Mr. Kandula Vishnu for his kind assistance during this venture. I would like to thank Mr. Chilukoti Murali for his devoted attention in printing and packaging and his heartfelt respect to the late author. My thanks go to Mr. Kallakuri Sreedhar & Mrs. K.V. Radhika Madhavi for D.T.P. and making the necessary CDs for the press. I am very grateful to Mr.Paasam Sandeep Chowdary for his advice on the web designing and for making the books available on the internet.

**Kasturi**
**The Author's Daughter**

# కృతజ్ఞతావచనములు

నా ఈ శంకరాద్వైత వ్యాసమాలను ఆదరపూర్వకముగా అందుకొని శ్రద్ధతో పరిశీలించి, నాకు సమధికోత్సాహమునందిస్తూ భాషా శైలులను, వాక్యదోషములను గమనించక భావమును గ్రహించి ఆదరవాక్యములద్వారా ఆశీస్సుల నందజేసిన మహానుభావులు అనంతపురం జిల్లా బొమ్మక్కపల్లి వాసులు శ్రీశ్రీశ్రీ స్వామి సర్వేశ్వరానంద వారికి, భూత పూర్వక అఖిలాంధ్ర సాధు పరిషత్తు అధ్యక్షులు మరియు శేరీకలవపూడి యందు శ్రీ కృష్ణదేవాలయ నిర్మాతలు, శ్రీ అరవిందులవారి ఇంగ్లీషు రచనలకు తెలుగు అనువాదకులు, స్వార్థత్యాగులు, ఋషితుల్యులైన కృష్ణాజిల్లా శేరీకలవపూడి వాస్తవ్యులు శ్రీశ్రీశ్రీ చలసాని నాగేశ్వరరావుగారికి, గుడివాడ పట్టణవాసులు సంస్కృతాంధ్ర భాషాపండితులు, కవులు అయిన శ్రీశ్రీశ్రీ సుంకర శివరామయ్యగారికి, శ్రీ వ్యాసాశ్రమాధిపతులు, యధార్ధభారతి పత్రికా సంపాదకులు బహుకాలముగా అఖిలాంధ్ర సాధు పరిషత్తులు నిర్వహించుచు నిరంతరాద్వైత ప్రచారము చేయుచు, అఖిలాంధ్ర లోకమునకు పరిచితులైన శ్రీశ్రీశ్రీ విద్యానందగిరి స్వాములవారికి, అనంతపురం జిల్లా కల్యాణదుర్గం బ్రహ్మ విద్యాశ్రమాధిపతులు, ప్రమావృత్తి, కల్యాణ మార్గము వగైరా గ్రంథరచయితలు, గౌరవాధ్యక్షులు అఖిలాంధ్ర సాధు పరిషత్తు కేంద్రము నాజరుపేట, తెనాలి అయిన శ్రీశ్రీశ్రీ భూమానంద భారతీస్వామివారికి, కర్నూలుజిల్లా ఆళ్ళగడ్డ గీతావాణి సంపాదకులు వయోవృద్ధులు, సతతము సనాతన ధర్మప్రచార నిమగ్నులైన శ్రీశ్రీశ్రీ రామకృష్ణానంద స్వామివారికి, యీ మహాత్ములకందరకు నా కృతజ్ఞతాపూర్వక వందనములర్పించు కొనుచున్నాను.

గ్రంథ ప్రచురణయందు అచ్చుపని నిర్వర్తించిన శ్రీ రామాప్రెస్‌వారికి, గ్రంథమునకు తెల్లకాగితములు మున్నగు వానిని నాయందు ప్రేమాభిమానముల చేత ఉచితముగా నిచ్చిన శ్రీ చక్కా పాండురంగారావుగారికి, ప్రింటింగు సమయమున ప్రూఫ్ చూచుటలో

బాధ్యత వహించి సహకరించిన శ్రీ మామిడి నరేంద్రబాబు, పుల్లేటి లక్ష్మీనరసయ్యగార్లకు నా కృతజ్ఞతలు.

సంధి వ్యాకరణాది దోషములు కొన్ని ఇందు దొర్లియుండవచ్చును. మామూలు గృహస్తుగా ఎక్కువ విద్యాపాండిత్యములు లేని నాచే వ్రాయించిన ఆ అద్వయ బ్రహ్మమనదగు గురుదేవునికి భక్తిపూర్వక ప్రణామములర్పించుకుంటూ, ఇందలి దోషములు గ్రహించక గుణములు గ్రహించి నన్నానంద పెట్టగలరని, పాఠక లోకమునకు మనవి చేయుచున్నాను.

ఇట్లు,

భక్తి ప్రపత్తులతో విధేయుడు,

**త్రిపురనేని విష్ణుశంకరరావు**

(ప్రథమ ముద్రణ నుండి సేకరించబడినది)

# విషయ సూచిక

పేజీ నెం.


శాంతి పాఠం

| | | |
|---|---|---|
| 1. | కర్మములు | 1 |
| 2. | అజ్ఞానము - భ్రాంతులు | 6 |
| 3. | ధ్యాన జ్ఞాన భేదములు | 10 |
| 4. | తీర్థము - ప్రసాదము | 14 |
| 5. | వాసనాత్రయము తన్నివృత్తి | 18 |
| 6. | సాధన చతుష్టయము | 23 |
| 7. | దు:ఖము - దాని ఆత్యంతిక నివృత్తి - ఆనందస్థితి | 29 |
| 8. | భక్తి | 33 |
| 9. | విజయదశమి | 38 |
| 10. | గురుమంత్రము | 44 |
| 11. | సాక్షి అనుభవము | 48 |
| 12. | ఓంకార బ్రహ్మముల యబేధము | 52 |
| 13. | తాను (ఆత్మ) నేను (జీవుడు) ఇది (ప్రపంచము) | 69 |
| 14. | అవిద్య - మాయ | 65 |
| 15. | మనశ్శాంతి | 73 |

| | | |
|---|---|---|
| 16. | జీవన్ముక్తులు | 81 |
| 17. | మోక్ష ప్రతిబంధకములు | 88 |
| 18. | జగత్తు, జీవుడు, ఈశ్వరుడు, పరమాత్మ | 93 |
| 19. | పంచదశ జ్ఞానయోగాంగములు | 98 |
| 20. | షడ్లింగసహిత మహావాక్యములు | 107 |
| 21. | అన్వయ వ్యతిరేకములు, ఆధారాధిష్టాన భ్రాంతులు, అధ్యాస | 111 |
| 22. | ఉపనిషత్తులు: అహం బ్రహ్మాస్మి తత్త్వమసి మహావాక్యములు | 116 |
| 23. | బ్రహ్మము - తటస్థ, స్వరూప లక్షణములు | 120 |
| 24. | స్వభావము | 123 |
| 25. | అష్టవిధ ప్రమాణములు | 127 |
| 26. | జీవభావన | 131 |
| 27. | గీతలోని కూటశ్లోక వివరణ | 135 |
| 28. | ఆత్మ స్వరూపము | 138 |
| 29. | భిన్నత్వములో ఏకత్వము | 142 |
| 30. | శాంతిమంత్రము (సదసద్వివేకము) | 145 |
| | ప్రతిదిన స్మరణీయములు | 152 |

# మనవి

అఖిల జీవులాత్యంతిక దు:ఖనివృత్తి శాశ్వతానంద ప్రాప్తిని కోరుచున్నారు. దీనిని పరమ పురుషార్ధమనియు, మోక్షమనియు విజ్ఞులందురు. ఈ యాత్యంతిక దు:ఖనివృత్తి శాశ్వతానందరూప మోక్షము. తన స్వరూపమునందే యున్నది. విషయవాసనా రూపమగు ప్రపంచమునందు సత్యత్వదృష్టిని నిలుపక సమస్త బ్రహ్మాండమును విచారించి ఆత్మయందు జ్ఞానదృష్టితో చూడగలిగిన సాధకులందరు జీవన్ముక్తులగుదురు. జీవన్ముక్తి అహంకారలయముతో గూడినది. అహంకారము వ్యక్తిగతము. వ్యక్తియే జీవన్ముక్తుడు కాగలడు. ప్రతివ్యక్తి గమనించవలసిన ముఖ్య విషయమేమన, తన శ్రద్ధాభక్తులే తాను ఉత్తీర్ణుడగుటకు ముఖ్యసాధనములని గుర్తించవలెను. సమ్యక్ప్రమాణ జనిత బుద్ధి, అనగా ధృఢ సంకల్పమవసరం.

నేను గుడివాడ ప్రణవాశ్రమాధిపతులు, బ్రహ్మీభూత శ్రీశ్రీశ్రీ ప్రణవానందస్వాముల వారివద్ద అద్వైత వేదాంతము కొంతకాలము శ్రవణము చేసి, ఆ మహాత్ముని ఆశీర్వాదములను పొంది క్రమముగ కొన్ని అద్వైత గ్రంథములను ముఖ్యముగ సత్రంపాడు బ్రహ్మవిద్యా గురుకులాశ్రమాధిపతులు బ్రహ్మీభూత జగద్గురు శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందగిరి స్వాములవారి రచనలు, ఇతర ఉపనిషద్గ్రంథములు మొదలగునవి చదివి అందలి సారలేశమును గ్రహించితిని.

**"తచ్చింతనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనమ్ తదేక పరత్వఞ్చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధా:"** అను వాక్యము ప్రకారం ప్రస్తుత ప్రణవాశ్రమాధిపతులు శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానంద భారతీ స్వామివారితోను, మరి యితర సత్పురుషులతోను సత్సంగ సమావేశములు జరుపుచు అందు పాల్గొనుట నా దినచర్యయైనది. ఈ నా సాధనలో నాకు త్రికరణశుద్ధిగా సహకరించి తాను కృతార్థురాలై నాకు చేయూతనిచ్చిన నా సతీమణి బ్రహ్మీభూత శ్రీమతి ధనలక్ష్మిని కూడ స్మరించుట సమంజసమని నా భావన.

వేదికలపై నాబోధలు విన్న మిత్రులు కోరిన కోరికపై వారికి వేదాంత వ్యాసములను వ్రాసి పంపుచుండెడి వాడను. వారు చదువుకొని ఆనందించి కృతజ్ఞత తెలుపుచుండెడి వారు. వారి కృతజ్ఞతా లేఖలు నాకు మరింత ప్రోత్సాహము కలిగించుటచే కొన్ని వ్యాసములు వ్రాసి గీతావాణి, యదార్ధభారతి, శాంతి మున్నగు మాసపత్రికలకు పంపగా వారు ఆదరముగా వాటిని తమ పత్రికలలో ప్రచురించియున్నారు. నా మిత్రులు సంస్కృతాంధ్ర భాషా పండితులు, ఉపాధ్యాయ వృత్తి నుండి రిటైరయిన శ్రీ సుంకర శివరామయ్యగారు యీ వ్యాసములను ప్రశంసించుచు, వానిని గ్రంథ రూపముగా ప్రకటించుట సముచితమని పల్కి నాకెంతయో చేయూతనిచ్చి యీ గ్రంథము వెలువడుటకు కారకులైరి. భాషాజ్ఞానము తక్కువైనను గుర్వనుగ్రహ బలముచే నేనీ గ్రంథమును రచించుట కుపక్రమించితిని. ఈ వ్యాసములు ఒక సంవత్సరములో వ్రాసినవి కావు. అనేక గ్రంథములలో గ్రహించిన ముఖ్య విషయములను ఒకచోట జేర్చి అప్పుడప్పుడు వ్రాయడం జరిగినది. ముఖ్యముగ జీవబ్రహ్మైక్య విషయమే ప్రస్తావించబడినది. ఇందు దోషములేవైన యున్నచో అజ్ఞాన పతితములుగాని, అహంకార జనితములు కావనియు మనవి జేయుచున్నాను.

ఓం తత్ సత్.

రచయిత,
**త్రిపురనేని విష్ణుశంకరరావు,**
గుడివాడ.

# శాంతిపాఠము

**ఓం పూర్ణమద: పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణము దచ్యతే ।**
**పూర్ణస్య పూర్ణామాదాయ పూర్ణమేవావశిష్యతే ॥**

ఓం - ఓం; అద: - అది; పూర్ణం - అనంతం; ఇదమ్ - ఇది; పూర్ణం - అనంతం; పూర్ణాత్ - అనంతము నుండి; పూర్ణం - అనంతం (ప్రపంచము); ఉదచ్యతే - బహిర్గతమైనది; పూర్ణస్య - అనంతము నుండి; పూర్ణం - అనంతం (ప్రపంచము); ఆదాయ - తీసివేసినా; పూర్ణం - అనంతం; ఏవ - మాత్రమే; అవశిష్యతే - మిగిలియున్నది; ఓం - ఓం; శాంతి: - శాంతి.

ఆ కనుపించనిది అనంతం. ఈ కనిపించే విశ్వం కూడా అనంతం. ఆ అనంతం నుండి ఈ అనంతవిశ్వం బహిర్గతమైనది. ఈ అనంత విశ్వం దాని నుండి వెలువడినా అనంతం అలాగే యున్నది. లేక - కనుపించనివన్నీ బ్రహ్మముచే నిండియున్నవి. కనిపించేవి అన్ని కూడ బ్రహ్మము చేత వ్యాప్తములై యున్నవి. అఖిల విశ్వము ఆ పూర్ణ బ్రహ్మము నుండే వచ్చింది అయినా విశ్వమఖిలము. దాని నుండి వచ్చినా ఇంకా ఆ బ్రహ్మము పూర్ణమే.

# కర్మములు

శరీర పరిగ్రహణమువల్ల దు:ఖమవశ్యముండును - శరీర పరిగ్రహణము కర్మఫలముల వల్ల జరుగుచున్నది. సూక్ష్మ పంచభూతముల, వ్యష్టి సమష్టి సత్వాంశము వలన జ్ఞానేంద్రియాది అంత:కరణములు కలుగుచున్నవి. సూక్ష్మ పంచభూతముల సమష్టి రజోంశము వలన ప్రాణమును, వ్యష్టి భూతముల రజోంశము వలన కర్మేంద్రియములును కలుగుచున్నవి. తమోగుణము వలన స్థూలశరీర విషయములును కలుగుచున్నవి. కావున యివి గుణములు అనబడును. ఇందు రాజససాత్విక గుణములగు ఇంద్రియాంత: కరణములు తామస గుణములగు విషయములందు ప్రవర్తించుటయే కర్మములని చెప్పబడును.

అజ్ఞాని యీ గుణములే తానని, వాని కర్మములు తనవనియు తలంచి ఇహపర భోగముల కొఱకు లౌకిక వైదికములగు వివిధ కర్మలు చేయుచున్నాడు. కర్మలు పుణ్యకర్మలనియు, పాపకర్మలనియు మిశ్రమ కర్మలనియు మూడు విధములు. ఇవి మనస్సు చేతను, వాక్కు చేతను. శరీరము చేతను. చేయబడుచుండును.

పరమార్థ చింత, జ్ఞానవైరాగ్య చింత, పరహిత చింత మొదలగునవి మనస్సుచే చేయబడు పుణ్యకర్మలు. సర్వదా విషయచింతన, వేదశాస్త్రములప్రమాణములను చింత, పుణ్యాపాపములు లేవను చింత, పూర్వజన్మ పునర్జన్మలు లేవను చింత. పరాహిత చింత మొదలగునవి పాపకర్మలు. భగవంతునారాధించునపుడును, పరమార్ధ విచారణ చేయునపుడును, ధర్మకార్యములు మొదలగు సత్కార్యములు చేయు సమయమున విషయములను చింతించుట మనస్సుచే చేయబడు మిశ్రమ కర్మలు.

వేదాధ్యయనము, గీతాపారాయణము, గాయత్ర్యాది మంత్రముల జపము మొదలగునవి వాక్కుతో చేయబడు పుణ్యకర్మలు. పెద్దలను దూషించుట, అబద్ధము

లాడుట, పరులను నిందించుట మొదలగునవి పాపకర్మములు. వేదాంతశాస్త్ర శ్రవణ సమయమున, మంత్రములను జపించుట మున్నగునవి చేయునపుడు లౌకిక సంభాషణలు చేయుట మిశ్రమ కర్మములు. పుణ్యక్షేత్రముల కేగుట, పుణ్యతీర్థముల స్నానమాడుట, గురువునకు చతుర్విధ శుశ్రూషలొనర్చుట మొదలగునవి శరీరముతో చేయు పుణ్యకర్మములు. పరులను పీడించుట, పరధనములపహరించుట, పరస్త్రీలతో గూడుట, విషాది ప్రయోగములచే పరుల నంతమొందించుట మొదలగునవి శరీరముతో చేయు పాపకర్మములు. చందాలు ప్రోగుజేసి సంతర్పణలు సాగించుట, పరులధనము నపహరించి గుడిగోపురాదులు కట్టించుట, ప్రజోపయోగములగు చెఱువులు, బావులు త్రవ్వించి ధనమెగవేయుట, మొదలగునవి శరీరముతో చేయు మిశ్రమ కర్మములు అనబడును. మనోవాక్కాయములతో చేయబడు పుణ్యకర్మముల చేత ఉత్కృష్ఠ దేవతా శరీరములు కలుగుచున్నది. పాపకార్యములు చేయుటచే నీచయోనులయందు బడుట సంభవించుచున్నది. మిశ్రమకర్మ లొనర్చుటచే మనుష్య జన్మ కలుగుచున్నది. కావున వివేకియైనవాడు పుణ్యకర్మములు చేయుచుండవలెను. లేనిచో మిశ్రమ కర్మములనైన చేయవలయును గాని పాపకర్మములు చేయగూడదు.

ఈ త్రివిధకరణములచే చేయబడు పాపపుణ్య మిశ్రమ కర్మములు మూడును సంచితాగామి ప్రారబ్ధములని త్రివిధములగును. అనేక జన్మముల నుండి చేయబడి ఇంతవరకు అనుభవింపబడక సంస్కార రూపముగా నిలిచియున్నవి సంచిత కర్మము లనబడును. వర్తమాన శరీరముతో ఇపుడు చేయుచున్న పాపపుణ్య మిశ్రమ కర్మములు ఆగామి కర్మములనబడును. పూర్వము చేయబడి సంచితరూపమున నిల్చియున్న కర్మములలో వర్తమాన శరీరమును, ఈ శరీరమునందు సుఖదు:ఖములను కలిగించెడి కర్మ భాగమును ప్రారబ్ధకర్మమందురు. వానిలో సంచిత కర్మలు బ్రహ్మజ్ఞానము కలిగిన వెంటనే నశించుచున్నవి. జ్ఞానికి కర్తృత్వాభిమానము లేకపోవుటచే ఆగామి కర్మములు ఉండవు. సుఖదు:ఖ రూపమగు ప్రారబ్ధకర్మము లనుభవించుటచే నశించుచున్నవి.

**శ్లో॥ "సంచితాగామి కర్మాణి దహ్యస్తేజ్ఞాన వహ్నినా।
ప్రారబ్ధానుభవాన్మోక్ష: ఇతి వేదాన్త డిండిమ: ॥"**

సంచితాగామి కర్మజాలము జ్ఞానాగ్ని వలన భస్మీపటలమగుచున్నది. ప్రారబ్ధ భోగానంతరము ముక్తి లభించుచున్నదని వేదాంత డిండిమము.

కర్మముల వలన శరీరములు గలుగుచున్నవి. శరీరపరిగ్రహమున్నచోట దు:ఖమున్నది. దానికి పరిహారము మన మందఱము చేసికొన్న కర్మఫలము తప్ప మరొకటేది కాదని నిర్ణయము. ఎందుచేతనంటే జ్ఞానోదయానికి కావలసిన సామగ్రి అంతాయుండి కూడ జ్ఞానము కలుగలేదంటున్నాము. ఇందు శాస్త్రము మానవుడు చేసికొన్న కర్మే, మరేదికాదని ఘంటాపథముగా చెప్పుచున్నది. **"శతకోటి జన్మసుకృతై: వినా, నలభ్యతే అద్వైత వాసనావాసి తాంత: కరణం".** కర్మ అంటే మనము చేసేపనులే. కర్మలన్ని చలనాత్మకాలే. కనురెప్పవేయుట, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు, కర్మలే. మనము పట్టించుకొనము. ఎప్పటికప్పుడు సమసిపోతాయి. మిగతా కర్మలలో అలా పట్టించుకొనకుండా ఉండుటలేదు. ఒక పనిచేస్తున్నానని కర్తృత్వ బుద్ధి, దానివల్ల యీ ఫలితం పొందాలనే భోక్తృత్వ బుద్ధి పెట్టుకుంటాము. అది వెంటనే మన మనస్సులో వాసనా రూపంగా పరిణమిస్తుంది. ప్రతిక్రియకు ఒక ప్రతిక్రియ ఉండి తీరుతుంది. ఈ ప్రతిక్రియయే వాసన. ఈ వాసనలే లేవని చెప్పితే, సృష్టి వైచిత్ర్యానికి, వైషమ్యానికి కారణము చెప్పలేము. కాన వాసనలేర్పడుట తథ్యము. ఏర్పడిన అవి శాశ్వతంగా అంటిపెట్టికొనును. శరీరం పతనమైనా అవి పోవు. మరణించిన తర్వాత సూక్ష్మ రూపంలో జీవుడుండునుగదా? మన వాసనలు గూడ మనతో నుండును.

కనబడుట లేదు గనుక లేవు అనగూడదు. మన ప్రాణము, మనస్సు అదృశ్య రూపంగా నున్నవి. అట్లే యీ కర్మవాసనల యొక్క ఫలితము ఎన్ని జన్మములకైనను మనము అనుభవించి తీరవలసినదే. ఇంగువ కట్టిన గుడ్డలో ఇంగువంతా ఖర్చయి పోయినా దాని వాసన ఆ గుడ్డ నాశ్రయించి ఉంటుంది. అట్లే మనల నాశ్రయించిన ఈ వాసనలు గూడా. కాన కర్తృత్వ భోక్తృత్వ బుద్ధి లేక ఈశ్వరార్పిత బుద్ధితో

ఫలాపేక్షరహితముగ కర్మలు ఆచరించి, వాటి వాసనలు మనకు లేకుండ చేసికొన్నచో మనకు జన్మ హేతుత్వముండదు. మానవుని మనస్సు బాహ్య ప్రపంచ విషయముల వైపుకు పోతుందిగాని, బ్రహ్మాత్మ తత్త్వము మీదికి ప్రసరించదు. అట్లు ప్రసరించనిచో తద్విషయమైన జ్ఞానం మనకెలా కలుగుతుంది. కాబట్టి సర్వాంగ సుందరమైన మానవజన్మనెత్తి బ్రహ్మానుభవం కలుగలేదంటే దానికి జీవులు చేసికొన్న కర్మే తప్ప మరేది కాదని వేదాంతుల నిర్ణయము.

**శ్లో॥ "మన ఏవ మనుష్యాణాం కారణం బద్ధమోక్షయో:**
**బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయంస్మృతం"**

కాన విషయముల వైపు పరుగు విడు మనస్సును ఆత్మబోధ వైపుకు అనగా వేదాంత శాస్త్ర శ్రవణమననముల వైపుకు ప్రసరింపజేసి, సంశయ నివృత్తి చేసుకొని, నిరంతర బ్రహ్మాకార వృత్తి యందు నిష్ఠ గలిగియుండిన, బ్రహ్మానుభవము కలుగును. మన ప్రారబ్ధమువల్ల మనకు బ్రహ్మజ్ఞానమబ్బుటలేదు అని ఎవ్వరు నిస్పృహ పొందనక్కరలేదు. ఒక జన్మలో చేసిన కర్మయేగదా ఇప్పటి ప్రారబ్ధము. అందరు ప్రారబ్ధముతోనే జన్మించినారు.

ఆనందముగ జీవించవలెనని కాంక్షించుట మానవునికి నైసర్గికమైన కామము. అందువలన కర్మ యోగమందరకు కావలసిన విషయము.

**శ్లో॥ మాం హి పార్థ వ్యపాశ్రిత్యయె పి స్యు: పాపయోనయ:**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రస్తేఽ పి యాన్తి పరాం గతిమ్॥ భ.గీ.అ.9 శ్లో.32**

అర్థము:- నికృష్టజన్మలు గలవారును, స్త్రీలును, వైశ్యులును, శూద్రులును, నన్నాశ్రయించి ముక్తిని పొందవచ్చును. కర్మయోగమనగా వైదిక కర్మలు చేయుటయని అర్థము చెప్పినచో పై శ్లోక మర్థవిహీనమగును. కర్మయోగ ఫలమహంకార విలయము. అభిమానము వదులుకొనుట, రజోగుణమును దమింపజేసి సత్వగుణ స్థాపితుడై ద్వంద్వాతీతుడగుట. అంత:కరణమునకు అభావస్థితియని, భావస్థితియని రెండు స్థితులు గలవు. ఒక

భావమునుండి మఱియొక భావమును వేరుచేయునది "అభావస్థితి". ఈ అభావస్థితిని సహజమని, భావస్థితిని కల్పితమని యందురు. భావములు శబ్దరూపములు. **"నిశ్శబ్దం బ్రహ్మ ఉచ్చ్యతే"** బ్రహ్మమనగా అంత:కరణమే శబ్ధముతోను గూడియుండక నిశ్చబ్దముగా వ్యాపకము జెందినస్థితి. భావమున్నంత వరకు శబ్దముండును. శబ్దము నిశ్శబ్దములో నుండి యుదయించి, నిశ్శబ్దముపైనే స్థితిజెంది, నిశ్శబ్దములో లీనము అగుచున్నది. శబ్దము లేకపోయిననను నిశ్శబ్దమున్నది. నిశ్శబ్దము నాశ్రయించియే శబ్దమున్నది. నిశ్శబ్దమే ఆనంద రూపము. సంకల్పము బయటికి రాగానే ఆనందము పోవుచున్నది. అందువలన ప్రతిభావము దు:ఖరూపము.

ఇట్టి వివేకదృష్టితో సజ్జనసాంగత్యము జేసి, ప్రపంచ విషయములు వికారవంతములు, దు:ఖహేతువులని వాటియందు నిస్సంగుడవై, ధ్యానాదులచే మనస్సు నేకాగ్రపరచి, ఉపనిషత్తుల రహస్యార్ధమును శ్రవణము చేసి వాటి సారంశమైన అభేదత్త్వమును గ్రహించినచో జీవన్ముక్తిని అనుభవించగలము.

**శ్లో॥ "కర్మాణి చిత్తశుద్ధ్యర్థం ఐకాగ్ర్యార్థ ముపాసనా,**
**మోక్షార్థం బ్రహ్మవిజ్ఞానం ఇతి వేదాన్త డిణ్డిమః"** **వే.డి.25**

అర్థము:- అంత:కరణమును పవిత్రమొనర్చ కర్మములును, ఏకాగ్రతను గూర్చి ఉపాసనము (ధ్యానము) విధించబడినది. చిత్తశుద్ధి, ఉపాసనల వలన లభ్యమగు బ్రహ్మజ్ఞాన మొక్కటియే మోక్షమును ప్రసాదించగలదని వేదాంతడింణ్డిమము.

వైదిక కర్మలు చేసి మలదోషముల నివారించుకొని, చిత్తశుద్దిని, ఉపాసనలచే చిత్తైకాగ్రతను సంపాదించి మోక్షము కొఱకు బ్రహ్మజ్ఞానము పొంది జీవితమును సార్థకము చేసుకొనవలెను.

ఓం తత్ సత్

# అజ్ఞానము - భ్రాంతులు

(1988 నవంబరు గీతావాణి యందు ప్రకటించబడినది)

వాస్తవముగా ఈ భ్రాంతులు ఆత్మయందు లేకపోయినను అజ్ఞానము చేత తోచుచున్నవి. శ్రుతియందాత్మకు సజాతీయ, విజాతీయ, స్వగత భేదములు నిరశింపబడియున్నవి. మహాకాశమున కంటె భిన్నముగా ఘటాకాశము లేనట్లు బ్రహ్మచైతన్యమున కంటె భిన్నముగా జీవేశ్వర చైతన్యములు లేవు. శ్వేతాశ్వాతరోపనిషత్తు షష్ఠాధ్యాయమున **"ఏకోదేవ: సర్వభూతేషుగూఢ:"** అను పదుకొండవ మంత్రమునందు **"ఏక:"** అను శబ్ధము చైతన్యము. బ్రహ్మ చైతన్యముగా, ఈశ్వర చైతన్యముగా, జీవ చైతన్యముగా వేరు వేరుగా కన్పించుచున్నను అది ఒకటియేయగు భగవంతుడని చెప్పుటకే వాడబడినది.

వేదాంత డిణ్డిమమున

**శ్లో॥ "న జీవ బ్రహ్మణోర్భేద: నామ్నా రూపేణ విద్యతే,**
**నామ్నోరూపస్య మిధ్యాత్వాత్ ఇతి వేదాంత డిండిమ:"**

అని యున్నది. అనగా నామరూపముల ననుసరించి చూచినను జీవబ్రహ్మములకు భేదము లేదు. ఏలయన నామరూపములు రెండును మిథ్య అని వేదాంతభేరి. వాస్తవముగా బ్రహ్మ చైతన్యమున కంటె భిన్నముగా జీవేశ్వర చైతన్యములు లేవు. సంజచీకటిలో రజ్జువునందు దోచెడు కల్పిత సర్పదండమాలాదులు రజ్జువునకంటె భిన్నముగా లేనట్లు బ్రహ్మచైతన్యము నందు అజ్ఞానముచే దోచెడి కల్పిత ద్వైత ప్రపంచము బ్రహ్మచైతన్యమున కంటె భిన్నముగా లేదు. కాని చైతన్యమునందు విజాతీయ భేదము లేదు. బ్రహ్మ చైతన్యము నిరవయమగుటచే స్వగతభేదమును కలుగదు. అట్టి తన స్వరూపము నెరుగకుండుటయే అజ్ఞానము. అనగా జ్ఞాన విపరిలోపము. ఇది అనాదిభావ

రూపము. ఆత్మజ్ఞానము చేత బాధించబడుచున్నది. **"అహమజ్ఞ:"** అను జ్ఞానముచే ఇది అసత్తని చెప్పగూడదు. బ్రహ్మవేత్తలయందు అగుబడుట లేదు గనుక సత్తని చెప్పగూడదు. ఇట్టి అనిర్వచనీయమైన అజ్ఞానముచే ద్వైతప్రపంచ భ్రాంతులు కలుగుచున్నవి.

భ్రాంతులు:- 1) భేదభ్రాంతి, 2) కర్తృత్వభోక్తృత్వ భ్రాంతి, 3) సంగభ్రాంతి, 4) వికారభ్రాంతి, 5) జగత్సత్వ భ్రాంతియను ఐదు భ్రాంతులు. ఇందు భేదభ్రాంతి ఐదు విధములు.

భేదభ్రాంతి:- జీవేశ్వరులు భిన్నులనెడి భ్రాంతి. జీవజగత్తులు వేరనెడి భ్రాంతి, జీవులు పరస్పర భిన్నులనెడి భ్రాంతి. ఈశ్వర జగత్తులు వేరనెడి భ్రాంతి. జగత్పదార్థములు పరస్పరము భిన్నములు అనెడి భ్రాంతి అను ఐదు విధములు.

ప్రబల శ్రుతులు భేదమును నిషేధించుటచే ప్రత్యక్షపరమాత్మల యభేదము సిద్ధించుచున్నది. ఔపాధికమగుట వలన ఘటాకాశ మహాకాశముల భేదము మిథ్యయగునట్లు, ఔపాధికమగుటవలన జీవేశ్వరుల భేదము మిథ్య. ఘటాకాశముల పరస్పర భేదము మిథ్యయగునట్లు జీవుల పరస్పర భేదము మిథ్య. స్వప్నజీవునకు జడపదార్థములతో భేదము మిథ్యయగునట్లు. జీవునకు జడపదార్థములతో భేదము మిథ్య. సాక్షికి స్వప్న ప్రపంచముతో గల భేదము మిథ్యయగునట్లు ఈశ్వరునకు, జగత్తుతో గల భేదము మిథ్య. రజ్జువునందు దోచెడు సర్పదండ మూలాదులు పరస్పరభేదము మిథ్యయగునట్లు, ఆత్మయందు దోచెడి జడపదార్థముల పరస్పర భేదము మిథ్య. ఈ విధముగా లౌకిక ప్రమాణములచే పై ఐదు విధముల భేదభ్రాంతులు మిథ్యయగును.

కర్తృత్వ భోక్తృత్వ భ్రాంతి:- అంత:కరణ ధర్మములగు కర్తృత్వ భోక్తృత్వాదులు ఆత్మయందు వున్నవని తలంచుట కర్తృత్వ భోక్తృత్వ భ్రాంతి యగును. ఇది స్ఫటికమణియందు తోచెడి జపా పుష్పముయొక్క యెఱ్ఱదనమును గూర్చి విచారించినచో

నశించును. స్ఫటిక మణియందు దగ్గరనున్న జపా పుష్పముయొక్క రక్తవర్ణము ప్రతిబింబించినప్పుడజ్ఞులకు స్ఫటికమణి యెఱ్ఱగానున్నదని భ్రాంతి గలుగుచున్నది. ఇది జపా పుష్పరూపమగు యుపాధివలన కలిగిన దగుటచే, దానిని సోపాధిక భ్రమయందురు. స్ఫటిక మణియందు యెఱ్ఱదనము వాస్తవముగా లేదనియు. అది స్వచ్ఛముగా నున్నదనియు, దానియందు తెలియబడుచున్న రక్తవర్ణము, జపా పుష్పముదని తెలిసినప్పటికిని, దాని సమీపమున జపా పుష్పమున్నంత వరకు స్ఫటిక మణియందు రక్తవర్ణము తెలియబడుచునేయుండును. అట్లే బ్రహ్మమునందు అధ్యస్తమైన ప్రపంచముయొక్క అనిర్వచనీయ సంబంధము బ్రహ్మమునందు తెలియబడుచున్నది. **"అహం బ్రహ్మాస్మి"** అను అధిష్టాన జ్ఞానము పొంది, జగత్తు మిథ్యయని తెలిసిన బ్రహ్మవేత్తలకు గూడ జగత్తు ప్రత్యక్షముగా తెలియబడుచున్నది. వారికిగూడ అందలి అనుభవములు గలుగుచున్నది. నేను కర్తను, భోక్తను అను ఆత్మయందుగల కర్తృత్వభ్రాంతి ఆంతర సోపాధిక భ్రమయగును.

**"న జాయతే మ్రియతేవా విపశ్చితి"** ఆత్మ జనన మరణములు లేనిదని చెప్పబడెను. ఆత్మ నిర్వికారాసంగ చిద్రూపుడై యుండగా అంతఃకరణము యొక్క కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములు అజ్ఞానముచే ఆత్మయందు ఆరోపించబడుచున్నవి. కావున ఆత్మకు కర్తృత్వ భోక్తృత్వాది ధర్మాలు లేవని తెలియవలెను.

సంగభ్రాంతి:- ఆత్మకు దేహేంద్రియాదుల యందహంకారమును, స్త్రీ పుత్ర ధన గృహారామాదులయందు మమకారమును కలిగియుండుట సంగభ్రాంతి యనబడును. ఇది ఘటాకాశ దృష్టాంతముతో విచారించిన యెడల నశించును.

వికారభ్రాంతి:- పాలు పెరుగైనట్లు బ్రహ్మమే జీవేశ్వర జగత్తులైనట్లు తలంచుట వికారభ్రాంతి. రజ్జు వివర్తమగు సర్ప దృష్టాంతముతో విచారించినచో వికారభ్రాంతి తొలగిపోవును.

జగత్సత్య భ్రాంతి:- బ్రహ్మమునకంటె అన్యముగా సత్యమగు ఒక జగత్తు ఉన్నదనుట జగత్సత్యభ్రాంతి యగును. మృత్తు ఘటశరావాదుల దృష్టాంతముతో విచారించినచో బ్రహ్మముకంటె భిన్నముగా జగత్తు సత్యమనెడి భ్రాంతి నశించును.

ఈ అనిర్వచనీయమైన ఆత్మాజ్ఞానము వలన ద్వైత ప్రపంచము సత్యమనెడి భ్రాంతి గలుగుచున్నది. వానివలన రాగద్వేషాదులు, వానివలన అనుకూల ప్రతికూల జ్ఞానములు, వానివలన విహితనిషిద్ధ కర్మలు, వాటివలన శరీర పరిగ్రహణము జరుగుచున్నది. కావున సమస్త దు:ఖములకు కారణము ఆత్మ అజ్ఞానము. యీ అజ్ఞానము ఆత్మజ్ఞానమువలన నశించి, అనుకూల ప్రతికూల జ్ఞానములు, రాగద్వేషములు, పై వివరించిన పంచవిధ భ్రాంతులు లేక సర్వానర్థములు నివర్తించి, నిరతిశయానంద మనుభవింపబడుచున్నది. కాన ఆత్మజ్ఞానము బొంది నిజరూపమున నిల్చి, భ్రాంతిని వీడి, దు:ఖరహిత శాశ్వతానందరూప దివ్యజీవితమును గడిపెదము గాక!

ఓం తత్ సత్.

# ధ్యాన జ్ఞాన భేదములు

జ్ఞానము ప్రమాణ ప్రమేయముల కధీనమగును. ధ్యానము విధి, ఇచ్ఛ, విశ్వాసము, హఠము అనునీ నాల్గింటి కధనము. ధ్యానము, ఉపాసన భక్తి, అన్నింటికి ఒకే అర్థము. ఉపాసన అన్నా ధ్యానం అన్నా ఒక కర్మే కదా! బాహిరమైన విషయములతో వ్యవహరించే కర్మలాంటిది కాదిది. ఆంతరమున మనస్సుతో చేయబడు కర్మ సూక్ష్మము. బాహిరకర్మ స్థూలము. అంతర మనోకర్మ అనగా ధ్యానము సూక్ష్మమైన కర్మ. ఈ ధ్యానము ప్రతీక ధ్యానమనియు, ధ్యేయానుసార ధ్యానమనియు రెండు విధములు. సాలగ్రామమును విష్ణువుగా భావించి ధ్యానించుట ప్రతీక ధ్యానమనబడును. వైకుంఠ వాసియగు విష్ణువును చతుర్భుజమూర్తిగను, శంఖ, చక్ర, గదాధారిగను, లక్ష్మీసమేతునిగను ధ్యానించుట ధ్యేయానుసార ధ్యానమనబడును. యీ రెండు విధముల ధ్యానములును విధి విశ్వాస్వేచ్ఛా హఠములు లేక చేయబడవు. ధ్యానమందీ విధముగా ఉపాసించవలెననెడి పురుషుని ప్రేరేపించు వేదవచన రూపమగు ''విధి'' యుండవలయును. వేదవాక్యము నందు శ్రద్ధారూపమగు "విశ్వాసము'' ఉండినగాని ఉపాసన చేయబడదు. ఈ ఉపాసనచేసి ఫలమును పొందవలెననిడి "ఇచ్ఛ'' కూడ నుండవలెను. ధ్యానము చేయునపుడు అంతఃకరణవృత్తి ధ్యేయాకారము గాక విక్షేపము నొందినపుడావృత్తిని ధ్యేయాకార మొనర్చుటకు "హఠము'' కావలెను. యీ విధముగా విధి, విశ్వాస, ఇచ్ఛా, హఠములు నాల్గును ధ్యానమునకు హేతువులగును. మనమెంత సూక్ష్మమని వర్ణించినా ఉపాసనా లేక ధ్యానమనేది కూడ ఒక కర్మే. శబ్దమునకర్థము - ఉప అనగా దగ్గరగా, ఆసన అంటే కూర్చోవటం. మనం పెట్టుకున్న ధ్యేయానికి సమీపంగా వెళ్ళి కూర్చోవటం అని అర్ధము. వెళ్ళటం, కూర్చోవటం అంటే కర్మే గదా! మామూలు కర్మ శారీరకము, యిది మానసికము. మానసిక మైనంత మాత్రాన కర్మగాకుండా పోదు. కర్మకు ఉత్పత్తి, నాశము, ప్రాప్తి వికృతి, సంస్కారము అను ఐదు కార్యములు

మాత్రము కలవు. యీ ఐదు కార్యములు అజ్ఞానాది సర్వానర్థములను నివృత్తి చేసి ఆత్మప్రాప్తిని కలిగించనేరవు. ఆత్మ నిత్యసిద్ధమై యుండుటచే దానికి ఉత్పత్తి నాశములు కలుగవు. సర్వవ్యాపకమై యున్నందున ప్రాప్తికి యోగ్యము కాదు. నిరవయమగుటచే వికారము నొందదు. నిత్యశుద్ధమై యున్నందున సంస్కారము నపేక్షింపదు. కేవలము మనస్సులో సాగించే ధ్యానమే అయినా ఒక మూర్తి నీ మనో నేపథ్యముమీద గోచరిస్తూనే వుంటుంది. ఇక కర్మ కాకపోయిందేమిటి. పైకి కన్పించకుండా లోపలచేసే కర్మ ఇది. ఇందులో కూడా ఉత్పాదనాదులు ఐదు ఉన్నాయి. నీ మనస్సులో అంతకు ముందులేని ఒక దేవతామూర్తిని నీవు తయారు చేసుకుంటావు. కాబట్టి అది ఉత్పత్తే. అన్యవృత్తులను నిరాకరించుచున్నావు. అది వృత్తినాశము. ఆరూపము నీకు దూరమైపోకుండా నీ మనస్సులోనే నిలుపుకోవాలని చూస్తున్నావు. అదే ప్రాప్తి (ఆస్తి) ఆమీదట దానికి కొన్ని హంగులు, రంగులు చేర్చి సర్వాంగ సుందరంగా మలచుకొని తిలకిస్తున్నావు. అది సంస్కృతే. చివరకు దాన్ని నిలుపుకోలేకపోతే నీ మనోమందిరం నుంచి చెప్పకుండా పారిపోతుంది. మరి అది వికృతే గదా! అందుచేత మానసికమైనా యీ ధ్యానంకూడా గొప్పకాదు. అదీ ఒక కర్మ భేదమే. అంతేకాదు మిగతా ఇంద్రవరుణాది దేవతామూర్తులు లాగా ఆ బ్రహ్మతత్త్వాన్ని కూడ మనస్సులో భావించటమనే కదా! అలా ఎన్నిటికిని జరుగబోదు. దేవతలకంటే ఒక నామ రూపమని ఉంది. అదికూడా నీవు కాదు. నీకంటె సర్వవిధాలా భిన్న మాదేవత. నీవు ధ్యాతవైతే అది ధ్యేయము. కనుక భావన అనేది సాధ్యమక్కడ. ఇక బ్రహ్మ విషయంలో అలా కాదు. నామ రూపాధికమైన గుణములు లేవు. దానికి పైగా నీకు ప్రమేయము కాదది. నీ స్వరూపమై కూర్చుంది. అలాంటి దానిని నీవెలా ధ్యానిస్తావు. కనుకనే కేనోపనిషత్ ఇట్లా చెప్పుచున్నది.

**శ్లో॥ యన్మనసాన మనుతే యే నా హుర్మనోమతమ్ ।**
**తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే ॥**

బ్రహ్మ విషయములో ధ్యానము లేక ఉపాసన కాండను నిర్మొహమాటంగా ఖండించ వలసినదే. బ్రహ్మస్వరూపాన్ని నీవు భావన చేయడము ఏమిటి. అది ఉన్నట్లు నీవు

భావించవలెనా! నీవు భావించినట్లది ఉండవలెనా? ఆత్మస్వరూపము నావరించుకొని యున్న అజ్ఞానమును, అజ్ఞానముచే కలిగిన స్థూలసూక్ష్మరూప కర్మములు నివృత్తి చేయజాలవు. నశించు వస్తువు, నశింపజేయు వస్తువు స్వరూపము చేతను, స్వభావము చేతను, పరస్పర విరుద్ధములై యుండవలెను. కర్మాజ్ఞానముల స్వభావ స్వరూపములు విరుద్ధములు కావు. అజ్ఞానము వలె కర్మములు జడస్వరూపములు. అజ్ఞానమునకు భేదమును స్ఫురింపజేయుట స్వభావమైనట్లు, కర్మములు భేదమును అవలంబించి యుండుట స్వభావము. ఇట్టి అవిరుద్ధమగు స్థూల, సూక్ష్మరూప కర్మములు అజ్ఞానమును నివృత్తి చేసి బ్రహ్మసాక్షాత్కారమును కలిగింపలేవు. ప్రతివస్తువునకు లోకంలో స్వభావమనేది ఒకటి ఉంటుంది. అగ్నికి ఉష్ణమనేది స్వభావము. నీటికి చైత్యమనేది స్వభావము. వానిని భావించేటప్పుడంతా అలాగే భావించాలి మనము. నిప్పు చల్లగా ఉన్నది, నీరు వెచ్చగా ఉన్నది అన్నట్లు భావించరాదు. ఒకవేళ నీళ్ళు వేడిగా వున్నట్లు కన్పించితే అది అగ్ని సంపర్కమువల్ల ఏర్పడ్డ గుణమే కాని దాని సహజ గుణము కాదు. కాబట్టి వస్తు స్వభావమని ఒకటి ఉంది. అది ఎప్పటికి మారదు కూడా. మనము వస్తువును గ్రహించునపుడు దాని స్వభావమును బట్టి గ్రహించవలెను. గాని మన ఇష్టానుసారంగా భావించరాదు. అలా భావిస్తే అది ప్రమ అనిపించుకోదు, భ్రమ అనిపించుకుంటుంది. ప్రస్తుతము ఈ బ్రహ్మమనేది అమూర్తము, సర్వవ్యాపకము, ఆత్మరూపమయిన ఒకానొక వస్తువు. ఇది దాని స్వభావము. దాన్ని నీవు ఒక దేవతారూపంగా - బాహ్యమైతే ఒక శిలా విగ్రహ రూపంలోనో, ఆంతరమైతే ఒక హృదయ కుహరములోనో, ఎక్కడో ఒకచోట నిలుపుకొని చూస్తుంటావు. అలా చేసి అది బ్రహ్మమన్నట్లు భావించుచున్నావు. నీవు భావించునట్లుగా బ్రహ్మమున్నదనుకొని చేసే ప్రయత్నము వస్తుస్వభావానికి అనురోధి కాకపోగా మీదుమిక్కిలి విరోధి అయి పరిణమిస్తుంది.

**శ్లో॥ సాంసిద్ధికీ స్వాభావికీ సహజా అకృతీ చయా ।**
**ప్రకృతి: నేతి విజ్ఞేయా స్వభావం నజహాతియా ॥**

**గౌడపాద కారిక - 9 - అలా. ప్ర. మూ॥**

అనగా ఏది సమాసాధితమై లెస్సగా సిద్ధమగుచున్నదో, స్వభావము చేతనే సిద్ధమై యుండునో, ఏది పుట్టుకతోనే వెలయుచుండునో లేక ఏది మరియొకదానిచేత కల్పితము గాదో తన స్వభావమునేది వదలదో అది అంతయు ప్రకృతి యనిపించుకొనును. వస్తు స్వభావమెన్నడు మారదు. అది దాని ప్రకృతి, మిధ్యా కల్పితములగు భౌతిక వస్తువులయందు గూడా ప్రకృతి మార్పును చెందుట లేదు. జన్మాది వికార విరహితమగు పరమార్ధ వస్తువును గూర్చి చెప్పనేల. అమృత స్వరూపమే లక్షణముగాగల దాని ప్రకృతి యెంత మాత్రము వితథము గానేరదు. దానికెన్నడును ఉత్పత్తి కలుగనేరదు. బ్రహ్మమెలా ఉందో అలాగే భావిస్తే, అది ఉపాసన కాదు. ఒక పదార్ధము వున్నదున్నట్లు గ్రహిస్తే అది జ్ఞానము. మన యిష్టానుసారము ఒక రూపకల్పన చేస్తే అది ధ్యానము. జ్ఞానానికి, ధ్యానానికి చాలా భేదమున్నది. ఒకటి ప్రమ అయితే మరియొకటి భ్రమ. తత్త్వాన్ని ఉన్నదున్నట్లు భావిస్తే అది ధ్యానం కాదు. మనం భావించినట్లు వస్తువుండాలని అనుకొన్నాము. అది బ్రహ్మమే కాదు. బ్రహ్మమును ఉన్నదున్నట్లు భావించుదామని అనుకొంటే అది ధ్యానమే కాదు.

ఓం తత్ సత్.

# తీర్థము - ప్రసాదము

శాస్త్రజ్ఞానము కలిగినవారు ప్రతిదినము తీర్థప్రసాదములు పుచ్చుకొనుచున్నారు గదా ! ఎందుకు పుచ్చుకొనుచున్నది తెలిసి పుచ్చుకొన్నచో సుఖము, ప్రయోజనముండును. తెలియక పుచ్చుకొన్నచో అట్టి ప్రయోజనముండదు. కాబట్టి పుచ్చుకోవలసిన అవసరమేమిటో తెలియుట మంచిది. సద్బ్రాహ్మణుడైనవాడు సాలిగ్రామ తీర్థమును పుచ్చుకొనక, యజ్ఞయాగాది క్రతువులు చేసిన వారు అగ్నిహోత్రాదులు చేయక ఎట్లు భోజనము చేయరో, కొందరు సూర్యనమస్కారములు, తులసిపూజతో అర్ఘ్యము లేక భోజనము చేయరో అటులనే గురుభక్తుడైన శిష్యుడు గురుపాదతీర్థము పుచ్చుకొనక భోజనము చేయకూడదు.

**శ్లో॥ అజ్ఞాన మూలహరణం జన్మ కర్మ నివారణం ।**
**జ్ఞాన వైరాగ్య సిధ్యర్థం గురుపాదోదకం పిబ ॥**

తన్ను తాను తెలియని మూలాజ్ఞానము, నిశ్శేషముగా నశించుటకు, జ్ఞాన వైరాగ్యములు కలుగుటకు, జ్ఞాన వైరాగ్యములు కలుగుటకు, తీర్థప్రసాదములు పుచ్చుకొనుము అని తాత్పర్యము. అభిషేకము చేసిన తీర్థము, తెలిసి తెలియక చేసిన పాపమును పోగొట్టుకొనుటకు ప్రాయశ్చిత్తము వంటిదనిన్ని, అకాల మృత్యువును హరించుననియు పుచ్చుకొనుచున్నారు. అకాలమృత్యువును హరించగలందులకు మనము గురుపాద తీర్థమును తీసికొనుట అవుసరము. తీర్థమనగా **"తరయితీతి తీర్థ:"**. తరింపజేసేది గనుక తీర్థమని పేరు. నది దాటుటకు పడవ ఎంత అవసరమో సంసారమను మహాసముద్రమును దాటుటకు గురుపాద తీర్థము కూడ అంత అవసరము. జనులు దేవాలయములకు వెళ్ళి, తీర్థయాత్రలకు వెళ్ళి, తీర్థప్రసాదములు పుచ్చుకొనుచున్నారు. యదార్థ వస్తువు పరిజ్ఞానము తగ్గిపోయినందను త్రేతాయుగములో

దేవాలయముల ప్రతిష్ఠలు జరిగినవి. దేవుడున్నాడనుటకు దేవాలయములు బీజముల వంటివి. ప్రతి యింట ఈశాన్యమూలగా దేవుని గదిని ఏర్పాటు చేసుకొని అందు దైవపూజలు, ప్రార్థనలు చేసుకొనుచున్నారు. మరి బ్రాహ్మణులు తమ ఇండ్లలో సాలిగ్రామాదులు, నర్మదాదులు కలిగియుండుట, లింగధారులు తమ శరీరమునందే లింగములను ధరించుట యిత్యాదులు దేవుని స్ఫురణ లోనికి తెచ్చుకొనునవిగా మనము గ్రహించవలెను. తీర్థయాత్రలకు పోవువారు దేవుని దర్శనమయినపుడే దాని ఫలం దక్కినదనుకొనుచున్నారు. ఆ పట్టణమందలి విలువైన వస్తువులు ఎన్ని సంపాదించు కున్నను, అందు సుందరాతి సుందర భవనములు వగైరా ఎన్ని చూచినను, దైవదర్శనము కానిచో తిరిగి మరి యొకసారి వెళ్ళి దర్శనము చేసికొని ఆనందపడుచున్నారు. నిస్సంతులు కాశి, తిరుపతి వగైరా వెళ్ళి వచ్చిన తర్వాత బిడ్డలు కలిగినచో దేవుని ప్రసాదమని ఆ దేవుని పేరు పెట్టుకొనుచున్నారు. దీనిని బట్టి చూచినచో దేవుని దర్శనమే తీర్థమని దేవుని అనుగ్రహమే ప్రసాదమని తెలియుచున్నది. చిన్నచిన్న గ్రామములలో వున్న దేవాలయములు తీర్థస్థలములు కావు. తిరుపతి, కాశి, కంచి, రామేశ్వరము మొదలైనవన్నియు తీర్థప్రదేశములు. లక్షలాది ధనమును ఖర్చుపెట్టి యంత్రములచేత మహాస్థలములు చేశారు. కనుక తీర్థప్రదేశములనబడినవి. మహాస్థలమనగా గొప్ప ప్రదేశము. ఒక పట్టణము కంటె మరియొకటి పెద్దదై యుండగా ఏది పెద్దది? అన్నిటికన్నా పెద్దది ఏది కలదో అదియే మహాస్థలము. అదేది యనగా దేశము. అట్టి దేశమునకు పదార్థమేది? అనగా లోకరీత్యా ఆకాశము. అనగా అవకాశము. "ఆకాశం గగనం శూన్యం" అని నిఘంటువు గదా? మరి మహాస్థలం అటే లేనిదా? అంటే కాదు. తనను మఱచినందున తన అఖండత్వమే దేశంగాను, తన ఆద్యంత రహితత్వమే కాలముగాను, తన నిష్క్రియత్వమే క్రియగాను, అజ్ఞానముచేత తోచుచున్నవి. విజ్ఞానమువలన తన్ను తాను తెలిపిన దేశ కాలక్రియలు లేవు. అట్లు తెలుపు గురువునకు షోడశోపచారములు చేత పూజలు చేసి, అభిషేకించి, నివేదించి తీర్థప్రసాదములు పుచ్చుకొనవలెను. ఆవాహనము మొదలు నీరాజనము వరకు గల పదహారు పూజా విధానముల చేత

తనకు ఏవిధమైన కర్తవ్యము లేకుండ గురువున కర్పించుటయే షోడశోపచారములు అనబడును. దేవునికి నివేదించిన కొబ్బరికాయ మన యిండ్లలో ఉపయోగించుకొన్నట్లు ఆ ఇంద్రియములను శ్రవణ, మనన నిధిధ్యాసనములకు వాడుకొనవచ్చును.

**శ్లో॥ ఆత్మాత్వం గిరిజామతి: సహచరా: ప్రాణా: శరీరం గృహం !**
**పూజాతేవి విధోపభోగ రచనా నిద్రా సమాధిస్థితి: ॥**
**సంచారస్తు పదో: ప్రదక్షిణ విధి: స్తోత్రాణి సర్వాగిరో ।**
**యద్యద్ కర్మకరోమి తత్తదఖిలం స్వామిన్ తవారాధనమ్॥**

వాటియందు కర్తృత్వము లేనందున అవి దోషరహితములైనవి. దేహేంద్రియాదులు జడ పదార్థములు గనుక వాటికి కర్తృత్వము లేదు. ఇంద్రియాధిష్టాన దేవతలు ప్రేరేపించనిదే ఇంద్రియములకు కర్తృత్వము లేదు. ఇంద్రియాధిష్టాన దేవతలకు బ్రహ్మ సత్తాలేనిదే శక్తి, వీర్యము బలము లేనివారని కేనోపనిషత్తు చెప్పుచున్నది.

**శ్లో॥ యత్వాచా నభ్యుదితం యేన వాగభ్యుద్యతే తదేవ బ్రహ్మాత్వం విద్ధి।**
**యన్మనసానమనుతేయేనా హుర్మనోమతమ్ తదేవబ్రహ్మాత్వం విద్ధి॥**
**నేదం యదిద ముపాసతే యచ్చక్షుష్నాన పశ్యతియేన చక్షూ:షి**
**పశ్యతి తదేవ బ్రహ్మాత్వం విద్ధి ।**
**యచ్ఛ్రోత్రేణ శ్రుణోతియేన శ్రోత్ర మిదం శ్రుతం తదేవ బ్రహ్మాత్వం విద్ధి ।**
**యత్ప్రాణేన ప్రాణితియేన ప్రాణ: ప్రాణీయతే తదేవ బ్రహ్మాత్వం విద్ధి ॥**

కావున ఇంద్రియాధిష్టాన దేవతలు కూడా కర్తలుగారు. బ్రహ్మ నిర్వికారుడు గనుక కర్తృత్వాభిమానం లేదు. గాన కర్మలేదు. కనుక దు:ఖము లేదు. ఇట్టి సర్వదు:ఖరాహిత్యమే ప్రసాదము. ఆరూఢమే తీర్థము.

**శ్లో॥ ప్రసాదే సర్వ దు:ఖానాం । హాని రస్యోపజాయతే ॥**
**ప్రసన్న చేతసోహ్యాశు । బుద్ధి: పర్యవ తిష్ఠతి ॥** **భ.గీ.అ.2.శ్లో.65**

దీనినే పై శ్లోకము చెప్పుచున్నది. ఇట్టి గురుపాద నౌకతో సంసార సముద్రమును తరించిన వారగుదురు. కాన సద్భావన, సద్గోష్ఠి, ధ్యానము, బోధ, సత్క్రియ, గురుపూజ అను ఆరు లక్షణములు కలిగి ప్రతిదినము తీర్థప్రసాదములు పుచ్చుకున్నవాడే స్థితప్రజ్ఞుడు. అట్టివాడే మాయా ప్రపంచమునుండి తప్పించుకున్నవాడు. మరియొక మార్గము లేదు.

ఓం తత్ సత్.

# వాసనాత్రయము - తన్నివృత్తి

వాసనలను గూర్చి వశిష్ఠుల వారు ఈ విధముగా చెప్పిరి:-

**శ్లో॥ దృఢ భావన యాత్యక్తా పూర్వాపర విచారణం ।**
**యధాదానం పదార్థస్య, వాసనా ప్రకీర్తితా ॥**

పూర్వాపర విచారణ లేకయే, పదార్థములయందు గలుగు అభినివేశ రూపమగు భావనయే వాసనయని పండితులు చెప్పుచున్నారు.

**శ్లో॥ వాసనాద్వి విభాప్రోక్తా, శుద్ధాచ మలినాతథా ।**
**మలినా జన్మనో హేతు: శుద్ధాజన్మ నాశినా ॥**

ఆ వాసనలు శుద్ధ వాసనలనియు, మలిన వాసనలనియు రెండు విధములు. అందు మలినవాసన జన్మకు హేతువగుచున్నది. శుద్ధవాసన జన్మ నివృత్తికి సాధనము అగుచున్నది. అజ్ఞానముచే ఘనీభవించియున్న అహంకారోపహిత మలినవాసన జీవునకు పునర్జన్మ కలిగించుచున్నది. జన్మమూలమును నశింపజేసి అఖండ బ్రహ్మతత్త్వము నెరుంగుటకు సాధనమగు వాసన శుద్ధ వాసన అనబడును. పునర్జన్మకు హేతువగు మలిన వాసనలు అనేకములున్నను, అవి అన్నియు లోకవాసన, శాస్త్రవాసన, దేహ వాసనలలో చేరియుండును. వానినే వాసనాత్రయమందురు.

<u>లోకవాసన</u>:- ప్రజలందరు తన్ను స్తుతింప వలెననియు, తన్నెవరు నిందింప కూడదనియు, తలంచి ఆవిధముగా ప్రవర్తింపవలెనను అభినివేశము లోకవాసన అనబడును. లోకులందరు తన్ను నిందించక, స్తుతించునట్లు ప్రవర్తించుట ఎవ్వరికిని సాధ్యము కాదు. రామకృష్ణాద్యవతారములను గాని, బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులను గాని, సర్వులు స్తుతించుటలేదు. శ్రేష్ఠమానవులు మాత్రమే గౌరవించుచున్నారు. నీచ మానవులు కొందరు నింద కూడ చేయుచున్నారు. దేశ పితయగు మహాత్మాగాంధీని

బహుజనులు ప్రేమించి గౌరవించిరేగాని, కొందరు ద్వేషించి, దూషించి వారి హత్యకు కారకులైరి. సర్వ జనులను సంతోషపెట్టు ఉపాయము లోకమందుగాని, శాస్త్రమునందు గాని, ఎచ్చటను కన్పించుట లేదు. కావున ముముక్షువులు లోకవాసనను పరిత్యజించి తన స్వరూప జ్ఞానమునకై ప్రయత్నించవలెను. సర్వ విధముల లోకుల చిత్తములను రంజింపదలచువారును, భోజనాచ్ఛాదములయందు తత్పరులైనవారును, శబ్దశాస్త్రముల యందు అభినివేశముగలవారును, రమణీయ గృహ ఆరామాదులయందు ప్రీతి గలవారును, మోక్షమును పొందరని శాస్త్రములయందు గలదు. కావున మోక్షేచ్ఛ గలవారు సర్వవిధముల లోకవాసన విడువవలెను.

శాస్త్రవాసన:- ఇది పాఠవాసనయనియు, అర్థవాసనయనియు, అనుష్ఠాన వాసనయనియు మూడు విధములు. తాత్పర్యమును గ్రహింపకయే జీవితపర్యంతము వేదశాస్త్రములను అధ్యయనము చేయదలంచుట పాఠవాసన అనబడును. వేదశాస్త్రముల యదార్ధ తాత్పర్యము తెలియక జీవితపర్యంతము వాని అర్ధములను అధ్యయనము చేయుట అర్ధవాసన అనబడును.

**శ్లో॥ అనంతశాస్త్రం బహువేది తవ్యం, అల్పశ్చకాలో బహవశ్చవిఘ్నా:।**
**యత్సారభూతం తదుపాసి తవ్యం, హం సోయధా క్షీరమివంబు మిశ్రం ॥**

జలమిశ్రితమగు క్షీరమునుండి క్షీరమును మాత్రమే గ్రహించు హంస విధమున ముముక్షువు సర్వశాస్త్రసారమగు అఖండ బ్రహ్మతత్త్వమును ఎరుంగుట యోగ్యమగునని పెద్దలు నుడువుచున్నారు. సారమగు అఖండ తత్త్వము తెలియనివారు పాకములయందు తిరుగు గరిటెవంటివారు. గరిటె సర్వవ్యంజనములయందు తిరుగుచున్నను వాని రసమును గ్రహింపజాలని విధమున, సర్వశాస్త్రములు చదివినను వాటి సారమగు అఖండ బ్రహ్మ తత్త్వమును ఎరుంగజాలరు.

అనుష్ఠాన వాసన:- శాస్త్రములయందు విధింపబడిన కర్మములను జీవితాంతము అనుష్ఠింప వలెనని తలంచుట అనుష్ఠాన వాసన అనబడును. నిదాఘుడను

బ్రాహ్మణోత్తముడు సర్వశాస్త్రములు చదివి, అందు విధించిన కర్మల నన్నింటిని అనుష్ఠించుచుండెను. అతడట్లే నిత్యనైమిత్తికాది విహిత కర్మల నొనర్చుచు ప్రతిదినము అతిథి, అభ్యాగతులను సత్కరించుచుండెను. సందర్భవశమున ఒకనాడు బుభు మహర్షిని తమ గృహమునకు తీసుకొనివచ్చి షడ్రసోపేతమగు భోజనము పెట్టి, ప్రక్క అమర్చి పరుండబెట్టి పాదములు ఒత్తుచుండెను. అతని సపర్యలకానందించి, అతనికి అద్వైతజ్ఞానమును వుపదేశించెను. లౌకిక కర్మఫలములను అనుభవించుటచే నశించునట్లు యజ్ఞయాగాది వైదిక కర్మఫలములు కూడ అనుభవించుటచే నశించును. కర్మలు చేయునపుడు, అనుభవించునపుడు, అనుభవించిన పిదప దు:ఖమును గలిగించును. **"క్షీణే పుణ్యేమర్త్య లోకం విశంతి"** పుణ్యము తీరిన తర్వాత తిరిగి జన్మమెత్తవలెను.

**శ్లో॥ సుఖమల్పం బహుక్లేశో విషయ గ్రాహిణాంన్నృణాం।**
**అనన్తం బ్రహ్మనిష్ఠానాం ఇతి వేదాంత డిణ్డిమ: ॥** **వే.డి.76**

'విషయాసక్తులకు సుఖము తక్కువ క్లేశమెక్కువ. బ్రహ్మనిష్ఠులకు ప్రయాస అల్పము సుఖము అనంతము అని వేదాంత భేరి అని బోధించి' వెళ్ళిపోయిరి.

కాని నిదాఘుడు కర్మానుష్ఠాన బలముచే బ్రహ్మబోధను మరచి కర్మానుష్ఠానమునే చేసుకొనుచుండెను. కొంతకాలమునకు బుభుమహర్షి నిదాఘుని యింటికి వచ్చెను. తన గురువని గుర్తించక యధాప్రకారముగా సత్కరించెను. భుజించిన వస్తువులు రుచికరముగా నున్నవా అని అడుగుచుండెను. దానికి ఋషిసత్తముడు రుచి, అరుచుల నెరుంగునది జిహ్వ కాని నేను కాదు. నేను అసంగ చిద్రూపుడనని చెప్పెను. అప్పుడు గురువుని గుర్తించి క్షమింపుమని వేడుకొనెను. పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తము. ఇకనైనను బ్రహ్మ చింతన చేయుమని చెప్పి వెడలిపోయెను. కావున కర్మానుష్ఠాన వాసనలు గూడ బ్రహ్మజ్ఞానమునకు ప్రతిబంధకములే.

<u>దేహ వాసన</u>:- స్థూల దేహమునందుగల అభినివేశము దేహ వాసన అనబడును. నేను మనుష్యుడను, నేను పురుషుడను, నేను స్త్రీని అనునటువంటి భావనలు

దేహవాసనలు అనబడును. గంగాస్నానాది పుణ్యకార్యములు చేసి సద్గుణములు పొందవలెననియు, శౌచాదమనాదులు చేసి దేహదోషములను పోగొట్టుకొనవలెననునట్టివి, దేహ వాసనలనబడును. ఈ వాసనాత్రయము జ్ఞానమునకు ప్రతిబంధకములగుటచే, ముముక్షువు వాటిని విడువవలెను. జ్ఞాన ప్రతిబంధకములగు రాగద్వేషాది వాసనలు, జన్మజన్మాంతర కామ కర్మాది సమస్త వాసనలను విడువవలెను.

వాని నివృత్తి:- వాసనలనేకము గనుక వాని నివృత్తి ఉపాయములు కూడ అనేకములు. ఆత్మానాత్మ వివేకమువలనను, విషయములందు దోషదృష్టివలనను, సత్పురుషుల సాంగత్యమువలనను, మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్షలను శుభవాసనల వలనను మలినవాసనలు నివృత్తియగుచున్నవి. నేనసంగ చిద్రూపుడనని సద్గురువుల వద్ద శ్రవణము చేసి ముముక్షువులు ఆత్మదర్శన ప్రియులై యుండవలెను. విషయాసక్తుల సంగమును పరిత్యజించి, బ్రహ్మవేత్తల సాంగత్యమున మెలంగ వలెను. మహా పురుషులను శ్రద్ధాభక్తులతో సేవించినచో మలినవాసనలు నివృత్తియగును. బ్రహ్మజ్ఞాన సారమును బలీయమైన ప్రయత్నముతో దేహమునందు ప్రాణముండగనే గ్రహించుట పరమార్థమగును.

వాసనలు కనబడుట లేదు గనుక లేవనగూడదు. మన ప్రాణము మనస్సు అదృష్టరూపముగా నున్నవి. అట్లే యీ కర్మవాసనలు యొక్క ఫలితములు ఎన్ని జన్మలకైనా మనము అనుభవించి తీరవలసినదే. ఇంగువకట్టిన గుడ్డలో ఇంగువంత ఖర్చుయిపోయినా దాని వాసన ఆ గుడ్డ నాశ్రయించి ఉంటుంది. అట్లే మనల నాశ్రయించిన ఈ వాసనలు గూడ. కాన కర్తృత్వ, భోక్తృత్వ బుద్ధి లేక ఈశ్వరార్పిత బుద్ధితో ఫలాపేక్షరహితముగా కర్మలాచరించి వాటి వాసనలు మనకు లేకుండ చేసికొన్నచో, మనకు జన్మహేతుత్వముండదు. మానవుని మనస్సు బాహ్యప్రపంచ విషయముల వైపుకు పోతుంది గాని బ్రహ్మతత్త్వము మీదికి ప్రసరించదు. అట్లు ప్రసరించనిచో తద్విషయమైన జ్ఞానము మనకెలా కలుగుతుంది. కాబట్టి సర్వాంగ సుందరమైన

మానవ జన్మనెత్తి బ్రహ్మానుభవము కలుగలేదంటే దానికి జీవులు చేసికొన్న కర్మే తప్ప మరేది కాదని వేదాంతుల నిర్ణయము.

**శ్లో॥ మన ఏవ మనుష్యాణాం కారణం బద్ధ మోక్షయో:।**
**బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతం ॥**

కాన విషయముల వైపు పరుగిడు మనస్సును ఆత్మబోధ వైపుకు అనగా వేదాంతశాస్త్ర శ్రవణ మననములవైపుకు ప్రసరింపజేసి, సంశయనివృత్తి చేసికొని, నిరంతర బ్రహ్మాకార వృత్తియందు నిష్ఠ గలిగియుండిన బ్రహ్మానుభవము కలుగును. మన ప్రారబ్ధము వల్ల మనకు బ్రహ్మజ్ఞానము అబ్బుట లేదు. అని ఎవ్వరు నిస్పృహ పొందనక్కరలేదు. ఒక జన్మలో చేసిన కర్మమే కదా ఇప్పటి ప్రారబ్ధము. అందరు ప్రారబ్ధముతోనే జన్మించినారు కనుక ఇప్పుడు సజ్జన సాంగత్యము చేసి, ప్రపంచ విషయములు వికారవంతములు, దు:ఖహేతువులని వాటియందు నిస్సంగుడై, ధ్యానాదులచే మనస్సును ఏకాగ్రపరచి ఉపనిషత్తుల రహస్యార్థమును శ్రవణము చేసి వాటి సారాంశమైన అబేధతత్త్వమును గ్రహించినచో జీవన్ముక్తిని అనుభవించగలము.

**శ్లో॥ కర్మాణి చిత్తశుధ్యర్థం ఐకాగ్రార్థ ముపాసనా।**
**మోక్షార్థం బ్రహ్మవిజ్ఞానం ఇతి వేదాంత డిండమ: ॥ వే.డి.25**

వైదిక కర్మములు చేసి మలదోషములను నివారించుకొని చిత్తశుద్ధిని, ఉపాసనలచే చిత్తైకాగ్రతను సంపాదించి మోక్షము కొఱకు బ్రహ్మజ్ఞానమును పొంది జీవితమును సార్థకము చేసుకొనవలెను.

**శ్లో॥ అవిజ్ఞాతే జన్మ నష్టం విజ్ఞాతే జన్మ సార్థకం।**
**జ్ఞాతురాత్మా న దూరే స్యాత్ ఇతి వేదాంత డిండిమ: ॥ వే.డి.73**

ఆత్మ నెరుంగకుండిన జన్మ వ్యర్థము. ఎరిగిన సార్థకము. జ్ఞాతకు ఈ ఆత్మ దూరమునలేదు. స్వస్వరూపముగనే యున్నది. అని వేదాంతభేరి.

ఓం తత్ సత్.

# సాధన చతుష్టయము

నవంబరు 88 యదార్ధభారతి మాసపత్రికలో ప్రచురించబడినది.

ఒకరాజు శత్రువులను జయించి రాజ్యమును స్వాధీనపరచు కొనవలయునన్నచో, చతురంగ బలములను చేకూర్చుకొనవలెను. అట్లే మోక్షసామ్రాజ్యమును బొందగోరిన జిజ్ఞాసువులు ముందుగా సాధన చతుష్టయ సంపత్తిగలవారు కావలయును. అవి ఏవనగా నిత్యా నిత్యవస్తు వివేకము, ఇహాముత్రార్ధ ఫలభోగ విరాగము, శమాది షట్సంపత్తి, ముముక్షత్వము, అను యీ నాలుగున్నూ సాధన చతుష్టయ సంపత్తి అనబడును.

నిత్యానిత్యవస్తు వివేకము:- హంస పాలను, నీటిని వేరు పరచు విధమున ఆత్మానాత్మల విచారించి ఆత్మ నాశరహితము, క్రియారహితము అనియు, నామ రూపాత్మకమగు జగత్తు క్రియావంతమనియు, షడ్భావ వికారవంతము అనియు తెలిసికొనుటయే నిత్యానిత్య వస్తు వివేకము.

**శ్లో॥ ఆకాశవత్సర్వ గతశ్చనిత్య: అజోనిత్య: శాశ్వతోయం పురాణ:**
**అవినాశితు తద్విద్ధియేన సర్వమిదంతతం**
**వినాశమవ్యయ స్యాస్యన కశ్చిత్కర్తు మర్హతి ॥**

అను శ్రుతిస్మృతులచే ఆత్మకు నిత్యత్వము చెప్పబడుచున్నది. అనాత్మ పదార్ధములు దృశ్యవస్తువులు **"యదృశ్యం తన్నశ్యమ్"** కాబట్టి అవన్నియును నశించునని గమనించవలయును. ఈ నిత్యానిత్య వస్తువివేకము సామాన్య జనులకు కూడ కలుగుచున్నది. ఆత్మ నిత్యమనియు, దేహేంద్రియాది సంఘాతము అనిత్యమని తలంచుచున్నారు. కాని అపరి శుద్ధాంత:కరణమున కలిగినదగుటచే చవిటి నేలలయందు నాటిన బీజము వలె ఫలితమునకు రాకున్నది. వైరాగ్యాది ఇతర సాధనములు కలుగనేరవు.

మలదోష రహితమైన పరిశుద్ధాంత:కరణమందు కలిగిన నిత్యానిత్య వస్తువివేకము విషయ వైరాగ్యమును కలిగించి మోక్షమునకు హేతువగు శమాది షట్సంపత్తిని ఉదయింప జేయుచున్నది. ఒకవేళ వివేకము లేకయే వైరాగ్యాదులు కలిగినను అవి శాశ్వతముగా నిలువనేరవు. కాన మలదోషరహితమైన శుద్ధసత్వాంత: కరణమందు కలిగిన నిత్యానిత్య వస్తువివేకము వైరాగ్యాది ఇతర సాధనలకు కారణమగును.

వైరాగ్యము:- ఇహలోక భోగముల యందును. స్వర్గాది పరలోక భోగములందును కాక మలము వలె విముఖత్వము కలిగి యుండుటయే వైరాగ్యమందురు. జీవన్ముక్తులకు సహజముగా అపరోక్షమిధ్యా దృష్టి వైరాగ్యముండును. సాధకులైన ముముక్షువులకు విషయములందు దోషదృష్టి వైరాగ్యముండవలెను. అందుబాటులోనున్న భోగవస్తువులను విడచుట భోగాత్యాగేచ్ఛ అనియు, నూతన భోగములను కోరకుండుట భోగానిత్యేచ్ఛ అనియు అందురు. పై దోషదృష్టి వైరాగ్యము వలన యీ లోకమున అనుభవించు స్రక్చందన వనితాదిభోగములు, స్వర్గాదిలోకములందు అనుభవించు రంభాది దేవతా స్త్రీల పొందు, నందనోద్యాన విహారములు, అమృతపానము యిత్యాది సకల భోగములు సాతిశయములనియు, దోష యుక్తములని, భోగానంతరము దు:ఖము కలిగించుననియు, కక్కిన కూటి యందు వలె, మలమూత్రాదుల యందు వలె యిచ్ఛ గలుగక పోవుచున్నది.

**"పరీక్ష్యలోకాన్ కర్మచితాꣳ, బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృత: కృతేన"** కర్మోపాసనలచే ప్రాప్తించు బ్రహ్మాదిలోకముల యందు నిత్య నిశ్చయము చేతను, బ్రహ్మజిజ్ఞాసువులగు ముముక్షువులు కర్మలనుండియు, కర్మసాధ్యములగు లోకములనుండియు, వైరాగ్యము పొందవలెనని శ్రుతి చెప్పుచున్నది.

**"బ్రహ్మాది స్థావరాంతేషు, వైరాగ్యం విషయేష్వసు యథైవకాక విష్ఠాయాం, వైరాగ్యం తద్ధి నిర్మలమ్".** మర్త్యలోకము మొదలు బ్రహ్మలోక పర్యంతము గల భోగములను, భోగసాధనములను కర్మలవలన కలిగినవి అగుటచే అనిత్యములగును. కాన, వానిని కాక మలమువలె విసర్జించుటయే వైరాగ్య లక్షణమని అపరోక్షానుభూతి యందు చెప్పబడెను. ప్రపంచము నందు గల పదార్థముల నిత్యానిత్యతల గుర్తించి అనిత్యమైన

వాటిని విడుచు ప్రయత్నము యతమాన వైరాగ్యమందురు. సజ్జన సాంగత్యము చేతను విడచుటకు యత్నించుట వ్యతిరేక వైరాగ్యమందురు. విషయేచ్ఛ నశింపకుండినను, ఇహపరభోగములు దు:ఖదాయకములని తెలిసికొని బాహ్య ఇంద్రియములను ప్రవర్తింపనీయక క్రమముగా ఒక్కొక్క ఇంద్రియమును నిరోధించుటకు చేయు ప్రయత్నము ఏకేంద్రియ వైరాగ్యము అందురు. ఇహపరభోగములు నాశవంతమని నిశ్చయించి, మనస్సునందు కూడా విషయతృష్ణ కలుగనీయకుండుట వశీకార వైరాగ్యమందురు. ఇందు స్త్రీ పుత్రధనాదుల వియోగముచే కలుగు వైరాగ్యము, మంద వశీకార వైరాగ్యమందురు. స్త్రీ పుత్రాది ఇహలోక భోగమును దు:ఖదాయకములని వానిని త్యజించుట తీవ్ర వశీకర వైరాగ్యమందురు. పునరావృత్తి యుక్తములగు బ్రహ్మాది సమస్తలోకములు దు:ఖహేతువులని త్యజించుట తీవ్రతర వశీకార వైరాగ్యమందురు. ఇవి అన్నియు అపర వైరాగ్యములు. త్రిగుణములు, వీటి కార్యములగు సమస్తలోకములు అజ్ఞానముచే ఆత్మయందు తోచుచున్నవి. వానికి ఆత్మకంటె భిన్న సత్త లేదని, అవి అన్నియు మిథ్యయని నిశ్చయించి వానియందు మనస్సును నిగ్రహించుట పరవైరాగ్యమందురు.

శమాది షట్క సంపత్తి:- శమము, దమము, ఉపరతి, తితిక్ష శ్రద్ధ, సమాధానము అను నీ యాఱునుగూడి శమాది షట్సంపత్తి యనబడును. **"శాంతో దాంత ఉపరతస్తితిక్షు, స్సమాహితో భూత్వాత్మ న్యేవాత్మాసం పశ్యతి"** అను శ్రుతిగూడ పైశమాది షట్క సంపత్తి గల ముముక్షువు ఆత్మసాక్షాత్కారమును బొందుచున్నాడని చెప్పుచున్నది. విషయములవైపు పరుగులిడు మనస్సును, విషయములందు దోషదృష్టిని చూపుచు, వానిపై అపేక్షను సన్నగిల్లజేయుట **"శమ"** మనబడును. శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణములను జ్ఞానేంద్రియములైదును, వాక్పాణి పాదోప స్థపాయువులను కర్మేంద్రియు లైదును గూడి దశేంద్రియములు, బాహ్యేంద్రియములనబడును. వీనిని విషయములవైపుకు ఇష్టానుసారము బోనీయక నిగ్రహించుట **"దమ"** మనబడును, దోషదృష్టి గలవారికి గూడ సహజ ప్రాప్తములగు విషయములందు గలుగు యిచ్ఛకూడ తిరస్కరిచుటయే "ఉపరతి" అనబడును.

దీనిని గూర్చి శాస్త్రమునందు **"విషయేభ్య: పరావృత్తి: పరమోపరతిర్హిసా"** అని చెప్పబడెను. ప్రారబ్ధానుసారముగా సంభవించెడి లాభనష్టములు, సుఖదు:ఖాదులు పూర్వజన్మమున జేసిన పుణ్య పాపఫలములని తలంచి ధృడచిత్తముతో వానిని సహించియుండుట "తితీక్ష" యనబడును. ఈ విషయమును గూర్చి వివేక చూడామణి యందు **"సహనం సర్వదు:ఖానాం, అ ప్రతీకార పూర్వకం చింతా విలాపరహితం, సా తితిక్షా నిగద్యతే" (24)**యని వ్రాయబడియున్నది. శుద్ధసత్వమా యాంశమును శరీరముగా ధరించి బోధచేయుట కవతరించిన గురుమూర్తినే దైవముగానెంచి వారి వేదాంత బోధలు ఆకళింపుజేసుకొనుటయే "శ్రద్ధ" యనబడును. భగవద్గీతయందు కూడ **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"** శ్రద్ధగల వారికే జ్ఞానము కలుగునని చెప్పబడెను. విషయముల నిగ్రహించి సదా బ్రహ్మజ్ఞానమును బొందవలెనను తీవ్రేచ్ఛయే "సమాధాన" మనబడును. **"చిత్తైకాగ్ర్యంతు సల్లక్ష్యే సమాధానమితిస్మృతం"** తన లక్ష్యమగు ఉత్కటేచ్ఛయందు చిత్తమునే కాగ్రబరచుటయే సమాధానమనియు అపరోక్షానుభూతి యందు చెప్పబడెను. ఈ యాఱును శమాదిషట్క సంపత్తియను మూడవ సాధనము.

ముముక్షత్వము:- ఆకలి గొన్నవానికి అన్నాపేక్ష కలిగినట్లు దు:ఖములననుభవించు వానికి అవి నివృత్తియై సుఖము చేకూరవలెనను యపేక్ష సర్వ జీవులకు సహజముగా నుండును. ఇట్టి దు:ఖనివృత్తి పరమానంద ప్రాప్తియే మోక్షము. దానిని కావలెనని కోరుటయే ముముక్షత్వము లేక మోక్షాపేక్షయనబడును. మోక్షము కావలెనని కాలము గడుపువాడెన్నటికిని మోక్షము బొందడు. తీవ్రమోక్షేచ్ఛ గలవాడు నిష్కామకర్మోపాసనలు చేసి, అంత:కరణ శుద్ధిబొంది, అనగా రజోతమోగుణములు దమించి, శుద్ధ సత్వగుణము గలిగి సాధన చతుష్టయసంపత్తిని సంపాదించి, జ్ఞానము వలన మోక్షముబొందును. కాలసర్పము కరచినచో ఆ విషమువలన ఆ జన్మమునందు మాత్రమే దు:ఖము గలుగును. కాని మనస్సు యొక్క దుర్విషయాసక్తియనెడి విషమువలన జన్మ జన్మానంతరములయందు గూడ దు:ఖములు సంభవించును. **"మనయేవ మనుష్యాణాం కారణంబన్ధ మోక్షయో: బన్ధాయ విషయాసక్తం ముక్త్యైనిర్విషయం స్మృతమ్"** అని అమృత

బిందూపనిషత్తు చెప్పుచున్నది. నిత్యానిత్యవస్తు వివేకముగలవారు వైరాగ్యము లేకపోవుటచే కామ్యకర్మలు చేయుచున్నారు. అట్టివారు వేదాంత శ్రవణమునాచరించరు. కనుక వైరాగ్యము కూడ కావలెను. కొందరారెండును కలిగియుండియు శమదమాదులు లేక కోపతాపముగలవారై యుందురు, అట్టివారు వేదాంత శాస్త్రమును శ్రవణము చేసియు ప్రయోజనము బొందరు. కనుక మూడవ సాధనము కూడ కావలసియున్నది. కొందరు పై మూడు సాధనములు కలిగియుండియు మోక్షాపేక్ష లేనివారగుటచే సద్గురువుల దగ్గరజేరి వారివలన వేదాంత శాస్త్రమును శ్రవణము చేయ నొల్లరు, కావున నాలుగు సాధనములు కావలయును.

ఈ వివేకాదులు నాలుగును, ఆపై చేయు శ్రవణ మనన నిది ధ్యాసనలు మూడును, తత్త్వం పదార్థశోధనము కలిసి ఈ యెనిమిది అఖండ బ్రహ్మజ్ఞానమునకు అంతరంగ సాధనములనబడును. కర్మోపాసనలు బహిరంగ సాధనలు. ముముక్షువు అంత:కరణ శుద్ధి కలుగువరకు కర్మలు చేయవలెను. మనోనిశ్చలత కలుగుటకు ఉపాసన చేయవలెను. వివేకియైనవాడు బహిరంగసాధనలు విడిచి అంతరంగ సాధనలయందు ప్రవేశించవలెను.

**శ్లో॥ "కర్మాణి చిత్త శుద్ధ్యర్థం ఐకాగ్ర్యార్థ ముపాసనా।**
**మోక్షార్థం బ్రహ్మవిజ్ఞానం ఇతి వేదాంత డిణ్డిమ: ॥"** **వే.డి.25**

అనగా అంత:కరణశుద్ధి నొనర్చ నిష్కామకర్మలు, మనస్సు యొక్క ఏకాగ్రత కుదురుటకు నిష్కామ ఉపాసనలు, మోక్షమునకు బ్రహ్మజ్ఞానము కారణములని వేదాంత డిణ్డిమము చెప్పుచున్నది. సాధన సంపత్తిగల ఉత్తమాధికారులు సద్గురువుల దగ్గర వేదాంత శ్రవణము షడ్లింగ సహితముగ జేసి ప్రమాణగత సంశయమును నశింపజేసు కొనవలెను. ఉపక్రమోప సంహారములు, అభ్యాసము, అపూర్వత ఫలము; అర్థవాదము, ఉపపత్తి అను యీ ఆఱును షడ్లింగము లనబడును. ప్రమాణజన్యమగు జ్ఞానమునకు విషయమగునది ప్రమేయ మనబడును. ఆ ప్రమేయమునందు గల సందేహము

ప్రమేయగత సందేహమనబడును. ఇది స్థాణువా? పురుషుడా? యను అనాత్మ గతసందేహములు, పరమాత్మయందు గలుగు బ్రహ్మ మద్వితీయమగునా? లేక సద్వితీయమగునా? యను బ్రహ్మగతసంశయములును, బ్రహ్మాత్మల అభేద సాధకమును భేదభాధకములునగు యుక్తులచేత మననముచేసి ప్రమేయగత సంశయమును నివృత్తి చేసుకొనవలెను. విజాతీయ ప్రత్యయముల తిరస్కరించి అవిచ్ఛిన్న తైలధారవలె అఖండ బ్రహ్మాకార వత్తి రూపమగు నిధిధ్యాసనము గలిగి విపరీత భావనలను తిరస్కరించవలెను. ఆ పిమ్మట పరస్పర విరుద్ధమగు జీవేశ్వరోపాధులను త్యజించి, అనుస్యూతమగు నుపహిత చైతన్యమును గ్రహించవలెను. సాధన చతుష్టయ సంపన్నుడైన మానవుడు మాత్రమే తత్వంపదార్ధ పరిశోధన చేసి జీవన్ముక్తుడు కాగలడు.

ఓం తత్ సత్ ఓమ్

# దుఃఖము - దాని అత్యంతిక నివృత్తి - ఆనందస్థితి

జూన్ 1988 గీతావాణి మాస పత్రికలో ప్రచురించబడినది.

సామాన్యముగా మానవులు ఆనందముతోను, దుఃఖముతోను వుండుట చూచుచుందుము. ఇవి స్వాభావికములా, ఆగంతుకములాయని విచారించెదము. మనము దుఃఖించుచున్నప్పుడు ఎవరైనా "ఎందుకు దుఃఖించు చున్నావు?" అని అడిగెదరు. కాని దుఃఖించని వానిని "ఎందుకు దుఃఖించుట లేదు" అని అడుగరు. అనగా దుఃఖము స్వభావము కాదని, ఏదో యొక కారణము చేత దుఃఖించుచున్నాడని, ఆ కారణము తెలిసికొని దాని నివారణ కొరకు ప్రయత్నము చేయవలెనని అర్థము. కాన దుఃఖము ఆగంతుకమేకాని స్వభావము కాదని లోక వ్యవహారములో తెలియుచున్నది. అది స్వాభావికమైనచో ఏనాటికి పోగూడదు. కాని కొంతకాలమునకు పోవుచున్నది. మరియు లోకంలో అందరు ఆనందమునే కోరుచున్నారు కాని దుఃఖమును కోరుటలేదు. ఆనందము స్వరూపతః సహజము, దుఃఖము ఆగంతుకము. స్వభావమే స్వరూపము. ఎట్లనగా బెల్లమునకు స్వభావము తియ్యదనం. ఆ మాధుర్యము నాశనమైన దానిని బెల్లమనరు. అటులనే మనకు (ఆత్మకు) దుఃఖము స్వభావమైన, దుఃఖము నశించినచో మనము (ఆత్మ) కూడ నశించవలెను. ఆత్మ అవినాశియని శ్రుతులు చెప్పుచున్నవి. కర్మ, ఉపాసన, యోగముల వలన దుఃఖము ఉపశమించి సుఖము వచ్చునుగదా యనిన అది తాత్కాలిక దుఃఖ నివృత్తియే కాని అత్యంతిక నివృత్తి కాదు. మనకు (ఆత్మ) ఆనందము స్వాభావికమైన యెడల, దుఃఖము కలుగుటకు కారణమేమి? ఎక్కడ శరీర పరిగ్రహముండునో అక్కడ దుఃఖముండును. లోకంలో మహారాజులకు కూడ శరీర పరిగ్రహముండుట చేత దారాపుత్రాదుల మరణముచే, వ్యాధులచే, జరామరణములచే దుఃఖములు కలుగుచున్నవి. ఆనందముగా నుండవలెనని కోరుచూ,

సర్వులు తత్ప్రాప్తికై సర్వవ్యవహారములు చేయుచున్నారు. అయినను దు:ఖమేల కలుగుచున్నది? అందరూ నేను నేను అని చెప్పు యీ 'నేను' ఎవరో తెలిసికోలేనందున దు:ఖము కలుగుచున్నది. ఇప్పుడా 'నేను'ను గురించి విచారించెదము.

ప్రొద్దున లేచినది మొదలు పరుండబోవువరకు అనేక నామములు కలిగిన మనము సర్వేంద్రియములతోను వ్యవహారములు చేయుచున్నాము. నామమా యీ నేననగా? విచారించెదము. పుట్టినప్పుడు లేదు. తర్వాత కొద్ది రోజులకు పెద్దలు పెట్టుచున్నారు. ఆ నామముతో తెలియబడు దేహములు మారుచున్నవి. కాని "నేను" మారుటలేదు. కాన ఈ నామము నేను కాదు. వర్ణము నేనాయని విచారించిన పుట్టునపుడు బ్రాహ్మణుడు పుట్టెననిగాని, క్షత్రియులు, వైశ్యాదులు పుట్టిరనిగాని అనరు. మగపిల్లవాడు లేక ఆడపిల్ల పుట్టెననియందురు. మధ్యలో ఒక కర్మవలన జంధ్యము వేయగా ఆ జంధ్యము వలన బ్రాహ్మణత్వము వచ్చినట్లు కనబడుచున్నది.

**శ్లో॥ "జనన కాలమునందు జన్నిదంబులు లేవు**
**తల్లి మెడను లేదు తనకు లేదు,**
**నడుమ జందెమేయ నగుబాటు గాదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ"**

అని వేమనయోగి అన్నాడు. కొంతకాలమునకు దానిని తీసివేసి తురకలలోనో, క్రైస్తవులలోనో కలియుదురు. ఇప్పుడు బ్రాహ్మణత్వము నేనా? జందెము నేనా? తురకను నేనా? క్రైస్తవుడను నేనా? కాన వర్ణములు మారిన "నేను" పోయినదా? లేదు. మరి "నేను" ఎవరను? "నేను" పురుషుడను, స్త్రీని అంటున్నారు. మూసను తయారుచేసి అందు కరిగించిన బంగారమును పోసిన కోరిన బొమ్మలు వచ్చును. అటులనే యిక్కడ మూస వంటిది తల్లియొక్క ఊహ. బంగారమువంటిది తల్లిదండ్రుల శోణితము, శుక్లము. యీ మూడింటి కలయిక వలన ఒక రూపము వచ్చుచున్నది. కనుక అనేక మార్పులతో కన్పించుచున్న స్త్రీ, పురుషుడు నేనా? వారు భిన్నాకారములుగా నుందురు. "నేను" మారదుగదా? దేహమును గురించి విచారించిన బాల్య, యౌవన,

కౌమార, వార్ధక్యములు కన్పించుచున్నవి. ఇట్లు దేహము మార్పు చెందుచున్నది. "నేను" మార్పు చెందదుగదా? ఇంద్రియములు నేనగుదునా యని విచారించిన వాటికి తెలిసికొనే శక్తి లేదు. మనస్సువల్లనే వాటి వ్యాపారము జరుగుచున్నది. కన్ను, కాలు మొదలగు ఇంద్రియములు లేకపోయినను 'నేను'కు మార్పులేదు. మనస్సు నేనాయని ఆలోచించిన, యీ మనస్సు ఎట్లు వచ్చినదనగా ప్రాణవాయువు అంతఃకరణకు తగిలిన వెంటనే సంకల్పము కలుగుచున్నది. ఈ మనస్సు ప్రాణ లక్షణము, అంతఃకరణ లక్షణము కలిగి పరిణామము చెందుచున్నది. అట్టి పరిణామవంతమైన మనస్సు పరిణామము లేని నేనట్లగుదును? కాన ప్రాణమును గురించి చూచినచో సర్వప్రాణులయందున్న ప్రాణమునే సూత్రాత్మయందురు. దాని ధర్మములు ఉచ్ఛ్వాస నిశ్వాసములు. ఇది సూక్ష్మ పంచ భూతముల సమష్టి రజోగుణము వలన కలిగినది. ఇన్ని మార్పులు గల ప్రాణము ఎట్టి మార్పులు లేని నేనెట్లగుదును? కాన మరి నేనెవరను? "నేను" అవ్యక్తమునా? వ్యక్తము కాని దానిని అవ్యక్తమందురు. వ్యక్తమనునది నొకటి యున్నది. కనుక అవ్యక్తమని పేరు వచ్చినది. అవ్యక్తమగునది ఏది అని విచారించగా అదియే 'నేను' అని తేలుచున్నది. దానినే జ్ఞాన స్వరూపమందురు. ఆ 'నేను' ఎప్పుడును ఉండును. దానికి రాకపోకలుగాని, ఆకలి దప్పులు గాని, శోక మోహములు గాని, యిన్నియేల దృశ్య సంబంధమేదియు యుండదు. శ్రుతి **"యదృశ్యం తన్నశ్యం"** అని చెప్పుచున్నది. కాన ఎప్పుడు నశించని పదార్థము 'నేను'. అంతటాయున్నది నేనే? అదే ఆత్మ. దుఃఖములేని ఆత్మకు శరీరాల తాదాత్మ్యము చేత శరీరమే నేనని, దానికి కలిగిన వికారములకు దుఃఖించుచున్నాము. ఇచ్చట సరిగా గమనించవలసిన విషయము శరీరమునకు వ్రణ బాధ, లేక మనస్సునకు ఋణ బాధ కలిగి దుఃఖించుచున్నాము. నిద్రించినప్పుడు పైరెండు బాధల వల్ల దుఃఖము లేదు. నిద్రలో సద్రూపులమై, చిద్రూపులమై, ఆనందరూపులమై యున్న మనకు బాధ గాని దాని వల్ల దుఃఖము గాని లేవు. మేల్కాంచిన తర్వాత తిరిగి కన్పించుచున్నవి. అనగా తెలిసికొను తెలివికి దుఃఖము లేదు. జాగ్రదావస్థలో మాత్రము జడమై మనయందు ఆరోపింపబడిన శరీరమునందు దుఃఖము తోచుచున్నది. అనగా మన నిజరూపము సచ్చిదానందమై

సుఖదు:ఖ రహితమై, అజరామరమై, అమృత స్వరూపమై యుండగా అది తెలియని అజ్ఞానము చేత దృశ్యరూపమైన కరచరణా ద్యవయవ రూపమైన దేహములే మనమని దాని వికారములకు దు:ఖించుచున్నాము. మన నిజరూపము శాస్త్రాచార్యోపదేశములచేత సంశయ విపర్యరహితముగా తెలిసికొన్నచో, దు:ఖము మన స్వభావము కాదని, ఆగంతుకమని నిర్ణయమగును. విషయప్రాప్తి వలన వచ్చినట్లగుపడు ఆనందము కూడ మన నిజరూప ఆనందలేశమే. వికారవంతమైన దృశ్యరూప వస్తువు వల్ల వచ్చినట్లు అగుపడుచున్నది. కాన మన నిజరూపము అమృత స్వరూపమని గుర్తించి అట్లు నిలిచినచో దు:ఖరహితులమై నిత్యానంద స్వరూపస్థితియందు దివ్యజీవనము జరుగును. దీనిని మాకు వివరించిన ప్రాజ్ఞులనుండి మేము విన్నాము.

కేనోపనిషత్తు రెండవ ఖండము .... ఐదవ మంత్రం

**శ్లో॥ "ఇహ చేద వేదీ దథ సత్యమస్తి**
**న చేదహా వేదీ దథ సత్యమస్తి।**
**భూతేషు భూతేషు విచిత్యధీరా:**
**ప్రేత్యాస్మాల్లోకా దమృతాభవన్తి॥ "**

ఇక్కడ ఈ ప్రపంచంలో దానిని సాక్షాత్కరించుకున్నట్లయితే ఆపైన నిజమైన జీవితం వున్నది. ఇక్కడ సాక్షాత్కరించుకొననిచో సర్వనాశనమే. ప్రతిజీవిలోను ఆత్మను వివక్షించుకుంటూ ప్రజ్ఞాశాలి ఇంద్రియజీవనాన్ని అతిక్రమించి అమరత్వాన్ని పొందుతాడు.

ఓం తత్ సత్.

# భక్తి

అక్టోబరు 88 యదార్ధభారతి మాసపత్రికలో ప్రకటితమైనది.

భక్తి యనగా భక్తులకు భగవంతునియందును, గురుపుత్రులకు సద్గురువులయందు గల ప్రేమయే భక్తియనబడును. ఆ ప్రేమ విభక్తము కానిది గనుక భక్తి యనబడుచున్నది. భాగవతమున చెప్పబడిన భక్తి విశేషములు. శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మ నివేదనము అనునవి. వీటినే నవవిధ భక్తులందురు.

భగవంతుడు రూప నామ క్రియారహితుడు. భగవంతుడు జ్ఞానగమ్యుడు, ధ్యానగమ్యుడు కూడా, **"కార్యసిద్ధ్యర్థం ఉపాసకానాం బ్రహ్మణో రూపకల్పన"** అనగా ఉపాసనా నిమిత్తం నామ రూపములు కల్పింప బడినవి. అతడు సర్వవ్యాపకుడు గనుక విష్ణు నామము కల్పింపబడినది. నీలాకాశరూపము గలవాడు గాన నీలమేఘశ్యాము డాయెను. కాలమే అతని చక్రము, ప్రణవమే అతని శంఖము, మంగళప్రదులు అగుటచేత శివుడనియు, శాంతిసుఖముల నొసంగువాడు గనుక శంకరుడు అనియు చెప్పబడెను. స్వరూపజ్ఞానమే అతనికి మూడవ నేత్రమనియు, ఆ నేత్రము తెరచినచో అనగా స్వరూపజ్ఞానము కలిగినచో స్వరూపాజ్ఞానము, దానికి కార్యమైన సమస్త ప్రపంచము నాశమగునని సూచించబడెను. భగవంతుని శక్తి సత్వము, రజస్సు, తమస్సు అను మూడు విధములు. అవి ప్రళయకాలమునందు అతని యందు నిగూఢముగా నుండును. అప్పుడతడు నిర్గుణుడు. సృష్టికాలము ఆ శక్తి విజృంభించి జగద్రూపముగా పరిణామము చెందును. జగద్విశిష్టుడైన భగవంతుడే సగుణబ్రహ్మ. అతడే వాసుదేవుడు, జగద్రూపముగా పరిణమించిన త్రిగుణాత్మికమగు శక్తియే ప్రకృతి యనబడును.

**శ్లో॥ యావత్సం జాయతే కించిత్సత్త్వం స్థావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగాత్తద్విద్ధి భరతర్షభ ॥**

ఈ ప్రకృతి పురుషులే శివశక్తులు. ఉపాసనార్ధము అనేక నామ రూపములతో శాస్త్రమునందు చెప్పబడెను. భాగవతము నందు చెప్పబడిన నవవిధ భక్తులలో మొదటిది శ్రవణభక్తి. అనగా భక్తుని యిష్టదేవతా సంబంధములగు శాస్త్రములను, కథలను ఎల్లపుడు శ్రవణము చేయుచుండుట. సద్గురు పుత్రులు సద్గురుని జీవిత చరిత్రను, అతని మాహాత్మ్యమును శ్రవణము చేయుచుండుట శ్రవణభక్తి యనబడును.

(2) కీర్తన యనగా:- భక్తులు తమ తమ యిష్టదేవతలను వారి మహిమలను నృత్యగీతాదులతో నిరంతరము విశ్వాసపూర్వకముగా కీర్తించుట, సద్గురు పుత్రులు తమ గురుమహిమలను నృత్యగీతాదులతో వర్ణించి పొగడుచుండుట.

(3) స్మరణ భక్తి యనగా:- భక్తులు తమ తమ యిష్టదేవతా రూపములను స్మరించుచుండుట, సద్గురు పుత్రులు సద్గురు పాద పద్మములను హృదయ కమలమున నిల్పి ఎల్లప్పుడు సద్గురు స్మరణ చేయుచుండుట.

(4) పాదసేవనం:- అనగా భక్తులు తమ తమ యిష్టదేవతా విగ్రహపాదములను నిరంతరము సేవించుట, సద్గురు పుత్రులు సద్గురుమూర్తికి నిరంతరము చతుర్విధ శుశ్రూష లొనర్చుట.

(5) అర్చన యనగా:- భక్తులు తమ తమ యిష్టదైవములను షోడశోపచారములతో నర్చించుట. సద్గురు పుత్రులు సద్గురుమూర్తికి షోడశోపచార పూజలొనర్చి అర్చించుట. అవి ఏవనగా ఆవాహనము, ఆసనము, పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, స్నానము, వస్త్రము, యజ్ఞోపవీతము, గంథము, పుష్పము, ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలము, నీరాజనము, నమస్కారము అను నీ పదునారును షోడశోపచారములు అందురు.

(6) వందనమనగా:- సాష్టాంగ నమస్కారమనియు, పంచాంగ నమస్కారమనియు, త్ర్యంగ నమస్కారమనియు, ఏకాంగ నమస్కారమనియు నాలుగు విధములు. ఇతరులు

యిష్టదేవతానామములను, గురుపుత్రులు సద్గురు నామములను మనస్సుచే స్మరించుచు, వాక్కుతో మీ శిష్యులగు మేము ప్రణామము చేయుచున్నామనియు చర్చించుచు, నేత్రములతో సద్గురుని పాదపద్మములను లక్షించి చూచుచు "రొమ్ము, శిరస్సు, కాళ్ళు, చేతులు, చెవులు" అను ఈ యెనిమిది అంగములను, దండము వలె నేలమీద మోపి నమస్కరించుటయే సాష్టాంగ ప్రణామము అనబడును. శిరస్సు, హస్తములు, బాహువులు, కర్ణములు, జానువులు ఈ ఐదు నేల మీద మోపి నమస్కరించునది పంచాంగ నమస్కారమందురు. రెండు చేతులను ముకుళించి శిరస్సునందు ఉంచుకొని నమస్కరించుట త్ర్యంగ నమస్కారమనబడును. శిరస్సును మాత్రమువంచి నమస్కరించునది ఏకాంగ నమస్కారమనబడును. ఈ నమస్కారములు భక్తులు వారి యిష్ట దైవములకును, గురుపుత్రులు గురుదేవునకును దేశకాల పరిస్థితులను అనుసరించి ఎప్పుడే నమస్కారము చేయవలెనో యెరింగి చేయవలెను.

(7) దాస్యమనగా:- భక్తులు యిష్టదైవములకును, సద్గురుపుత్రులు గురుదేవునకును దాసులై చతుర్విధ శుశ్రూషలు చేయుచు ఆజ్ఞాబద్ధులై వర్తించవలెను. ఆంజనేయుడు శ్రీరామచంద్రునికి యిట్టి దాస్యభక్తి నెరపియే పరమార్ధ మెఱిగినట్లు పురాణప్రసిద్ధి.

(8) సఖ్యమనగా:- భక్తులు ఉపాస్యదైవముతోడను, గురుపుత్రులు సద్గురుమూర్తి తోడను, తెంపులేని మిత్రత్వముతో స్నేహము నెరపుట. తన స్నేహితునకు తెలియని దేదియు నుండరాదు. అర్జునుడు శ్రీకృష్ణునియందిట్టి యీ సఖ్యభక్తి నెఱపియే శ్రీకృష్ణుని అనుగ్రహముతో కురుక్షేత్రయుద్ధమున విజయము పొందుట, తత్త్వగ్రహణము చేయుట జరిగినది.

(9) ఆత్మనివేదన మనగా:- ఆత్మార్పణమనియు, శరణాగతియనియు, ప్రవృత్తి యనియు, మధురభక్తి యనియు అనబడును. ఇవి అన్నియు అనన్యభక్తికి పర్యాయపదములు. భక్తునకు పాస్యదైవము తనకంటె అన్యముగా తోచును. అనన్యున

కంతయు దైవమయమై యుండును. భక్తులన్నింటిలోను ప్రపత్తి సర్వోత్తమమైనది. దానినే మధురభక్తియని కూడ అందురు. రాధ శ్రీకృష్ణుని యందు ఆచరించినది ఈ మధురభక్తియే. రాధకు శ్రీకృష్ణునికంటె యీ ప్రపంచమున అన్యమేదియు తోచలేదు. రాధ కృష్ణుని మురళిని జూచి నాకంటె నీవు పుణ్యాత్మురాలవు. నీవు శ్రీకృష్ణుని చేతియందే ఎల్లప్పుడు ఎడబాటు లేకుండ ఉంటున్నావు. నేను భోజన మజ్జన విసర్జనాది కాలముల యందు నాకు భగవంతుని ఎడబాటు గలుగుచున్నది. ఇట్లుండుటకు నీవేమి పుణ్యము చేసినావు అని అడిగెను. అందులకా మురళి యీ విధముగా సమాధానము చెప్పెను. నేనే పుణ్యకర్మలు చేసియుండలేదు. నాయందెట్టి అరమరలు లేక హృదయమంతయు పట్టిబోలుగా నుండును. అది నేజేసిన సుకృతవిశేషము. అరమరలు, వాసనలు లేక నిర్మలమై బోలుగా నుండువారు భగవంతునికంటె భిన్నులు కారు. వారికెప్పటికిని భగవంతునితో వేరుబాటు లేక వారి హృదయములలోనే యుందురు. రాగద్వేషములు, అరమరలు, వాసనలు గలవారి హృదయములలో భగవంతుడుండడు. వారెప్పుడు భగవంతునికి భిన్నముగానే యుందురు. వారి ప్రేయస్సుకు వారే కర్తృత్వము వహించెదరు, భగవంతున కాత్మార్పణ మొనర్చిన భక్తులుగాని, సద్గురువున కాత్మార్పణ మొనర్చిన గురుపుత్రులుగాని ప్రపన్నులనబడెదరు. తన ప్రయత్నపూర్వకమగు కర్తృత్వమున్నంతవరకు రక్షణ కలుగదు. ఇందులకు పురాణములయందు ఈ విధముగా వ్రాయబడి యున్నది. ద్రౌపది ఒకచేత మాన సంరక్షణము చేసుకొనుచు మరియొక చేయి పైకెత్తి హే కృష్ణా! అని ఎంత వేడుకొన్నను రక్షణ జరుగలేదు. చివరకు తన ప్రయత్నము మాని రెండు చేతులు పైకెత్తి హే కృష్ణా! విశ్వరూపా! ఆపద్బాంధవా! అనాథరక్షకా! నా సర్వము నీకర్పించితిని అని ఆత్మార్పణ మొనచర్చగా శ్రీకృష్ణ భగవానుడు అక్షయ వస్త్రముల నిచ్చి కాపాడెను. గీతయందు కూడ యిట్లున్నది.

**శ్లో॥ అనన్యా శ్చింతయంతో మాం యే జనా: పర్యుపాసతే,**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥ భ.గీ.అ.9.శ్లో.22**

గజేంద్రుడు తన కర్తృత్వమును ఉపయోగించి మొసలితో పోరాడినంత వరకు భగవంతుని సహాయమును పొందలేదు. నీవే తప్ప నితఃపరంబెరుగ, రావే ఈశ్వర!

కావవే వరదా! సంరక్షించు భద్రాత్మకా! యని వేడుకొనగా విష్ణుమూర్తి సహాయమును పొందగలిగెను.

**శ్లో॥ దేహబుద్ధ్యాస్మిదాసోఽహం, జీవబుద్ధ్యాత్వదంశకః।**
**ఆత్మబుద్ధ్యాత్వ మేవాహం, ఇతిమే నిశ్చితామతిః॥**

దేహాత్మ బుద్ధిగలవాడు దాస్యభక్తి నపేక్షించును. దైవాంశ బుద్ధిగలవారు ఈ అంశమునను బుద్ధితో సఖ్యభక్తి నపేక్షించెదరు. ఆత్మబుద్ధిగలవారు అనన్యతతో నీవే నేను, నేనే నీవు అని మధురభక్తిని కలిగియుందురు. వివేకచూడామణిలో **"మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవగరీయసీ, స్వస్వరూపాను సంధానం భక్తి రిత్యభిధీయతే"**, అని చెప్పబడియున్నది.

కావున ఈ నవవిధ భక్తులను వారి వారి సంస్కారమున కనుగుణ్యముగ ఆచరించి భగవత్సాక్షాత్కారమునకు పాత్రులగుదురుగాక!

ఓం తత్ సత్.

# విజయదశమి

ఆశ్వయుజ శుద్ధ దశమి పర్వదినమును గురించి విచారించుట జిజ్ఞాసగల ప్రతి మానవునకు అవసరము. పండుగ అనగా క్రొత్త బట్టలు ధరించుట, పిండివంటలతో భోజనము చేయుట, వినోద కాలక్షేపములు చేయుట సామాన్య మానవుని పండుగ. దైవభావముగల వారు పైచెప్పిన వానికి అదనముగా ప్రతిరోజు దేవీ భాగవతము చెప్పుటగాని, వినుటగాని చేయుచుందురు. పరమార్థ దృష్టితో చూచిన యిది అంతయు ఆరోపితముగా అనగా మిథ్యగా తోచును. పరమేశ్వరుడు సృష్టి, స్థితి లయ కర్తయని తలంచినపుడు, లేక ప్రపంచము సత్యముగా తలంచినపుడు అనగా సృష్టి దృష్టివాదమున యీ పండుగకు మనము ఇవ్వవలసిన గొప్పతనమును గూర్చి విచారింతము.

పరమేశ్వర చైతన్యము ప్రకృతియందు ప్రతిబింబించి ప్రదర్శనమగునపుడు, అందు శక్తి స్వరూపమునే అమ్మ, చాముండేశ్వరి, రాజరాజేశ్వరి మరి అనేక నామములతో శక్తిస్వరూపిణిగా పిలువబడుచు ఆరాధింపబడుచున్నది. సర్వశక్తిమంతమగు శ్రీరాజ రాజేశ్వరిని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులు కూడ ఆరాధింతురని పురాణవచనము. దీనిని గురించి అనేక గాథలు కలవు. స్థూల మనస్సు గలవారలకు యీ కథలెంతయో ప్రయోజనవంతములు. కథా ప్రస్తావన పూర్వకముగా దాని లక్ష్యమైన సూక్ష్మాంశమును గ్రహింతుము గాక. పురాణములయందు దేవతలు, రాక్షసులు అను మాటలు వినవచ్చుచున్నవి.

రాంబస్, కరంబస్ అను రాక్షస సోదరులు శక్తి సంపాదనకై నీటియందు నిల్చి, తపస్సు చేయుచుండగా దేవేంద్రుడు మొసలి రూపమునవచ్చి కరంబస్ అను రాక్షసుని చంపివేసెను. అప్పుడు రాంబస్ అగ్నిదేవుని గురించి తపస్సు చేసి, అగ్నిదేవుని సాక్షాత్కరింపజేసుకొని తనకు ఎట్టి ప్రాణి చేతను చంపబడని బలశక్తి సామర్థ్యములు

గల కుమారుని ప్రసాదింపుమని వరమడిగెను. అట్లే అతనికి మహిషాసురుడను కుమారుడు కలిగెను. తండ్రి మరణించుట ద్వారా మాత్రయే యితడుద్భవించెను. ప్రస్తుతము అనవసరమగు కథాభాగము విడువటమైనది. అతడు బలసంపన్నుడై రాజ్యము చేయుచు తన పినతండ్రి కరంబన్‌ను చంపిన దేవేంద్రుని ఓడించి దేవరాజ్యమును కైవసము చేసుకొనెను. మించి మరింత దుష్టకార్యములు చేయుచుండుటచేత అతనిని పరిమార్చుటకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర దేవగణములకు శక్తి చాలక, భయగ్రస్థులై వారందరు సమావేశమై తొమ్మిది శక్తులు కలిగిన ఒక అందమైన స్త్రీని సృజించిరి. ఆ మూర్తిపేరు "చాముండి". ఆమెను పదునెనిమిది చేతులతో, ప్రతి దేవుని యొక్క ముఖ్యాయుధము ఒక్కొక్క చేతితో ధరించి మహిషాసురునిపై యుద్ధమునకు బోయెను. ఆమెను వివాహము చేసుకొనుటకు అనేక ప్రయత్నములు మహిషాసురుడు చేసి విఫలుడయ్యెను.

తొమ్మిది రోజులు ఆమెతో యుద్ధముచేసి చివరకు ఒక పెద్ద శక్తివంతమైన దున్నపోతు రూపముదాల్చి ఘోరయుద్ధము చేసి ఆమె చేతిలో మరణించెను. అతని తమ్ముడు రక్తబీజుడు (అనగా అతని రక్తము భూమిమీద పడినచో బొట్టునకు వేయిమంది రాక్షసులు ఉద్భవించునట్లు వరము కలిగియున్నాడు). ఆమెపై యుద్ధమునకు బోయెను. యితని రక్తము క్రిందపడకుండా చంపవలెను గనుక దేవి "కాళీ" రూపమును (అనగా నల్లనిశరీరము, పెద్ద నాలుక) సృజించి, ఆమె రక్తబీజుని చంపగా, ఆయన రక్తము క్రిందపడకుండా కాళీమాత తన పెద్దనాలుకతో నాకి అతనిని హతమార్చివేయగా లోకమంతయు రాక్షస బాధ నుండి తప్పింపబడి క్షేమముగా ఆనందముగా నుండిరి. కుప్తముగా కథ యిది.

సూక్ష్మబుద్ధి గలవారు దీనినిబట్టి నేర్చుకొనవలసినది యీ పండుగ తొమ్మిది రోజులు చేయుటకు కారణమేమి? మరికొన్ని రోజులు చేసుకొన గూడదా? తొమ్మిది రోజులలో మొదటి మూడు రోజులు దుర్గాపూజ, రెండవ మూడు రోజులు లక్ష్మీపూజ, చివరి మూడురోజులు సరస్వతీ పూజ ఎందుకు చేయవలెను? యీ క్రమమునకేదైనా

కారణమున్నదా? సంఖ్యలన్నింటిలోను పెద్దది తొమ్మిది కనుక పెద్ద సంఖ్యనే ఏర్పాటు చేయడమైనది. మొదటి మూడు రోజులు దుర్గాపూజ - దుర్గ భయంకర స్వరూపిణి. ఆమెను ఉపాసన చేయుటవల్ల మనలోనున్న దుష్టశక్తులను నిరోధించగల శక్తి సామర్థ్యములు మనకు లభించును. తరువాత మూడురోజులు లక్ష్మీపూజ అనగా ఐశ్వర్యవంత మగుట, యిది రెండు విధములు. బైట వ్యవహారమునకు ధనము వగైరా, లోపల అనగా ఆంతరమున మంచిబుద్ధి గలిగియుండుట. ఈ రెండు విధముల ఐశ్వర్యము లక్ష్మీపూజ వల్ల సిద్ధించును. తరువాత మూడురోజులు సరస్వతి పూజ. దుర్గాపూజ వలన మనలోని తమోగుణము, లక్ష్మీపూజ వలన రజోగుణము శమించును. చివరి మూడు రోజుల సరస్వతి పూజతో మనలో శుద్ధ సత్వాంత:కరణము ఏర్పడి శ్రవణ మననములకు అర్హత కలుగును. దానివలన జీవబ్రహ్మైక్య విజ్ఞానము పొందగలము. యిదియే విజయదశమి. మానవులు లౌకికదృష్టి, వైదికదృష్టి, పరమార్థిక దృష్టి వారి అంత:కరణ భేదముల ననుసరించి కలిగియుందురు. లౌకికదృష్టి యనగా యీ దేహమే నేనని తలంచి వ్యవహరించుట. అప్పుడు తాను దాసుడు, భగవంతుడు ప్రభువని తలంచును. వైదిక దృష్టి యనగా తాను జీవుడనని, తానా దేహమును ధరించియున్నానని, దైవము యొక్క అంశమునని, తలంచుచు, వ్యవహరించును. తానుజేసిన కర్మఫలములను అనుభవించుటకు పరలోకములకు పోవుదుననియు వైదిక కర్మలాచరించుచుండును. పారమార్థిక దృష్టిగలవారు తెలియబడునదంతయు దృశ్యమనియు, అనగా షడ్భావ వికారవంతమనియు శ్రుతి స్మృతులను, తన అనుభవములో విచారించును. తనకు ఎదుట కన్పించుచున్న ప్రపంచము దృశ్యమై యున్నందున తాను ద్రష్ట అని తలంచును.

ఇంద్రియములకు తన దేహము దృశ్యమైనందున ఇంద్రియములు చేతన వంతములని గుర్తించును. మనస్సును విడిచి యింద్రియ వ్యవహారము లేకపోవుట అనుభవము. ఇంద్రియములు, ప్రాణము దృష్ట్యా మనస్సు చేతనవంతమని తెలియుచున్నది. నిద్ర యందు మనస్సు లేకపోవుట గమనించుచున్నాము. దేని

సత్తాయందు యీ మనస్సు రాకడ పోకడలు కలిగి జ్ఞానకర్మేంద్రియములద్వారా సర్వవ్యవహారములు జరుపుచున్నదో అది కదా ''నేను'' అని అనుభవములో తెలియవచ్చినది. ఆ సచ్చిదానంద రూపమునందు గదా యీ కరచరణాద్యవయ రూప స్థూలదేహము గాని, మనోబుద్ధేంద్రియాది సూక్ష్మదేహముగాని, అజ్ఞానరూపమగు కారణ దేహముగాని, సత్తాస్ఫూర్తులు కలిగి వ్యవహరించుచున్నట్లగు బడుచున్నది. **"యేసయ ద్యాప్తంత త్తన్మాత్రమేవ"** ఏది దేనిచేత వ్యాప్తి పొంది ఉన్నదైనదో అది దానికంటె భిన్నము కాదు. కనుక యీ నామరూపాత్మకమగు చరాచర భూత ప్రపంచము ఆ **"సత్ చిత్ ఆనంద"**ములపై తోచుచున్నది. **"నామరూపాభి మానస్యాత్ సంసార: సచ్చిదానంద దృష్టిస్స్యాసముక్తి:"** అనగానామరూపములు నేననుకొనుట జనన మరణ రూప సంసారమునకు హేతువగును - అనగా మృత స్వరూపుడవు. శ్రుతి, స్మృతి, స్వానుభవములతో విచారించి సచ్చిదానందములే తానని నిశ్చయించినచో ముక్తి - అనగా అమృత స్వరూపుడవు. ఇట్టి ప్రశాంతస్థితిని గదా వేదాంతము తత్త్వమసి మొదలగు మహావాక్యముల ద్వారా తెలుపుచున్నది. ఇది దృష్టి సృష్టివాదము. యీ విచారణమునందు నిశ్చయము కలిగిన వారు జీవన్ముక్తులు. వీరు ప్రారబ్ధ కర్మానుసారము వ్యవహరించియు వ్యవహరించనివారే.

**"య ఏవంవేత్తి పురుషం ప్రకృతించగుణైః సహా సర్వధా వర్తమానోపిన సభూయోభి జాయతే"** (గీత. 13). అనగా ప్రకృతి, పురుషుడు, గుణములు అనగానేమియో విచారించి తెలుసుకున్న వారికి తిరిగి జన్మలేదు. ఇట్టి పరిశీలన కలిగినపుడు దృక్కు దృశ్యము రెండే వస్తువులు. దృక్ దృశ్యమును తెలిసికొనునపుడు వాటిమధ్య దృష్టి యుండును. దీనిని త్రిపుటి యందురు. దృష్టికి ఆకారము దృశ్యము, స్వరూపము దృక్కై యున్నది. దృక్‌ను విడిచి దృష్టిలేదు. దృష్టిని విడిని దృశ్యములేదు. దృష్టి దృశ్యములు లేనపుడు దృక్‌యున్నది. కనుక దృష్టికి స్వరూపమైన దృక్‌సత్యముగా గుర్తింపజేయుటయే **"బుద్ధిన్ జ్ఞానమంయకృత్యా"** యగును. అప్పుడు బుద్ధి (దృష్టి) దృశ్యమును బ్రహ్మమయముగా చూడగలుగును. యీ విధముగా **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** అని శ్రుతివచనము.

జగద్వ్యవహారమంతయు ప్రకృతిదిగా గుర్తించి యిట్టి జడరూప ప్రకృతి దేని సాన్నిధ్యమున చేతనవంతమై యీ వ్యవహారమంతయు జరుగుచున్నదో అట్టి చేతనమే పరమేశ్వరుడు.

**శ్లో॥ ప్రకృత్యైవ చ కర్మాణి క్రియామాణాని సర్వశ: ।**
**య: పశ్యతి తదాఽ త్మాన మకర్తారం స పశ్యతి ॥** **భ.గీ.1.13.శ్లో.29**

అనగా స్థూల, సూక్ష్మ, కారణరూప వ్యవహారము ప్రకృతిదని గుర్తించి చేతనము అకర్తయని గుర్తించుట యదార్ధము. అట్టి ప్రకృతి రూపమే అమ్మ లేక చాముండేశ్వరి లేక రాజరాజేశ్వరి.

విడదీసి చెప్పగా కాళీ, లక్ష్మి, సరస్వతి, మరింత విడదీసి చెప్పగా కంచికామాక్షి, కాశీవిశాలాక్షి, మధుర మీనాక్షి యిత్యాదులు. ఆత్మ సాన్నిధ్యమున ప్రకృతి చేతనవంతమైన సర్వశక్తుల రూపమున కార్యరూపముగా తెలియబడుచున్నది. పురుషుడే సర్వమునకు ఆధారుడని నిలచినవాడు నిరహంకారుడై జన్మరాహిత్యమును పొందును. అట్టి స్థితిని పొందుటకు, శక్తిని సంపాదించుటకు, యీ అమ్మను ప్రార్ధించి, పూజించి కృతార్ధత పొందవలసిన వారమై యున్నాము. యివి దేవీ నవరాత్రులు, ఇట్లే వినాయక నవరాత్రులు చేయుట కూడ మన హిందువుల పండుగలలో మరియొకటి. తెలివియందు తెలియబడిగదా జడమనియు, చేతనమనియు చెప్పుచున్నాము. ప్రకృతి అని చెప్పుటకు పూర్వమే తెలివియున్నది. దీనినే శ్రుతి **"తదేవ సౌమ్యా ఇదమ గ్రమాసీత్ ఏకమేవా ద్వితీయం బ్రహ్మ"** సృష్టికి పూర్వము బ్రహ్మమే యున్నది. అనగా ప్రత్యగాత్మ చైతన్యము అంత:కరణమందు భాసించి వృత్తిరూప పరిణామము పొంది నేత్రముద్వారా బయటికి వచ్చి విషయాకారము పొంది 'ఇది' అనుచున్నది. ఇది అనుటయే సృష్టి. ఇది అనుటకు పూర్వమే చైతన్యము బహిర్గతమై "ఇది" యని వస్తు నిర్ణయము జరుగుచున్నది. పై పరిశీలనలో చైతన్య విశిష్ట ప్రకృతిలో కార్యరూపము ధరించు పంచ భూతాత్మకమగు ప్రకృతిని ప్రముఖముగ తీసుకొన్నపుడు దేవీ నవరాత్రులు పూజ, విశిష్టమునందు పురుషుని చైతన్యమును ప్రముఖముగా తీసుకున్నపుడు వినాయక నవరాత్రులు, అట్లే

సీతారామ కళ్యాణము, శ్రీరామనవమి, శ్రీరాముడు - పురుషుడు లేక చైతన్యము, లేక ధృక్ సీత - ప్రకృతి లేక దృశ్యము యీ రెంటి సమ్మేళనమే సృష్టి.

**శ్లో॥ యావత్సంజాతయే కించి త్సత్త్వం స్తావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞ సంయోగా త్తద్విద్ధి భరతర్షభ ॥** **భ.గీ.అ.13.శ్లో.26**

యీ విధముగా పండుగలన్నియు స్థూలముగా కన్పించినను సూక్ష్మబుద్ధితో విచారించినచో ఉపనిషత్ ప్రతిపాదితమైన **"ఏకమేవా ద్వితీయం బ్రహ్మ"** అని బోధించుటకే. కనుక బేధములో జీవించు మనము సగుణారాధనతో శుద్ధ సత్వాంత: కరణము సంపాదించుకొని శ్రవణ, మనన, నిధి ధ్యాసనములతో తత్త్వరహస్యమును గ్రహించి **"అహం బ్రహ్మాస్మి"** యను మహా వాక్యమును స్మరించుచు, శాంత శివస్వరూపులమై యుందుము గాక.

ఓం తత్ సత్.

# గురుమంత్రము

**శ్లో॥ గురుర్ బ్రహ్మా గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః।**
**గురు స్సాక్షాత్పర బ్రహ్మా తస్మై శ్రీ గురువేనమః ॥**

అర్థము:- గురువు బ్రహ్మ, గురువు విష్ణువు, గురువే మహేశ్వరుడు ఆయనే సాక్షాత్తు పరబ్రహ్మ, అట్టి గురువునకు నమస్కారము.

ప్రపంచమున పెద్ద వస్తువులను గురువులందురు. చిన్న వస్తువులను లఘువు లందురు. లోకములో పదార్థము లన్నిటికంటె మహామేరువు పెద్దదిగ చెప్పబడుచున్నది. తక్కిన పదార్థములు దానికంటె చిన్నవనబడుచున్నవి. కాన మహామేరువును బట్టి యితర పదార్థములు లఘువులనబడుచున్నవి. ఇతర పదార్థములను బట్టి మహామేరువు గురువనబడుచున్నది. ఆ మహా మేరువు కంటె దానిని ధరించియున్న భూమి మిక్కిలి పెద్దది. కాన భూమినిబట్టి మహామేరువు లఘువనబడును. మహామేరువుని బట్టి భూమి గురువగును. భూమినంతా వ్యాపించియున్న ఉదకము భూమికంటె గురువగును. ఉదకమును బట్టి భూమి లఘువగును. జలమునకంటె తేజోరూపముగా వ్యాపించియున్న అగ్ని పెద్దదగుటవలన గురువగును. దేనివలన ఒకటి గురువగుచున్నదో అది దానికి లఘువగును. వాయువు అగ్నికంటె గురువగును. వాయువున కవకాశమిచ్చిన ఆకాశము వాయువు దృష్ట్యా గురువగును. ఆకాశాది భూత భౌతికములగు సమస్త పదార్థములకు సంయోగ వియోగములను కలిగించెడి చాలనశక్తి యే సూత్రాత్మయనబడును. దానివలననే పంచభూతములు, వియత్పథమున సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు మొదలగునవి నియమానుసారముగా ప్రవర్తించుచున్నవి. అదియే కుండలినీశక్తి యనుపేరుతో సర్వశరీరములను ధరించి దేహేంద్రియ మనోబుద్ధి ప్రాణములను ప్రవర్తింప జేయుచున్నది. ఆకాశమును బట్టి సూత్రాత్మ గురువగును. సూత్రాత్మకంటె

దానికి కారణమగునది వ్యాకృత్వము. జగత్సంస్కారములతో సూత్రాత్మయు అవ్యాకృతమున చేరియుండును. కార్యరూపమగు సూత్రాత్మకంటె కారణరూపమగు నవ్యాకృతము పెద్దది గనుక గురువనబడును. మూల ప్రకృతికంటె అవ్యాకృతము అల్పమగుట వలన మూలప్రకృతి గురువగును. మూలప్రకృతికంటె ఆధారము, అధిష్టానము, ప్రకాశము నగు బ్రహ్మచైతన్యము పెద్దదగును. దానికంటె పెద్దదగు వస్తువే కాలమందున, యే దేశమందున లేదు. కాన అదియెప్పుడును లఘువుగా నేరదు. కాన బ్రహ్మచైతన్యమునకు నిరపేక్షక గురుత్వము సిద్ధించుచున్నది. ధౌత వస్త్రమునందు రంగులచేత చిత్రకారుడు చిత్రములను చిత్రించు విధమున, ఆ గురుతమమగు బ్రహ్మచైతన్యము తనయంద ధ్యస్తమైన త్రిగుణాత్మికయగు జడ ప్రకృతిని తన సత్తచే దేశకాల విశిష్టమగు నామరూప క్రియాత్మక జగత్తుగా పరిణమింప జేయుట వలన బ్రహ్మ యనబడెను. సర్పదండ మాలాదుల యందు రజ్జువు వ్యాపించి యుండునట్లు, బ్రహ్మ చైతన్యమున కల్పితములైన సమస్త పదార్థముల యందు అధిష్టాన రూపముగ గురుతమమగు బ్రహ్మ చైతన్యము వ్యాపించియున్నది. కనుక విష్ణువు అనబడును. సమస్త పదార్థములు పగలు సూర్యుని ప్రకాశము చేతను, రాత్రి చంద్ర, నక్షత్రముల వలనను ప్రకాశింపబడుచున్నవి. ఆ సూర్య చంద్ర జడ జ్యోతిస్సులు ఒక కాలమందు, ఒక దేశమందు ఉండును. అవి అధిష్టాన సత్త చేతనే ప్రకాశించుచున్నవి.

**శ్లో॥ "కిం జ్యోతిస్తవ? భానుమానహని మే రాత్రౌ ప్రతీపాదికం**
**స్యాదేవం రవిదీప దర్శనధౌ కిం జ్యోతిరాఖ్యాహి? మే,**
**చక్షు, స్తస్య నిమీలనాది సమయే కిం? ధీ, ర్ధియోదర్శనే,**
**కిం? తత్రాహ, మాతో భవాన్పరమకం జ్యోతి, స్తదస్మి, ప్రభో!"** **ఏ.ప్ర.**

గురుతమమగు అధిష్టాన చైతన్యము నిరాపేక్షముగా సర్వ పదార్థములను సర్వ కాలములందు సర్వ దేశములందు ప్రకాశింప చేయుచున్నది. కాన ఆదిదేవుడని చెప్పబడెను.

**"దీప్యతే ఇతి దేవ:"** ఈ చైతన్య రూపుడగు గురుదేవుడే బుద్ధికి అధిపతియై వారి వారి కామ కర్మాది వాసనలు, జన్మజన్మాంతర సంస్కారములు నిలిచి ఉండునట్లును, సమిష్టి బుద్ధియగు మహాతత్వము నందు సృష్టి యొక్క సంస్కారములు, సర్వ జీవుల అదృష్టము నిలిచి యుండునట్లు చేయును. సుషుప్తి, మరణ ప్రయత్నములలో మాయావిముక్ష చైతన్యం నందణిగియుండి, మరల జాగ్రత్, జన్మ, సృష్టిలలో అధిష్టాన చైతన్య సత్తాచే ఏ జీవుని బుద్ధి ఆ జీవునకును, ఎవరి సంస్కారములు వారికి ప్రత్యేకించి యొసగబడుచున్నవి. కాన ఆ అధిష్టాన చైతన్య స్వరూపుడగు గురుదేవుడు మహేశ్వరుడు అనబడుచున్నాడు.

అధిష్టానమగు బ్రహ్మ చైతన్యము నిర్గుణ మగుటచే ఏ కార్యమును స్వయముగా చేయలేదు. కాన ఆ నిర్గుణ బ్రహ్మ చైతన్యము సాధన చతుష్టయ సంపన్నులు ఐన జిజ్ఞాసువుల నుద్ధరించుటకు శుద్ద సత్వ ప్రధానమగు మాయను ఉపాధిగా గైకొని భక్తుల ఎదుట ప్రత్యక్షమగుచున్నాడు. జన్మజన్మాంతర కామకర్మాది వాసనలను బట్టి గాని సామాన్య మానవుల అంత:కరణములయందు ఆత్మ స్వరూప సాక్షాత్కారము ఉదయింపనేరదు.

**"సత్వాత్సం జాయతే జ్ఞానం"** సత్వ గుణ ప్రధానమగు అంత:కరణమునందు మాత్రమే జ్ఞానము కలుగునని భగవద్గీత యందు చెప్పబడెను. కావున బ్రహ్మవేత్త అయిన సద్గురువు అంత:కరణము శుద్ధసత్వ ప్రధానమని తెలియవలెను. భక్తుల నుద్ధరించుట కొరకు ఆ నిర్గుణ బ్రహ్మము శుద్ధసత్వ ప్రధానోపాధిని గైకొని ప్రపంచమున అవతరించుచున్నాడు. కాన ఆ మంగళకరుడైన సద్గురుమూర్తి **"సాక్షాత్ పరబ్రహ్మ"** గా గుర్తించి సాష్టాంగ నమస్కారము చేయవలెను.

ఈ మంత్రమునకు ఈ విధముగా కూడా అర్ధము చెప్పవచ్చును. శుద్ధసత్వ ఉపాసకుడైన పరమేశ్వరుడు, రజోగుణ యుక్తుడై బ్రహ్మ యను పేరుతో జగత్తును సృష్టించుచున్నాడు. సత్వగుణ యుక్తుడై విష్ణునామముతో ప్రపంచమును పోషించు

చున్నాడు. తమోగుణయుక్తుడై రుద్రాఖ్యతో జగత్తును లయము చేయుచున్నాడు. అట్లే పరబ్రహ్మ రూపుడైన సద్గురుమూర్తి ముముక్షువు యొక్క పరిశుద్ధాంతకరణమను సుక్షేత్రమునందు ఉపదేశమను విత్తనమును నాటి జ్ఞానాంకురము సృజించుచున్నాడు. కావున అతడు బ్రహ్మ యనబడును. ఆ గురుమూర్తియే బోధ యనబడు జలమును జల్లి ఆ జ్ఞానాంకురము పోషించటము చేసి విష్ణువనబడుచున్నాడు. అతడే ఆత్మ జ్ఞానము చేత అజ్ఞానమును, అజ్ఞాన కార్యమగు సర్వ సంసారమును నాశనం చేసి, అటు పిమ్మట అజ్ఞాన నాశకమగు జ్ఞానము కూడా అజ్ఞాన కార్యమగు అంత:కరణ వృత్తియే అగుటచేత, దానిని కూడా నాశనము చేసి శుద్ధచైతన్య రూపుడై శేషించుచున్నాడు. కావున అతడు రుద్రుడనబడుచున్నాడు. శృతి యందు కూడా ఇట్లున్నది. **"ఏకం యేవహి రుద్రోన ద్వితీయయతస్థు:"**. ఇట్లు త్రిమూర్త్యాత్మక స్వరూపుడై, సృష్టి, స్థితి, లయములు చేయుచున్న సద్గురుమూర్తి పరబ్రహ్మ స్వరూపుడే అగును. **"బ్రహ్మ విత్ బ్రహ్మైవ భవతి"** బ్రహ్మ నెరిగినవాడు సాక్షాత్ బ్రహ్మయే యగుచున్నాడు అని చెప్పబడినది. కావున పరబ్రహ్మ స్వరూపుడైన సద్గురుమూర్తికి తన ధన మనముల నర్పించి నిత్యము చతుర్విధ శుశ్రూషల నొనర్చవలయును.

ఓం తత్ సత్

# సాక్షి - అనుభవము

(నవంబరు 1987 గీతావాణి మాసపత్రికయందు ప్రకటితమైనది)

వీరు గుడివాడ శ్రీ ప్రణవాశ్రమాధిపతులైన పూజ్యపాద శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వాములవారి శిష్యులు - వేదాంత జిజ్ఞాస గల వారు. వీరు యీ వ్యాసమును పంపి బహుకాలమైనది. నేను అనారోగ్యముతో వుండుటవలన యీ వ్యాసం ప్రకటించుటకు ఆలస్యమైనది. అన్యధా భావించరు గాక!

-సంపాదకుడు

సాక్ష్యనుభవము మనకు క్రొత్తగా వచ్చే విశేషము కాదు, మనందరి స్వరూపమై మనకు కలుగు లోకానుభవము లన్నింటిని ప్రకాశింపజేస్తూ వుండేటటువంటిది. ఈ సాక్ష్యానుభవము యొక్క విషయము వేదాంతేతర శాస్త్రములయందు లేదు. కేవలం ఉపనిషత్తులయందు మాత్రమే మనము చూడగలము.

**శ్లో॥ "ఏకో దేవ: సర్వభూతేషు గూఢ: సర్వ వ్యాప్తి - సర్వభూతాంతరాత్మ!**
**కర్మాధ్యక్ష: సర్వ భూతాధివాస: సాక్షీ చేతా కేవలో నిరుణశ్చ" శ్వే.ఉ.అ.6.మం.11**

మరియు

**శ్లో॥ గతిర్భర్తా ప్రభు: సాక్షీ నివాస: శరణం సుహృత్ ।**
**ప్రభవ: ప్రలయ: స్థానం నిదానం బీజ మవ్యయమ ॥ భ.గీ.అ.9.శ్లో.18**

అని చెప్పబడినది.

ఈ సాక్షి అను తత్త్వము అనుభవ స్వరూపము, అఖండమునునై యున్నది. దానిని గురించి కొంచెము విచారింతము. ప్రపంచ విషయములను మన ఇంద్రియముల ద్వారా తెలుసుకున్నపుడు "ఇది యిటువంటిది" అను కల్పన వచ్చును గదా? దానిని - ప్రత్యయానుభవమందురు. ఈ అనుభవము బయటినుండి లోనికివచ్చును. ఇంద్రియ

విషయ సంబంధము లేకుండనే మన అంత:కరణమందు ఉత్పన్నమై దేహాదుల వ్యాపించు మరియొక అనుభవము కూడ యున్నది. మనకు కామ, క్రోధ, సుఖ, దు:ఖాదులు మన అంత:కరణమునందు ఉద్భవించి, మనస్సు, ఇంద్రియములు దేహము మొదలగు వాటిని అన్నిటిని వ్యాపించి వాటిని స్వాధీనము చేసుకొనును. యీ అనుభవము అంత:కరణము నందు లేచి బయటికి వచ్చుచున్నట్లు కన్పించుచున్నది. దీనినే వేదనానుభవమందురు. సుఖము, దు:ఖము, ఈర్ష్య, భక్తి, ప్రేమ, ఆసక్తి అహంకారము మొదలగున వన్నియు వేదనానుభవము నందు చేరును.

యోగసాధన వలన, తపస్సు వలన కలుగు ప్రత్యేక శక్తులు కూడ యీ అనుభవమునందు చేరును. జన్మాంతర విషయములను చెప్పు స్మృతులు కూడ వేదనానుభవమునందు చేరిపోవును. వానిని దివ్యానుభవములందురు.

అనుభవము అను శబ్ధమునకు, అను అనగా అనుసరించి దానిని పొంది, భవమనగా కలుగునది అను అర్ధము. ఇంద్రియముల ననుసరించి పుట్టునటువంటిది ప్రత్యయానుభవము. అంత:కరణము ననుసరించి పుట్టునటువంటిది వేదనానుభవము. సాధనములచే కలిగిన సిద్ధులు వగైరా కూడ అంత:కరణమునందే పుట్టినవి కనుక వేదనానుభవమునందే చేరును.

మనము గమనించవలసిన విషయము పై చెప్పిన ప్రత్యయానుభవము కూడ అంత:కరణమునందే జరుగుచున్నది. అయితే యీ ప్రత్యయము (జ్ఞానము) కలుగుటకు ఇంద్రియముల సహాయము కావలెను. వేదనానుభవము - అంత:కరణము నందే జరుగుచున్నది. ఇందు ఇంద్రియముల సహాయ మవసరములేదు. మన అనుదిన వ్యవహారమంతయు యీ రెండు అనుభవములలో చేరియున్నది. ఇప్పుడు సాక్షి అనుభవమును గూర్చి విచారించెదము. పై రెండు విధముల అనుభవములకు ఆధారముగాను, తాను వాటినంతా వ్యాపించి జ్ఞానరూపముగాను, అవి కనబడనపుడు తనకు తానుగానే ప్రకాశ స్వరూపముగాను, వున్నామను అనుభవమే సాక్ష్యనుభవము.

పై రెండు అనుభవముల దృష్ట్యా దానిని సాక్ష్యనుభవమనుచున్నామే గాని అది అనుభవము కాదు. స్వరూపము సాక్షి, స్వప్రకాశస్వరూపమై, సర్వప్రకాశమై, ఏకమై, అసంగమై, నిర్లిప్తమై, వ్యవహార హేతుభూత మగుచున్నది.

పరమార్ధమును విచారించునపుడు, వాచ్యర్థమునుగాక, లక్ష్యార్థమును గుర్తించవలెను. సాక్షి శబ్దమునకు వాచ్యార్ధమును గ్రహించినచో పరమార్ధము సిద్ధించదు. సాక్ష్యమున్నంతవరకే సాక్షి యున్నట్లు గ్రహించవలసి యుంటుంది. సాక్షి, సాక్ష్యములు సాపేక్షిక శబ్దములు. సాక్షి శబ్దమును ఒక పరమార్ధమును తెల్పు లక్షణముగా గుర్తించినచో వాచ్యరూపమైన సాక్షి శబ్దమును, సాక్షియందు తోచు అవస్థలు, అవస్థావాసులు, అవస్థాలోకములు. ఆ లోకానుభవములు, తోచి, అణగునవిగా మనము గ్రహింతుము. అట్లు తోచి, అణగుదానినే అనిర్వచనీయమందురు. అట్టి అనిర్వచనీయమైన దానినే వేదాంత శాస్త్రము నందు మిథ్యయందురు. సాక్షి అనుభవము ప్రమాణములచే పొందబడు అనుభవము కాదు. ప్రమాతకు (నేనే) కూడ ఆవల యుండి వీనినన్నిటికి వ్యాపించు కేవలానుభవమే సాక్షి అనుభవమని తెలియవలెను.

ధర్మజిజ్ఞాసయందు శ్రుతి ప్రమాణము. బ్రహ్మ జిజ్ఞాసయందు శ్రుతి, అనుభవముకూడ ప్రమాణములు. ఈ సాక్ష్యనుభవమును గురించి తర్కించునపుడు శ్రౌతతర్కము, గురువు బోధించునపుడు అనుభవానుగత తర్కములే ఉపయోగమునకు వచ్చును.

సాక్షి యొక్క అద్వయతత్వము యీ క్రింది విధముగా గ్రహించవలెను, భౌతిక జగత్తునందు కన్పించు వేరు వేరు - నామరూపములుగా నున్న వస్తువులయందు "శక్తి" అను ఒకటే అద్వితీయ మూలభూత వస్తువుగా యున్నది. శక్తి యొక్క వ్యాప్తిని అన్నిచోట్ల కనుగొనిన వెంటనే వస్తువు అను వ్యాప్యము లేనేలేదు. అట్లే వ్యాపకమైన సాక్ష్యనుభవమును కనుగొనిన వెంటనే వ్యాప్యములైన బుద్ధ్యాదులు ఎప్పుడు లేనేలేవని తెలియును. ఈ విధముగా దానిని అద్వయమని చెప్పెదము. తన (సాక్షి స్వరూపము) యందు తన

జాగ్రత్తు, దానికి చేరిన ప్రపంచము, తన స్వప్నము, దానికి చేరిన ఆ స్వప్న ప్రపంచము, తన నిద్ర అక్కడ ఏవిధమైన ప్రపంచము లేని తాను అనురీతిలో తన స్వరూపమును పట్టుకొని విచారించుటకు బయలుదేరిన వేదాంత శాస్త్రములు చెప్పు "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" అను శ్రుతిని వివరించు పారమార్థిక దృష్టియగును.

కాని "మనము ఈ జగత్తులో పుట్టిన మనుష్యులము, మనకు యిచ్చట కల, నిద్ర కలుగుచున్నది" అని విచారించిన వ్యవహారిక దృష్టి యగును.  ఇది పూర్ణ విచారణకాదు.  వ్యవహారిక దృష్టితో బుద్ధి మొదలగునవి సాక్షిస్వరూపమును విభాగము చేసి చూసినచో, బుద్ధి మొదలగు వానినన్నింటిని సాక్షి వ్యాపించినదని స్పష్టమగును. అయితే - శక్తియే పరమార్థము.  అదే వస్తువుగా కనబడుచున్నదని ఎరిగినపుడు, శక్తిని ఏవిధముగా దృష్టాంతమందు అద్వితీయమై యున్నదని గ్రహించితిమో ఆ విధముగానే పరమార్థ దృష్టితో చూచినట్లయితే, అంతఃకరణము మొదలగునవి లేనేలేవు.  సాక్షి స్వరూపమే ఈ విధముగా కనబడుచున్నదేగాని, సాక్షి వ్యతిరిక్తముగా ఏమియు లేదని గుర్తించబడును.

ఓం తత్ సత్

# ఓంకార బ్రహ్మము లయబేధము

హరి: ఓం అని ఉపనిషత్తు చెప్పుచున్నది. సర్పము సగుణ బ్రహ్మమైనట్లు కారణ కార్యరూపముగనున్న యీ జగత్తంతయు ఓంకారమే. కాని ఓంకారము వాచకము. సగుణబ్రహ్మము వాచ్యార్థము. వాచ్యవాచకములకు భేదము లేదు. కాన ఓంకారమును సగుణ బ్రహ్మముగ తెలిసికొని ధ్యానించవలెను. జగత్తంతయు నిర్గుణ బ్రహ్మయంద ధ్యస్తము. కల్పిత సర్పము అధిష్టాన రజ్జువు కంటె వేరుగా లేనట్లు, కల్పితమైన జగత్తు అధిష్టానమైన నిర్గుణ బ్రహ్మము కంటె భిన్నముగ లేదు. అట్లే కల్పితమైన ఓంకారము అధిష్టానమైన నిర్గుణ బ్రహ్మమునకు వాచకము. నిర్గుణ బ్రహ్మము వాచ్యము. వాచ్య వాచకములకు భేదముండదు. కాన ఓంకారము నిర్గుణ బ్రహ్మమని ధ్యానించవలెను. పరిదృశ్యమానమైన అర్థజాతమంతయు శబ్దముచే చెప్పబడుచున్నది. శబ్దములు వాని వాచకములు. ఏ వస్తువైనను అద్దానిని తెలియజేయు పదముకంటె వేరుకాదు. పదమే దానిని తెలియజేయునో అది ఆపదమున కర్థమగు చున్నది. అనగా వాచ్య వాచకములకు అభేదమని భావము. **"సర్వగ్ం హ్యే తద్బ్రహ్మ అయమాత్మా బ్రహ్మసోయ మాత్మా చతుష్పాత్"**. ఈ జీవాత్మయే పరబ్రహ్మము, యీ ఆత్మయే నాలుగు పాదములు గలవాడు. ప్రణవమునకు నాలుగు మాత్రలు గలవు. ఇందు విరాట్టు, హిరణ్యగర్భుడు, అవ్యాకృతుడు, పరమాత్మ అను నాలుగును బ్రహ్మపాదములు, విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు , ప్రత్యగాత్మ అను నాలుగును ఆత్మపాదములు. అకారము, ఉకారము, మకారము, అమాత్రుక అను నాలుగును ప్రణవ మాత్రలు.

<u>ప్రథమ పాదము:</u>- సమష్టి స్థూల ప్రపంచ విశిష్టమగు చైతన్యము విరాట్టనబడును. వ్యష్టి స్థూలశరీర విశిష్టమగు చైతన్యము విశ్వుడనబడును. విరాట్టునకును, విశ్వునకును ఉపాధి స్థూలమగుటచే వీరిద్దరకు భేదము లేదు. సమష్టియందు వ్యష్టి అంతర్గతముగ నుండును. కాన వ్యష్టి స్థూలోపాధికుడగు విశ్వుడు సమష్టి స్థూలోపాధికుడగు

విరాట్టునకంటె భిన్నుడు కాడు. యీ విరాడ్రూప విశ్వునకు ఏడంగములున్నవి. అతనికి సత్యలోకము శిరస్సు. ఆహవనీ యాగ్ని ముఖము. సూర్యచంద్రులు నేత్రములు. వాయువు ప్రాణము. ఆకాశము ఉదరము. సముద్రాదుల జలము మూత్రస్థానము. పృధ్విపాదము. యీ సప్తాంగములు గల విశ్వునకు పందొమ్మిది ముఖములున్నవి. పంచప్రాణములు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, అంత:కరణ చతుష్టయము అను ఈ పందొమ్మిది భోగసాధనములగుటచే ముఖములని వర్ణించబడెను. జాగ్రదవస్థయందు విశ్వుడు యీ పందొమ్మిది ముఖములతో బాహ్యవృత్తిగలవాడై స్థూలభోగములను అనుభవించుచున్నాడు. యీ పందొమ్మిదింటిలో జ్ఞానేంద్రియములు ఐదు, కర్ణేంద్రియములు ఐదు, అంత:కరణ చతుష్టయము, కలసి యీ పదునాలుగు తమ తమ అధి దేవతల సహాయముతో, తమ తమ విషయము లందు ప్రవర్తించుచున్నవి. కాన యీ పదునాలుగు ఇంద్రియములు పదినలుగరధి దేవతలు, పదునాలుగు విషయములు కలసి పదునాల్గు త్రిపుటులగును.

### 14 త్రిపుటులు

ఆధ్యాత్మము - అధిదైవము - అధిభూతము

శ్రోత్రేంద్రియము - దిక్కులు - శబ్దము

త్వగింద్రియము - వాయువు - స్పర్శము

నేత్రేంద్రియము - సూర్యుడు - రూపము

జిహ్వేంద్రియము - వరుణుడు - రసము

ఘ్రాణేంద్రియము - అశ్వనీదేవతలు - గంథము

వాగింద్రియము - అగ్ని - వచనము

పాణేంద్రియము - ఇంద్రుడు - దాన పరిగ్రహములు

పాదేంద్రియము - విష్ణువు - గమనాగమనము

ఉపస్థేంద్రియము - బ్రహ్మ - ఆనందము

పాయురింద్రియము - మృత్యువు - విసర్జనము

మనస్సు - చంద్రుడు - సంకల్ప వికల్పములు

బుద్ధి - బ్రహ్మ - నిశ్చయము

చిత్తము - నారాయణుడు - చింతన

అహంకారము - రుద్రుడు - కర్తృత్వము

యీ పదునాలుగు త్రిపుటులును, అధిదేవతా సహితమగు పంచప్రాణములును కలసి విరాడ్రూపుడగు విశ్వునకు పందొమ్మిది ముఖములని చెప్పబడెను.

జాగ్రదవస్థ యందుండువాడును, బాహ్య విషయములందు ప్రవర్తించెడు ప్రజ్ఞ గలవాడును, సప్తాంగములు గలవాడును, పందొమ్మిది ముఖములు గలవాడును, స్థూలభోగముల ననుభవించు వాడుననగు విరాడ్రూపవిశ్వుడు ప్రథమ పాదమని శ్రుతి చెప్పుచున్నది. కాన విరాట్టున కంటె విశ్వుడు వేరుకాదు. ఇతనికంటె ఓంకారము నందలి ప్రథమ మాత్రమైన 'అ'కారముగూడ భిన్నముకాదు. బ్రహ్మము యొక్క మొదటి పాదము విరాట్టు. ఆత్మ యొక్క మొదటి పాదము విశ్వుడు. ఓంకారము యొక్క మొదటి మాత్ర అకారము. యీ మూడును ప్రథమములగుటచే సమానత్వ ధర్మమున్నది. యీ విరాడ్రూపుడైన విశ్వుడు, అకార మాత్రయు నొక్కటేయని నెరింగినవాడు సమస్త మనోరథములను పొందుచున్నాడు. అతడు పూజ్యులలో మొదటి శ్రేణికి చెందిన వాడగుచున్నాడని ఉపనిషత్తునందు చెప్పబడెను.

<u>ద్వితీయ పాదము</u>:- సమిష్టి సూక్ష్మరూప చైతన్యము హిరణ్యగర్భుడు, వ్యష్టి సూక్ష్మరూప చైతన్యము తైజసుడు. వీరిద్దరి ఉపాధులు సూక్ష్మమగుటచే వారికి భేదము లేదు. విరాడ్రూపుడగు విశ్వునకు చెప్పబడిన సప్తాంగములు, ఏకోన వింశతి ముఖములు హిరణ్యగర్భ రూపుడగు తైజసునకు గూడ గలవు. విరాడ్రూపుడగు విశ్వుని అంగములు, ముఖములు ఈశ్వర రచితములు. హిరణ్యగర్భ రూపుడగు తైజసుని అంగములు, ముఖములు మనోమయములగును. విశ్వుని భోగము స్థూలము. తైజసుని భోగము

సూక్ష్మము. విశ్వుని స్థూలభోక్త యనియు, తైజసుని సూక్ష్మ భోక్తయని యెరుగుము. విరాట్టునకు, విశ్వునకు భేదము లేనట్లు, హిరణ్యగర్భునకు తైజసునకు భేదము లేదు. స్వప్నావస్థ యందున్న తైజసునకు గూడ సప్తాంగములు, ఏకోన వింశతి ముఖములు గలవు. ఇతడు వాసనా మాత్రుడై భోగములను అనుభవించుచుండును. కాన విరాడ్విశ్వులకు భేదము లేనట్లు, హిరణ్యగర్భ తైజసులకు భేదము లేదు. ఈ హిరణ్యగర్భ రూప తైజసుని కంటె ఓంకారము యొక్క ద్వితీయ మాత్రమైన 'ఉ'కారము భిన్నము కాదు. బ్రహ్మము యొక్క రెండవ పాదము హిరణ్యగర్భుడు, ఆత్మ యొక్క రెండవ పాదము తైజసుడు, ఓంకారము యొక్క రెండవ మాత్ర ఉకారము. ద్వితీయత్వ ధర్మ మీ మూడింటియందును సమానము గనుక నివి అభేదములని చింతించవలెను. స్వప్నమే స్థానముగా గలిగిన తైజసుడు ద్వితీయ పాదము. ఓంకారములోని 'ఉ'కారము ద్వితీయ మాత్ర. యీ రెండును ఉత్కర్షము వలనను, మధ్య యందుండుట వలనను ద్వితీయము లగుటవలనను ఒక్కటియేనని ధ్యానించువారు, జ్ఞానమభివృద్ధియై విజ్ఞాన సంతతిని పెంపొందింప జేయుచున్నారు. శత్రుమిత్రులకు సమానులగుదురు. వారి కులమున బ్రహ్మవేత్త కానివారు జన్మించరని శ్రుతి వాక్యము.

తృతీయ పాదము:- సమిష్టి శరీరమైన మాయా చైతన్యము అవ్యాకృత మనబడును. వ్యష్టి శరీరమైన అవిద్యాసహిత చైతన్యము ప్రాజ్ఞుడనబడును. అవ్యాకృతునకును, ప్రాజ్ఞునకును శరీరములగు మాయావిద్యోపాదులు సమిష్టి వ్యష్టి ప్రపంచ కారణములు అగుటచే వారిద్దరికిని భేదము లేదు. ప్రాజ్ఞుడానంద భుక్కు. ఇతడు సుషుప్త్యవస్థయందు అవిద్యావృతమగు స్వరూపానందము ననుభవించుచున్నాడు. విశ్వ తైజసుల స్థూల సూక్ష్మ భోగములు త్రిపుటుల వలన గలుగునట్లు ప్రాజ్ఞుని యానంద భోగముగూడ త్రిపుటి వలననే కలుగుచున్నది. చైతన్య ప్రతిబింబ సహితమగు అవిద్యావృత్తి యధ్యాత్మ మనబడును. ఈశ్వరుడధి దేవతయగును. అజ్ఞానవృతమైన స్వరూపానందమధి భూతమగును. జాగ్రత్స్వప్నముల యందుగల సమస్త జ్ఞానములు సుషుప్తి యంద విద్యను పొంది ఘనీభవించుచున్నవి. అప్పుడాయ విద్యావిశిష్ట చైతన్యమే ప్రజ్ఞాన ఘనుడు

అనబడును. అతడు ప్రాజ్ఞుడు. సుషుప్త్యవస్థ యందు విశేష జ్ఞానము కలవాడగుటచేత ఇతడు ప్రాజ్ఞుడనబడుచున్నాడు. ఈ ప్రాజ్ఞ అవ్యాకృతుల ఉపాధులు కారణములు. కాన వారిద్దరకు భేదము లేదు. ఏ కోర్కెలు కోరక, ఏ స్వప్నము గాంచక యుండెడి సుషుప్తియే స్థానముగా గల ప్రాజ్ఞుడు అజ్ఞానావృతమగు స్వరూపానందమును అనుభవించుచున్నాడు. ఆ చేతోముఖుడగు ప్రాజ్ఞుడు తృతీయ పాదమని శ్రుతి చెప్పుచున్నది. కాన అవ్యాకృతుని శరీరము కారణమైనట్లు, ప్రాజ్ఞుని ఉపాధి కూడ కారణమేయగును. వీరిద్దరికి భేదము లేదు. అట్లే అవ్యాకృత రూపుడగు ప్రాజ్ఞుని కంటె ఓంకారము యొక్క మూడవ మాత్రయగు 'మ'కారమును భిన్నము కాదు. బ్రహ్మము యొక్క మూడవ పాదము వ్యాకృతుడు. ఆత్మ యొక్క మూడవ పాదము ప్రాజ్ఞుడు. ఓంకారము యొక్క మూడవ మాత్ర 'మ'కారము తృతీయత్వ ధర్మము, ఈ మూడింటికి సమానము. ఇవి మూడును అభేదములని గమనింపవలెను. విశ్వ తైజసులు ప్రాజ్ఞుని యందు లయమగునట్లు, 'అ'కార 'ఉ'కార మాత్రలు 'మ'కార మాత్ర యందు లయమగుచున్నవి. కాన అవ్యాకృత స్వరూపుడగు ప్రాజ్ఞుని కంటె 'మ'కార మాతృక భిన్నము కాదని యెఱింగినవారు యీ సమస్త జగత్తును యెఱింగిన వారును, యీ జగత్తుకు కారణభూతులగుచున్నారని శ్రుతియందు గలదు. కాన అవ్యాకృతుడు, ప్రాజ్ఞుడు, 'మ'కారమును అభేదములని చింతింపవలెను.

<u>చతుర్ధ పాదము</u>:- విరాట్టునకు స్థూలసూక్ష్మ కారణోపాధులను మూడు పాధులు గలవు. హిరణ్యగర్భునకు సూక్ష్మోపాధియు కారణోపాధియను రెండు పాధులు గలవు. అవ్యాకృతునకు కారణోపాధి యొక్కటి మాత్రమే గలదు. యీ విరాట్టు, హిరణ్యగర్భుడు, అవ్యాకృతులకుగల సమిష్టి స్థూలసూక్ష్మ కారణోపాధుల కధిష్ఠానమగు చైతన్యము పరమాత్మ యనబడును. దానికే యుపాధితోను సంబధము లేదు. కాన అది నిరుపాధికము. విశ్వునకు వ్యష్టి స్థూలోపాధియు, వ్యష్టి సూక్ష్మోపాధియు, అవిద్యారూపము అగు వ్యష్టి కారణోపాధియు, మూడు పాధులు గలవు. తైజసునకు వ్యష్టి సూక్ష్మోపాధియు, అవిద్యా రూపమగు వ్యష్టి కారణోపాధియునగు రెండు పాధులు గలవు. ప్రాజ్ఞునకు

విద్యారూపమగు కారణోపాధి యొక్కటి మాత్రమే గలదు, ఈ విశ్వ తైజస ప్రాజ్ఞులకు గల వ్యష్టి స్థూల సూక్ష్మ కారణోపాదుల కధిష్ఠానమైన చైతన్యము, ప్రత్యగాత్మ యనబడును. యీ ప్రత్యగాత్మకే యుపాధితోను సంబంధము లేదు. కావున ఇది నిరుపాధికము. వ్యష్టి సమిష్టి రూపములగు స్థూల సూక్ష్మ కారణోపాధులయందు భేదమున్నది. కాని వాటి కధిష్టాన చైతన్యమునందెట్టి భేదమును లేదు. అది స్వయముగా ప్రకాశించుచూ ఇంద్రియముల కవిషయమై శబ్దములచే తెలియబడక యున్నది. ఇట్టి ప్రత్యగ భిన్నమైన పరమాత్మయే చతుర్థపాదము. విరాట్టు, హిరణ్యాగర్భ, అవ్యాకృతా భిన్నులగు విశ్వ, తైజస, ప్రాజ్ఞులగు మూడు పాదముల పరమార్థములు. ఈ మూడిటియందు అస్తి, భాతి, ప్రియ రూపమున వ్యాపించియున్న బ్రహ్మ భిన్నమగు ప్రత్యగాత్మ పరమార్ధము. అట్లే అకార, ఉకార, మకారమనెడి మూడు మాత్రల పరమార్థములు. ఈ మూడిటియందు అస్తి, భాతి, ప్రియ రూపమున ఉన్న అమాత్ర పరమార్థము. మాత్రారహితమగు ఓంకారము తురీయమైన మాత్రయేయగును. దాని నెరింగినవాడు ఆత్మ స్వరూపుడే యగుచున్నాడని శ్రుతి చెప్పుచున్నది. యీ మూడు పాదముల యందనుగతముగ నున్న బ్రహ్మ భిన్న ప్రత్యగాత్మకు, అకార, ఉకార, మకారములందను గతముగనున్న అమాత్రతో అభేదము గలదు. బ్రహ్మ భిన్నమగు ప్రత్యగాత్మ నాల్గవ పాదము. అమాత్రయును నాల్గవదగును. కాన యీ రెండును ఒక్కటియే యని తెలియవలెను.

**మూ॥ ప్రజ్ఞానాంశు ప్రతానై: స్థిరచరనికరవ్యాపి భిర్వ్యాప్యలోకాన్ ।**
**భుక్త్వా భోగాన్ స్థవిష్ఠాన్ పునరపి ధిషణోబ్దా సితాన్ కామజన్యాన్ ।**
**పీత్వాసర్వాన్ విశేషాన్ స్వపితి మధుర భుఙ్మాయయా భోజయన్నో ।**
**మాయా సంఖ్యా తురీయం పరమ మృతమజం బ్రహ్మయత్తన్న తోస్మి ॥**

టీ॥ వృక్షాది స్థావరముల యొక్కయు, మనుష్యాది చరముల యొక్కయు సమూహమును వ్యాపించెడు తనయొక్క ప్రజ్ఞాన కిరణాజాలములచేత విషయములను వ్యాపించి స్థూలములగు సుఖ దు:ఖాది భోగములను జాగ్రదవస్థ యందనుభవించియు,

(2) సర్వేన్ద్రియములు ఉపరమించు చుండగా, జాగ్రద్వాసనా వాసితమగు బుద్ధిచే అవభాసితములు. అవిద్యా కామకర్మ కల్పితములు అగు భోగములను స్వప్నమునందు అనుభవించియు, (3) స్థూల సూక్ష్మములు జాగ్రత్స్వప్న రూపములునగు సమస్త విషయములను తనయందైక్యము చేసికొని తాను సుషుప్తి యందానందమును అనుభవించుచు మాయచే మమ్ములను గూడ ఆనందము ననుభవింపజేయు చున్నట్టియు తురీయము శ్రేష్ఠము, అమృతము, అజమునగు వేదాంత ప్రతిపాదిత బ్రహ్మమును గూర్చి నమస్కరించిన వాడనగుచున్నాను.

**శ్లో॥ తుభ్యం మహ్యమనన్తాయ మహ్యంతుభ్యం శివాత్మనే।**
**నమో దేవాది దేవాయ పరాయ పరమాత్మనే॥**

నీవును, నేనును అనంత స్వరూపులమే, ఉభయులము శివ స్వరూపులమే. దేవాది దేవుడును, శ్రేష్ఠుడునునగు పరమాత్మకు నమస్కారము. ఆ పరమాత్మ స్వరూపుడనగు నాకు గూడ నమస్కారము.

ఓం తత్ సత్

# “తాను” (ఆత్మ) “నేను” (జీవుడు) “ఇది” (ప్రపంచము)

ప్రపంచమున సర్వజీవులు సుఖానందములకు అన్వేషణము చేయుచున్నారనుట నిర్వివాదాంశము. కాని ఆనందమును పొందుటకు అవలంబించు మార్గములు భిన్నములు. కొందరు ధన సంపాదనమున, మరికొందరు భార్యాపుత్రాదుల వలన, మరికొందరు ప్రాపంచిక విషయ భోగములవలన ఆనంద ప్రాప్తి నభిలషించుచున్నారు. సార్వత్రికానుభవముతో పరిశీలించినచో యిందేదియును నిత్య నితిశ యానందమును యిచ్చినట్లగుపడదు. స్వల్పకాలికానందమును యిచ్చినను కాలాంతరమున, దేశాంతరమున దు:ఖప్రాప్తిని కలిగించుచున్నవి. కారణమాలోచించి మార్గమును తెలియు వారు వివేకులు. ప్రపంచమును గురించి విచారించినచో శబ్ధమున కర్థము - (పంచ=ఐదు, ప్ర=కూడినది) అనగా ఐదు భూతములతో కూడినది. ఇది జడము, వికారవంతము. అనగా, పుట్టుచూ, పెరుగుచూ, నశించుచూ ఉండు స్వభావము కలది. దానిని ఆశించిన సుఖము కూడ నశించు స్వభావము కలిగియుండునని నిర్ణయించవలెను. యీ ప్రపంచ వస్తువులు మనచేత తెలియబడి, మన మమకారము ననుసరించి అనుభవించ బడుచున్నవి. కాని మనలను గుర్తించలేవు. కనుక అవి జడములు అని చెప్పుటకు ఎట్టి సందేహము లేదు. గుర్తించు మన మెవరమై యున్నాము అని విచారించుటయే ధృక్, దృశ్య వివేకము. యిదియే వేదాంతమునకు పునాది.

ఏది దేశాంతరమునగాని, కాలాంతరమునగాని, బాధించబడక నిత్యమై, స్వప్రకాశమై, సర్వప్రకాశమైయుండునో అదియే సత్యమని వేదాంత నిర్ణయము. అట్టి సత్యవస్తు నిర్ణయమునే శాస్త్రము లందించుచున్నవి. ప్రపంచమున అనేక మతములున్నవి. వారికి మతగ్రంథము లున్నవి. అవి అన్నియు దైవమును గురించియే పలుకుచున్నవి. కాని హిందూమతమున అద్వైత సిద్ధాంతము మిన్న. ఇందు శ్రుతి ననుసరించుచు, సార్వత్రికానుభవమున సరియనుకొనుచు, యుక్తితో దైవతత్వమును తెలియపరచును.

అనుభవమున సరిలేక శాస్త్రమున చెప్పబడిన కర్మకాండాది క్రియల వలన వచ్చు ఫలములు కాలాంతరమున గాని, దేశాంతరమున గాని, లోకాంతరమున గాని వచ్చి నశించును.

**"య ఆత్మా సర్వాంతర:"** యిది శ్రుతివాక్యము. పంచేంద్రియ గోచరములగు అనగా ఆధ్యాత్మిక, ఆదిభూత, ఆదిదైవికములు నాకు దృశ్యములు. అవి నాచే యెరుగబడుచున్నవి. కనుక అవి నాకు బాహ్యములు, దృశ్యములు. **"యదృశ్యం తన్నశ్యమ్"** ఏది ఎరుగబడుచున్నదో అది నాశవంతమని గుర్తించవలెను. జ్ఞానేంద్రియము ద్వారా మాత్రమే తెలియబడుచున్నవి.

అందువలన జ్ఞానేంద్రియములకు తెలియబడు యీ దేహము ప్రపంచము. వాటికి బాహ్యములు జ్ఞానేంద్రియములు, అంతరములు మనస్సు. జ్ఞానేంద్రియముల ద్వారా తెలుసుకొనుచున్నది. కనుక జ్ఞానేంద్రియములకు మనస్సు ఆంతరము. అవి బాహ్యములు. అంత:కరణము మనస్సునకు అంతరము. సర్వమునకు అంత: = లోపల, కరణము=పనిముట్టు (అంత:కరణము) అంతరమైయున్నది. నిద్రావస్థయందు అదికూడ లేనిదై ఏమియు తెలియని రీతిని యుందుము. మేల్కొంచిన తర్వాత సుఖముగ నిద్రించితిమని, ఏమియు తెలియలేదని అందరి అనుభవము. యిప్పుడు నిద్రలో మనమున్న యునికి అంత:కరణమున కంటె అంతరము. ఆ ఉనికికి అంత:కరణము బాహ్యము. ఆ ఉనికికి బాహ్యములని చెప్పబడిన అంత:కరణము, మనస్సు, ఇంద్రియములు, దేహము (ప్రపంచం) దృశ్యములు. కనుక అవి జడములు. అనగా స్వత: సత్తలేనిది. నిద్రలో మనమున్న ఉనికియే సర్వాంతరము. అదియే "ఆత్మ". ఆ ఆత్మ తేజస్సుచేత అంత:కరణము స్ఫూర్తిగలిగి అందున్న పూర్వజన్మ వాసనా విశేషములవలన సంకల్పించబడి, వృత్తులుగా యింద్రియముల ద్వారా బహిర్గతమై సర్వ వ్యవహారమునకు ఆస్పదమగుచున్నది. అంత:కరణములు వేరు వేరుగా నుండును. గనుక భిన్న మానవులకు భిన్న వ్యవహారములుండును. సర్వాంతరమున నున్న తెలివి (ఆత్మ) మాత్రము సమముగా ఏకమైయే యున్నది. ఒకే సూర్యరశ్మి భిన్న భిన్నములగు

రంగుల అద్దములలో నుండి బహిర్గతమైనపుడు ఆయా అద్దముల రంగులతో బయటికి వచ్చునుగదా? ఈ రీతిగా మానవుల వ్యవహారములు కూడ భిన్నములుగా నుండును. ఈ విధముగా **"య ఆత్మా సర్వాంతర:"** అను శ్రుతి వాక్యమును మనము అనుభవములో సరిచూచుకొని ఆత్మ నిశ్చయము చేయలెను. ఘటము నందలి ఆకాశము, మహాకాశమున కంటె ఎట్లు భిన్నము కాదో, ఒక మనుష్యుని యందు నిర్ణయించి తెలుసుకున్న తెలివి (ఆత్మ) యే సర్వాత్మయై యున్నది. ఘటాకాశము, మటాకాశమని ఉపాధులను బట్టియే కాని, ఉపాధులను విడిచి చూచినచో ఏకమైయున్న విధమున, జీవోపాధులను విడిచి చూచినచో ఆత్మ చైతన్యము యేకమైయున్నది. ఆత్మ సత్త యందు సర్వప్రపంచం జ్ఞానస్ఫూర్తి, సత్తలను పొంది వ్యవహార యోగ్యమగుచున్నది. ఇపుడు మన స్వరూపము తెలివిరూపమై యున్నదని తెలిసినది. దానికి కర్తృత్వ, భోక్తృత్వములు లేవు. సుఖదు:ఖము లాదిగాగల ద్వందములు లేవు, పూర్వజన్మ వాసనలతోను నిండియున్న అంత:కరణమునందు ప్రతిబింబించిన స్ఫూర్తి (ఆభాస) అంత:కరణము, బ్రహ్మము (సర్వాత్మ) కలసి జీవుడనబడును. సూక్ష్మ పంచభూతముల సమిష్టి సత్వాంశము వలన ఏర్పడినదియే అంత:కరణము సూక్ష్మ పంచభూతముల సమిష్టి రాజసాంశమువలన ఏర్పడినదియే ప్రాణము. ఆత్మ స్ఫూర్తిని పొందిన అంత:కరణము పరిణామము పొంది సంశయాత్మకమగు వృత్తితో నున్నపుడు మనస్సందుము. నిశ్చయాత్మక వృత్తిలో నున్నపుడు బుద్ధి యందుము. చిత్తము మనస్సు నందున, అహంకారము బుద్ధి యందున అంతర్గతములు. కనుక అంత:కరణము నందున్న చెడువాసనలు ప్రయత్న పూర్వకముగా తొలగించుకొని, సద్వాసనలచే నింపవలెను. సద్వాసనల నుండి సర్వాత్మకమగు భగవద్భావనా వృత్తి (బ్రహ్మాకార వృత్తి) యందు నిల్పవలెను. ఇట్లు ఏకవృత్తి స్థాపన చేయగలిగి (ధ్యానము ద్వారా) వృత్తి రహితస్థితిని (సమాధిని) స్థాపన చేయవలెను. దానినే నిర్వికల్పక సమాధి యందురు. తెల్లని వెలుగు, తెల్లని అద్దము ద్వారా బయటికి వచ్చినపుడు తెల్లగానే ఎట్లుండునో, అట్లే వృత్తి రహితాంత:కరణమందు ప్రతిబింబించిన ఆత్మ తేజస్సు

సర్వజ్ఞాత్వాది లక్షణములు కలిగి ఈశ్వర తేజస్సువలె నుండును. పురుష ప్రయత్నము చేత సత్పురుషుల సాంగత్యము చేత, అంతఃకరణ మాలిన్యమును తొలగించుకొని, స్వరూపస్థితి యందుండుటకు ప్రయత్నము చేయవలయును. ప్రాపంచికానుభవము ననుసరించియే వేదాంతానుభవమును పొందవచ్చును.

ప్రత్యయానుభవము:- అనగా పంచేంద్రియముల ద్వారా శబ్ద, స్పర్శ, రూప, రసగంధానుభవములను పొందుచున్నాము.

వేదనానుభవము:- యింద్రియముల సహాయము లేకయే, మనస్సులో సుఖదుఃఖానుభవములను పొందుచున్నాము.

సాక్షి అనుభవము:- నిర్వికారమై, సమస్త ప్రత్యయానుభవములకు, వేదన అనుభవములకు సత్తా, స్ఫూర్తులనిచ్చి అనుభవింప జేయునదియే **"సాక్షి"** యని గుర్తింపవలెను.

అధ్యారోపాప వాదములు:- కన్పించిన జగత్తును ఒప్పుకొని, దాని జడత్వమును నిరూపణము చేసి, అపవాద మొనర్పవలెను. ఇట్లే అంతఃకరణము, మనస్సు, బుద్ధి, ఇంద్రియములు, దేహమును అంగీకరించి అపవాదము చేయవలయును. అట్లు చేయగా శేషించిన తెలివి రూపమే మన స్వరూపముగా నిర్ణయించవలెను. ఆ తెలివియే ఉపనిషత్తులు ప్రతిపాదించు సత్యవస్తువు (బ్రహ్మము). ఆ సత్య వస్తు స్ఫూర్తిలో ఆగమాపాయినులై యున్న అవస్థలు, దేహములు మున్నగునవి మిథ్య.

కర్తృతంత్రము:- ఏదేని కర్మజేసి దాని ఫలమును పొందుటను కర్తృతంతమని చెప్పుదురు.

వస్తుతంత్రము:- వస్తువనగా స్వరూపము. దానిని పొందుటకు చేయవలసిన దేదియులేదు. దానియందు తెలియబడు నామ రూపములు ఆరోపితములుగా విచారించి తెలిసికొని ద్వంద్వాతీతుడవై యుండుటయే స్వరూపస్థితి యందుండుట అదియే స్థిత ప్రజ్ఞత్వము.

పారమార్థికము:- కేవల నిర్గుణ స్వరూపమును గుర్తించి అందు స్థితి గలిగి యుండుట. అనగా "తానై" యుండుట. అదియే విదేహముక్తి, దేహముండియు దాని వ్యవహారము లేనివాడు.

జీవన్ముక్తుడు:- అట్టి తానైన స్థితిని గుర్తించి తిరిగి నేను, నాదియని మమత చెందక నిర్లిప్తముగా వ్యవహరించుట జీవన్ముక్తి యందురు. తానై యుండుట పరమార్థము. నేనై యుండుట వ్యవహారము. వ్యవహారములో మమకారమును పొందినచో తిరిగి జన్మకు కారణమగును.

ఎవరు శాంతి, దాంతి ఇత్యాది సద్గుణములు కలిగి, ప్రత్యక్ దృష్టి నవలంబించి, తమ ఆత్మ స్వరూపమును వివేచించి తెలుసుకొనుచున్నారో వారికి 'నేను' అను స్వరూపమునకు అతీతమైన 'తాను' అను అనుభవము కలుగును. అదియే అనుభవాత్మకమగు పరమాత్మ, అది యేకరూపమై, దానియందే సర్వము కల్పితమై తోచుచున్నది. సమాధి మొదలగు అనుభవములచేతను యీ స్వరూపమే అభివ్యక్త మగును. యీ సంగతులన్నియు విచారించి, మననము చేసి, యీ జగత్తు మాయా స్వరూపమని దాని నెరుగు "నేను" మాయావినని తెలుసుకొని నిర్విచారముగా జీవింతుము గాక!.

1) ఆత్మయందు అనగా తన స్వరూపమునందు లేని సుఖదు:ఖములను దానియందు కల్పించుకొనుటయే "అవిద్య".

2) ఆత్మ నిత్య శుద్ధమైనదని, దానికి మరియొక వస్తువుతో సంపర్కము లేదని విచారించి తెలుసుకొనుటయే "విద్య".

3) బ్రహ్మ విద్య యనగా బ్రహ్మను తెలుసుకొనుట. తెలుసుకొనిన అనుభవములో నిలుచువారికి సర్వానర్థములు మొదలంట నశించిపోగలవు.

4) యింతటి యీ ప్రపంచము తోచి, అణగుటకు ఆధారమైన దేదియో అదియే "బ్రహ్మము".

5) మన స్వరూపమే (ప్రత్యగాత్మ) బ్రహ్మమై యుండుట వలన, ఆత్మ విద్యయే బ్రహ్మ విద్య. ఆత్మ స్వరూపమునందు స్థితి పొందినచో బ్రహ్మమునందు స్థితి పొందుటయే యగును. **"బ్రహ్మ జ్ఞానమే బ్రహ్మము".**

6) నేను ఉన్నాను అను దానియందు ఎవ్వరికిని సందేహము లేదు. దాని స్వరూపమే ఆత్మ. ఆత్మయే బ్రహ్మము. దానియందు తెలియబడు దృశ్యము ప్రపంచము.

**శ్లో॥ జ్ఞాతేస్థాణౌ కృతశ్చౌర శ్చౌరాభావే భయంకృత:**
**జ్ఞాతేస్వస్మిన్కుతో విశ్వం విశ్వాభావే కుతో భలమ్॥**

అర్థము:- స్థాణువును స్థాణువుగా గ్రహించినపుడు దొంగ ఎక్కడ? దొంగ లేకుండిన భయమెక్కడ? ఆత్మ జ్ఞాన మేర్పడిన, విశ్వమెక్కడ నుండగలదు. సంసారము లేనిచో విశ్వ మెట్లగుబడును.

ఓం తత్ సత్

# అవిద్య - మాయ

లోక వ్యవహారములలో, ఉన్నదానిని మరియొక రూపముగా దర్శించుట మాయ యందురు. దానిని రెండు విధములుగా నిర్వచించవచ్చును. ఉన్న వస్తువే మరియొక విధముగా కనబడునని గాని, నిజముగా లేనిదియే ఉన్నటుల తోచునని గాని చెప్పుట మాయా శబ్దమున కర్థము. **"యామాసా మాయా"** ఏది విచారించగా లేనిదో అది మాయ. ప్రపంచము మాయా స్వరూపమని అనేక వేదాంత గ్రంథములలో కాననగును. మాయకు మొదటి లక్షణము అవిద్యా కల్పితము, వ్యక్తావ్యక్తమనునది రెండవ లక్షణము. అనగా మిథ్యా పదార్థము. ఒకసారి ప్రతీతమై మరియొకసారి ప్రతీతము కాక యుండుట, మాయ అనిర్వచనీయ మనుట మూడవ లక్షణము. అద్వితీయాత్మయందు మాయా దృష్టిచే ఈశ్వరత్వము కల్పితము. ఈ మాయను ఈశ్వర శక్తియనియు, వైష్ణవీ మాయ అనియు పిలుతురు. ఇది మాయయొక్క నాల్గవ లక్షణము.

గోచరించుచు అనుభవ యోగ్యమగు వ్యావహారిక ప్రపంచం లేదని అంగీకరించ లేము. శశ విషాణాదులత్యంతా సత్తులగుటచే, నవి ఏకాలమందును తెలియబడవు. కాన తుచ్ఛము లనబడును. శుక్తి రజతాదులవి ఏకకాలమందు తోచుటలేదు. కావున నివి యపహ్నవములు. అపహ్నవ పదార్ధ మిదమిద్ధమని చెప్పబడదు. కాన ఇది అనిర్వచనీయము. అనిర్వచనీయ పదార్థము మిథ్య యనబడును. అట్టి మిథ్యారూపమగు జగత్తు ఆత్మ అనిగాని, ఆత్మ కంటె వేరనిగాని గుర్తుపట్టి చెప్పుటకు వీలుపడని తోపికమైయున్నది.

**తే॥ అరయనాయున్కి కంటె వేఱైన యున్కి,**
**లేదుగాన నుద్భిన్నంబు గాద విద్య,**
**ప్రకృతి యజ్ఞానమని పల్క(బడుటవలన) గాదు,**
**మదభిన్నము నునాయనాది మాయ.**

అర్థము:- నేనున్ననే మాయయున్నది. కాబట్టి మాయ నాకంటె భిన్నమనుటకు వీలులేదు. నేను నిష్క్రియుడనగుట చేతను, జ్ఞానస్వరూపుడ నగుటచేతను, మాయ జగదా రంభాది క్రియలు గలదనుటచేతను, జ్ఞానరూపముగాదు. కాబట్టియును నాకంటె భిన్నమయినదనియే చెప్పవలెను. సీ॥రా॥ఆంజ

అందుచేనిది అవిద్యకమైన మాయ. అది సుషుప్త్యాద్యవస్థలయందు ఏ విధముగాను కనబడక, ఆత్మయందే ఒకటై పోవుచున్నది. అందుచేత దాని నిజస్వరూపము ఆత్మేయని తెలిసినది. పలువురు పెద్దలు, పలు విధములుగా యీ అవిద్యా మాయలను వివరించుట కాననగును. అందువలన వేదాంతార్థమును నిర్ణయించుట కడ్డుగా నున్నది.

శ్రీ శంకరాచార్యుల వారి నిర్వచనము ప్రకారము - చైతన్య స్వరూపుడుండియే, మిగిలిన వానిని ప్రకాశింప జేయుచూ తన స్వరూపమున ఏ మార్పును లేకుండట చేత, అతడు సత్య స్వరూపుడు. దేహేంద్రియాదులు, మనస్సు మొదలగునవి ఆత్మావలంబనము ద్వారా ఉనికి గలిగి కనబడుట కనుగొనవలసి యున్నది. కాన అవి అనృతములు - మిథ్య, అనిపించుచున్నవి. ఈ ఆత్మానాత్మలకు నిజముగా ఏ సంబంధము లేకపోయినప్పటికిని ఈ రెండింటిని విడదీసుకొనక కలుపుకొని నేను, నాది అను వ్యవహరించుట జనులకు స్వభావమైయున్నది. ఆత్మానాత్మలను, ఒకదాని నొకటని తెలియుట, ఒకదాని ధర్మములను మరియొక దానియందారోపణ జరుపుట, అను అధ్యారోపమునే "అవిద్య" అందురు. ప్రమాత లేకుండ ఏ శాస్త్రవిచారణ జరుగనిచేతనూ, ప్రమాతృత్వము ఆత్మానాత్మల అధ్యాసవలన ఏర్పడుట వలననూ, అన్ని విచారణలు, ఉపదేశ శ్రవణాదులు అవిద్యా భూమియందే అంతర్గతములని అనుభవ సమ్మతము. ఈ విద్యావిద్య విభాగము గూడ అవిద్యా దృష్టియొక్క వ్యవహారమే. భ్రాంతిలో తోచిన దానిని మాయ యనుట రూఢ్యర్థము. మాయావి తానొక్కడేయున్నను తన మాయతో అనేకముగా కనబడునట్లు పరమేశ్వరుడు అవిద్యతో అనేకరూపములుగ కన్పించుచున్నాడనునది సరళమైన అర్థము. అవిద్యతో తోచు నామరూపముల బీజమునూ, నామరూప కార్యమును, ఆచార్యులు మాయయని పిలుచుచున్నారు. ఇట్లు

జగత్తంతయు మాయయే అయియుండుట చేత, అవిద్యను యీ దృష్టితో మాయయని పిలువవచ్చును. ఎందుకనగా అవిద్యావంతులకు, కనబడునదంతయు మాయయే. ఆత్మనిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావుడను జ్ఞానము, మనసుకు వచ్చినపుడు విద్యావిద్యలు రెండును పరమార్ధముగా ఎప్పుడు లేవను జ్ఞానము కలుగును. ఆత్మ చైతన్యమునకు విషయమైన విద్యావిద్యలు రెండును, నామరూప పక్షమునకే చేరినవి. ఈ దృష్టితో అవిద్యను మాయయని పిలువవచ్చును. మాయయని పిలుచు నామరూపములను గూడ అవిద్యయని పిలువవచ్చునా? విచారించగా నామరూపములు అవిద్యవల్లనే తోచుచున్నవి. అవిద్యలేని బ్రహ్మజ్ఞానులకు అవి నిజమని కనిపించుటయే లేదు. ఎందుకనగా అన్నియు బ్రహ్మమే యనునదే బ్రహ్మవిద్య. మిథ్యా జ్ఞానరూపమైన అవిద్యయు, ఆత్మరూపమై యున్నదని సురేశ్వరులు గూడ చెప్పును. అయితే వృత్తిరూపముతో జూచినపుడు, విద్యావిద్యలు రెండును అవిద్యయని పిలువవచ్చునని సిద్ధమగును. ఇట్లు పరమార్ధదృష్టితో జూచినపుడు విద్యావిద్యా విభాగమే యుండదనియు, మాయయు లేదని తెలిసినది. నేను అని పల్కినపుడు, ఆత్మేయనిగాని ఆత్మకంటె వేరనిగాని నిర్వచనము చేయుటకు వీలులేకపోవుటచే, అవిద్యాకృతమైన మాయయనియే తెలియదగినది. ఈ మాయావాదమునకు ఆచార్యులవారి ప్రక్రియ యందు అంత ప్రాధ్యానము లేదు. అంతయు బ్రహ్మమేయను బ్రహ్మవాదమునే ముఖ్యముగా గణించుటకు నిమగ్నులైరి. మాయావాదమును గురించి, యిది శంకరాచార్యుల వారి అభిప్రాయము.

కాని కొందరు అవిద్య జీవునికి ఉపాధియనియు, మాయ ఈశ్వరునికి ఉపాధి అనియు చెప్పుదురు. మాయకు ఆవరణ, విక్షేపశక్తులు గలవనియు, మొదటిది ఆత్మను గప్పిపుచ్చుననియు, రెండవది నానారూప ప్రపంచమును గోచరింపజేయును అనియు అందురు. పరమాత్మ సృష్టికి పూర్వాపరములలో నిర్వికారుడని చెప్పుట శ్రుతి సమ్మతము. ఐన యీ ప్రపంచమెట్లు కలిగెనను సంశయము అందరకు కలుగును. దానికి (సీ॥ ఆం) నందు, **"అట్టి నాయందనాదిగా నాత్మశక్తి యలరు నవ్యవక్తమయి**

**జగదాదియగుచు, గలితమృత్తికయందున్న కలశశక్తి, యేర్పడక కుంభహేతువై యెనసినట్లు"** మట్టియందు కుండయగు శక్తివ్యక్తము గాకుండ నున్నది. అదియే కుండ ఆకారమగుటకు హేతువగుచున్నది. ఆ ప్రకారముగానే జగత్తుకు కారణమగుచు నిట్టిదని చెప్పుటకు వ్యక్తముగాని ఆత్మశక్తి నాయందు మొదటినుండియు ప్రకాశించుచున్నది. మఱ్ఱిగింజ మిక్కిలి సూక్ష్మమైనది. పెద్ద మఱ్ఱిచెట్టును నిర్మించు శక్తి ఆ గింజయందు వున్నదేగాని మరియెక్కడ లేదు. దానియందున్నను తెలియుట లేదు. కాన అట్టి శక్తికి అవ్యక్తమని పేరు. ఆ వృక్షమునకును, గింజకును భేదము లేదు. ఆధారమైన గింజకును. ఆధేయమైన వృక్షశక్తికిని భేదము లేదు. ఈ ప్రకారముగానే అగ్ని మొదలగు వానియందుష్ణశక్తి మొదలగునవి. అదే విధముగ ప్రపంచమునకు హేతువగు ఆత్మశక్తి, నిర్వికారుడగు పరమాత్మ యందు వ్యక్తముగా నుండును. ఆ శక్తికి ఆధారమైన బ్రహ్మమునకు, ఆత్మశక్తి జన్యమైన ప్రపంచమునకును భేదము లేదని యెరుంగుము. ముత్యపు చిప్ప యందలి మెరుగును జూచి, వెండి యనుకొనుట అందరి అనుభవమే. అజ్ఞానమువల్ల కలిగిన భ్రమ చేత ఒక వస్తువు మరియొక వస్తువుగా గాన్పించుచున్నది. ఆ భ్రమ తొలగగానే ఆ వస్తువుయొక్క యదార్థ స్వరూపము కాననగును. అట్లే అద్వయుడగు సచ్చిదానందరూప పరమేశ్వరుడు, అనృత జడ దు:ఖరూపుడుగా మాయవలన తోచుచున్నాడు. ఆ మాయ దొలగిన, పరమేశ్వరుని యదార్థ స్వరూపము మాత్రమే గోచరించును.

**తే॥ ధృఢ తరాద్వైత విజ్ఞాన దృష్టిచేత,**
**బండితులు పూర్ణ నిర్గుణ బ్రహ్మమయుడు**
**నైన ననుగాంచిన నంతనెయ్యది యభావ**
**మగునది యసూమదీయ మాయాతమంబు.**

కాని, అనృతజడ దు:ఖాత్మకమైన ప్రపంచము గోచరించదు కాబట్టి యిట్టి భ్రమను గలిగించునదియే మాయ. ఆ మాయను సమష్టి నిద్రాస్వరూపమనియు, జగద్వాసనా రూపమనియు, త్రిగుణ స్వరూపమనియు, అవిద్యయనియు, అవ్యక్తమనియు,

తమస్సనియు, అజ్ఞానమనియు ఇత్యాది పదములతో బ్రహ్మవేత్తలు చెప్పుదురు. అట్టి మాయ నిర్వికార పరమేశ్వరునకు, సృష్టి స్థితిలయములు కలిగినట్లుగా తోపింప జేయుచున్నది. అట్లు తాను తోచుటయే గాక, ఆది మధ్యాంతరహితాద్వయ బ్రహ్మమునకు, మధ్యాంతములు గలిగినట్లు తోపింపజేయుచున్నది. ఈ లోకముల గ్రమ్ముకొనియున్న మూలప్రకృతి, మాయయనియు అవిద్యయనియు రెండు విధములు. మొదటిదగు మాయ రజోతమోగుణములతో గూడని శుద్ధసత్వగుణమే ప్రధానముగా గలది. మలినసత్వ ప్రధానమైనది అవిద్య. ఇట్లు మూలప్రకృతి యే రెండుగా నున్నదని కొందరు వచించెదరు.

మాయకు "మీయతే అనయేతి మాయా" అని కూడ అర్థము ఉన్నది. అనగా దేనివలన తెలుపుడు చేయబడునో అది మాయ. సృష్టియంతయు ఆత్మాభివ్యక్తియే. తనచేతన సత్తుయొక్క శక్తి చేతను, దానియొక్క శుద్ధ ఆనందమునుండియు ఏ ఏకమాత్ర సత్తకర్మ చేయుచు, విశ్వమును సృజించునో, అదియే మనస్వరూపమగు సద్వస్తువు. అదియే మన సమస్త క్రియా ప్రకారముల, మరియు మనోభావములయొక్క ఆత్మ. అదియే మన సమస్త క్రియ పరిణామము మరియు సృజనముయొక్క కారణము, విషయము, గమ్యము. చిత్రకారుడు, గాయకుడు తానొకసృష్టి చేసినపుడు, అనభివ్యక్త ఆత్మలోని ఒకానొక శక్యతను, అభివ్యక్తియొక్క ఒక రూపములోనికి వికసింపజేయునేగాని మరేమియు జేయుట లేదు. సరిగా నిదియే బ్రహ్మజగత్తుల కనువర్తించును. సమస్త సృష్టి లేక సంభూతి నిజానికి ఆత్మ అభివ్యక్తియే యగును గాని మరేమియు గాదు. ఏది బీజముననున్నదో అదియే ఆ బీజమునుండి వికసించును. ఆశక్తియే మూలజీవ తత్త్వము. నిజానికి శక్తియు ఆ వ్యక్తియే. ఆ శక్తిని ఉపకరణముగా నుపయోగించుకొని వ్యక్తి భావమునంది నచేతన, ఆ వ్యక్తియే ఆ శక్తి. యే ఉపాదానము యుపయోగించునో అదియు నా వ్యక్తియే. చివరకు ఫలితరూపమును ఆ వ్యక్తియే. ఒకే సత్తా, ఒకే శక్తి, సత్యము యొక్క ఒకే ఆనందము. తనను తాను వివిధ బిందువులయందు కేంద్రీకరించుకొని "ఇది నేను" అని చెప్పుకొనును. ఇక ఆ సత్తు దేని నుత్పన్నము

జేయునో, అది స్వయముగ తానే మరి నితరమేమియు కాజాలదు. కాన ఏదేది ప్రపంచము లోనికి వచ్చునో, అది కేవలము దానిని గోరుచుండును. తన గభీరతమ స్వరూపమునందు పనిచేయుచుండు సత్తు, చిచ్ఛక్తి మరియు ఆనందములచే ప్రతి దిశయందును, స్వవిషయకమగు ప్రతి భావము ద్వారాను, అది తన ఆనందమును వృద్ధిపరచి, పూర్ణము గావించుకొన చూచును. కాని అట్టి పూర్ణత, వైయక్తిక నిర్మాణము యొక్క అవధుల లోపల కేంద్రీకృతమైన వైయక్తిక చేతనయందు సంభవము కాదు. ఆత్యంతిక పూర్ణత, సాంతమునందు సాధింప శక్యముగాదు. సాంతముయొక్క స్వభావమునకది పరకీయము. పూర్ణతా విషయమున సంభవము కాగల ఏకమాత్ర చరమ గమ్యము. వ్యక్తియందు (వ్యక్తి లోపలగాదు) అనంతచేతన యొక్క ఆవిర్భావమే. ఆ ఆవిర్భావము ఆత్మజ్ఞానము చేతను, ఆత్మానుభవము చేతను, తన యొక్క సత్యమును వ్యక్తి తిరిగి పొందుట మాత్రమే. ఈ సత్యము సత్తాయందు, చేతనయందు, ఆనందము నందు అనంతమే. ఈ సాంతము తన ఈ ఆత్మయొక్క ఒక ముసుగు అనియు, బహువిధ ప్రకటన కొరకు ఒక ఉపకరణమనియు కనుగొనును. అనంత విభాజనము లోనికి చేతనవస్తువు యొక్క అంతర్లయనమును భావన చేయవలయును. అట్లు కానిచో సాంత వైవిధ్యముండనేరదు. దీనికి పిమ్మట స్వరూప సత్తా (ద్రవ్యము) లోనికిని, సజీవసత్త (వృక్షము) లోనికిని, సబుద్ధిక సత్త (మనుష్యుడు) లోనికిని, స్వవిరుద్ధమైన శక్తి యొక్క ఆవిర్భావమును భావన చేయవలయును. చివరకు ప్రపంచమున క్రీడించుచున్న ఏ ఏకము, మరియు అనంతముగలదో తానదియేనను విముక్త అనుభవము లోనికి స్వరూప సబుద్ధికయొక్క విముక్తిని భావన చేయవలయును. అట్టి విముక్తి చేత తానిపుడు రహస్యముగను, వాస్తవముగను, నిత్యముగను, దేని రూపమునసున్నదో, ఆ నిస్సీమ సచ్చిదానందము యొక్క పున: ప్రాప్తిని భావించవలెను. ఈ త్రివిధగతియే ప్రపంచ సమస్యకు సంపూర్ణ కీలకము. ఈ సత్తు, చిత్తు, ఆనందము సరాసరి పనిచేయదు. ఇక శక్తి సత్తా యొక్క స్వప్రకటనమని మనము గాంచినపుడు ఈ శక్తి అవలంబించిన క్రియారేఖ, ఆ సత్తయొక్క అనురూపమని తలంచెదము. ఈ

క్రియాశక్తియే వస్తువును వెలికిదెచ్చును. ఈ శక్తి వైదిక ఋషులకు మాయా నామమున తెలిసియుండెను. అనంతచేతన యొక్క ఏ శక్తి అపార సత్యమునందు నామ రూపములను వానితో తాదాప్యము చెంది సమగ్రముగా గ్రహించి, ఆకారమిచ్చునో అదియే "మాయ" అని వారి అర్ధము. మాయ యొక్క రెండవ నిర్వచనమైన **"మీయతే అనయేతి మాయా"** దేనిచేత తెలియబడునో అది మాయ. ఈ ప్రత్యక్షగోచరమైన సృష్టిని విచారించగా మూలమైన బ్రహ్మ వస్తు దర్శనమగును.

అప్పుడు పరిణామవంతమైన యీ ప్రపంచము లేనిది, కానిది అని త్రోసివేయ వచ్చునా? పరిణామము, వివర్తము సమనియతములు. పరిణామము గోచరించవలెనని జ్ఞానముండవలెను. జ్ఞానమున్నదని నిశ్చయించుటకు పరిణమించు వస్తువుండవలెను. కాన జ్ఞానము నిరపేక్షకముగాను, ప్రపంచము సాపేక్షికముగాను గ్రహించవలెను. అప్పుడు "ఏకమేవా ద్వితీయం" అను శ్రుతికి సమ్మత మగును.

**శ్లో॥ సమం సర్వేషు భూతేషు, తిష్ఠస్తం పరమేశ్వరమ్,**
**వినశ్యత్స్వ వినశ్యస్తం యఃపశ్యతి సపశ్యతి.** **భ.గీ.అ.13.శ్లో.27.**

తా॥ సర్వభూతముల యందున సమముగా నుండి, వాని శరీరములు నశించునపుడు నశించనట్టి ఈశ్వరునెవ్వరు జూతురో వారే యదార్ధమును జూచిన వారు. బృహదారణ్యము ప్రపంచ బ్రహ్మములను విశేషణ విశేష్యములుగా వివరించి, ప్రపంచము సత్యమనియు, బ్రహ్మము సత్యశ్య సత్యమనియు చెప్పుచున్నది.

తైత్తిరీయము

**"సత్యంచా నృతంచ సత్యమభవత్ । యదిదంకిఙ్చ । తత్సత్యమిత్యా చక్షతే"**

అనగా సత్యమే సత్యమూ అసత్యము ఐనది, ఇదంతా అదే ఐనది. దానినే సత్యమని పిలుచుచున్నారు. పరమార్ధము ఆత్మ ఒక్కటే సత్యమైనప్పటికిని, జనులు సత్యము. అనృతము అని వ్యవహరించు రెండును కూడ అదే ఆత్మ అయియున్నది అని చెప్పినది. దక్షిణామూర్తి స్తోత్రమునందు **"విశ్వంపశ్యతి కార్యకారణతయా"** అను శ్లోకమునందు

**"మాయో పరిభ్రామిత:"** అని ఒక వ్యాఖ్యానము. **"మాయా అపరిభ్రామిత:"** అని యొక వ్యాఖ్యానము చేయబడినది. అనగా అజ్ఞానులు మాయ (భేదము) చేత కప్పబడి శోకమోహములు పొందుదురు. జ్ఞానులు మాయచేత అపరిభ్రామితులై (ఏకతను గుర్తించి) భేదమును జూచుచుండియు, బ్రహ్మాకారముగను అనుభవించుచుందురు. ఈ విషయమునే ఉపనిషత్తు లిట్లు చెప్పుచున్నవి.

**శ్లో॥ యద్యత్పశ్యతి చక్షుర్భ్యాం తత్తదాత్మేతి భావయేత్,**
**యద్య త్స్పృశ్యతి హస్తాభ్యాం తత్తదాత్మేతి భావయేత్,**
**యద్యచ్ఛృణోతి కర్ణాభ్యాం తత్తదాత్మేతి భావయేత్ ॥**

మనస్సు, వాక్కు, నేత్రము మరియు ఏ ఇతరేంద్రియముల చేత ఏదేది గ్రహించబడు చున్నదో అది అంతయు బ్రహ్మమని గ్రహించుచున్నాము.

ఓం తత్ సత్.

# మనశ్శాంతి

మనస్సే నామరూపు లన్నింటిని అనగా ప్రపంచమునంతను కల్పించుచున్నది. వాస్తవ స్థితిలో పరబ్రహ్మము నందు లేని నామరూపములు మనస్సుచే సంస్కారాను సారముగా కల్పింపబడి ప్రపంచము అని వ్యవహరించబడుచున్నది.

**తే॥ సర్వ సంసారమును మానసమున నొదవు,**
**సర్వ సంసారమును మానసమున నుండు,**
**సర్వ సంసారమును మానసమున నడగు,**
**సర్వ సంసారమును మానసంబె యగును.**

కాన బంధమోక్షములకు మనస్సే మూలకారణము. మనసనేది బాగా చంచలమైనది. నిత్యము పాదరసమువలె పారాడే స్వభావం దానిది. బలమైనది, ధృఢమైనది. అట్టి మనస్సును నిగ్రహించాలనేది మనస్సే. అభ్యాస వైరాగ్యములతో ప్రయత్నించిన మంత్రముగ్ధమైన భుజంగము వలె అది మనకు తప్పక వశమగును. ఆత్మ స్వరూపాన్ని పట్టుకోవటం అభ్యాసము, అనాత్మ పదార్థములను త్రోసి వేయుట ద్వారా వైరాగ్యం, వీనిలో ఏది ముందు, ఏది వెనుక అను ప్రశ్న లేదు. రెండు ఏక కాలంలో అభ్యసిస్తూ పోవాలి. సంసారమనేది అనాదిసిద్ధమైన అజ్ఞానం వల్ల ఏర్పడింది. అనగా ఆవరణ, సత్యమైన ఆత్మను కప్పిపుచ్చగా, విక్షేపము ప్రపంచాన్ని బయటపెట్టింది. నామరూపాలే విక్షేపమనగా. నిత్యము వైరాగ్య బుద్ధితో భావన చేస్తే కరిగిపోతుంది. ఆవరణ వాసనారూపంగా ఆత్మచైతన్యాన్ని ఆవరించియున్నది. నిత్యము స్వరూపాన్ని భావన చేస్తూ పోతే ఆవరణాత్మక తమస్సు నశించి స్వరూప ప్రకాశము అనుభవమునకు వచ్చును. వైరాగ్యమనేది ప్రతిలోమ క్రియ. అది అనాత్మ జగత్తును లయం చేస్తుంది. అభ్యాసము అనులోమ క్రియ. అది ఆత్మ మీదనే చూపు నిల్పుతుంది. దానితో అంతయు ఆత్మగానే అనుభవానికి వస్తుంది. మానవుని మనస్సుకొక గొప్ప

సామర్థ్యమున్నది. దానినే సంయమము అందురు. సంయమమంటే ఒక పదార్థాన్ని సంశ్లేషాత్మకంగాను, విశ్లేషాత్మకంగాను చూడగలగడము. ఈ రెండు శక్తులు సహజంగా ఉన్నాయి మానవుని మనస్సునకు. విశ్లేష దృష్టిని తగ్గించుకున్నట్లయితే వైషమ్య రూపంగా నున్న ప్రపంచ దృష్టి తగ్గును. దానికి భిన్నంగా సంశ్లేష దృష్టిని పెంచుకున్నచో సామాన్య రూపమైన బ్రహ్మదృష్టి బలపడును. విశ్లేషము అనునది తగ్గి ఒక బిందురూపంగా మారి బలహీనము అగును. కాబట్టి సామాన్య రూపమైన చైతన్యాన్ని ఏమి బాధించలేదు. మీదు మిక్కిలి దానికే అధీనమై దాని ఇచ్ఛానుసారంగా ప్రవర్తించే శక్తిగా మారుతుంది. దానినే అవ్యక్తమని - ప్రకృతి అని - మాయ అని వేదాంతులందురు. విస్ఫులింగ రూపంగానున్న సంశ్లేష దృష్టిని జ్వాలారూపంగా ప్రజ్వలింప చేయాలి. అట్టి వారిని వశ్యాత్ములందురు. వారు మనస్సును కూడకట్టుకుని ఏది చూచినా అఖండంగా చూడగలరు.

**శ్లో॥ యత్ర యత్ర మనస్స్ఫూర్తి స్తత్ర తత్ర జగత్రయం**
**యత్ర యత్ర మనోనాస్తి తత్ర తత్ర నకించన ॥**

తా॥ మనస్సు కలిగిన ప్రపంచము కలుగును. లేకున్న ప్రపంచము లేదు. అనగా ఆత్మకును ప్రపంచమునకును సంబంధము లేదనియు, వాస్తవ స్థితిలో సర్వము బ్రహ్మమేనని ఎరింగినవారికి దు:ఖము లేదు. భేదభ్రాంతికిని దానివల్ల కలుగు వివిధ దు:ఖములకు కారణం మనస్సే.

ఆత్మ విచారణ చేయువారు నిశ్చలము, ఏకాగ్రము, అవిరళమయిన దృష్టితో మనస్సు యొక్క పుట్టిన చోటును అన్వేషిస్తే, ఆ మనస్సు నిజమైన నేనుగా అంటే ఆత్మగా మారిపోతుంది. ఆత్మ విచారణ మార్గంలో మనస్సే ఉపకరణము. ఇక్కడ ప్రత్యేకత ఏమంటే అన్వేషించే మనస్సు కూడ నాశమగును. శవాన్ని కాల్చిన కట్టె మాదిరి. ఇదే ముక్తి. మేల్కొనగానే మనకు గొప్ప తేజస్సు కనబడుతుంది. ఎక్కడిదా కాంతి? ఆత్మకాంతి మహతత్త్వము ద్వారా వస్తోంది. దానినే ప్రపంచ సంబంధమైన జ్ఞానము అంటారు. ఇదే అరూప మనస్సు. ఈ కాంతి అహంపై బడి అక్కడి నుండి

ప్రతిఫలిస్తుంది. అప్పుడు శరీరం, ప్రపంచము కనబడుతాయి. ఇదే స్వరూప మనస్సు ప్రతిఫల కాంతితోనే విషయాలు గోచరిస్తాయి. ఈ కాంతినే జ్యోతియని పిలుస్తారు. ప్రథమమున మనోనిగ్రహమును అనగా మనస్సునందలి వికారములతో సంబంధింప కుండుట అభ్యసించవలెను. ఏది సంకల్పించునో అది మనస్సు అని గుర్తించవలెను. ఈ ధర్మములలో నొక్కటియు ఆత్మకు సంబంధించినది కాదని గ్రహించవలెను. అపుడు ఈ మనస్సు నిగ్రహించవలసినదియు లేదు. వాడు, నేను, ఇదియను భేదజ్ఞానమే మనస్సు అనబడును. అది లేకుండటయే అమనస్కస్థితి.

మనమే యే వస్తువులను ప్రీతి పూర్వకంగా ధ్యానింతుమో మన మనస్సా వస్తువుల ఆకారంతోనే నిలిచియుండును. ప్రేమ యను సంబంధముచే నేయే వస్తువు తన్నాశ్రయించునో ఆయా వస్తువు యొక్క స్వరూపముతో స్వయముగా పరిణమించుట ఈ మనస్సునకు స్వభావమే. ఈ మనస్సునకు విషయములు గోచరము గాకూడదను నిషేదము లేదు. జ్ఞానము గలిగిన పిదప గూడ ప్రపంచము గాన వచ్చుచునే యుండును. ఈ ప్రపంచమునకు నాశమనునది గలుగుటకే వీలులేదుగదా? కాన ఏ పదార్ధ మెచ్చట కానవచ్చినను దానియందు బ్రహ్మ భిన్న పదార్థత్వ భావనను వదిలి, బ్రహ్మత్వ భావన చేయుటయే తత్త్వజ్ఞానఫలము. నామరూపములు మాత్రమే క్రొత్తయైయున్నవి. వాస్తవ స్థితిలో ఇది సర్వకారణమగు బ్రహ్మము కంటె భిన్నము కానేరదు. ఈ మనోజయము గూడ భ్రాంతివశుండై ప్రపంచమునందు బ్రహ్మ భిన్నత్వ భావన భావించి ఆచరించు వానికి మిగులకష్టము. తత్త్వము నెరింగి అంతటను పరబ్రహ్మ భావన నొనర్చువానికి అతి సులభము. నిర్మలమై సర్వోత్తమైయున్న బ్రహ్మమేది గలదో అదియే నేను, అదియే సర్వపదార్థములును, అను యదార్థ జ్ఞానము కలిగిన వాని మనస్సు ఎట్లును చలించుటకు వీలులేదు. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను భేదములు మనస్సు నందే యున్నవి. సుషుప్త్య వస్థయందు మనస్సు లీనమైనపుడు స్వస్వరూపమున కంటె అన్యమగు భేదమేమియు లేదుగదా? అప్పుడు మాత్రమే భేదము లేదనియు, పరమాత్మ ఏకరూపముతో ప్రకాశించుననియు తలంచగూడదు. **"దేహాభిమానే గళితే విజ్ఞాతేచ.**

**చిదాత్మని, యత్ర యత్ర మనోయాతి తత్ర తత్ర సమాధయః"** దేహాభిమానము తొలగి ఆత్మ స్వరూపము తెలియబడగానే మనస్సు ఎటకు బోయినను అది అంతయు సమాధియే అను వాక్యము ననుసరించి ఆత్మవేత్తయగు వాడెట్లు వ్యవహరించుచున్నను, సమాధి యందున్న వాడే, ఆత్మభిన్నమేదియు లేదుగదా? వాస్తవ స్థితిలో విషయాకారము తో బరిణమించినపుడు బంధమును గలిగించును. ఆత్మాకారముతో బరిణమించినపుడు మోక్షము గలిగించును.

**శ్లో॥ మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః।**
**బన్ధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతం ॥**

అని అమృతబిందూపనిషత్తు పల్కుచున్నది. నేను జీవుడనను భావమున్నంతవరకు ప్రపంచము తోచుచునే యుండును. **"అహం బ్రహ్మాస్మి"** మొదలగు మహావాక్యము లందలి బ్రహ్మ శబ్దమునకు లక్ష్యార్థము బ్రహ్మమని యెరింగినపుడు నీకంటె భిన్నముగా బ్రహ్మము లేడనియు, నీవే బ్రహ్మమనియు, అన్యోన్యాఖండ సమరసైక్యానుభవము కలుగును. అప్పుడు జీవభావన తొలగి, నేను కేవలుడను, నిత్యుడను, అద్వితీయుడను, నిరాభ్యాసుడనను నట్టి భావన కలిగి, ప్రపంచము సత్యముగా దోచును. సాంఖ్యతారక యోగముల కొరకు శ్రమపడ నక్కరలేదు. చిత్తవృత్తి నిరోధ మక్కఱయుండదు.

**మ॥ ఘనతం దారక సాంఖ్యయోగములచే గష్టింప గానేలనె,**
**మ్మనముం బట్టగనేల యింద్రియములఁ మర్ధింపగానేల జ,**
**క్కనగా ముందట గానిపించు ఘటంగన్నట్లు బ్రహ్మంబుగా**
**దను దాగాంచినయంతలో నిఖిలముందానై వెలుంగుందగుఁ॥**

ఆత్మ సాక్షాత్కారోప యోగమగు చిత్త్యైకాగ్ర్యమునకును, బాహ్యావస్తు నివృత్తి రూపమగు చిత్త నిరోధమునకును, గడు భేధము గలదు. సర్వవస్తు గ్రహణమగుచుండగా నద్ధానియందు బ్రహ్మ భావనను నిల్పుట చిత్త్యైకాగ్ర్యఫలము. సమస్త పదార్థములనుంచి మనస్సును నియమనము చేయుట చిత్త నిరోధము. చిత్తైకాగ్ర్యము నందు జ్ఞానేంద్రియ

కర్మేంద్రియముల నిగ్రహింప నక్కర యుండదు. తనను బ్రహ్మముగానే గాంచినపుడు బ్రహ్మమేయై వెలుగును, అప్పుడు మనస్సుండదు. నేను "సత్తు" త్రికాలములందు నశింపనివాడను, "చిత్తు" జ్ఞానస్వరూపుడను, అనగా సచ్చిదానంద స్వరూపుడగు బ్రహ్మమును అని, ఇతర సంకల్పములన్ని విడిచి నిర్మల చిత్తముతో నుండువాడు బ్రహ్మవేత్త. అట్టివాని మనస్సు కట్టెనిప్పు వంటిది. కట్టె యందలి నిప్పు ఆకట్టెను తగులబెట్టి తానుకూడ ఎట్లు నశించునో ఆ ప్రకారముగా స్వరూపజ్ఞానము కలిగిన వానియొక్క మనస్సు కూడ తనయందే తాను నశించును. సింహమును జూచిన యేనుగులు తమ చేష్టలు మాని కదలక మెదలక నిలిచిపోవునో అట్లే పరబ్రహ్మమునుగన్న బ్రహ్మవేత్త మనస్సును, ఇంద్రియములును తమ తమ సంకల్పాది వ్యాపారములను మాని నిల్చిపోవును. మానసేంద్రియములు నిశ్చలమై యడగినపుడు నేనచలుడనను జ్ఞాన ముండకూడదు. నీవు వాటినన్నిటిని గనుచుండు కూటస్థుడవు, నీవా మనస్సునకు గాని, ఇంద్రియములకు గాని అందవు. **"నతత్రచక్షుర్గచ్ఛతి నవాగ్ గచ్ఛతినోమన:"** అని ఉపనిషత్తు చెప్పుచున్నది. నీవు అద్వితీయానంద స్వరూపుడవు. కాన నిర్వికల్ప సమాధియందు బ్రహ్మజ్ఞానానుభవము గలవారలకు మనస్సున్నదన్నను, లేదన్నను బాధ యుండదు. దేహేంద్రియాదులు నేను గానని యెరింగిన చిత్తవృత్తినే బ్రహ్మమనిన బ్రహ్మనందమగును. చిత్త వృత్తి అంతటితో నిర్వికారతనొంది కట్టెవలె నిలిచిపోవును. అనగా బ్రహ్మనిష్టయందు చిత్త వృత్తి యుండదు. చిత్తము జడమగుటచే నుండినను బాధ లేదు. ప్రత్యగాత్మ వృత్తి జ్ఞానము పొంది తన తేజస్సును బ్రహ్మ తేజస్సు నంధైక్యము నొందించును. తానే బ్రహ్మమై ప్రకాశించును. ఎండలో దీపముంచిన ఆ దీపపు వెలుగు ఆ యెండలో ఏకమగును. ప్రత్యేకముగా దీపపు వెలుగు కన్పించదు. అట్లే ప్రత్యగాత్మ చైతన్యము పరమాత్మ చైతన్యమై వెలుగునపుడు చిత్త వృత్తి యుండనే యుండదని తాత్పర్యము. గాలి లేకున్న దీపము వెలుంగునట్లు నామమాత్రముగా మనస్సుండినను సంకల్ప వికల్ప రూపముగా పరిణమించదు. అప్పుడా మనస్సుండియు లాభములేదు. కాన సమాధియందు మనస్సు లేనేలేదు. ఇదియే అమనస్కము.

పాలుకాచి తోడుపెట్టిన పెరుగగును. దానిని చిలికిన వెన్నవచ్చును. ఆ వెన్న మనమెంత ప్రయత్నించినను మజ్జిగలో కలుపజాలము గదా! అది కలియదు. అట్లే యోగి సంసారరూపమైన ప్రపంచమును విచారించి తరచి తరచి జీవుడనియును, బ్రహ్మము అనియును పదార్థద్వయములు లేవు, సర్వము బ్రహ్మమేయని తెలిసికొని తానే యా బ్రహ్మమై వెలుంగును. అట్టి బ్రహ్మజ్ఞాని ప్రపంచము నందున్నను దాని వికారము లేమాత్రము అతనినంటవు.

**శ్లో॥ యు ఏవం వేత్తి పురుషం ప్రకృతించ గుణి సహ।**
**సర్వదా వర్తమానో పే న స భూయో భిజాయతే॥ భ.గీ.అ.13.శ్లో.23.**

ఏ జీవుడట్లు పురుషుని గుణసహితమగు ప్రకృతిని ఎరుంగునో అతడెట్లు వర్తించినను తిరిగి జన్మించడు. సూర్యుడేలోకమందు ఎన్ని విధములైన పదార్థములున్నవో వాటి నన్నిటినుండి రసమును కిరణములచే గ్రహించుచున్నాడు. అయినను ఆయా రసములందలి గుణ దోషములు సూర్యుని పొందుటలేదు. అట్లే శబ్దాది విషయముల పొందుచున్నను పరిశుద్ధ మనస్కుడగు బ్రహ్మజ్ఞానికి వాటి గుణ దోషములు అంటవు. మట్టిలో తిరుగు కుమ్మరి పురుగునకు ఆ మట్టి యంటనట్లే బ్రహ్మజ్ఞానికి గుణ వికారము లంటవు.

**శ్లో॥ ప్రకాశం చ ప్రవృత్తించ మోహ మేవ చ పాండవ।**
**న ద్వేష్టి సమ్ప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి॥ భ.గీ.అ.14.శ్లో.22.**

సత్వ గుణ కార్యమగు ప్రకాశముగాని, రజోగుణ కార్యమగు కర్మ ప్రవృత్తిగాని, తమోగుణ కార్యమగు మనోమోహము గాని, వ్యవహారమునందు పైకి లేచినపుడు దానిని ద్వేషింపడు. మరిలోనికి అణగినపుడు దానిని కాంక్షించడు. ఆత్మసాక్షాత్కారమను మాట అసందర్భమైన మాట, ఎట్లన ఒకడు తాను అనాత్మనని, తనలో రెండాత్మలున్నవని (నిద్రలోనికి ఉనికి, జాగ్రత్తలోని ఉనికి) ఒకటి రెండోదాన్ని తెలిసికోవాలని భావించడము. దేహంతో ఏకత్వం పొందినపుడే యీ ప్రశ్న కలుగుతుంది. గాఢనిద్రలో యీ ప్రశ్న

లేదు. కాని ఉన్నామనునది నిర్వివాదము. ఇప్పుడు దేహమునే తాననుకొని వస్తువులను జూచునట్లు ఆత్మను చూడాలని తలస్తూ యున్నాడు. "ఇంద్రియములు తెలిసికొనుటకు ఉపకరించే పరికరాలు మాత్రమే, తెలిసికొనేవాడవు నీవు".

**"ఎరుక మరపుల నెరిగెడు యెరుక నేను,**
**విధి నిషేధంబుల గాంచు విభుడ నేను,**
**దర్శ్యముల నెల్ల దర్శించు తత్త్వమే నేను,**
**నేను నేనని వివరించు నేత నేను"** **సీ॥ ఆంజ**

"నేను" అను చెప్పు వస్తువేదో అవస్తువే నేనని యెరుంగుము. ఆత్మ సాక్షాత్కారము అంటే అనాత్మ నిరసన చేసి నిషేదావధిని యున్నదే ఆత్మయని గుర్తించుటయే. ఇది ప్రతివారి సహజస్థితి. ఈ అభ్యాస ముద్విధము. 1) ఆత్మ సాక్షాత్కారోపయోగమగు చిత్త్యైకాగ్రము, 2) బాహ్యవస్తు నివృత్తి రూపమగు చిత్త నిరోధము. ఈ రెండింటికి కడు భేదము గలదు. సర్వవస్తు గ్రహణమగు చుండగా నద్దానియందు బ్రహ్మభావనను నిల్పుట చిత్తైకాగ్ర్య ఫలము. సమస్త పదార్థముల నుంచి మనస్సు నియమనము చేయుట చిత్త నిరోధము. మనస్సును విషయములవైపుకు బోకుండ చిత్తమును, ఇంద్రియములను గూడ ప్రయత్న పూర్వకంగా నరికట్టుట రాజయోగ మార్గము. విద్యాంసులను గూడ నాకర్షించునంత బలవంతమగు ఇంద్రియగ్రామము నరికట్టుట బహుళ ప్రయాస సాధ్యము. నిరోధము తొలగిన వెంటనే, ఇంద్రియములు తిరిగి సహజమగు విషయముల వైపుకు బరుగులిడును. కాన విషయములు మిధ్యా మాత్రములు, మనస్సు బ్రహ్మమున కంటే వ్యతిరిక్తము గాదని ధృడమగు జ్ఞానము కుదిరినపుడు, మనస్సునకు ప్రవృత్తి కారణము లేకుండట వలన అచంచలమయి విషయస్పర్శ నొందకుండుటకు ఇది రెండవ మార్గము. ఇదియే జ్ఞానయోగ మార్గము. దీనినే పెద్దలు పశువును కర్రతో కొట్టి వశము చేసుకొనుట వంటిది రాజయోగ మార్గము, ఆ పశువునే పచ్చిగడ్డి చూపి మంచిగా మచ్చిక చేసుకోవటం జ్ఞానయోగ మార్గము అందురు. ఇట్టి ఆ స్పర్శయోగము ఉత్తమాధికారులకు విషయము. మంద

మధ్యమాధికారులు మనస్సాత్మ వ్యతిరిక్తమని తలంచి మనోనిరోధముచే అభయము పొందగలరు. మోక్షమని చెప్పబడు నక్షయశాంతి వీరలకు మనోనిరోధాధీన మగును. మనోనిరోధ మున్నంత కాలముండును. మనస్సు బ్రహ్మమను ధృడ విశ్వాసము గలవారికి మనోనిరోధము లేకనే శాంతి యబ్బును. ఈ శాంతి నిత్యము. "శాంతము లేక సౌఖ్యము" లేదని త్యాగరాజ మహాత్ముడు కూడ తన కృతులలో వేనేళ్ళన ఉద్ఘోషించెను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# జీవన్ముక్తులు

మనస్సే సర్వసంసారమునకు కారణమగుటచే మనోగతములగు వాసనలే సర్వ ప్రపంచమునకు కారణములు. బ్రహ్మ, మనస్సులకు భేదములేదు. కావున యీ మనస్సు కూడ నశించుటగాని, ఎందైన లీనమగుట గాని, యెచ్చోటికైన బోవుటకు గాని వీలు లేదు. ఇకనేమనిన ఈ మనస్సు అసత్యముగా వున్నదాని వికారములతో బ్రహ్మమునకు సంబంధము లేదు, అని మాత్రమే తెలిసికొనవలెను. అజ్ఞానమువలన జనించిన భ్రాంతి, జ్ఞానముచే నశించును. కాన పైజెప్పిన విధముగా తెలిసికొనన తోడనే బ్రహ్మము యొక్క యదార్థ స్వరూపము కాననగును. ఆ మనస్సు త్రికాలముల అందు శూన్యమైనదియే యగును. ఈ విధముగా జ్ఞానబలముచే సంసారమను ముడిని త్రెంచి వేయుము. ఇట్లు త్రెంచివేసి, ఆ బ్రహ్మమునకంటె వాస్తవ స్థితిలో భిన్నమైనదేదియు లేదనియు, సర్వవస్తువులయందున ఏకరూపముగా నుండు జ్ఞానమే స్వరూపముగా గలిగినట్టియు, ఉనికియే ఆకారముగా గలిగినట్టియు, ప్రత్యగాత్మకంటె వేరుగానట్టియు, ఆ పరబ్రహ్మమునందే సర్వకాలములయందు క్రీడింపుము. ప్రపంచాధిష్టానమైన ప్రత్యగాత్మ రూపుడై యున్న పరబ్రహ్మము నెరి(గినచో భ్రాంతి దశయందు గానవచ్చిన స్థూల సూక్ష్మాది ప్రపంచమంతయును పరబ్రహ్మమే యగును. అధిష్ఠానముకంటె నతిరిక్తముగా నొక్కటియు గానరాదు. మరియొక విశేషము వాస్తవస్థితిలో బ్రహ్మమున కంటె అన్యుడగు ద్రష్టలేడు. గాన ప్రపంచము నారోపించినను, అధిష్ఠానాభిన్నముగా అవలోకించినను, బ్రహ్మమే ఆకార్యములను ఆచరించుచున్నాడు. అజ్ఞానమునకు గూడ ఆ బ్రహ్మమే ఆశ్రయము. సర్వ ప్రపంచమును బ్రహ్మాభిన్నమై బ్రహ్మమునే ఆశ్రయించియుండ, తదంతర్గతమగు అజ్ఞానము మాత్రమెందు బోవును? ఇట్లైనను ప్రపంచమువలెనే అజ్ఞానము కూడ త్రికాలములందున సత్యమేగాని, బ్రహ్మమునకే

వికారములు లేవు. భేదదృష్టి యున్నపుడు సర్వవ్యవహారములందు ప్రవర్తించునుగాని, పరమార్థము నెరింగినపిదప నేదియు గానరాదు.

మరియు పరమ ప్రమాణభూతమగు శ్రుతిగూడ "సదేవేదం సర్వం" (ఇదం + తు + సర్వం = ఈకనబడునదంతయు, సత్ + ఏవ) బ్రహ్మమేయని చెప్పుచున్నది. మరియు **"విద్దీదం సర్వం బ్రహ్మ, సర్వం ఖల్విదం బ్రహ్మ, బ్రహ్మై వేదం విశ్వమిదం వరిష్టం"** అను మొదలగు అనేక శ్రుతులు కూడ జగద్బ్రహ్మభేదమునే నిరూపించుచున్నవి. మహాత్ములును అట్లే అనుభవించుచున్నారు. బ్రహ్మజ్ఞానులగు సత్పురుషుల దృష్టికి బ్రహ్మభిన్నమగు పదార్ధ మెచ్చటను గానవచ్చుట లేదు. శ్రుతియందు జూపబడిన సిద్ధాంతము ననుభవించువారే జ్ఞానులు. అజ్ఞానులకు ప్రపంచమెంత సత్యముగా గాన వచ్చినను ఎంత బ్రహ్మభిన్నముగా గానవచ్చినను అది యదార్ధము గాదు. ప్రమాణ భూతముకాదు. కాన శ్రుతి, యుక్తియు, విద్వదనుభవమును ఏకవిధముగా జగద్బ్రహ్మ అభేదమును చెప్పుచున్నవి. ఈ కారణము వలన చేతనా చేతనాత్మకమగు ప్రపంచమంతయును పరబ్రహ్మమేయని నిశ్చయించి, భ్రాంతిచే గానవచ్చు భేదము మనస్సుచే కల్పించబడినదేగాని, యదార్ధముగాదని ఆ భేదభ్రాంతిని ధ్వంసము చేసికొనుము. ఇట్లు స్వస్వరూపజ్ఞానము కలిగి, సర్వకాలములందు బ్రహ్మానందము ననుభవించుచుండుము. ఇదియే జీవన్ముక్తస్థితి. ఈ మోక్షసుఖమునకై క్రొత్త ప్రయత్నమేమియు జేయనక్కరలేదు. సర్వము అజ్ఞానకార్యమే గాన ఆత్మకు త్రికాలములందు బంధము లేదు.

కావున ఆ మోక్షరూపమగు ఆనందము ఆత్మకు స్వభావ సిద్ధము, శాశ్వతము, ఎప్పటికిని విభాగము జెందునట్టిదిగాదు. ఏ పురుషుడు చిత్తనిగ్రహము గలిగి **"భేదములు లేక సత్యజ్ఞానానందరూపుడైయున్న బ్రహ్మమే నేను"** అని నిశ్చయించుకొని, తనలో తాననుభవించుచుండునో, అట్టి మహాత్ముడు బ్రహ్మమయుడై సర్వసంకల్పములను విడిచి యుండును. కాన వివేకియైన పురుషుడు శాస్త్ర, యుక్తి గురూపదేశ,

స్వానుభవములచే జనించిన జ్ఞాననేత్రముతో చక్కగ విమర్శించెనేని దేహాత్మా భిమానమును సంపూర్ణముగా వదలును. ఇట్టి మహాత్మునకు సర్వోత్కృష్టంబును జ్ఞానమాత్రమే స్వరూపముగా గలదియునగు, బ్రహ్మముతో నైక్యము గలుగును. ఈ విధముగా స్వతసిద్ధమగు ఐక్యముజెంది అనగా దేహమే ఆత్మయను భ్రాంతివదలి, నేనెప్పటికిని బ్రహ్మమేయై యున్నాను అను జ్ఞానమును పొంది బ్రహ్మాత్మభావన గలిగియుందురో అట్టివారు జీవన్ముక్తులనబడుదురు.

పురుషుడు మనోవృత్తితో సంబంధపడక, అనగా మనోవృత్తివలన గలుగు వికారములు తనవిగా భావింపక, ఈ మనస్సు అహంకారముతో గలసి ప్రవర్తించును. దానికిని నాకును సంబంధం లేదు. "మనమేపని జేసినది, మనమే జేసితిమటంచు మదిదోచు సనాదనమై, ద్యోతనమై, చేతనమై తగు మనకు గల్పితంబిది యనఘా"

తా॥ త్రిగుణాత్మకమగు మనస్సుజేయు కార్యములన్నియు మనముజేయుచున్నాము అనుట అసత్యము. బ్రహ్మము సదాయుండునది, సదా ప్రకాశించునది. మరియు చిత్స్వరూపమయినది. అట్టి పరమాత్మ నిష్క్రియమని జెప్పియుండుట బట్టియు, మనమే ఆ పరమాత్మ యగుటంబట్టియు, మనస్సు జేయు కార్యములు మనయందారోపించుటకు అజ్ఞానమే కారణమని యెరుంగుము. అయినను ఇది కూడ నాయందే కల్పించబడినది గాన ఇదియు నేనేయని నిశ్చయించుకొని ఏకరూపముతో ఎవ్వరు ప్రకాశించుచున్నారో అట్టి వారే జీవన్ముక్తులు.

మరియు భ్రాంతిలోనుండియే ప్రతిజీవుడు క్రమక్రమముగా ముక్తిని పొంద వలయును గదా? అందు సకల భూతములను తన కంటె భిన్నముగా తలంచుచున్నను, వివేకదృష్టిచే వానినన్నింటిని ఆత్మగానే, అనగా ఆత్మయందారోపింపబడినవిగానే తలంచుట మొదటిమెట్టు. ఈ కారణము వలన ఆత్మయందు సర్వభూతములు గలవని తలంచుట, అనగా సర్వభూతములకు ఆత్మయే ఆధారమగుటచే సర్వ భూతములును ఆత్మయందే యున్నవి అని తలంచుట రెండవ మెట్టు. ఈ రెండు

మెట్లు గడచి, ఆరోపితమునకు నధిష్టానమునకు భేదము లేదు కావున సర్వము ఆత్మయే, ఆత్మకంటె భిన్నమైనదేదియు లేదు, అని ఎరింగి సర్వమయుడై ఏ మహాత్ములు నిలిచి యుందురో అట్టి వారే జీవన్ముక్తులు.

**శ్లో॥ "యత్ర చిత్తం తత్ర విశ్వం స్వయమేవ ప్రతీయతే।**
**యత్ర చిత్తం నాస్తి తత్ర నాస్తికించి జ్జగత్కధా" ॥**

బుద్ధి ఎచ్చటయుండునో అచ్చట ప్రపంచముండును. బుద్ధి ఎచ్చట లేదో అచ్చట ప్రపంచము లేదు. మరియు **"వాసుదేవ స్సర్వమిదం; సర్వం విష్ణుమయం జగత్; బ్రహ్మమాత్ర మిదం సర్వం; బ్రహ్మైవ సకలం జగత్ భూతాని విష్ణు:"** అను మొదలగు స్మృతులు నూర్లకొలది, వేలకొలది పై సిద్ధాంతమునే ధృఢముచేయుచున్నవి. ప్రపంచముకంటె బ్రహ్మముగాని, బ్రహ్మముకంటె ప్రపంచముగాని వేరుగాదు. జ్ఞానియగు వానికి అనగా సర్వమును విమర్శించగలవానికి యీ ప్రపంచము బ్రహ్మముగా దోచును. అట్లు విమర్శింపనేరని వానికి ఆ బ్రహ్మమే ప్రపంచముగా దోచును. మణి స్వరూపము నెరుంగని వానికి ఆ మణియే రాయిగా దోచుటయు, దాని నెరింగిన వానికి అట్లు తోచక రత్నముగానే తోచుటయు సహజమే కదా? అనుభవించువాడు, అనుభవము, అనుభవింపబడునది అను భేదములన్నియు ఆ బ్రహ్మముకంటె భిన్నముగ గానరావు. వాస్తవస్థితిలో అంతయు మనోవికార రూపమే గదా? నాకును భూతములకును భేదము లేకపోవుటచే నేను వేరు, భూతములు వేరు అనియు నా యందు భూతములుగాని, నేను భూతములయందు గాని యున్నామని వ్యవహరించుటకు వీలులేదు. గీతాచార్యుడు కృష్ణుడు కూడ దానినే ధృఢపరచుచున్నారు. సర్వులు జ్ఞానరూపులే యగుటచే బ్రహ్మమునకు, ఆత్మకును భేదము లేదు. కావున నేనే బ్రహ్మమునని నిశ్చయించు కొనుము. పిదప ఆత్మవేరు, ఈ ప్రపంచము వేరు, దానికి ఆత్మసాక్షి, ప్రపంచము సాక్ష్యము, అను భేదాభిప్రాయమును గూడ వదలి జ్ఞానము నందే యారోపింపబడిన దగుటచే నీ ప్రపంచము గూడ బ్రహ్మము కంటె భిన్నము కాదు, కాన బ్రహ్మము సర్వమయుడు అను అభిప్రాయము ధృఢపరచుకొనుము. పిమ్మట ఇది ఆత్మయను

భేదమును సహితము వదిలి **"ఏకమేవా ద్వితీయం బ్రహ్మ"** ఈ పరబ్రహ్మమొక్కండే త్రికాలములందు, రెండవ పదార్థము బొత్తిగ లేదు అను అభిప్రాయమును నిష్కర్ష చేసుకొనును.

బియ్యముతో సంబంధము గలిగినతోడనే టెంకాయ చెట్టు లేక టెంకాయ సంపూర్ణముగా నశించునట్లు, నీరు తగులగానే తేనియ నిరర్థకమై బడునట్లును, వేదాంత వాక్యశ్రవణము వలన గలిగిన అభేదజ్ఞానము కర్మానుష్ఠానముచే సంపూర్ణముగా ధ్వంసమగును. ఆ కర్మాచరణము వానికి కీడును కలిగించునేగాని ఇంచుకైనను మేలును గలిగించదు. జీవ బ్రహ్మలకుగల సహజాభేదమును ఎరుంగుటయే ఫలమని పెద్దలు చెప్పుదురు. ఇట్టి ఫలమును కలుగజేయనిదగుటచే కామ్యకర్మము ముముక్షువునకు పనికిరాదు. ఈ జీవబ్రహ్మాభేదమునకు ఏ సాధకుడు ప్రయత్నించుచున్నాడో వానికి తను తానే యెరుంగబడవలయును. ఇట్టి శ్రద్ధగల సాధకునకు ఆ యాత్మ స్వయముగనే స్వస్వరూపమున ప్రకటనమగును. ఇదియే ఈశ్వర ప్రసాదమనబడును. ఏ మహాత్ముడు ప్రేమయను పాశముచే సర్వజీవులను కట్టి మోహింప జేయుచున్నాడో, అట్టి అజ్ఞానమను పరబ్రహ్మమునకు నమస్కారము. పరబ్రహ్మాభిన్నమగు పదార్థమేదియు లేకపోవుటచే అజ్ఞానము కూడ బ్రహ్మమే యగుటలో విరోధము లేదు. జీవ జడరూప ప్రపంచమునకును, బ్రహ్మమునకును అభేదము బాగుగా గుర్తించి నిశ్చయించి తన యందు దాను స్వస్వరూపానందానుభవము నొనర్చు మహాత్ములకు స్వర్గమేల? సత్యలోకమేమిటికి? వైకుంఠ మెందులకు? కైలాసముతో పనియేమి? ఏ ఏ పదార్థము స్వస్వభావముతో గానవచ్చునో అది అంతయు, అనగా ఆయా స్వభావములతో ఆయా పదార్థ రూపములతోగూడ పరమశివుడే ప్రకాశించుచున్నాడు. కాని అంతకంటె భిన్నమైనదేదియులేదు అని తెలిసికొనుటయే **"తత్త్వజ్ఞానము"**. తత్త్వజ్ఞానికి శాస్త్రము యొక్క విధి నిషేధములు లేవు. దేహమే నేననెడి అజ్ఞానము వల్ల గలిగిన భ్రాంతి, ఆత్మజ్ఞానంచే నివృత్తియైనపుడు ఆత్మ కర్తయనెడి బుద్ధి కలుగదు. ఈ కార్యము అవశ్యము చేయదగిన దనెడు శాస్త్రకృతమగు విధి **"యనుజ్ఞ"** యనబడును. ఈ

కార్యము చేయుటకు యోగ్యము కాదనెడి శాస్త్రకృత నిషేధము "పరిహార" మనబడును. ఈ యనుజ్ఞా పరిహారరూపమగు విధినిషేధములు తత్త్వజ్ఞానియందు ప్రవర్తింపవు. పాలనుకాచి తోడు వేయగా వచ్చిన పెరుగును చిలికినట్లైయిన వెన్న వచ్చును. ఆ వెన్న తిరిగి మజ్జిగలో కలియనట్లు జీవేశ్వర జగత్తులు మిథ్యయని ధృఢముగా నెరింగిన పిమ్మట ఈ ప్రపంచమున ఏవిధముగా ప్రవర్తించినను, ప్రపంచ వికారములు బ్రహ్మవేత్తకు నెంత మాత్రముండవు. ఇట్టి జీవన్ముక్తులైనట్టి మహాత్ములు "బ్రహ్మవిదుడు, బ్రహ్మవిధ్వరుడు, బ్రహ్మవిద్వరీయుడు, బ్రహ్మవిద్వరిష్టుడు" అని నాలుగు విధములుగా నుందురు. ఇందు బ్రహ్మవిదునకు తత్త్వసాక్షాత్కారము కలిగి యుండును, గాని వాసనాక్షయము, మనోనాశములు గలిగియుండవు. బ్రహ్మవిధ్వరునకు తత్త్వజ్ఞానము, వాసనా క్షయము కలిగియుండును, గాని మనోనాశము గలుగదు. బ్రహ్మ విద్వరీయ, బ్రహ్మవిద్వరిష్టులకు మాత్రము తత్త్వజ్ఞాన, వాసనాక్షయ, మనోనాశములు మూడును కలిగియుండును. ఇందు బ్రహ్మవిదుడు దేహాభిమానమును బొందడు. చేయుకర్మలకు కర్తనని తలంపక వాటి ఫలములను గోరడు. లోకసంగ్రహార్ధము విహితకర్మలు చేయుచుండును. సంతోష విచారముల నుండి విడివడి లభ్యమైన దానితో తృప్తిచెంది యుండును. బ్రహ్మ విద్వరుడు సర్వకర్మలను వదలి సర్వమును బ్రహ్మముగా జూచుచుండును. సుఖదు:ఖములను సమముగా జూచుచు మనోవికారములను బొందక నిరంతరము బ్రహ్మమయుడై, నిశ్చలత్వమున నుండును. ఇతడే గుణములకు లోబడని గుణాతీతుడగుచు బ్రహ్మవిద్వరుడన బడుచున్నాడు. వైరాగ్య భోధోపరతులు మూడింటిలో "బోధ" రూపమగు బ్రహ్మజ్ఞానము బ్రహ్మవిదునకు, బ్రహ్మవిద్వరునకు ధృఢముగా నుండును. బ్రహ్మవిద్వరునకు బోధతోపాటు ధృఢ వైరాగ్యము కూడ నుండును. బ్రహ్మవిద్వరీయుడు నిరంతరము బ్రహ్మ సాక్షాత్కార రూపమగు అద్వైత భావనారూప సమాధియందుండును. భక్తులిచ్చిన సాత్వికాహారమును సూక్ష్మముగా గ్రహించి మరల భావనారూప సమాధియందుండును. వాసనాక్షయ మైనందున ఇతని అంత:కరణ వృత్తులు ఎప్పుడును స్వయముగ బయటికి రానేరవు. ఇతడు వైరాగ్య

బోధలు రెండును గలవాడగుటచే ఇతనికి **"తత్త్వసాక్షాత్కారము, వాసనాక్షయము"** అనునవి రెండు నుండును. బ్రహ్మవిద్వరిష్ఠుడు నిరంతరము బ్రహ్మస్వరూపమగు అద్వైత స్వరూప స్థితి సమాధియందుండును. ఇతను సమాధి నుండి స్వయముగా మేల్కొనడు. ఇతరులచేత మేల్కొల్పబడడు. వైరాగ్య బోధోపరతులు మూడును సంపూర్ణముగా నుండుటచే ఇతనికి తత్త్వసాక్షాత్కారము, వాసనాక్షయ, మనోనాశములు మూడును గలిగియుండును. బ్రహ్మవిదునకు తత్త్వజ్ఞానమువల్ల జీవన్ముక్తి కలిగినను వాసనాక్షయ మనోనాశములు కలుగకపోవుటచే జీవన్ముక్తి విలక్షణ సుఖము లభింపనేరదు. బ్రహ్మవిద్వరునకు మలిన వాసనాక్షయ మగుట చేతను, బ్రహ్మవిద్వరీయునకు సర్వవాసనాక్షయ మగుట చేతను, బ్రహ్మవిద్వరిష్ఠునకు వాసనాక్షయ మనోనాశములు గలుగుట చేతను జీవన్ముక్తి విలక్షణసుఖము ననుభవించుచున్నారు. ఈ బ్రహ్మవేత్తలకు గలిగెడు జీవన్ముక్తి యొక్కటియే యగును. వాటియందే భేదము లేదు గాని జీవన్ముక్తి విలక్షణ సుఖమునందు మాత్రము భేదము గలదు.

ఓం తత్ సత్.

# మోక్ష ప్రతిబంధకములు

సద్గురువుల వద్ద వేదాంత శ్రవణము చేసినను, సంశయ అసంభావనా విపర్యయ భావములు, ఆవరణ, విక్షేపములు గల వారికి అఖండ బ్రహ్మాకార వృత్తి కలుగదు. కాన అవి నశించువరకు వేదాంతశాస్త్ర శ్రవణమనననిధి ధ్యాసనములు చేయుచుండ వలెను. సంశయమనగా శ్రుతులయొక్క నానావిధత్వములవలన కలిగెడి సంశయములు. ఈ సంశయము వేదాంతార్థ శ్రవణమువల్ల గల్గిన జ్ఞానదార్ఢ్యముచేత నివర్తించును. అసంభావన యనగా అఖండైకరసమగు అద్వితీయ బ్రహ్మస్వరూపము లౌకికము కాదని భావించుట. ఇది వేదాంతార్ధ మననము చేత అసంభావన యనెడి అదార్ఢ్య హేతువు నివర్తించును. విపరీత భావన యనగా కర్తృత్వాది అభిమానము గలుగుట. దేహాత్మత్వ, జగత్సత్యత్వ బుద్ధియే విపరీత భావన. చిత్తైకాగ్ర్యము వలన విపరీతభావన పోవును. ఆవరణమనగా స్వయంప్రకాశమానమగు బ్రహ్మస్వరూపమును లేనిదానినిగా తలంచుట. విక్షేపమనగా దృష్టి బ్రహ్మవైపునకు బోవుటమాని, ప్రపంచాభిమానము గలిగియుండుట. ఈ సంశయ, అసంభావనా విపరీతభావనలు నశించి ఆవరణ విక్షేపములు తొలగినను, భూత భవిష్యద్వర్తమాన ప్రతిబంధకములున్నచో ఆత్మసాక్షాత్కార జ్ఞానముదయింపదు. ఈ త్రివిధ ప్రతిబంధకములున్నవారు, శ్రవణ మనన నిధిధ్యాసనము లొనర్చినను, తత్త్వమస్యాది మహావాక్యముల శ్రవణము చేసినను, బ్రహ్మజ్ఞానము కలుగదు. బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము కలుగుటకు విరోధియైన వాసనా విశేషము ప్రస్తుత ప్రతిబంధక మనబడును. ఇట్టి వాసనారూప ప్రతిబంధకము లేనివారికి, మహావాక్య శ్రవణమువల్ల సంశయ విపర్యయాదులు తొలగి బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము కలుగుచున్నది. ప్రస్తుత ప్రతిబంధకములున్నవారికి యీ జన్మమున బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము కలుగుచున్నది. ప్రస్తుత ప్రతిబంధకము లున్నవారికి యీ జన్మమున బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము గలుగనేరదు. వామదేవాదులకు వలె, వారికి ప్రతిబంధ నివృత్తియైన పిదప జన్మాంతరము

నందు మాత్రమే బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము కలుగుచున్నది. బహుజనులీయాత్మను గూర్చి శ్రవణము చేయుటలేదు. శ్రవణము చేసిన వారిలో కూడ, పెక్కు మంది ఏదేని యొక ప్రతిబంధకము వలన బ్రహ్మ సాక్షాత్కారమును బొందజాలకున్నారని శ్రుతి కూడ చెప్పుచున్నది.

**శ్రు॥ శ్రవణాయాపి బహుభిర్యో నలభ్యం: ।**
**శృణ్వంతోపి బహవోయం నవిద్యు: ॥**

భూత ప్రతిబంధకము:- మానవుడు పూర్వమనుభవించిన ప్రియ విషయముల యొక్క ధృఢ సంస్కారము భూతప్రతిబంధకమనబడును. వేదాంతశాస్త్ర శ్రవణ సమయమున, పూర్వ విషయ సంస్కారము లద్భుద్ధమై మరల మరల పూర్వ విషయ స్మృతియే కలుగుచుండును. ఆ భూతప్రతిబంధకమునకు కారణమగు, విషయోవహ్నిత బ్రహ్మ చింతనము చేత నా ప్రతిబంధము నివృత్తియగుచున్నది. అట్లు చింతించుట చేత, ఉపాధి భ్రాంతి నివృత్తియై యువహిత చైతన్యస్థితి కుదురును. అప్పుడతడు మహావాక్య బోధలవలన, ఆత్మజ్ఞానము కలవాడై మోక్షమును బొందును.

భావి ప్రతిబంధకము:- ఇది ప్రారబ్ధకర్మ శేషమనియు, బ్రహ్మలోకేచ్ఛయనియు రెండు విధములు. ఈ రెండింటిలో యే ప్రతిబంధకమున్నను, వేదాంత వాక్యములను శ్రవణము చేసినను, ఆత్మజ్ఞానము కలుగదు. ఇందు ప్రారబ్ధకర్మము, ఫలాభిసంధి కృతప్రారబ్ధమనియు, కేవలమగు ప్రారబ్ధమనియు రెండు విధములు. స్వర్గాది ఫలములను గోరి చేయబడు కర్మములు, ఫలాభిసంధికృత ప్రారబ్ధకర్మము లనబడును. ఈ కర్మములు, వాని ఫలముల ననుభవించుటచేత మాత్రమే నాశమొందుచున్నవి. మరియే యితరమైన ఉపాయము చేతను వినాశమొందుటలేదు. ఇవియుండిన ముముక్షువు శ్రవణాదు లొనర్చినను, బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము పొందుట లేదు. జ్ఞాన సామగ్రులన్నింటిలో నిచ్ఛాఘటితమగు సామగ్రి బలమైనదగును. రెండు వస్తువుల జ్ఞానసామగ్రులుండిన మానవునకు, యే వస్తువుయొక్క జ్ఞానేచ్ఛ కలుగుచున్నదో ఆ

వస్తువు యొక్క జ్ఞానమే మొదట గలుగుచున్నది. రెండవ వస్తువు జ్ఞానము కలుగదు. కాన ఫలేచ్ఛ సహితమగు ప్రారబ్ధకర్మము ప్రబలమైనది. అది తీరనంత కాలము ఎంత వేదాంతశ్రవణము చేసినను, బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము కలుగదు. ఆ కర్మ ఫలము అనుభవించిన పిదపనే, ఆత్మజ్ఞానము కలుగుచున్నది. శ్రుతులయందు కూడ నిట్లున్నది.

**శ్లో॥ "సయత్కామోభవతి, తత్క్రతుర్భవతి, యత్క్రర్భవతి,**
**తత్కర్మకురుతే, యత్కర్మకురుతే, తదభి సంపద్యతే"**

అనగా ఎవడే యే ఫలములను గోరుచున్నాడో, వాడా యా ఫలముల కనుకూలమైన కర్మములను చేయవలయుననెడి సంకల్పము కలవాడగు చున్నాడు. అతడేయే కర్మములను చేయవలయునని సంకల్పించు చున్నాడో, ఆయా కర్మములు అవశ్యము చేయుచున్నాడో, అతడాయా కర్మములను చేయుచున్నాడు. ఆ యా కర్మానురూపమగు ఫలముల ననుభవించుచున్నాడని చెప్పబడెను. కాన ఫలాభి సంధికృతమగు ప్రారబ్ధకర్మము భావి ప్రతిబంధకమని చెప్పబడినది. రెండవది యైన ఫలేచ్ఛారహితమగు ప్రారబ్ధకర్మము, పుణ్యము, పాపము యను భేదముచే రెండు విధములు. పుణ్యరూప ప్రారబ్ధకర్మము, పాపనివృత్తి మూలమున నతనియొక్క తత్త్వజ్ఞానమునకు హేతువు అగుచున్నది.

**శ్రుతి॥ జ్ఞానముత్పద్యతే పుంసాం, క్షయాత్పాపస్య కర్మణ:**
**కషాయే కర్మభి: పక్వే, తతోఽజ్ఞానం ప్రవర్తతే ॥**

అనగా మోక్షాధికారులగు పురుషులకు, పాపకర్మలు నశించుట వల్లనే ఆత్మజ్ఞానము కలుగుచున్నది. పుణ్యకర్మలచేత పాపకర్మలు నశించి, శుద్ధాంత:కరణమందు ఆత్మజ్ఞానము కలుగుచున్నది. రెండవదియగు పాపకర్మ, అది ఫలాభిసంధి కృతమైనను, ఫలాభిసంధి కృతముగాక పోయినను, ఆత్మజ్ఞానమునకు ప్రతిబంధకమే యగుచున్నది. ఈ పాపకర్మరూప ప్రారబ్ధకర్మములు, ప్రబలమగు పుణ్య కర్మలచేత నశించి, అంత:కరణము శుద్ధసత్వమై శ్రవణార్హతను కలిగించి, ఆత్మజ్ఞాన ప్రతిబంధకమును

తొలగించును. భావి ప్రతిబంధకములున్నంతవరకు ఆత్మజ్ఞానము కలుగనేరదు. కాన ప్రారబ్ధ శేషమనుభవించి తీరవలయును. ఈ భావి ప్రతిబంధక మింత కాలమునకు నివృత్తియగునని నియమము లేదు. కొందరికి రెండు మూడు జన్మలు కలిగించుచున్నది. బ్రహ్మలోకేచ్ఛ గలవాడా యిచ్ఛ నడంచి శ్రవణాదులు చేసినను, అతనికి ఆత్మజ్ఞానము కలుగదు. కలుగకపోయినను అతని శ్రవణ ప్రాబల్యము వలన, మరణానంతరం బ్రహ్మలోకమునకు పోయి, అచ్చట నిర్గుణ బ్రహ్మము యొక్క సాక్షాత్కారమును బొందుచున్నాడు, అని శ్రుతి స్మృతులు కూడ చెప్పుచున్నవి.

**శ్రు॥ వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా : సన్యాసయోగాద్యతయ శుద్ధ సత్వా: ।**
**తే బ్రహ్మలోకేషు పరాంతకాలే, పరామృతాత్పరి ముచ్యంతి సర్వే ॥**
**స్మృతి : "నహికల్యాణకృత్కశ్చి ద్దుర్గతింతాత గచ్ఛతి".**

<u>వర్తమాన ప్రతిబంధకము</u>:- ఈ వర్తమాన ప్రతిబంధకములను గూర్చి విద్యారణ్యస్వాములు ఈ విధముగా చెప్పిరి.

**శ్లో॥ ప్రతిబంధో వర్తమానో, విషయాసక్తి లక్షణ:**
**ప్రజ్ఞామాంద్యం కుతర్కశ్చ విపర్యయ దురాగ్రహ:**

అనగా విషయాసక్తి, ప్రజ్ఞామాంద్యము, కుతర్కము. విపర్య దురాగ్రహము అను నీ నాల్గును వర్తమాన ప్రతిబంధకము లనబడును. శబ్దస్పర్శరూప రసగంధాధి విషయములందు గల అనురాగము విషయాసక్తి యనబడును. గురువుల వద్ద శ్రవణము చేసిన వేదాంత విషయముల అర్థమును గ్రహించుట యందును, గ్రహించినదానిని ధారణచేయుట యందును, కుశలత్వము లేకపోవుట బుద్ధిమాంద్య మనబడును. శ్రుతికి వ్యతిరేకముగా తర్కించుట కుతర్కమనబడును. దానికే శునక తర్కమని మరియొక పేరుకూడ కలదు. కుక్కలు విస్తరియందున్న అన్నమును తినుటకు ప్రయత్నించి, చివరకు జయాపజయముల కొరకు పోరాడి కరచుకొని అన్నమును నేలపాలు చేయుచున్నవి. అట్లే శ్రుతిని విడిచి బుద్ధి కుశలతతో తర్కము చేయువారు

తత్త్వ నిర్ణయము కొరకు వాదము ప్రారంభించి, కొంత చర్చ జరిగిన తర్వాత దానిని మరచి, జయాపజయముల కొరకు పోట్లాడెదరు. కర్తృత్వ భోక్తృత్వములు లేని ఆత్మయందు అవి కలవనెడి దురభిమానము, విపర్యయ దురాగ్రహమందురు. ఈ నాలుగు ప్రతిబంధకములలో ఏ ఒకటి యుండినను, వేదాంతశ్రవణము చేసినను, ఆత్మసాక్షాత్కార జ్ఞానము కలుగదు. ఇందు విషయాసక్తి రూపమగు ప్రతిబంధకము శమదమాదులచేత నివృత్తి యగుచున్నది. మరల మరల వేదాంతశాస్త్ర శ్రవణము చేయుటచేత, బుద్ధిమాంద్యరూపమగు ప్రతిబంధకము నివృత్తియగుచున్నది. ఆ శ్రవణము చేసిన అర్థమును శాస్త్రోక్తమైన యుక్తులచే మననము చేసినచో, కుతర్కరూప ప్రతిబంధకము నివృత్తి యగుచున్నది. మననము చేత నిశ్చితమైన ఆత్మ తత్త్వమును అవిచ్ఛిన్న తైలధారవలె ధ్యానము చేయుట యనెడి నిధి ధ్యాసము చేత, విపర్యయారూప దురాగ్రహమను ప్రతిబంధకము నివృత్తియగుచున్నది.

**శ్రు॥ "శమాద్యైః శ్రవణాద్యైర్వా, తత్రతత్రోచితైః క్షయం।**
**నీతేఽస్మిన్ప్రతి బందేతు, స్వస్వబ్రహ్మత్వ మశ్నుతే॥**

అనగా శ్రణమననాదుల చేతను, శమదమాదుల చేతను వర్తమాన ప్రతిబంధకము నశించిన తోడనే, నేను బ్రహ్మమునైతిననెడి స్వస్వరూపత్వమును పొందుచున్నాడని చెప్పబడెను. ఈ పై ప్రతిబంధకము లన్నింటిని తొలగించుకొనిన జిజ్ఞాసువు వేదాంత మహావాక్యార్థ బోధవలన తప్పక ముక్తి నొందును.

ఓం తత్ సత్.

# జగత్తు - జీవుడు - ఈశ్వరుడు - పరమాత్మ

జగత్తు:- జనించి గతించునది జగత్తు, జడాత్మకము, చేతనాత్మకము.

జీవుడు:- శుద్ధచైతన్యము, మలినసత్వాంత:కరణము నందలి ప్రతిబింబము, అంత:కరణ.

ఈశ్వరుడు:- శుద్ధచైతన్యము, శుద్ధసత్వ మాయాప్రతిబింబము, ప్రకృతి.

పరమాత్మ లేక బ్రహ్మము:- స్వప్రకాశరూపమై ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక ప్రపంచమును, తన ప్రకాశమునందున్నట్లు తోపింప జేయునట్లున్న "చిత్రప్రకాశము".

జగత్తును గురించి విచారించినచో అది జడమనియు, వికారవంతమనియు, దృశ్యమనియు, మోహాత్మకమైనదనియు తెలియగలము. జీవుని విచారించినచో జడ చేతనాత్మకమని, వికార నిర్వికారమనియు, దృక్ దృశ్యముగా, కర్తృత్వ, భోక్తృత్వ రూపముగ గోచరించును. ఈశ్వరుని విచారించినచో శ్రుతిస్మృతుల ద్వారా సర్వేశ్వర సర్వజ్ఞ సర్వశక్తిమత్వ, సర్వాంతర్యామిగా తెలియవచ్చుచున్నది. పరమాత్మను గురించి విచారించగా అఖండ, అద్వితీయ, చిన్మాత్ర స్వరూపునిగా **"ఏకం ఏవా ద్వితీయం"** అని శ్రుతి పలుకుచున్నది. ఇంత విచారణ ఎవరికి, ఎందుకు?

మానవుడు (జీవుడు) సుఖాభిలాషి - సుఖమనగా విషయోప లబ్ధివలన కలుగు సామాన్య కించిత్కాల చిత్తవిశ్రాంతి. కాని మానవుడు కోరునది నిత్యసుఖము. అందులకై యీ జగత్తులో తన జీవితకాలము సతతము విహరించి, తన్నిత్య సుఖప్రాప్తి లభింపని కారణము చేత, దాని తత్త్వమెరుంగగోరు జిజ్ఞాసువునకు యీ విచారణ అవసరము. అది గురువుల వద్ద ఉపనిషత్తుల విచారణ ద్వారా పొందవలసియున్నది.

జీవునకు నేనెవరిని, ఎచ్చటనుండి వచ్చి యిచ్చట యిట్లుండి, ఎచ్చటికి పోనున్నాను, అను ప్రశ్న ఉదయించగానే, అతనికి కరచరణాద్యవయవములతో కూడి తెలిసికొనువాడ ననియు, యీ జగత్తు నాచే తెలియబడున దనియు స్థూలముగా నిర్ణయించును. ఈ

జగత్తు నన్ను తెలిసికొనలేదు. నాచే తెలియబడి ఉన్నదైయున్నది. సర్వకాల, దేశ, అవస్థల యందు, నిత్యమై యుండు నదేదియో అది సత్యవస్తువుగా వేద నిర్ణయము. ఈ జగత్తును తెలిసికొను యీ జీవుడు జాగ్రదవస్థను వీడి స్వప్నావస్థకు చేరుచున్నాడు. అప్పుడు యీ దేహ సంబంధమేమియు తోచనివాడై, యీ దేహసంబంధమగు భార్యాపుత్రాదులు, ధనధాన్యాదులు, గృహ ఆరామ క్షేత్రాదులు లేనివాడై, మరియొక ప్రపంచము, దానియందు సుఖదుఃఖానుభవములు అనుభవించుచున్నాడు. కనుక యీ దేహము నేను గానని, నాయందిది తెలియబడినదని ఊహించుట జీవునకు సులభమే గదా! స్వప్నమును వీడి సుషుప్తిని (నిద్ర) బొందినపుడు, మెలకువలో అనగా జాగ్రత్తులోనున్న యీ స్థూలదేహముగాని, దానికి సంబంధించిన జగత్తుగాని, సుఖదుఃఖములుగాని, మనము భావించు ఈశ్వరాదిక దైవములుగాని, మరి స్వప్నములో సూక్ష్మరూపముగ నున్న నేనుగాని, దానికి సంబంధించిన సూక్ష్మ ప్రపంచముగాని తెలియబడక, ద్వైతము భావించక యున్నది. మనకు ఏమియు తెలియుటలేదు. అజ్ఞానానుభవము కలుగుచున్నది. దానినే శాస్త్రీయముగ, జాగ్రత్తున విశ్వుడని, స్వప్నమున తైజసుడని సుషుప్తియందు ప్రాజ్ఞుడని చెప్పబడుచున్నది.

సమష్టిగా వైశ్వానరుడు, హిరణగర్భుడు, అవ్యాఘృతుడు లేక ఈశ్వరుడుగా చెప్పబడుచున్నది. ఈ సర్వము అవస్థాత్రయ మాత్రములై యున్నది. జాగ్రత్తునందు స్వప్నములేదు. స్వప్నం నందు జాగ్రత్తులేదు. యీ రెండు సుషుప్తియందు లేవు. కనుక యీ అవస్థలు, యీ అవస్థాభిమానులు, వారికి సంబంధించిన జగత్తు, యీ జగత్తుకు సృష్టికర్త అను ఈశ్వరభావన ఒకప్పుడు తెలియబడుచున్నవి. సర్వకాల దేశముల యందు స్వప్రకాశముతో నుండునది సత్యవస్తువని తెలుపు వేదనిర్ణయము ప్రకారము పై తెలియబడిన వన్నియు సత్యవస్తువులు కావని నిర్ణయము చేయవచ్చును గదా? దృష్టనష్ట స్వభావములు కలిగియుండునవి అనిర్వచనీయములని చెప్పెదరు. ఏది అనిర్వచనీయమో అది మిధ్య. కనుక జీవభావము, ఈశ్వరభావము మిధ్యగా తెలియబడుచున్నవి. ఈ భావములకు అధిష్టానమై యున్ననా "ఉనికి" తెలివి

రూపమైయుండి, ఆ తెలివియందు యివి యన్నియు, మన వాసనాను సారముగ భాసించుచున్నవై యున్నవి. మన స్వరూపమును తెలియని వారమై (అవిద్య) అందు తెలియబడు యీ సమస్తము నందు సత్యత్వభావనముంచి (భ్రాంతి) మన జీవితమును సాగించుచున్నాము. సత్యత్వ భావముంచి, సాగించు యీ జీవయాత్రలో ఈ జీవుడు ఆశించు నిత్యనిరతిశయానందమును పొందగలుగుట అసాధ్యము.

సత్యవస్తువును, వికారరహితమైనదని, అదియే మన స్వరూపమని పైవిధముగ గుర్తించి, దానియందే అనగా ఆ నిశ్చయము నందే నిష్ఠ గలిగి, రాగద్వేష రహితుడవై జీవయాత్ర గడిపినచో, చిత్తశాంతిని బొంది, పరమగమ్యమగు పురుషార్థమును బొందగలమని శ్రుతిస్మృతులు తెలుపుచున్నవి. అనుభవమున గూడ కన్పించుచున్నది. "అహం" భావనను వదలి "స్వయం" భావన యందుండుము.

ఔపాధికములగుట వలన ఘటాకాశ మహాకాశముల భేదము మిథ్యయైనట్లు, ఔపాధికములగుటచే జీవేశ్వరుల భేదము మిథ్యాయగును. ఘటాకాశముల పరస్పర భేదము మిథ్యయైనట్లు, జీవుల పరస్పర భేదము మిథ్యయగును. స్వప్న జీవునకు, స్వప్న పదార్థములతో గల భేదము మిథ్యయైనట్లు, జీవునకు జడపదార్థములకు గల భేదము మిథ్యయగును. సాక్షికి స్వప్న ప్రపంచంతోగల సంబంధం మిథ్యయైనట్లు, ఈశ్వరునకు జడప్రపంచముతో గల సంబంధము మిథ్యయగును. రజ్జువునందు తోచెడి, సర్పదండమాలాదుల భేదం మిథ్యయగునట్లు ఆత్మయందు తోచెడి జడపదార్థముల భేదము మిథ్యయగును. ఈ విధముగ మన అనుభవములో తెలియబడు భేదములన్నియు మిథ్యగా గుర్తించి, జీవబ్రహ్మముల ఏకత్వమును నిశ్చయించి, సమస్త భేద దర్శనములు మిథ్యయని అద్వైత గురువుల వద్ద మన సమస్త సంశయములను నివారించుకొని ప్రశాంతితో జీవన్ముక్తులమై జీవింతుముగాక.

మనము ఉపక్రమించిన జగత్తు, జీవుడు, ఈశ్వరుడు, పరమాత్మ యను యీ భేదమంతయు ఒక అవస్థకు చెందినవి మాత్రమగుట వలన వేదనిర్ణయము ప్రకారము

సత్యవస్తువులుగా నిర్ణయించుట సాహసము. సత్తాస్ఫురణ రూపమగు తెలివి యందు యివి అన్నియు తెలియబడి భావమాత్రములై యున్నవో ఆ తెలివి రూపమే బ్రహ్మము. అదియే సర్వము, ఏకము, అద్వితీయము అగును.

**శ్లో॥ సర్వగం హ్యేతద్ బ్రహ్మ అయమాత్మా**
**సోఽ యమాత్మా చతుష్పాత్ ॥** **మాండూక్య ఉపనిషత్ - 2.**

అర్థము:- ఇదియంతయు పరబ్రహ్మము. ఈ జీవాత్మయే పరబ్రహ్మము; ఈ ఆత్మయే నాలుగు పాదములు గలవాడు యని చెప్పుచున్నది. బ్రహ్మ మనగా బృహత్ పెద్దది. అంతయు అదియే అయినది. అదియే పరమాత్మ. గురు శిష్య బోధలో పరమాత్మయను చెప్పు పదమునకు లక్ష్యార్థముతో ఆ మహా **"తత్త్వమును"** గ్రహింతుము గాక. ఈ తత్త్వమును తెలిసికొనుటకు జగత్తు నేత్రము వంటిది. ఇట్లు తెలిసికొను బుద్ధిశక్తి మానవజీవికొక్కనికి మాత్రమే గలదు. మానవ జన్మ దుర్లభము. వేదాంత డిండిమ యందిట్లున్నది.

**శ్లో॥ అవిజ్ఞాతే జన్మ నష్టం విజ్ఞాతే జన్మ సార్థకం ।**
**జ్ఞాతురాత్మా న దూరే స్యాత్ ఇతి వేదాంత డిండిమః ॥** **వే.డిం. 73.**

అర్థము:- ఆత్మ నెరుంగకుండిన జన్మ వ్యర్థము, ఎరిగిన సార్థకము. జ్ఞాతకు ఈ ఆత్మ దూరమున లేదు. స్వస్వరూపముగనే యున్నది అని వేదాంతభేరి. కాన తన స్వరూపమును గురుశాస్త్రయుక్తుల ద్వారా తెలిసికొని, జీవ భావమును వదలి, బ్రహ్మభావన యందున సతతము చరించుచు, మానవజన్మను సార్థకము చేసికొనుటయే మోక్షము. ధర్మ, అర్థ, కామమోక్షములను చతుర్విధ పురుషార్థములలో మోక్షమును పొందుట ఒక్క మానవజన్మయందే సాధ్యము. వేదాంత డిండిమ యందిట్లున్నది.

**శ్లో॥ పురుషార్థ త్రయా విష్టాంపురుషాఃపశవో ధృవమ్ ।**
**మోక్షార్థీ పురుషః శ్రేష్టః ఇతి వేదాంత డిండిమః ॥** **వే.డిం. 38.**

అర్ధము:- ధర్మము, అర్ధము, కామము అనబడు ఈ మూడు పురుషార్ధములను సాధించు మానవులు పశువులనుట నిక్కమే. కేవలము మోక్షమును బొందగోరు పురుషుడే శ్రేష్ఠుడు అని వేదాంత డిండిమము. గురువుల సమీపించి, శ్రుతుల లక్ష్యార్ధమును తెలిసి కొందుము గాక. కర్మ, ఉపాసన, భక్తులకు వాటి వాటి ఫలముల నిచ్చినను, అవి అల్పఫలములని గుర్తించి, ఆత్యంతిక ఫలమగు జీవబ్రహ్మైక్యమను జ్ఞానమును తెలిసికొని కృతార్ధులగుదురు గాక.

ఓం శాంతి: శాంతి: శాంతి:

# పంచదశ జ్ఞాన యోగాంగములు

తత్త్వమస్యాది మహావాక్యములు, సద్గురువుల వద్ద శ్రవణము చేసి, సంశయ విపర్యములను తొలగించుకొని, జీవబ్రహ్మైక్య విజ్ఞానము పొందినను, జీవన్ముక్తి విలక్షణ సుఖమును పొందుటకు అనగా జ్ఞానదార్ఢ్యము కొరకు పంచదశ జ్ఞాన యోగాంగములను అభ్యసింపవలెను. జ్ఞానయోగాంగములను గురించి అపరోక్షానుభూతి యందు వివరముగా చెప్పబడెను. యమము, నియమము, త్యాగము, మౌనము, దేశము, కాలము, ఆసనము, మూలబంధము, దేహసామ్యము, ధృక్స్థితి, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి ఈ పదిహేను జ్ఞానయోగాంగములు.

యమము:- సత్యము, అహింస, అపరిగ్రహము, అస్తేయము, బ్రహ్మచర్యము. ఈ ఐదును కలిసి యమమనబడును. సత్యము బ్రహ్మానుభవమునకు ప్రథమ సోపానము. సత్యము పల్కుట మన అంతరాత్మయొక్క ఆకాంక్ష. ఎప్పుడు మనము అసత్యము పల్కెదమో, మనలను మనమే గుర్తించనట్లగును.

అహింస:- మనోవాక్కాయ కర్మలతో ఇతరులకు నొప్పి గలిగింపకుండుట.

అపరిగ్రహము:- కావలసిన దానికంటె, అధికముగా వస్తు సామగ్రిని, కూడబెట్ట కుండుట.

అస్తేయము:- ఇతరుల వస్తువులను అక్రమముగా పరిగ్రహింపకుండుట.

బ్రహ్మచర్యము:- ఉచితమైన కామోపభోగములతో వీర్య సంయము చేయుట. ఈ ఐదును కలిసి యమ మనబడును. యమమును గూర్చి శాస్త్రమునందిట్లు చెప్పబడెను.

**శ్లో॥ సర్వం బ్రహ్మేతి విజ్ఞానా, దింద్రియ గ్రామసంయమః ।**
**యమోఽయమితి సంప్రోక్తోఽ, భ్యసనీయో ముహుర్ముహుః ॥**

అనగా సర్వమును బ్రహ్మముగ చూచెడి బ్రహ్మవేత్తలు ఇంద్రియములను కూడ బ్రహ్మముగనే భావింతురు. కాన ఆ ఇంద్రియము లేవిషయమునందు ప్రవర్తింపనేరవు. యీ విధముగా ఇంద్రియ సంయమము గలిగి యుండుటయే "యమ" మనబడును. యీ అభ్యాస బలమువలన, సర్వమును బ్రహ్మమనెడి భావము ధృఢమగును. అట్టివారికి నరకము లేదు, పునర్జన్మ లేదు.

నియమము:- మానవ జీవితములో, నియమముండి తీరవలయును. శ్రోత్రేంద్రియముతో ధ్వన్మాత్మక, వర్ణాత్మకమగు సమస్త శబ్దములను వినుచుండినను, త్వగింద్రియముతో, శీతోష్ణ మృదు కఠినాది సమస్త స్పర్శలను నెరుంగుచుండినను, నేత్రేంద్రియముతో శ్వేతపీతాది సమస్త రూపములను చూచుచుండినను, జిహ్వేంద్రియముతో మధురామ్లాది సమస్త రసములను గ్రహించు చుండినను, ఘ్రాణేంద్రియముతో సుగంధ, దుర్గంధాది సమస్త గంథముల నెరుంగు చుండినను, వాగింద్రియముతో సర్వ శబ్దములు చ్ఛరించుచుండినను, పాణీంద్రియముతో సమస్త కార్యము లాచరించు చుండినను, పాదేంద్రియముతో గమనాగమనములు చేయు చుండినను, గుహ్యేంద్రియముతో శుక్రమూత్రములను విడుచుచు, ఆనందించు చుండినను, పాయురింద్రియములో మలవిసర్జన మొనరించుచుండినను, మనస్సుచే సంకల్పించుచు, బుద్ధితో నిశ్చయించుచు, చిత్తముతో చింతించుచు, అహంకారముతో కర్తృత్వమూనుచు ప్రవర్తించుచుండినను, ఈవిధముగ ఇంద్రియములన్నియు, నింద్రియార్ధములకును, మనోబుద్ధి చిత్తాహంకారములు వానివాని కార్యములకును, తాను సాక్షి ననియు, సచ్చిదానంద స్వరూపుడననియు, గుణ జాతి నామరూపాదు లేమియు లేని వాడననియు, తాను బ్రహ్మముననెడి భావమును చింతించుటయే నియమమనబడును. దీనిని గూర్చి శాస్త్రమునందిట్లు చెప్పబడెను.

**శ్లో॥ సజాతీయ ప్రవాహశ్చ, విజాతీయ తిరస్కృతి: ।**
**నియమోహి పరానందో, నియమాత్క్రియతే బుధై: ॥**

బ్రహ్మముకంటె భిన్నమగు జడపదార్థముల దృష్టిని విడిచి, సజాతీయమగు బ్రహ్మదృష్టి గలిగి అవిచ్ఛిన్న తైలధారవలె అఖండ బ్రహ్మాకార వృత్తి ప్రవాహము గలిగియుండుట నియమమని చెప్పబడెను.

త్యాగము:- "చిత్తత్యాగం విదు: సర్వత్యాగం" చిత్తమును త్యాగము చేయుటయే సర్వత్యాగము. అనగా చిత్తమునందున్న సంస్కారములయొక్క త్యాగము. చిత్తము నేను కాదు. ఈ విధమైన సంసర్గాధ్యాసము మరియు అర్థాధ్యాసమును త్యాగము చేయుటయే వాస్తవిక త్యాగము. ఈ శరీరము నాది అనుట సంసర్గాధ్యాసము. ఈ నేనుకు అతిరిక్తమైన దానిని సత్యమని భావించుట అర్థాధ్యాసము. ఈ రెండును కలిసి జ్ఞానాధ్యాసములగును. ఈ విషయమును గూర్చి శాస్త్రము లిట్లు నుడువుచున్నవి.

**శ్లో॥ త్యాగ: ప్రపంచరూపస్య, చిదాత్మ త్వావలోకనాత్ ।**
**త్యాగోహి మహాత్మాం పూజ్య, స్సద్యో మోక్షమయోయతీ: ॥**

అనగా ప్రపంచము యొక్క రూపనామములను త్యజించి, సర్వత్ర చిదాత్మ నవలోకించుటయే పూజ్యమైన త్యాగమగును. ఇట్టి త్యాగమువలన మోక్షము కలుగును గాని, స్త్రీ పుత్ర గృహారామాదులను, శిఖాయజ్ఞోపవీతాదులను త్యజించుట త్యాగము అనబడదు.

మౌనము:-

**శ్లో॥ యత్వాచా అనభ్యుదితం యేన వాగభ్యుద్యతే తదేవ బ్రహ్మత్వం విద్ధి,**
**యన్మనసానుమనుతే యేనాహుర్మనోమతమ్ తదేవ బ్రహ్మత్వం విద్ధి ॥**

అని కేనోపనిషత్తు పల్కుచున్నది. అట్టి బ్రహ్మమే తానుగా నెరింగి, మనస్సుతో నితర విషయములను చింతిపక, సత్యమైన వాక్కులు మితముగ ఉచ్ఛరించుట మౌనమనబడును. ఈ విషయమును గూర్చి శాస్త్రమిట్లు వచించుచున్నది.

**శ్లో॥ యస్మాద్వాచోని వర్తంతే అప్రాప్య మనసాసహ ।**
**యన్మౌనం యోగిభిర్గమ్య తద్భజేత్సద్విదా బుధ: ॥**

ఏ బ్రహ్మమును గూర్చి వాక్కునుడువజాలదో, మనస్సూహింపజాలదో అట్టి బ్రహ్మస్థితిని బొందుటయే మౌనమని పెద్దలు చెప్పుచున్నారు. బ్రహ్మభావనలో నుండి మితవాక్కులు పల్కుట గూడ మౌనమే. నోరు మూసికొని, తల, చేతులు త్రిప్పుచు కాగితం మీద వ్రాసి చూపుట మొదలగు అనేక విధముల భాధపడుచున్నారు. ఇట్టి మౌనము మవహాస్యాస్పదమగును.

దేశము:- ఆచార్యోపదేశముచే పండితులు తెలిసికొనిన బ్రహ్మము యొక్క స్వరూప ప్రదేశమే ఉత్తమప్రదేశమనబడును. ఏకములో సర్వమును అంతము చేయడము ఏకాంతము. ఏది అందరిలోను, అన్నింటిలోను, నిండియున్నదో, ఆ ఆత్మస్వరూపము తప్ప మరొకటి లేనేలేదో, అట్టి ఏకముగా ప్రకాశించు బ్రహ్మస్వరూప ప్రదేశమే, పవిత్రదేశ మనబడును. ఆ బ్రహ్మప్రదేశ మత్యంత నిరుపద్రవకరమైనది. ఈ విషయమును గురించి శాస్త్రవాక్యమిది.

**శ్లో॥ ఆదావంతేచ మధ్యేచ, జనోయస్మిన్న విద్యతే।**
**యే నేదం సతతం వ్యాప్తం, సదేశో విజన: స్మృత: ॥**

అనగా ఆదియందును, అంతమందును, మధ్యమందును జనులు లేని నిర్జన ప్రదేశమును పవిత్రమైనదిగా లోకులు చెప్పెదరు. అది సరికాదు. ఆదియందున, అంతమందున, మధ్యమునందున, వ్యాపించియున్న బ్రహ్మమే నిర్జనప్రదేశమనబడును. ఇట్టి నిర్జన రూపమగు ప్రదేశమైన బ్రహ్మమునందు స్థితిగలవారే, ఏకాంతవాసులని చెప్పబడెదరు. అరణ్యము నిర్జన ప్రదేశమని తలంచి అచ్చట కూర్చొని తపమాచరించెడి దేహాభిమానికి బ్రహ్మానందము కలుగనేరదు.

కాలము:- కాలమంటే అది ఒక అఖండమైన వస్తువు. శరీర దృష్టి ననుసరించి భూతభవిష్యద్వర్తమానములు ఉండును. కాలంలో యివన్నియు ఉపాధులు. ఈ ఉపాధులనుండి కాలములో భూత, భవిష్య, వర్తమానము లారోపితములు. ఆద్యంత రహితమైన బ్రహ్మమే కాలమనబడును. ఈ విషయమును గురించి శాస్త్రమిట్లు వక్కాణించుచున్నది.

**శ్లో॥ కలనాత్సర్వ భూతానాం, బ్రహ్మాదీనాం నిమేషతా: ।
కాలశబ్దేన నిర్దిష్టో, హ్యఖండానంద ఆద్వయ: ॥**

అనగా అఖండానందాద్వయ బ్రహ్మస్వరూపమగు కాలంలో నొకత్రుటి కాలములో, బ్రహ్మాది స్థావరాంతములుగాగల సమస్త భూతములు అనేక పర్యాయములుత్పత్తి నాశమునొందుచున్నవి. ఇట్టి వీటికన్నిటికీ అధిష్టానమై యుత్పత్తి నాశము లేకయున్న పరబ్రహ్మమే కాలమని చెప్పబడెను. ఆ కాలమే పవిత్రమైన కాలమగును. కాని జ్యోతి శాస్త్రమునందు నిర్ణయించబడిన కాలము పవిత్రమైనది కాదని చెప్పబడెను.

ఆసనము:- వేదాంతములోని సాధనలో ఆసనము శ్రమ పూర్వకముగా నుండకూడదు. సహజము, సరళము, సుఖముగా నుండవలెను. సుఖమంటే - సు = సుష్ట + ఖ = హృదయాకాశము. హృదయాకాశము దేనియందు సుష్టుగా ఉ ంటుందో అది సుఖము. హృదయాకాశము దేనియందు దూషితమగునో అది దు:ఖము. ఏ విధంగా కూర్చుంటే బ్రహ్మచింతన సులభంగా జరుగుతుందో, అట్లు కూర్చొనుట సుఖాసనము. బ్రహ్మమునందు స్థితిగలిగి యుండుట సిద్ధాసన మందరు. యీ విషయము శాస్త్రమునందిట్లు పలుకబడెను.

**శ్లో॥ సుఖేనైవ భవేద్యస్మి, న్నజస్రం బ్రహ్మచింతనమ్ ।
ఆసనం తద్విజానీయా, న్నే తరత్సుఖ నాశనమ్ ।
సిద్ధం యత్సర్వభూతాది, విశ్వాధిష్టాన మవ్యయమ్ ।
యస్మిన్ సిద్ధా: నమాశిష్టా స్తద్వైసిద్ధాసనం భవేత్ ॥**

నిరంతరము బ్రహ్మమునందు స్థిరమగుస్థితిగలిగియుండుట సుఖాసన మనబడును. సమస్త భూత భౌతిక ప్రపంచమున కధిష్టానమై, నాశరహితమై, సర్వవ్యాపకమైయున్న బ్రహ్మమునందుండుటయే సిద్ధాసనము అనబడును. ఇట్టి సిద్ధాసనమే సర్వాసనముల కంటె శ్రేష్టమును, సర్వదు:ఖవినాశకమును, సర్వానంద ప్రదమును ~~మును~~ అగును. తద్భిన్నమైన వన్నియు దు:ఖప్రదములును, సుఖనాశకరములు నగును.

మూలబంధము:- సమస్త బంధకములకు కారణమైన ప్రకృతి మూలబంధ మనబడును. ఈ మూలబంధము, బ్రహ్మతత్త్వము తెలియగనే తొలగిపోవును. సర్వబంధములను గలిగించు, ప్రకృతి బంధమును గూడ బాధించు బ్రహ్మమే మూలబంధమనబడును. ఈ విషయమును శాస్త్రములిట్లు వివరించుచున్నవి.

**శ్లో॥ యన్మూలం సర్వభూతానాం, యన్మూలం చిత్తబంధనమ్ ।**
**మూలబంధ స్సదాసేవ్యో, యోగోఽసౌ రాజయోగినామ్ ॥**

అనగా సమస్త ప్రపంచమునకు మూలమైనది మాయ. ఆ మాయకు మూలమైనది బ్రహ్మము. ఆ బ్రహ్మమునందు చిత్తమును బంధించుటయే మూలబంధ మనబడును. ఇది జ్ఞానులకు యోగ్యమైనదని చెప్పబడెను.

దేహసామ్యము:- సముద్రమునందు సమస్తనదులు కలిసెడి విధముగ బాహ్య అంతరేంద్రియములును, వాని వృత్తులన్నియును, బ్రహ్మానందమునందు సమరస భావము నొందుటయే, దేహసామ్యమనబడును. ఈ విషయము శాస్త్రము నందిట్లు వివరించబడినది.

**శ్లో॥ అంగానాం సమతాం విద్యా, త్సమే బ్రహ్మణి లీయతే ।**
**నోచేన్నైన సమానత్వ, మృజుత్వం శుష్కకాష్టవత్ ॥**

అనగా సముద్రమునందు తరంగములు లీనమైనట్లు చైతన్య సముద్రమునందు దేహేంద్రియాదులయొక్క విలయుమగుటయే దేహసామ్యమనబడును. గాని యెండిపోయిన కట్టెవలె కూర్చుండుట దేహసామ్యము కానేరదని చెప్పబడెను.

దృక్స్థితి:- యోగములో నాసాగ్రవాలోకిని దృష్టియని చెప్పబడినది. **"ద్రష్టృ దర్శన దృశ్య విరామమెచట నగునో అచట దృష్టి నిలుపలగ నగును గాని, చెదరి నాసాగ్రమున జూపు జేర్ప దగదు, కోరియ మనస్క రాజయోగులకు వత్స."** బ్రహ్మమందు ద్రష్టయనియు, దర్శనమనియు, దృశ్యమనియు, భేదము లేదు. కాన బ్రహ్మవిద్వరిష్టులు పరబ్రహ్మమునందే దృష్టి నుంచవలెను. నాసాగ్రమందున, ఎంతమాత్రము చూపు

నిలుపగూడదు. ఎచ్చట నుండి దృష్టి బయలుదేరుతుందో ఆ చైతన్యమే ప్రధానమైనది. అది పరమోదార దృష్టి, అట్టి స్థితినే **"యత్ర యత్ర మనోయాతి, తత్ర తత్ర సమాధయ:"** అని శ్రుతి వర్ణించినది.

**శ్లో॥ దృష్టిం జ్ఞానమయీంకృత్వా, పశ్యే ద్బ్రహ్మమయం జగత్।**
**సాదృష్టి: పరమోదారా, ననాసాగ్ర విలోకిని ॥**

అని శాస్త్రవచనము. సర్వజగదధిష్టానమైన పరబ్రహ్మమును గాంచుచుండుటయే దృష్టియనబడును. చరాచరాత్మకమగు సమస్త ప్రపంచము బ్రహ్మమయమే యగును. కాని నాసాగ్రమును విలోకించుట దృష్టికాదని చెప్పబడెను.

ప్రాణాయామము:- ప్రాణాయామము పలువిధములు. భస్త్రికాప్రాణాయామ మనగా గాలిని, త్వరగా పీల్చుకొని వెంటనే విడుచుట. సామాన్య ప్రాణాయామమునందు పూరక, రేచక, కుంభకములు తగిన పరిమాణములో చేయబడును. సంధ్యావందనము చేయువారు యీ సామాన్య ప్రాణాయమము నాచరింతురు. కొందరు శబ్దోచ్చారణ, మంత్రజపము నియమితముగ జేసి, ప్రాణాయామము జేసినట్లు భావింతురు. కాని వేదాంతమార్గమందు -

**శ్లో॥ చిత్తాది సర్వభావేషు బ్రహ్మత్వేనైవ భావనాత్।**
**నిరోధ: సర్వవృత్తీనాం ప్రాణాయమ: స ఉచ్ఛతే ॥**

అనగా ఇంద్రియ ప్రాణాంత:కరణ వృత్తులన్నింటిని బ్రహ్మరూపముగ జూచుట వలన, ఆ వృత్తులన్నియు నిరోధింపబడును. ఆ సర్వవృత్తి నిరోధమే ప్రాణాయామమని చెప్పబడెను. లోపల వెలుపల కనుపించెడి నామరూపముల సముదాయము మాయా కల్పితమని, అవి సత్యములు కావనియు, నిశ్చయించి వాటిని విడుచుట రేచక మనబడును. ఈ సమస్తమున కధిష్టానమైన సచ్చిదానంద బ్రహ్మము సత్యమని నిశ్చయించి గ్రహించుట పూరక మనబడును. పిదప నిశ్చలమై నిర్వికారమైయున్న

పర(బహ్మము నందు మనస్సును స్థిరత్వమొనర్చుట కుంభక మనబడును. ఇట్టి మూడును కలిసి (ప్రాణాయామ మనబడును.

ప్రత్యాహారము:- సత్యాసత్యములగు సమస్త పదార్ధములు (ప్రత్యగభిన్న పర(బహ్మముగా నిరంతరము అవలోకించుట ప్రత్యాహారమనబడును. ఈ విషయమును గూర్చి శాస్త్రమిట్లు చెప్పుచున్నది.

**శ్లో॥ విషయే ష్వాత్మతాం దృష్ట్వా, మనసశ్చిత్త మజ్జనమ్ ।**
**ప్రత్యాహారస్స విజ్ఞేయోఽ, భ్యసనీయో ముముక్షిభి: ॥**

శ్రోత్రాదీ దింద్రియములు శబ్దాది విషయములను బొందుచుండగా, ప్రయత్నముతో ఆయింద్రియముల నావిషయములనుండి నిరోధించి బ్రహ్మాభి ముఖమొనర్చుట ప్రత్యాహార మనబడును.

ధారణ:- ఇంద్రియ మనంబులచే తెలియబడెడు సమస్తము బ్రహ్మమేయని తలంచి, ఆ బ్రహ్మమునందు మనస్సును స్థిరముగ నిల్పుట ధారణ యనబడును.

**శ్లో॥ యత్ర యత్ర మనోయాతి బ్రహ్మణస్తత్ర దర్శనాత్ ।**
**మనసో ధారణం చైవ, ధారణాసా పరమతా: ॥**

అర్థము:- మనస్సు ఎచ్చటెచ్చట ప్రసరించునో అచ్చటచ్చట బ్రహ్మమును గాంచుట ధారణయని చెప్పబడెను.

ధ్యానము:- “ధ్యానం నిర్విషయం మన:”, వేదాంతము మనస్సు నిర్విషయము కావడమే ధ్యానమని చెప్పును. వేదాంతంలో రూపాదుల విషయికమైన ధ్యానము గాని, వృత్తియందు గాని విశేషత్వముండదు. దేహేంద్రియ ప్రాణాంత:కరణములును, వాని వ్యాపారములును, నాకు దృశ్యములగు చున్నవి. నేను వాని నెరింగెడు ధృక్ స్వరూపుడను. వాని కార్యముల నెరింగెడి సాక్షినని తలంచుట ధ్యానమనబడును. దీనిని గురించిన శాస్త్రోక్తి ఇది.

**శ్లో॥ బ్రహ్మైవాస్మీతి సద్వృత్త్వా, నిరాలంబ తయాస్థితి:।**
**ధ్యాన శబ్దేన విఖ్యాతా పరమానంద దాయినీ ॥**

**"అహం బ్రహ్మాస్మి"** అనెడి అంతర్ముఖమైన బ్రహ్మాకార వృత్తియే యాశ్రయము లేక బ్రహ్మాకారముగ నిల్చియున్నది. ఈ బ్రహ్మాకారమగు నిరాలంబన వృత్తియే ధ్యానమనబడును. ఈ ధ్యానము పరమానంద దాయకమగును.

సమాధి:- జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలయందు కన్పించు సమస్త పదార్థములు పరబ్రహ్మమేయని నిరంతరము తలంచుట సమాధి యనబడును. దానిని గురించి శాస్త్రమునందిట్లు గలదు.

**శ్లో॥ నిర్వికారతయా వృత్త్వా, బ్రహ్మాకారతయా పున:।**
**వృత్తి విస్మరణం సమ్యక్, సమాధి: జ్ఞానసంజ్ఞక: ॥**

అనగా వృత్తి నిర్వికారమైతే వృత్తి విస్మరణం జరుగుతుంది. ఇట్టి వృత్తి విస్మరణ రూపజ్ఞానమే సమాధి యనబడును. వేదాంత విచారణ చేయుటచే నంత:కరణమున గల్గిన నిర్వికారమైన బ్రహ్మాకారవృత్తివలె, అవస్థాత్రయమునందు తోచెడి సమస్త పదార్థములు బ్రహ్మముగనే నిరంతరము గాంచుట నిర్వికల్పక సమాధి యనబడును. ఈ వృత్తి యొక్క తటస్థభావనగాని, స్తబ్ధతగాని, మూర్ఛగాని, అజ్ఞాన విలీనరూపమగు సుషుప్తిగాని సమాధి గానేరదని చెప్పబడెను. రాగద్వేషాది కషాయవృత్తులు లేని యధికారికి, యీ రాజయోగము అతి సులభముగా సిద్ధించుచున్నదని శాస్త్రమునందు చెప్పబడెను. పైజెప్పిన పంచదశ జ్ఞానయోగాంగములు క్రమముగ సాధనచేసి జీవన్ముక్తి సుఖము ననుభవించెదము గాక.

ఓం తత్ సత్.

# షడ్లింగ సహిత మహావాక్యములు

ఉపనిషత్సార భూతమైన, జీవబ్రహ్మైక్య విజ్ఞానమును బోధించు ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయమాత్మాబ్రహ్మ అను మహావాక్యములు, శ్రవణము చేసిన జిజ్ఞాసువులకు, వారి వారి అంత:కరణములయందలి పూర్వవాసనలచేతను, భేదవాదుల బోధలు వినుట చేతను సహజముగ సంశయభావన, అసంభావన, విపరీతభావనయను త్రివిధభ్రాంతులు కలుగుచున్నవి. కొందరు వీనినే ప్రమాణగత సంశయము, ప్రమేయగత సంశయము, విపర్యయ మనియు నందురు.

<u>ప్రమాణగత సంశయము</u>:- శ్రుతులయందు ప్రతిపాదించెడి మహావాక్యములు అద్వితీయ బ్రహ్మమును ప్రతిపాదించుచున్నవా? లేక అన్యార్థమును ప్రతిపాదించు చున్నవా? యను నిటువంటి సందేహములు ప్రమాణగత సంశయమనబడును. శ్రోత్రియ బ్రహ్మనిష్టుడగు సద్గురువు వలన షడ్లింగ సహితముగ వేదాంత శాస్త్ర శ్రవణము చేయుటవలన నివృత్తి యగుచున్నది.

<u>షడ్లింగములు</u>:- ఉపక్రమోప సంహారములు, అభ్యాసము, అపూర్వత, ఫలము, అర్థవాదము, ఉపపత్తి అను నీయారును షడ్విధ తాత్పర్య లింగములనబడును.

**శ్లో॥ ఉపక్రమోప సంహారా, వభ్యాసో పూర్వతాఫలం ।**
**అర్థవాదోప పత్తీచ, లింగం తాత్పర్య లింగయోః ॥**

"ప్రజ్ఞానం బ్రహ్మ" యను మహావాక్యమును బోధించిన ఐతరేయోపని షడ్లింగములు **"ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత"** ఈ సృష్టికి పూర్వమాత్మయే యుండెనని యుపక్రమించి **"ప్రజ్ఞానం బ్రహ్మ"** ప్రజ్ఞానస్వరూపుడగు ఆత్మయే బ్రహ్మమను మహావాక్యంతో ఉపసంహరింపబడెను. ఇది <u>ఉపక్రమోప సంహారమను</u> ప్రథమ లింగము.

**"స ఇమాంలోకాన సృజత"** ఆ బ్రహ్మ యీ లోకములను సృజించెననియు, **"సఈక్షతేయేను లోకాలోక పాలాన్ను సృజీఇతి"** ఈ లోకములను, లోకపాలకులను

సృజించెదనని ఆ బ్రహ్మము సంకల్పించెననియు, **"తస్మాది దింద్రోనామ"** అందువలన ఇంద్రనామము గలిగెననియు, మొదలగు వాక్యములచేత నభ్యాసలింగము చెప్పబడెను.

**"సహజాతో భూతా న్యభివ్యైక్షత్"** ఆ ప్రకటమైన భూతములను స్పష్టముగా నెరుగుచున్నానను వాక్యములచే సర్వభూతములకు ప్రకాశకుడగు ఆత్మ యా భూతములకు విషయుడు కాడనియు, **"సర్వం తత్ప్ర జ్ఞానేత్రం"** సర్వజగత్తు స్వప్రకాశ చైతన్యరూపుడగు పరబ్రహ్మము వల్లనే ప్రకాశింపబడుచున్నదనియు, స్వప్రకాశ స్వరూపుడగు బ్రహ్మమే ప్రకాశము చేతను తెలియబడదనియు, అపూర్వత చెప్పబడెను.

**"సఏతేన ప్రజ్ఞేనాత్మనాఽ స్మాల్లోకాదుృత్క్రమ్యా ముష్మిన్ సర్వలోకే సర్వాన్ కామానాప్త్వాఽమృత: సమభవత్ సమభవత్ ఇత్యోమ్"** జ్ఞానముచే నీలోకము నుల్లంఘించి మోక్షలోకము నందు సర్వకామములను పొంది అమృతుడగుచున్నాడు. ఇది సత్యమను నిటువంటి వాక్యములచే ఫలము చెప్పబడెను.

**"తాఏతా దేవతా: సృష్టా:"** ఈ యుత్పాదిత దేవతాస్తుతి చేయబడుచున్నదనియు, **"గర్భేమసన్న న్వేషామ వేదమహం దేవానాం జనిమాని విశ్వా"** నేను తల్లిగర్భము నందు ఉండియే యీ దేవలయొక్క జన్మముల నన్నింటి నెరుగుచున్నానను వాక్యములచేత అద్వితీయ బ్రహ్మస్తుతి రూపమగు అర్థవాదము చెప్పబడెను.

**"సఇమాం ల్లోకాన్ సృజత్"** ఆ బ్రహ్మ యీ లోకముల సృజించెనని యారంభించి, **"సతమేవ సేమానం విద్యార్యైం తయా ద్వారా ప్రాపద్యత"** ఆ బ్రహ్మమే మస్తకగత ప్రదేశమును విచారణ మొనర్చి ఆ ద్వారమునుండి శరీరమును పొందెనను, మొదలగు వాక్యములతో యుక్తిరూపమగు ఉపపత్తి చెప్పబడెను. ఈ లింగములచే ఐతరేయ ఉపనిషత్తునకు అద్వైత బ్రహ్మమునందు తాత్పర్యము గలదని తెలియవలెను.

బృహదారణ్యక ప్రథమాధ్యాయ లింగములు:- **"ఆత్మేత్య వోపాసీత"** ఈ విధముగ ఆత్మ నెరుంగవలయునని యుపక్రమించి **"ఆత్మానమేవ లోకముపాసీత"** లోకమాత్మ స్వరూపముగనే యెరుంగవలయునను వాక్యములచే నుపసంహరించబడెను.

**"తదేతత్పదనీయ మస్యసర్వస్య యదయమాత్మా"** సమస్తమునకు ఆత్మ స్వరూపమగు బ్రహ్మమును బొందుటయే యోగ్యమగుననియు, **"తదే తత్ప్రేయ: పుత్రాత్ప్రేయో విత్తాత్"** ఆ ఆత్మ పుత్రునికంటెను ప్రియమైనది, విత్తముకంటెను ప్రియమైనది, అను వాక్యములతో ప్రారంభించి "అహం బ్రహ్మాస్మి" నేను బ్రహ్మమునైతిని అను మహావాక్య పర్యంతముగల శ్రుతులచే అభ్యాసము చెప్పబడెను.

**"తదాహుర్యద్బ్రహ్మ విద్యయాసర్వం భవిష్యంన్తో మనుష్యా మన్యంతే"** బ్రహ్మవిద్యచేత మానవులు సర్వాత్మ భావము నెరుంగుచున్నారను మొదలగు వాక్యముల చేతను ఇతర లౌకిక ప్రమాణములవల్ల పరమాత్మ యెరుంగబడడను అపూర్వత ప్రతిపాదించెను.

**"య ఏవం దోహంబ్రహ్మోస్మీతి సఇదం సర్వంభవతి"** నేను బ్రహ్మమునని తెలిసికొనినవాడు సర్వస్వరూపుడగుచున్నాడను వాక్యముల చేత జ్ఞానము వలన సర్వాత్మ భావరూపమగు ఫలము చెప్పబడెను.

**"తస్యహ నదేవాచ్చ నాభూత్యా ఈశతే"** బ్రహ్మజ్ఞానికి బ్రహ్మత్వము సిద్ధింపకుండ జేయుటకు దేవతలే సమర్థులు కారు. ఇక నితరులకెట్లు సాధ్యమగునను వాక్యములచేత అభేదజ్ఞానము యొక్క స్తుతియు, భేదజ్ఞానము యొక్క నిందయు అను అర్థవాదము చెప్పబడెను.

**"సఏష ఇహప్రవిష్ట ఆనఖాగ్రేభ్య:"** ఆ పరమాత్మ నఖశిఖ పర్యంతము దేహమునందు ప్రవిష్టుడై యుండెనను మొదలగు వాక్యములచేత నుపపత్తి చెప్పబడెను. ఈ యారు లింగములచే బృహదారణ్యక ప్రధమాధ్యాయమున కద్వైత బ్రహ్మమునందు తాత్పర్యము కలదని యంగీకరింపబడెను.

ఛాందోగ్య షష్ఠాధ్యాయ లింగములు:- **"తదేవ సోమ్యా ఇదమగ్ర మాసీత్ ఏకమేవా ద్వితీయం బ్రహ్మ"** - ఓ ప్రియ దర్శనుడగువగు శ్వేతకేతూ! ఈ పరి దృశ్యమానమగు ప్రపంచము తనయుత్పత్తికి పూర్వము సద్రూపమగు బ్రహ్మముగనే యుండెను. ఆ

బ్రహ్మము సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమగునని యుపక్రమించి, **"ఐతదాత్మ్యమిదం సర్వం"** - ఈ సమస్త ప్రపంచ మద్వితీయ బ్రహ్మమే యగును. ఈ యద్వితీయ బ్రహ్మముకంటె నీ జగత్తు భిన్నముగలేదని యుపసంహరించెను. ఇది ఉపక్రమోప సంహార ప్రథమ లింగము.

**"తత్త్వమసి శ్వేతకేతో"** ఓ శ్వేతకేతుడా! ఆ బ్రహ్మమే నీవని అనేక ఉపమానములతో తొమ్మిది మారులు బోధింపబడినది. కాన ఇది అభ్యాసలింగమనబడును.

**"అత్రవాకిల సత్సోమ్య ననిబాలయసేఽ త్రైవకివేతి"** ఓ సౌమ్యుడా! ఆ సద్రూపమగు బ్రహ్మము ఆచార్యోపదేశమువలన మాత్రమే తెలియబడుచున్నది. అది ఇంద్రియ మనస్సులకు గోచరము కాదను నిటువంటి వాక్యములచే బ్రహ్మము లౌకిక ప్రమాణములకు విషయము కాదను అపూర్వత ప్రదర్శింపబడెను.

**"ఆచార్యవాన్ పురుషోవేద, తస్యతావదేవ చిరం యావన్నవి మోక్ష్యేఽథ సంపత్స్య"** అధికారి బ్రహ్మవేత్తయగు గురువుల వలన తత్త్వమస్యాధి మహావాక్యములను శ్రవణము చేసి ప్రత్యగభిన్న పరబ్రహ్మమును సాక్షాత్కరించు కొనుచున్నాడు. ఆ బ్రహ్మ సాక్షాత్కారమును పొందిన బ్రహ్మవేత్త ప్రారబ్ధకర్మలయొక్క ఫలము ననుభవించిన పిదప బ్రహ్మమే యగుచున్నాడను నిటువంటి శ్రుతుల చేత ఫలము ప్రతిపాదించ బడుచున్నది.

**"యేనాశ్రుతగ్ం శ్రుతం భవత్యమతం మత మవిజ్ఞాతం విజ్ఞాతం"** ఓ శ్వేతకేతూ! ఏయొక కారణవస్తువును వినుటచేత వినబడని కార్యజాతమంతయు వినబడినదగు చున్నదో, ఏ యొక కారణ వస్తువును మననము చేయుటచేత మననము చేయబడని కార్యజాతమంతయు మననము చేయబడినదగుచున్నదో, ఏయొకకారణ వస్తువును తెలియుటచేత తెలియబడని కార్యజాతమంతయు తెలియబడినదగుచున్నదో, ఆయొక కారణ వస్తువును గూర్చి నీవు నీ గురువునడిగితివా? అను నిటువంటి వచనములచేత నద్వితీయ బ్రహ్మము యొక్క స్తుతిరూపమగు అర్థవాదము చెప్పబడెను.

**"యథా సోయ్యేకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతగ్ం స్యాత"** ఓ సౌమ్యుడా! కారణమగు నొక్క మృత్పిండము నెరింగినచో దానికార్యములగు ఘటశరావాదులు అన్నియు తెలియబడినవగునను నిటువంటి వాక్యములచే దృష్టాంత రూపమగు నుపపత్తి చెప్పబడెను. ఈ లింగముల చేత ఛాందోగ్యోపనిషత్తు యొక్క షష్టాధ్యాయమున కద్వితీయ బ్రహ్మమునందే తాత్పర్యము గలదని తెలియవలయును.

మాండూక్యోపనిషద్ షడ్లింగములు:- **"ఓమిత్యే తదక్షర మిదగ్ం సర్వం"** ఈ సమస్తము ఓంకారమగు అక్షరరూపమను వాక్యముతో నుపక్రమించి **"అమాత్ర శ్చతుర్థో"** అమాత్ర రూపమగు బ్రహ్మము చతుర్థపాదమను వాక్యముచే నుపసంహరింపబడెను. ఇది ఉపక్రమోప సంహార ప్రథమ లింగము.

**"ప్రపంచోపశమం శాంతం"** ఆ బ్రహ్మము నిష్ప్రపంచ రూపమును, శాంతమును అగు యిటువంటి వాక్యములచే అభ్యాసలింగము తెలుపబడెను.

**"అదృష్టమ వ్యవహారం"** ఆ బ్రహ్మమే ప్రమాణమునకు గోచరము కానిదనియు, వ్యవహార రహితమైనదనియు చెప్పెడి వాక్యములచే నది ఏ ప్రమాణమునకు విషయము కాదను అపూర్వత తెలుపబడెను.

**"సంవిశ త్యాత్మనాత్మానం యం ఏవంవేద"** ఎవడీ యాత్మ నీ విధముగ నెరుగుచున్నాడో వాడాయాత్మనే పొందుచున్నాడను నిటువంటి వాక్యములచే ఫలము ప్రదర్శించబడెను.

**"అప్నోతి హవై సర్వాన్ కామాన్"** బ్రహ్మవేత్త సర్వకామములను పొందుచున్నాడను నిటువంటి వాక్యముల చేత ఫలము చెప్పబడెను. పండితులిద్దాని అర్థవాదమందురు.

ఈ యుపనిషత్తు యొక్క మంత్రములయందు బ్రహ్మప్రాప్తి నిమిత్తము నాలుగు పాదములు కల్పింపబడినవి. ఆ కల్పనా రూపమగు యుక్తియే యుపపత్తి యనబడును. ఈ లింగముల చేత మాండూక్యోపనిషత్తునకు నద్వైత బ్రహ్మమునందే తాత్పర్యము కలదని తెలియవలయును. ఇట్లే దశోపనిషత్తులు షడ్లింగ సహితముగ అద్వైత

బ్రహ్మమునందే పర్యవశించుచున్నవి. ఈ విధముగ శ్రవణము చేసినచో ప్రమాణగత సంశయములు నివృత్తి గలుగును. అసంభావన వేదాంతార్థ మననముచే అసంభావన యనెడి అదార్ఢ్య హేతువు నివర్తించును. దేహాత్మత్వ, జగత్సత్యత్వ బుద్ధిరూప విపర్యయభావన చిత్తైకాగ్రరూప నిధిధ్యాసనము వలన నివర్తించును.

ఇట్లు ప్రమాణ ప్రమేయ విపర్యయ భావనలు తొలగించుకొనినచో, **"అయమాత్మా బ్రహ్మ"** యను నిశ్చయజ్ఞానము కలుగును. ఈ నిశ్చయ జ్ఞానమే బ్రహ్మసాక్షాత్కార మందురు.

ఓం తత్ సత్

## అన్వయ వ్యతిరేకములు, ఆధారాధిష్టాన భ్రాంతులు, అధ్యాస

త్రాడు యొక్క నిజరూపము తెలియనపుడు దానియందు పాము, నీటిధార, నేల పగులు అను మూడు భ్రాంతులు కలుగుచున్నవి. ఈ మూడును ఒకదానికొకటి పరస్పరమగును, త్రాటి తోడను వ్యతిరేకములగును. త్రాడే మూటియందున అన్వయమగుచున్నది. త్రాటియందు పాము తోచినపుడు, నీటిధారగాని, నేల పగులుగాని తోచుటలేదు. నీటిధార తోచినపుడు, పాముగాని, నేల పగులుగాని తోచుటలేదు. నేల పగులు తోచినపుడు, పాముగాని, నీటిధారగాని తోచుటలేదు. కాన నీ మూడును పరస్పర వ్యతిరేకములనబడును. ఈ మూడు భ్రాంతులు గలుగక పూర్వముగాని, కలిగిన పిదపగాని, నశించిన తర్వాతగాని, త్రాటియందీ మూటియొక్క వ్యవహారిక పారమార్థికాత్యంతా భావమున్నది. కాన యీ మూడును త్రాటికి వ్యతిరేకములు. భ్రాంతి కాలమందు "ఇది పాము" "ఇది నీటిధార" "ఇది నేలపగులు" అను మూడింటి యందును, త్రాటి యొక్క "ఇది" యను సామాన్యాంశము తెలియబడుచున్నది. కాన త్రాటికా మూటియందు నన్వయమున్నది. అట్లే ఆత్మస్వరూపము తెలియనందున, అధిష్టానాత్మయందు, జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడు భ్రాంతులు కలుగుచున్నవి. వానికి పరస్పరము అధిష్టానాత్మతోడను, వ్యతిరేకత కలదు. ఆత్మకీ మూడవస్థలయందు నన్వయమున్నది. జాగ్రత్త ప్రతీతమగునపుడు, స్వప్న సుషుప్తులు కలుగుటలేదు. స్వప్నము తోచినపుడు, జాగ్రస్వప్నముల భావములగుచున్నవి. కాన నీ మూడవస్థలు పరస్పర వ్యతిరేకములనబడును. అధిష్టానమగు నీయాత్మ యీ మూడవస్థలయందను స్యూతముగనుండి ప్రకాశించుచుండుటచే, దానికీ మూడవస్థలయందు అన్వయమున్నది.

ఆధారాధిష్ఠాన భ్రాంతులు:- త్రాటియందు సామాన్యాంశము, విశేషాంశము, కల్పిత విశేషాంశము అను మూడంశములు గలవు. అధికదేశ, అధిక కాలములయందును వర్తించి యుండునది సామాన్యాంశ మనబడును. అల్పదేశ, అల్పకాలముల యందను

వర్తించుననని విశేషాంశ, కల్పిత విశేషాంశము లనబడును. "ఇది త్రాడు" అను దానియందు "ఇది" అనునది భ్రాంతికి పూర్వకాలమందున, భ్రాంతి కాలమందున, భ్రాంతి నశించిన పిదపను తెలియబడుచున్నది. కాన "ఇది" యనునది సామాన్యాంశ మనబడును. దీనినాధారమనియు నందురు. పురి, పీచు మొదలగునవి త్రాటి యొక్క విశేషాంశములనబడును. ఇవి భ్రాంతిలేని కాలమందే తెలియబడును. కాని భ్రాంతి కాలమున తెలియబడుటలేదు. దీని విశేషాంశ ప్రతీతి వలన భ్రాంతి నివృత్తి యగుచున్నది. కాన నిది విశేషాంశ మనబడును. దీని నధిష్టానమనియు నందురు. పాము, నీటిధార, నేలపగులు కల్పిత విశేషాంశములగును. ఇవి త్రాటి యొక్క అజ్ఞాన కాలమందున మాత్రమే తెలియబడుచున్నవి. జ్ఞాన కాలమందు యివి త్రాటికంటె భిన్నముగ తెలియబడుటలేదు. కాన నివి కల్పిత విశేషాంశము లనబడును. వానిని భ్రాంతి యనియు నందురు. అట్లే అధిష్టానాత్మ యందు జ్ఞానముచే "సామాన్యాంశము విశేషాంశము, కల్పిత విశేషాంశము" అను మూడంశము లారోపించ బడుచున్నవి. "జాగ్రత్త యందున్నాను, స్వప్నము నందున్నాను, సుషుప్తియందున్నాను" అను నిటువంటి ఆత్మయొక్క "ఉన్నాను" అను సత్ లక్షణము భ్రాంతి కాలమందున ప్రతీత మగుచున్నది. "సద్రూపుడనై యున్నాను, చిద్రూపుడనై యున్నాను, ఆనందరూపుడనై యున్నాను, అద్వితీయుడనై యున్నాను" అను నిటువంటి "ఉన్నాను" అను సత్ లక్షణము భ్రాంతి నివృత్తి కాలము నందునను ప్రతీతమగుచున్నది. కాన "ఉన్నాను" అను ఆత్మయొక్క సద్రూపము సామాన్యాంశ మనబడును. దీని నాధారమని యందురు. ఆనందము, అద్వితీయము మొదలగు ఆత్మయొక్క విశేషణములు, విశేషాంశ మనబడును. భ్రాంతి కాలమున నివి ప్రతీతముకావు. వాని ప్రతీతి వలన భ్రాంతి నివృత్తి యగుచున్నది. కాన, నివి విశేషాంశము లనబడును. బ్రహ్మాభిన్నమగు నాత్మ యొక్క అజ్ఞానకాలమున నివి ప్రతీత మగుచున్నవి. "నేను బ్రహ్మమును" అను జ్ఞానకాలమున నివి ఆత్మ కంటె భిన్నముగ ప్రతీత మగుటలేదు. కాన అవస్థాత్రయ రూపమగు ప్రపంచము కల్పిత విశేషాంశ మనబడును. దీనిని భ్రాంతి యనియునందురు. భ్రాంతియే అధ్యాస మనబడును.

అధ్యాసలు:- భ్రాంతి జ్ఞానమునకు విషయమును, భ్రాంతి జ్ఞానమును గూడి యధ్యాస యనబడును. ఇది జ్ఞానాధ్యాసయనియు, అర్థాధ్యాసయనియును రెండు విధములు. ఒక వస్తువునందు మరియొక వస్తువు యొక్క భ్రాంతి అర్థాధ్యాస యనబడును. అధ్యస్థ వస్తువు యొక్క జ్ఞానము, జ్ఞానధ్యాస యనబడును. ఇందు అర్థాధ్యాస కేవల సంబంధాధ్యాస యనియు, సంబంధసహిత సంబంధి యొక్క యధ్యాసయనియు, కేవల ధర్మాధ్యాసయనియు, ధర్మ సహితధర్మి యొక్క యధ్యాసయనియు, అన్యోన్యాధ్యాసయనియు, అన్యతరా ధ్యాసయనియు, ఆరు విధములు. ఆత్మ సత్యమగుటచే, అదియనాత్మ పదార్థములంద ధ్యస్తముగాదు. కాని దాని తాదాప్త్య సంబంధము మాత్రము అనాత్మ వస్తువుల యంద ధ్యసింపబడుచున్నది. కాన అనాత్మ పదార్థముతో నాత్మకుగల తాదాత్మ్య సంబంధము, సంబంధాధ్యాస యనబడును. ఆత్మయందనాత్మ సంబంధమును అనాత్మ యొక్క స్వరూపమును నధ్యస్థములగు చున్నవి. కావున ఆత్మతో అనాత్మకు గల సంబంధము, సంబంధసహిత సంబంధి యొక్క అధ్యాస యనబడును. స్థూలదేహము యొక్క శ్వేత పీతాది ధర్మములును, ఇంద్రియముల యొక్క దర్శన స్పర్శనాది ధర్మములను మాత్రమే ఆత్మయంద ధ్యస్థములగు చున్నవి. కాని దేహేంద్రియముల ధ్యస్థములగుట లేదు. కావున నిది కేవల ధర్మాధ్యాస యనబడును. అహంకార ధర్మములైన కర్తృత్వ భోక్తృత్వాదులును, అహంకారము యొక్క స్వరూపమును కలిసి ఆత్మయంద ధ్యస్థములగు చున్నవి. కావున నిది ధర్మసహిత ధర్మి యొక్క యధ్యాస మనబడును. ఆత్మయందనాత్మ పదార్థములకు స్వరూపము చేతను, అనాత్మ పదార్థముల యందాత్మకు సంసర్గముచేతను అధ్యాసము తెలియబడుచున్నది. కాన ఇది ఆన్యోన్యాధ్యాస యనబడును. కావున నిది అన్యతరాధ్యాస యనబడును.

"సత్తు, చిత్తు, ఆనందము, అద్వితీయము" అను నీ నాలుగును ఆత్మ లక్షణములగును. "అసత్తు, జడము, దు:ఖము, సద్వితీయత్వము" అను యీ నాలుగును అనాత్మ లక్షణములగును. అనాత్మ లక్షణములగు దు:ఖము, సద్వితీయత్వము

ఆత్మయందు స్వరూపత: ఆరోపితమై ఆత్మయొక్క ఆనందాద్వితీయ లక్షణములను మరుగుపరచుచున్నవి. అందువలననే అజ్ఞాని "నేనున్నాను" అను సల్లక్షణమును "నేను చేతనుడను" అను చిల్లక్షణమును, ఆత్మయందు తెలియుచున్నాడు. కాని "నేనానందస్వరూపుడను, అద్వితీయుడను" అని తెలియుటలేదు. "నేను దు:ఖిని, ప్రతి శరీరం భిన్నుడను" అని తెలియబడుచున్నాడు. అట్లే ఆత్మతో అనాత్మలగు అహంకారాదులకు గల కల్పిత సంబంధముచే ఆత్మయొక్క సల్లక్షణ, చిల్లక్షణములను అనాత్మలగు నహంకారాదుల యొక్క సల్లక్షణ, జడలక్షణములను మరుగు పరచుచున్నది. అందువలననే అజ్ఞాని అహంకారాదులను దు:ఖస్వరూపములనియును, సద్వితీయము లనియును తెలియుచున్నాడు. కాని యవి అసత్యములనియును, జడములనియును తెలియుటలేదు. అవి సత్యములనియు, జ్ఞానస్వరూపములనియు తెలియుచున్నాడు. ఈ విధముగా అవస్థాత్రయ లక్షణములు, స్వరూపముచే నాత్మయందును, ఆత్మ లక్షణములు సంసర్గముచే అవస్థాత్రయమునందున, కల్పితములై తోచుచున్నవి. నాయందు కల్పితమై తోచు అవస్థాత్రయము నాచేతనే ప్రకాశింపబడుచున్నది. కాన నాయవస్థాత్రయమునకు సాక్షినగుదును. అవస్థాత్రయమును, వాని వికారములును వాని నెరింగెడి నన్నెంతమాత్ర మంటవు. ఈ మూడవస్థలొకదాని యందొకటియును లేదు. ఇవి ఆత్మయందును లేవు. కాన నివి అసత్తనబడెను. ఈ అవస్థాత్రయమునందు వానికధిష్టానముగ నుండుటచే నీవు సద్రూపుడవగుదువు. అవస్థాత్రయము నాచే తెలియబడుచున్నవి. కాన నది జడమగును. అవస్థాత్రయము నెరుంగుచుండుటచేత నీవు చిద్రూపుడవగుదువు. అవస్థాత్రయము నీయందు కల్పితమై తోచు చుండుటచేత అది దు:ఖరూపమగును. అవస్థాత్రయములందు నిరతిశయ ప్రేమ స్వరూపుడవై స్థిరరూపమున నుండుటచేత నీవానందస్వరూపుడవగుదువు. అవస్థాత్రయం సజాతీయ, విజాతీయ, స్వగత భేదములు గలది యగుటచేత నది సద్వితీయమగును. సజాతీయ, విజాతీయ, స్వగతభేదములు లేనివాడు అగుట చేత నీవు అద్వితీయుడవు అగుదువు. అవస్థాత్రయము పరిణామవంతమగుట చేత అది వికారవంత మగును. అవస్థాత్రయమున కధిష్టానమై నిర్వికారముగ నుండుటచే నీవు కూటస్థుడవగుదువు.

అవస్థాత్రయము నీయందధ్యస్థమై నాచే ప్రకాశింపబడుటచే అది సాక్ష్యమనబడును. అవస్థాత్రయమున కధిష్టానమై ఉదాసీనముగనుండి, అధ్యస్థ అవస్థాత్రయమును ప్రకాశింపచేయుచుండుటచేత నీవు సాక్షివగుదువు. ఈ విధముగ అవస్థాత్రయము జడము, దు:ఖము, సద్వితీయము, వికారవంతము, సాక్ష్యము నగును. నీవు సద్రూపుడవు, చిద్రూపుడవు, ఆనందరూపుడవు, అద్వితీయుడవు, కూటస్తుడవు, సాక్షివియు నగుదువు. జాగ్రదవస్థయందు శ్రోత్రియ బ్రహ్మనిష్టుడగు సద్గురువు వలన వేదాంతశాస్త్రమును శ్రవణము చేయుటచేత, అవస్థాత్రయ విచారణచేత అంత:కరణమున బ్రహ్మాకార జ్ఞానవృత్తి ఉదయించిన, ఆ విశేషజ్ఞానమే తురీయమనబడును.

ఓం తత్ సత్.

# ఉపనిషత్తులు:- అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి మహావాక్యములు

**శ్లో॥ "ఇష్ట ప్రాప్త్య నిష్ట పరిహారయో: అలౌకికం,**
**ఉపాయం యోగ్రంధ: వేదయతి సవేద:**
**అలౌకిక పదేన ప్రత్యక్షానుమానే వ్యావర్త్యేతే ॥**

వేదం అంటే ఇష్టప్రాప్తిని, అనిష్టపరిహారాన్ని సాధించడానికి అలౌకికమైన ఉపాయాన్ని చెప్పే గ్రంథమని సాయనాచార్యుల వారు తైత్తిరీయ సంహితాభాష్యమునందు వివరించి యున్నారు. ఉపనిషత్తులు వేదాలకు గమ్యము, పరమార్ధము అగుచు వేదాలకు తలమానికములై యున్నవి. ఋగ్వేదము ఇరువదియొక్క శాఖలుగను, యజుర్వేదము నూటతొమ్మిది శాఖలుగను, సామవేదము వేయి శాఖలుగను, అధర్వవేదము ఏబది శాఖలుగను విభజింపబడినవి. ఈ విధముగ నాలుగు వేదములకు ఒక వేయిన్నూట యెనబది శాఖలేర్పడెను. ఒక్కొక్కశాఖ కొక్కక్క ఉపనిషత్తు కలిగి యుండెను. కాన నీ యుపనిషత్తులు ఒకవేయి నూట యెనబది యని తెలియబడుచున్నది. తత్త్వమును తెలియజేయునవి గనుక వానికి వేదాంతములనియు, వేద శిరస్సులనియు నామాంతరము గలదు. వానిలో ముఖ్యమైనవి నూటయెనిమిది యుపనిషత్తులు. వీటన్నింటిని హనుమంతునకు శ్రీరామచంద్రుడు భోదించినట్లు తెలియబడుచున్నది. వీనిలోగడ దశోపనిషత్తులు మిగుల శ్రేష్టములైనవి. ఋగ్వేదములోని ఐతరేయోపనిషత్తు **"ప్రజ్ఞానం బ్రహ్మ"** అను విధి మహావాక్యమును బోధించుచున్నది. యజుర్వేదములోని బృహదారణ్యకోపనిషత్తు **"అహం బ్రహ్మాస్మి"** యను ననుభవ మహావాక్యమును భోదించుచున్నది. సామవేదములోని ఛాందోగ్యోపనిషత్తు **"తత్త్వమసి"** యను యుపదేశ వాక్యమును భోధించుచున్నది. అధర్వవేదములోని మాడూక్యోపనిషత్తు **"అయమాత్మా బ్రహ్మ"** యను సాక్షాత్కార మహావాక్యమును బోధించుచున్నది. ఈ నాలుగు మహావాక్యములు ఆకాంక్ష జ్ఞానము, యోగ్యతాజ్ఞానము, తాత్పర్యజ్ఞానము, ఆసత్తి యనెడి

చతుర్విధ సహకారులతో కూడినవై అఖండ బ్రహ్మతత్త్వమును బోధించుచున్నవి. ఏ పదము తన యొక్క అర్థాన్వయము సిద్ధించుట కొరకు ఇతర పదములను గోరుచుండునో, ఆ పదముయొక్క జ్ఞానమాకాంక్షా జ్ఞానమనబడును. ఒక పదార్థమునకు మరియొక పదార్థముతోగల సంబంధము యోగ్యత యనబడును. ప్రకరణానుసారమగు జ్ఞానము తాత్పర్య జ్ఞానమనబడును. తత్-త్వం పదార్థముల శోధించి, మహావాక్యముల శ్రవణమువలన, అనావృతములగు శోధిత పదార్థములయొక్క స్మృతి గలుగుచున్నది. ఈ స్మృతియే యాసత్తి యనబడును. యజుర్వేదములోని బృహదారణ్యకము నందు చెప్పబడిన **"అహం బ్రహ్మాస్మి"** అను అనుభవ మహావాక్యమునందుగల **"అహం"** పదముయొక్క అర్థము సర్వదేశముల యందున, సర్వకాలములయందున, సమస్త వస్తువులయందున, అపరిచ్ఛిన్నమై వ్యాపించియుండిన పరమాత్మ మాయాకల్పితమైన జగత్తునందుగల విద్యాధికారులగు మనుష్య శరీరములయందు వుండిన అంత:కరణములతో, తాదాత్మ్య సంబంధము గలదియై "నేను, నేను" అని వ్యవహరించు చున్నది. ఇందు సర్వవ్యాపకమై నిర్వికారముగనున్న శుద్ధచైతన్యము నేననజాలదు. జడమగు అంత:కరణము గూడ నేననజాలదు. ఈ చిజ్జడములయొక్క తాదాత్మ్య సంబంధమువలన అహంవృత్తి కలుగుచున్నది. ఈ యహంవృత్తియందే నేనను ప్రతీతి గలుగుచున్నది. కాన **"అహం బ్రహ్మాస్మి"** అను మహావాక్యమునందుగల "అహం" పదముయొక్క వాచ్యార్థము అంత:కరణవృత్తి విశిష్ట చైతన్యమగును. ఆ వృత్తి విశిష్ట చైతన్య మహంకార మనబడును. ఈ అహంకారమునకు బ్రహ్మముతో నేకత్వము సంభవింపదు. కాన అహంకారము నందు గల జడభాగమైన అంత:కరణ వృత్తిని పరిత్యజించి, చైతన్య భాగమును గ్రహించవలెను. ఆ చైతన్యమే సాక్షి యనబడును. ఆ సాక్షి చైతన్యమునకు బ్రహ్మచైతన్యముతో నేకత్వము సంభవించు చున్నది. కాన అహం పదమునకు సాక్షి చైతన్యము లక్ష్యార్థమగును. సర్వోపాధులతో గూడిన చైతన్యము బ్రహ్మపదమునకు వాచ్యార్థము. సర్వోపాధులను విడిచినచో, వాని కధిష్ఠానమగు శుద్ధచైతన్యము బ్రహ్మ శబ్దమునకు లక్ష్యార్థమగును. ఈ విధముగ అనహంకారసాక్షియైన

ప్రత్యక్ చైతన్యము బ్రహ్మచైతన్యమే యగునని "అస్మి" యను పదముచే నేకత్వ రూపమగు ననుభవమీ మహావాక్యమునందు చెప్పబడెను.

అహంకారమునకు కూటస్థాత్మము విలక్షణమగును. లక్షణము విశేషణమనియు, నుపలక్షణమనియు రెండు విధములు. అందు విశేషణము లక్ష్యస్వరూపమును తెలియజేసి, లక్ష్యస్వరూపముతో సంబంధింపక యుండును. అహంకారము కూటస్థాత్మకు ఉపలక్షణమగును. కాని విశేషణము గాదు. కాన అహంకారము లక్ష్య స్వరూపమగు కూటస్థాత్మ ననుసంధించియుండి, లక్ష్యజ్ఞానమును కలుగజేసి, తాను లక్ష్యమైన కూటస్థాత్మ యందు కల్పింపబడిన దగుటచే, కూటస్థాత్మ జ్ఞానము కలుగగనే నశించిపోవుచున్నది. కావున కూటస్థాత్మయొక్క యద్వితీయత్వమునకు భంగము కలుగదు. అహంకారము నవలంభించియే అఖండైక పరబ్రహ్మ జ్ఞానము తెలుసుకొను చున్నాము.

**"తత్త్వమసి"** మహావాక్యము జీవేశ్వరులకిద్దరకు ఏకత్వమును బోధించుచున్నది. వాచ్యార్థులైన జీవేశ్వరులు పరస్పర విరుద్ధ ధర్మములు గల వారగుటచే వారికేకత్వము సంభవింపదు. కావున తత్పదవాచ్యార్థమగు నీశ్వరుని యందుగల విశేషణభాగమైన యాభాస సహిత మాయను, మాయాకృతమగు సర్వశక్తి సర్వజ్ఞత్వాది ధర్మములను విడిచి విశేష్యమైన శుద్ధచైతన్య భాగమును గ్రహించవలయును. అట్లే త్వంపద వాచ్యార్థమగు జీవునియందుగల విశేషణ భాగమైన, యాభాస సహితమగు అవిద్యను, అవిద్యాకృతమగు అల్పశక్త్యల్పజ్ఞత్వాది ధర్మములను విడిచి, విశేష్యమైన సాక్షి చైతన్యమును మాత్రము గ్రహించవలెను. ఈవిధముగ జీవేశ్వరులయందు గల విశేషణ భాగములను విడిచి విశేష్యమైన చైతన్య భాగమును గ్రహించినచో "తత్త్వమసి" యను మహావాక్యము నందు చెప్పబడిన జీవేశ్వరైక్యము సంభవించుచున్నది. ఈ మహావాక్యములందు గల పదములకు సామానాధికరణ్య సంబంధమును, పదార్థములకు విశేషణ విశేష్యభావ సంబంధమును, పదపదార్థములకు లక్ష్యలక్షణభావ సంబంధమును గలదు. ఈ త్రివిధ సంబంధములు గల మహావాక్యము లఖండ బ్రహ్మతత్వమును బోధించుచున్నవి. ఇందు సామానాధికరణ్యము ముఖ్య సామానాధికరణ్యమనియు, బాధా సామానాధికరణ్య

మనియు రెండు విధములు.  ఘటాకాశము మహాకాశమేయైన విధమున, కూటస్థుడు బ్రహ్మమే యగుననునది ముఖ్య సామానాధికరణ్యమనబడును. పురుషుడు బాధించబడి స్థాణువే యైనట్లు సాభాసాంత:కరణము బాధింపబడి బ్రహ్మమేయగుచున్నదనునది బాధ సామానాధికరణ్యము అనబడును.  ఈ సామానాధికరణ్యా సంబంధముగల ప్రత్యక్పరమాత్మలకు విశేష్య విశేషణ భావ సంబంధము నెరుగవలయును. బ్రహ్మమునకు చిదాత్మ విశేషణమైనచో బ్రహ్మమునందుతోచెడి అనాత్మత్వ, పరోక్షత్వ భ్రాంతులు నివృత్తియగును.  ప్రత్యగాత్మకు బ్రహ్మము విశేషణమైనచో ప్రత్యగాత్మ యందు గల పరిచ్ఛిన్నత్వ, దు:ఖిత్వభ్రాంతులు నివృత్తియు యగును.  అట్లే పదములకును, పదార్ధములకును లక్ష్యలక్షణ భావసంబంధము సంభవించుచున్నది. ఆ లక్షణ జహల్లక్షణ యనియు, అజహల్లక్షణ యనియు, జహదజహల్లిక్షణ యనియు మూడు విధములగును.  ఇందు వాచ్యార్ధమును సంపూర్ణముగ విడిచి, వాచ్యార్థముతో సంబంధముగల మరియొక యర్ధమును గ్రహించుట జహల్లక్షణ యనబడును.  ఈ జహలక్షణ మహావాక్యములందు పొసగదు.  వాచ్యార్ధములో వాచ్యార్ధ సంబంధముగల మరియొక యర్ధమును గ్రహించుట అజహల్లక్షణ యనబడును.  ఈ యజహల్లక్షణ యును మహావాక్యముల యందు సరిపడదు.  వాచ్యార్ధమునందొక భాగమును విడిచి మరియొక భాగమును గ్రహించుట జహద జహల్లక్షణ యనబడును.  తత్త్వమస్యాది మహావాక్యములచే ప్రతిపాదింపబడెడి జీవేశ్వరులు పరస్పర విరుద్ధ ధర్మములుగల వారగుటచే వారికేకత్వము సంభవించుటలేదు.  కావున విరుద్ధ ధర్మములు గల జీవేశ్వరుల విశేషణములను త్యజించి, విశేష్యమైన చైతన్యమున కేకత్వము గలుగుచున్నది.  కావున జహద జహల్లక్షణచే మహావాక్యార్ధమైన బ్రహ్మాత్మల యేకత్వము నెరుంగవలయును. ఇట్టి సమ్యక్ జ్ఞానముచేత ననాదిగా బ్రహ్మము నాశ్రయించియున్న మూలాజ్ఞానము కార్యసహితముగా నాశమగుచున్నది.  అప్పుడఖండైక రసమగు బ్రహ్మము స్వయముగ ప్రకాశించుచున్నది.

ఓం తత్ సత్

# బ్రహ్మము తటస్థ స్వరూప లక్షణములు

ఏ ప్రమాణములకు ప్రమేయము కానిది, ఏ లక్షణము లేనటువంటి బ్రహ్మమును గురించి తెలిసికొనుట వీలులేని మాట. ఐనను దానియందు లక్షణములను కల్పించి, వానివలన లక్ష్యమగు బ్రహ్మము నెరుంగవలయును. అజ్ఞానకృతావరణ నివృత్తికొరకు శబ్ద ప్రమాణమంగీకరించ బడుచున్నది. బ్రహ్మమునందు కల్పింపబడిన లక్షణములు తటస్థ లక్షణము, స్వరూపలక్షణమని రెండు విధములు. లక్షణమందు అతివ్యాప్తి, అవ్యాప్తి, అసంభవాది దోషములున్నచో లక్ష్యము తెలియబడదు. దోషముగల లక్షణము, దుష్టలక్షణ మనబడును. తన లక్ష్యమును తెలియజేసెడి లక్షణము అన్యమునందు గూడ వర్తించినచో, ఆ లక్షణమతివ్యాప్తి దోషము గలదియగును. నాలుగు పాదములు గలది గోవు అని గోలక్షణము చెప్పినపుడు, నాలుగు పాదములు గోవునకే గాక గుఱ్ఱము మున్నగు జంతువులకు కూడ వర్తించును. కనుక ఆ లక్షణమతివ్యాప్తి దోషమగును. తన లక్ష్యమునందంతటను వర్తింపక, యేదేనియొక ప్రదేశమందు మాత్రమే వర్తించు లక్ష్మణమతివ్యాప్తి దోషమగును. తెల్లగానుండునని గుఱ్ఱము అని చెప్పునపుడా శ్వేతవర్ణ లక్షణము గుఱ్ఱము లన్నింటియందు ఉండుటలేదు. కాన శ్వేత లక్షణము అవ్యాప్తి దోషయుక్తమగును. అశ్యమునకు చెప్పబడిన లక్షణము ఆ లక్ష్యమునందు ప్రవర్తింపక యితరమునందు వర్తించు లక్షణము సంభవ దోషమగును. కొమ్ములు గలది గుఱ్ఱము అని చెప్పినపుడా శృంగత్వ లక్షణ మవశ్యమునందు లేదు. గుఱ్ఱమున కంటె భిన్నమగు గోవు మున్నగు వానియందు మాత్రముండును. కాననిది అసంభవదోష లక్షణమగును. దోషయుక్తమగు లక్షణములచేత, తన లక్ష్యము తెలియబడదు.

<u>బ్రహ్మముయొక్క తటస్థలక్షణము</u>:- దాని లక్ష్యమునందొక కాలమందు మాత్రమేయుండి, దాని లక్ష్యము నితరపదార్థముల నుండి వేరుచేసి తెలుపునది తటస్థ లక్షణమనబడును. కాకియున్నది రాముని యిల్లు అనునపుడు, రాముని గృహమునకు

కాకి తటస్థ లక్షణమగును. కాకి యెల్లప్పుడుండదు. కాని ఆ సమయమున నుండి రాముని గృహమును ఇతర గృహములనుండి వేరు చేసి చూపుచున్నది. బ్రహ్మమునకు సృష్టి, స్థితి, లయ కారణత్వము తటస్థ లక్షణమగును. **"యతోవా ఇమాని భూతాని జాయంతే, యే న జాతాని జీవంతి, యత్ప్రయంత్యభిసం విశంతి"** అను నిటువంటి శ్రుతులచేతను "జన్మాద్యస్యయత:" అనెడి సూత్రములచేతను, బ్రహ్మమునందు సృష్టి స్థితి లయములకు కారణత్వము చెప్పబడెను. ఈ కారణత్వము మాయాధిష్ఠాన కాలమందు మాత్రమే, బ్రహ్మమునందు తెలియబడుచున్నది. బ్రహ్మమునందు చెప్పిన ఈ కారణత్వము, సాంఖ్యులు చెప్పిన ప్రధానము నుండియు, నైయాయికులు చెప్పిన పరమాణువుల నుండి వేరుచేసి బ్రహ్మమును తెలుపుచున్నది. ఈ బ్రహ్మము స్థితి లయములకు మాత్రమే కారణమని చెప్పినచో, జగత్సృష్టికర్త మరియొకడుండునెడి సందేహము కలుగును. సృష్టి స్థితులు మాత్రమే చెప్పినచో, జగల్లయకర్త బ్రహ్మమునకంటె భిన్నముగ మరియొకడు కలడనెడి సందేహము కలుగును. ఈ సందేహముల నివృత్తికొరకు, సృష్టి స్థితిలయ కారణత్వము చెప్పబడెను. ఇట్లు బ్రహ్మము జగత్తున కభిన్న నిమిత్త ఉపాదన కారణమని సిద్ధించుచున్నది. జగత్కర్తృత్వముతో గూడిన జగదుపాదనాత్వము బ్రహ్మము యొక్క తటస్థ లక్షణము. బ్రహ్మము జగత్తునకు కేవలమొక ఉపాదానకారణమని చెప్పిన కొందరు ఉపాదానకారణము మాయయనియు, నిమిత్తకారణ మీశ్వరుని యందును చెప్పుచున్నారు. కాన మాయయందు ఉపాదాన లక్షణమున కతి వ్యాప్తి దోషము కలుగుచున్నది. శుద్ధబ్రహ్మమునందా యుపాదాన కారణత్వము లేకపోయినప్పటికి విశిష్టమగు బ్రహ్మమునందు గలదు. విశిష్టమునందు వుండు ధర్మములు, విశేషణ మందవశ్యముండును. **"మాయాంతు ప్రకృతిం విద్యాత్"** అని శ్రుతి కూడ చెప్పుచున్నది. ఈ అతివ్యాప్తి దోష నివారణ కొరకు లక్షణమందు జగత్కర్తృత్వము గూడ చెప్పబడినది. కర్తృత్వముచే తనయందుండును గాని, జడమైన మాయయందుండదు. ఈశ్వరుడు పాదానకారణమని చెప్పక, కర్తయని మాత్రమే చెప్పు నైయాయికుల వాదన యందతి వ్యాప్తి దోష నివారణకు బ్రహ్మమునందు

జగత్కర్తృత్వము, ఉపాదాన కారణత్వము చెప్పబడెను. శ్రుతియందు **"తదైక్షత బహుస్యాం ప్రజాయే యేతి" "సోకామయత బహుస్యాం ప్రజాయే యేతి"** సద్రూపమగు బ్రహ్మ మనేకమగుదునని సంకల్పించినట్లు చెప్పబడెను. బ్రహ్మము శుద్ధసత్వ ప్రధాన మాయోపాధికుడై జగత్తునకు, నిమిత్తకారణమును, తమఃప్రదాన ప్రకృతినిగూడి ఉపాదాన కారణమగుచున్నాడు. కాన నీ సృష్టి స్థితిలయములు బ్రహ్మయొక్క తటస్థ లక్షణమగును. ముండకోపనిషత్తు ప్రథమ ముండకము ప్రధమ ఖండమున:-

**శ్లో॥ యధోర్ణనాభి: సృజతే గృహ్ణతేచ - యధాపృధి వ్యామోషదయ: సంభవంతి ।**
**యధాసత: పురుషాత్ కేశలోమానిత ధాక్షరాత్ సంభవతీహ విశ్వమ్ ॥**

అర్థము:- సాలెపురుగు ఎలా తనగూడును తనలోనుండే వెలికితీసి తనలోకే తీసికొంటుందో, భూమినుండి మూలికలన్ని ఎలా ఉద్భవిస్తాయో, మానవుడి తలమీద శరీరం మీదా ఏ ప్రయత్నము లేకనే వెంట్రుకలు ఎలా పెరుగుతాయో అలాగే ఆ అక్షర తత్త్వం నుండి ఈ విశ్వముత్పన్న మగుచున్నది.

బ్రహ్మముయొక్క స్వరూపలక్షణము:- తన లక్ష్యముయొక్క స్వరూపమేయైయుండి అన్యపదార్థములను తన లక్ష్యమునుండి వేరుచేయు లక్షణము స్వరూప లక్షణ మనబడును. మనుజునకు మనుష్యత్వము స్వరూపలక్షణము. అద్వైత సిద్ధాంతము నందు జాతి వ్యక్తులకు తాదాత్మ్యని సంబంధమున్నది. అట్లే సత్యజ్ఞానానందములు బ్రహ్మమునకు స్వరూప లక్షణము. అవి బ్రహ్మము యొక్క స్వరూపమయమై ఆ బ్రహ్మమును అసజ్జడ దు:ఖరూపమగు జగత్తునుండి వేరు చేయుచున్నది. కాననివి బ్రహ్మము యొక్క స్వరూప లక్షణము లనబడెను. వాస్తవముగ సత్యజ్ఞానానందములు బ్రహ్మము యొక్క స్వరూపమేయైనను, వానికిని బ్రహ్మమునకును కల్పిత భేద మంగీకరించబడుచున్నది. దానివలన బ్రహ్మము లక్ష్యమనియు, సచ్చిదానందములు లక్షణములనియు చెప్పబడుచున్నవి. ఇందు సత్యపదమునకు బాధాభావ విశిష్టచైతన్యము వాచ్యార్థము. కేవల చైతన్యము లక్ష్యార్థము. జ్ఞానపదమునకు వృత్త్యవచ్ఛిన్న చైతన్యము వాచ్యార్థము. కేవల చైతన్యము లక్ష్యార్థము. ఆనంద పదమునకు ప్రియమోద ప్రమోదాది

వృత్త్యవచ్ఛిన్న చైతన్యము వాచ్యార్థము. కేవల చైతన్యము లక్ష్యార్థము. కాన ఆ సత్య జ్ఞానానంద పదముల లక్ష్యార్థము బ్రహ్మమే యగుటచే వానికి వాస్తవమైన బేధము లేదు. ఉపాధికృత కల్పిత బేధము ప్రతీతమగుటచే వానికి లక్ష్యలక్షణ భావము చెప్పబడినది. బ్రహ్మమునకు జడత్వము, అనిత్యత్వము నివారణ కొరకు సత్యపదమును, నైయాయికులు చెప్పు సత్తాజాతి యందతివ్యాప్తి దోష నివారణకొరకు జ్ఞానపదమును, విషయజన్య సుఖమునందతి వ్యాప్తి దోష నివారణకూ ఆనంద పదమును ప్రయోగింప బడినవి. కావున సత్యజ్ఞానానందములు మూడును ఆ బ్రహ్మము యొక్క స్వరూప లక్షణములనబడెను. **"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ, ఆనందో బ్రహ్మ"** అని శ్రుతి. అనగా ఆ బ్రహ్మము **"సత్యము, జ్ఞానము, అనంతము, ఆనందము"** అని చెప్పెను. దేశకాల వస్తు పరిచ్ఛేదము లేనిది అనంతమనబడును. **"నవ్యాపిత్వా ద్దేశతోఽంతో, నిత్యత్వాన్నాపి కాలత: నవస్తుతోపి సార్వాత్మ్యా దానంత్యం బ్రహ్మణిత్రిధా"** అనగా బ్రహ్మము సర్వదేశములయందు వ్యాపించియుండుట వలన దానికి దేశముచే నంతము లేదు. నిత్యమగుటవలన దానికి కాలముచేతను అంతము గలుగదు. సర్వాత్మ రూపమగుట వలన అది వస్తువు చేతను అంతమొందదు. ఆ బ్రహ్మము దేశకాల వస్తువులచే నంతమొందదు, గావున ననంతమనబడెను. **"ఆనందదాయ: ప్రధానస్య"** ఆనందము, సత్యము, జ్ఞానము అనునవి బ్రహ్మము యొక్క స్వరూపములైయుండి బ్రహ్మమును గోచరింపజేయుచున్నవని చెప్పబడెను; ఇట్లు శ్రుతిసూత్రములచే, బ్రహ్మమునకు సత్యజ్ఞానానంద స్వరూపము సిద్ధించుచున్నది. గాన ఆ సత్య జ్ఞానానందములు బ్రహ్మయొక్క స్వరూపలక్షణ మనబడెను. ఈ సచ్చిదానంద లక్షణములు గల బ్రహ్మమునందు అజ్ఞానముచే నామరూపాత్మకమగు జగత్తు కల్పించబడెను. ఈ కల్పిత జగద్విశిష్ట బ్రహ్మము నందు **"ఆస్తిభాతి ప్రియం నామం రూపము"** అనెడు పంచలక్షణములు తెలియబడుచున్నవి. ఇందు అస్తిభాతిప్రియం ఈ మూడును బ్రహ్మలక్షణములు నామరూపములు రెండును మిధ్యా జగత్తు యొక్క లక్షణములు ''జగత్తున్నది'' అనుదాని యందు ''ఉన్నది'' అను సద్లక్షణము

బ్రహ్మముయొక్క స్వరూపము. జగత్తను నామమును, జగత్తు యొక్క రూపమును, అసత్తైవ మిధ్యారూప జగత్తు యొక్క లక్షణములు. "జగత్తు ప్రకాశించున్నది". అను దానియందు ప్రకాశించుచున్నదను చిద్లక్షణము బ్రహ్మముయొక్క స్వరూపమగును. జగత్తుయొక్క నామరూపములు, జడమగు జగత్తు యొక్క లక్షణములగును. "జగత్తు ప్రియమైనది" అనుదాని యందు "ప్రియమైనది" అను ఆనందలక్షణము బ్రహ్మము యొక్క స్వరూపమగును. జగత్తుయొక్క నామరూపములు దు:ఖరూపమగు జగల్లక్షములగును. ఈ సత్యజ్ఞానానంద లక్షణములచే లక్ష్యమగు బ్రహ్మము నెరుంగవలెను. బ్రహ్మమునందు తటస్థ లక్షణతయా నామరూపాత్మకమగు జగత్తుకల్పితమైనట్లు, ఆత్మయందు కరచరణాద్యయవ యుక్తమై మ్రోడువలె కన్పించు స్థూలదేహము, దాని యందున్న ఇంద్రియ ప్రాణాంత:కరణంబుల సముదాయమగు సూక్ష్మశరీరము, ఈశరీరద్వయమునకు కారణమగు అజ్ఞానరూప కారణశరీరము కల్పించబడుచున్నవి.

ఓం తత్ సత్.

# స్వభావము

విశ్వమంతయు గుణమయము. గుణము మాయాకల్పితము. కాన విశ్వమునుండి నిర్గమించుటయే గుణవిముక్తికి మార్గమని కొందరు చెప్పెదరు. అందుకు ప్రథమ ఉపాయము స్వధర్మాచరణమే. కొందరు విశ్వమంతయు గుణమయమే కాని, విశ్వమంతయు మాయా కల్పితముగాదని యందురు. అందలి అహంకారము మాత్రము మాయా కల్పితమందురు. గుణవిముక్తి నొందుటకు ప్రపంచమునే త్యజింపవలసిన పనిలేదు. గుణాతీతుడుడగు భగవంతునితో ఏకతనొందిన చాలును. స్వభావము శాశ్వతముగాన, స్వధర్మమును శాశ్వతమే. కాన స్వధర్మాచరణమే మార్గమని కొందరు చెప్పెదరు. స్వధర్మము స్థూలముగ చతుర్విధమని, దానిని బట్టి చతుర్వర్ణములతో గూడిన భారతీయ సంఘ వ్యవస్థ ఏర్పడినదని గీత. 4-13. **"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః"** నుండి తెలిసికొనుచున్నాము.

**శ్లో॥ బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః॥** **భ.గీ.అ.18.శ్లో.41**

"బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, మరియు శూద్రులు యొక్క కర్మలు, తమతమ స్వభావముల నుండి పుట్టిన గుణములబట్టి వేరువేరుగా విభజింపబడినవని అర్థమగుచున్నది. స్వభావము నుండి గుణములు బుట్టినవా? లేక గుణముల నుండి స్వభావము పుట్టినదా? ఒకొకనికి ఒకొక స్వభావముండును. మరియు నాస్వభావ విభేదమునకు గుణములే కారణము కాన గుణములనుండియే స్వభావము పుట్టినదని చెప్పవలెను. ఇట్లేర్పడిన స్వభావము ధృఢపడి ఒక సంస్కారరూపము ధరించును. జన్మాంతరమున ఈ సంస్కారము నుండి గుణములు పుట్టును. కాన స్వభావమునకు కారణమైన గుణములచేత లేక స్వభావమే తమకు కారణమైన గుణముల చేత, కర్మ

విభజన జరుగునని చెప్పుకొన వచ్చును. పోతే బ్రాహ్మణాది నామములు జన్మను బట్టి వచ్చినవా? లేక కర్మను బట్టి వచ్చినవా? స్వభావమున బట్టి కర్మ, ఆకర్మను బట్టి బ్రాహ్మణాది నామములు అని స్పష్టముగనే, గీత, 18-42, 43, 44, శ్లోకములందున్న **"స్వభావజం కర్మ"** కలిగినవని తలంచవచ్చును. మరియొక చోట గీత. 18-48. "సహజం కర్మ'' అని చెప్పబడినది. సహజం కర్మ = జన్మతో వచ్చిన కర్మ. కొంతవరకు స్వభావమును బట్టి జన్మయుండును గాన ఆమేరకు జన్మను బట్టియు కర్మయుండునని మనమనుకొనవలెను. ఫలితార్థమేమన, ముఖ్యముగా స్వభావమును బట్టి కర్మ, గౌణముగ జన్మను బట్టి కర్మ యుండునని తలంచవచ్చును. లోకములో గొప్పవారికి సామాన్యులో, అధములో జన్మించుట చూచుచున్నాము. కాన జన్మనుబట్టి కర్మయను నియమము మిక్కిలి తక్కువగ మాత్రమే వర్తించును. అయినను దురదృష్టవశాత్తు ఇదియే భారతదేశమున రానురాను ఎక్కువగ గుర్తింపజేయబడినది. అందుచేత సంఘ వికాసమునకు దోహదము చేయ నుద్దేసించబడిన సంఘవ్యవస్థ, కృత్రిమ బేధములను కల్పించుటకే దారి తీసినది. మనదేశమే గాక అన్ని దేశములలోను మానవునకు స్వభావము మారుచుండినను, మానవ స్వభావమున, 1 సత్యప్రకారము 2 సత్యముతో గూడిన రజః ప్రకారము 3 తమస్సుతో గూడిన రజః ప్రకారము 4 రజస్సుతో గూడిన తమః ప్రకారము అను నాలుగు స్వభావములు గలవు - భగవంతుడు చాతుర్వర్ణమును సృజించెననిన, చాతుర్వర్ణము వెనుకనున్న చతుర్విధ స్వభావములను సృజించెనని అర్థము. ఈ ప్రకారములచే ఈశ్వరుడు సృజించినది, మరియు శాశ్వతమైనవి, యీ ప్రకారములు గాని, జన్మనుబట్టి వచ్చిన వర్ణములుగావు. ఇట్లు గ్రహించినచో సార్వకాలిక గ్రంథమగు గీత ప్రతిపాదించిన వర్ణవ్యవస్థయు ఒక కంటకము కాదని నిర్ణయించగలము. సరియగు జ్ఞానముతోను సరియగు ఆశయములతోను సత్కర్మ ననుష్ఠించినపుడు సిద్ధి బొందును. పరధర్మముకంటె స్వధర్మము శ్రేష్ఠమని గీత. 18-47 చెప్పుచున్నది. దీనికి కారణము పరధర్మమునకు ప్రేరణ బాహ్యము నుండి (కామము నుండి) వచ్చును. అందుచేత దాని ప్రవృత్తి యాంత్రికము. మరి స్వధర్మము సహజము గనుక నేను

చేయుచున్నానను అహంకారము దానిలో తక్కువగా నుండును. కాన అది జ్ఞానోదయమున కవకాశమిచ్చును. పులి చంపుచున్నను, అది దాని స్వధర్మముగనుక నెట్లు పాపము బొందదో, అటులనే స్వధర్మనిరతుడును అహంకార స్వభావమువేరు, అంతరాత్మ స్వభావము వేరు. మొదటిదానిని గూడ నిజమగు స్వభావము క్రిందనే జమకట్టి, అది ఆడించినట్లు ఆడగూడదు. దానిని అధిగమించవలెను. అధిగమించగలము గూడను. సహజకర్మ ననుసరించినపుడు దాని దోషము మనకంటకపోవుటయే గాక బుద్ధిని పావనము చేయును. (గీత. 18-5) మానసిక చేతనలో కర్మజ్ఞానములకు పొత్తు కుదరదేమో గాని, అది మానస దివ్య చేతనలో తప్పక కుదురును.

కొందరు జన్మను, కర్మను అంగీకరించుచు ఇట్లు చెప్పెదరు. బ్రాహ్మణ జన్మనెత్తి క్షత్రియకర్మ చేయుచున్నచో, జన్మత: బ్రాహ్మణుడనియు, కర్మత: క్షత్రియుడనియు, వైశ్యకర్మ జేయుచున్నచో, జన్మత: బ్రాహ్మణుడనియు, కర్మత: వైశ్యుడనియు, శూద్రకర్మ చేయుచున్నచో, జన్మత: బ్రాహ్మణుడనియు, కర్మత: శూద్రుడనియు, ఇట్లే అన్ని వర్ణములవారికి చెప్పవచ్చునని యందురు. జన్మ బ్రాహ్మణుడై శూద్రకర్మ చేయువారొకరు, జన్మ శూద్రుడై బ్రాహ్మణకర్మ చేయువారొకరు, యున్న వారిద్దరిలో సంఘము ఎవరిని ఎక్కువగా ఆదరించి గౌరవించుచున్నది? సహజముగ బ్రాహ్మణకర్మ చేయువానినే గౌరవించుచున్నదనునది నిర్వివాదాంశము. ఇప్పుడు కూడ జన్మకంటె కర్మకు ప్రాముఖ్యమిచ్చినట్లు గమనించెదము. **"సర్వోపాధి వినుర్ముక్తం చైతన్యంచ నిరస్తరమ్, తద్ బ్రహ్మోహమితి జ్ఞాత్వాకథం వర్ణాశ్రమీ భవేత్"** అని బ్రహ్మనిష్ఠులందురు.

**శ్లో॥ నకర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభు:।**
**న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥**

భిన్నమగు లోకవ్యవహారమంతయు వారి వారి స్వభావము ననుసరించియే జరుగుచున్నదని చెప్పుచున్నది. భారతదేశములో జన్మించిన మనము జన్మ స్వభావములను గుర్తించి జాతి వర్ణ వైషమ్యములతో మానవత్వమును గోల్పోక వారి

వారి బ్రాహ్మణ కర్మలకు తగిన ఆదరణము నిచ్చి, ఆనంద దాయకము, శోభాయమానము, ప్రశాంతయుతము, మంగళ ప్రదమగు దివ్యజీవితము గడుపుదుము గాక.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి:

# అష్టవిధ ప్రమాణములు

ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, అర్థాపత్తి, అభావము, ఐతిహ్యము, సంభవములనునవి అష్టవిధ ప్రమాణములందురు.

1) ప్రత్యక్షము:- విషయ చైతన్యమున కభిన్నమగు ప్రమాణ చైతన్యము ప్రత్యక్ష ప్రమయనబడును. నేత్రమునకు కనబడునట్టి నలుపు, ఎరుపు మొదలగు రంగులు, పొట్టి, పొడవు, లావు మొదలగు వివిధ రూపములు ప్రత్యక్ష ప్రమ యనబడును. ఈ రూపములు రూపాతన్మాత్రలుగాను, అగ్నిభూతము యొక్క గుణములుగాను ఉన్నవి. కాన అవి బ్రహ్మపదార్థము కాజాలవు. శృతి: **"యద్దృశ్యం తన్నశ్యం"** అన్నట్లు నేత్రేంద్రియమునకు గోచరించు వస్తువులన్నియు షడ్భావ వికారవంతములై నశించునట్టివి. పరబ్రహ్మము నేత్రములచే చూడబడడు గాన అప్రత్యక్షమనబడును. **"యచ్చక్షుషా నపశ్యతి యేనచక్షూంషి పశ్యతి"** దృష్టి చూడజాలనిది కాని దృష్టిని చూచేది మాత్రమే బ్రహ్మమని కేనోపనిషత్తు చెప్పుచున్నది.

2) అనుమానము:- అనుమితి ప్రమకు, కరణము అనుమానప్రమాణ మనబడును. **"అయం పర్వతో వహ్నిమాన్, ధూమవత్, యోయోధూమవాన్ సోఽగ్నిమాన్, యధామహానస:"** అనగా ఈ పర్వతమగ్ని గలది, ధూమముండుటవలన ఏది ఏది ధూమవంతమై యుండునో, అది యది అగ్నిగలది యగును. వంట యింటివలె. కార్యమునకు కారణము, కారణమునకు కార్యముగలదని వాదించుట అనుమాన మనబడును. ఇప్పుడు మాయ కారణముగాను అవిద్య కార్యముగాను ఉన్నది. కాన మాయా ప్రతిబింబమగు ఈశ్వరుడును, అవిద్యా ప్రతిబింబమగు జీవుడును వీరిద్దరు కారణోపాధిని కార్యోపాధిని పొందిన వారగుచున్నారు. పరబ్రహ్మమునకు కార్యకారణ ఉపాధులు రెండును లేవు. కాన పరబ్రహ్మ స్వరూపము అనుమానరహితమైన దనబడును.

3) ఉపమానము:- ఉపమిత ప్రమకు కరణ ముపమాన ప్రమాణమగును. సజాతీయ, విజాతీయ భేదములు కలిగియుండుట ఉపమానమనబడును. పరబ్రహ్మము అట్టి స్వజాతీయ విజాతీయ భేదశూన్యమై, తనకు రెండవది లేనిదిగా నున్నది గాన ఉపమాన రహితమైన దనబడును.

4) శబ్దము:- శాబ్దీప్రమయొక్క కరణము శబ్ద ప్రమాణ మనబడును. చెవుల చేత వినబడినట్టి శివ, కేశవ, హరిహరాది పారమార్థిక నామములు, నీలఘటము, ఘటమానయము అను లౌకిక వచనములు శబ్దము లనబడును. శృతి: **"ఆకాశస్య గుణశ్శబ్దః, నిశ్శబ్దో బ్రహ్మ ఉచ్యతే"** అన్నట్లు శబ్దములన్నియు ఆకాశముయొక్క గుణములు. పరబ్రహ్మము శబ్దము లేనిది కాన శబ్దరహిత మనబడును. **"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ"** మనస్సుగాని వాక్కుగాని పరబ్రహ్మమును తెలుపలేవని శ్రుతి చెప్పుచున్నది.

5) అర్థాపత్తి:- సంపాదక కల్పనకు హేతువగు సంపాద్యజ్ఞానము అర్థాపత్తి ప్రమాణ మనబడును. ఎచ్చటనైనను ఒకచోట ఉన్నది యని నిశ్చయించుటను అర్థాపత్తిప్రమ మనబడును. అయితే పరబ్రహ్మము సర్వమునందు నిండి పరిపూర్ణముగా నున్నదని చెప్పబడుచున్నది గాని ఒక్కచోటనే యున్నదని చెప్పబడుట లేదు. కాన అట్టి పరబ్రహ్మము అర్థాపత్తి రహితమైనది.

6) అభావము:- యోగ్యమగు అనుపలబ్ధి ప్రమాణమువలన గలిగెడి ప్రమ అభావప్రమ యనబడును. అసత్యమైన వస్తువు అభావమనబడును. అయితే పరబ్రహ్మము కాలత్రయమునందును నాశము లేక సత్యముగా నుండుటవలన అట్టి పరబ్రహ్మము అభావశూన్యమైనది యనబడును.

7) ఐతిహ్యము:- అప్పటప్పటికి నూతన నూతనముగా వచ్చుచు పోవుచు నుండుట ఐతిహ్య మనబడును. ఇట్లు జీవేశ్వర జగత్తులే ప్రళయ ప్రళయమునకు పలుమారు పుట్టుచు, చచ్చుచు నుండును గాని, పరబ్రహ్మము రాకపోకలు లేనిది గాన ఐతిహ్య రహితమైన దనబడును.

8) సంభవము:- ఒకటిగా కూడుట, మరల అనేక భాగములుగా భేదపడుట. ఇవి మాయాకార్యములే గాని పరబ్రహ్మమునందు లేవు. కాన పరబ్రహ్మము సంభవ ప్రమాణము లేనిది అనబడును. శ్రుతి కూడ యిట్లు చెప్పుచున్నది. (అమృత బిందూపనిషత్తు (10))

**మూ॥ ననిరోదో నచోత్పత్తి ర్నబద్ధో నచసాధక:।**
**ముముక్షు ర్నవైముక్త ఇత్యేషా పరమార్థతా ॥**

టీ॥ ప్రళయము లేదు, పుట్టుక లేదు. బద్ధుడైన జీవుడు లేడు. మోక్షేచ్ఛ గలవాడు లేడు, ముక్తుడు లేడు. ఇదియే పరమార్థము.

ద్వైతము వితథము, ఆత్మ యొకటే పరమార్థము అను నిశ్చయము గలిగినపుడు లౌకిక వైదిక వ్యవహారమంతయు అవిద్యా విషయవము అగుచున్నది. అప్పుడు ద్వైత అద్వైతములకు విరోధము లేదు. ద్వైతము లేనిదగుటచే నుత్పత్తి ప్రళయము లేవు.

**"యత్రహి ద్వైత మిషభవతి"** **బృ. 4-4-14**

ఎచట ద్వైతమున్నట్లు కనబడుచున్నదో,

**"య ఇహ నానేవ పశ్యతి"** **బృ. 6-4-9.**

నానాత్వము నెవరు చూచుచున్నారో,

**"ఆత్మై వేదం సర్వం"** **చాం. 7-25-2**

ఇది అంతయు నాత్మయే,

**"బ్రహ్మై వేదం సర్వం"** **ఉ-తా-7**

ఇది అంతయు బ్రహ్మయే,

**"ఏకమేవా ద్వితీయమ్"** **చాం. 6-2-1**

ఆత్మ ఒక్కటే, అద్వితీయుడు,

**"ఇదం సర్వం యదయ మాత్మా"** **బృ. 4-4-5**

ఇది అంతయు నేది పరిదృశ్యమాన మగుచున్నదో యది యీ ఆత్మయే.

మొదలగు శ్రుతులచేత ద్వైతాభావము సిద్ధమగుచున్నది. ఉన్న వస్తువునకు ఉత్పత్తి ప్రళయములు కలుగును. కాని లేనిదానికవి కలుగనేరవు. ఉత్పత్తి నాశములు ద్వైతప్రపంచ లక్షణములు. జనన మరణములు కారణము లేక కలుగవు. ఈ కారణము వీనికంటె భిన్నము కావలెను. అట్టి భిన్నకారణ మద్వైతమున నుండనేరదు. కాన ఉత్పత్తి ప్రళయముల సత్యములగుచున్నవి. మనస్సు వ్యాపారవంతమైనపుడే యిట్టి కల్పనలు సంభవించుచున్నవి. సుషుప్తియందు, చిత్తనిరోధము నందు యివి లేవు. కనుక నిరోధము, ఉత్పత్తి, బంధము, సాధకుడు, ముముక్షువు ముక్తుడు మొదలగు ద్వైతము మనో కల్పితములు. నిరోధాది సర్వవిశేష శూన్యమగు వస్తువు పరమార్థమని తాత్పర్యము.

ఓం తత్ సత్.

# జీవభావన

**మూ॥ జీవం కల్పయతే పూర్వం తతోభావాన్ పృథగ్విధాన్ ।**

**బాహ్యానాధ్యాత్మికాం శ్చైవ యధావిద్య స్తథాస్మృత: ॥ వై.ప్ర. 16.**

టీ॥ ఆత్మ ప్రథమమున జీవుని కల్పించుచున్నాడు. అటు పిమ్మట ఆ జీవుడు వాని వాని విజ్ఞానమున కనుకూలమగు స్మృతి గలవాడై బాహ్యములను ఆధ్యాత్మికములు అగు వేరు వేరు భావములను కల్పించుచున్నాడు.

సుఖము, దు:ఖము, జ్ఞానము మొదలగునవి ఆధ్యాత్మిక భావములు. ఇంద్రియ గ్రాహ్యములగు శబ్దాదులు బాహ్యములు. బాహ్య పదార్ధములచేత ఇచ్ఛాదులు సుఖదు:ఖములు మొదలగు ఆధ్యాత్మిక భావములు కలుగుచున్నవి. ఈ యాధ్యాత్మిక భావములచే తిరిగి బాహ్య వస్తువులు కలుగుచున్నవి. ఇట్లు బాహ్యాత్మిక భావముల కన్యోన్య కార్యకారణ భావము సంభవించుచున్నది. ఆత్మయే మాయావశముచేత ప్రపంచము నంతయు కల్పించి జీవభావమును పొందుచున్నాడు. జీవునిచే పూర్వా చరితమగు కర్మఫలము తిరిగి జీవత్వప్రాప్తి హేతువగుచున్నది. "నేను కర్తను" ఈ పని చేయుదును అని నిశ్చయించుకొని జీవుడు కర్మాచరణము చేయుచున్నాడు. అట్టి కర్మఫలానుభవము కొరకు తిరిగి జన్మము నెత్తుచున్నాడు. అట్టి ఫలము ననుభవించుచు "నేను సుఖముగా నున్నాను, దు:ఖ మనుభవించు చున్నాను అని తలంచుచున్నాడు. కర్తృత్వ కర్తృత్వాది విశేషస్వరూపుడగు జీవుడు రజ్జువునందు సర్పము వలె కల్పింప బడుచున్నాడు. ఈ జీవుడు స్వప్రయోజనమును కోరి అనేక విధములగు ప్రాణాది బాహ్యాధ్యాత్మిక భావములను కల్పించు కొనుచున్నాడు. తన విజ్ఞానమున కనురూపమగు స్మృతి గలుగుచున్నది. హేతు విజ్ఞానముచేత ఫలవిజ్ఞానము, అందువలన హేతు ఫలముల యొక్క స్మృతి, దానివలన క్రియాకారక ఫలభేదజ్ఞానములు, వీని వలన వీని స్మృతి, దానివలన తిరిగి దాని విజ్ఞానము. ఈ విధముగ అన్యోన్యము కార్యకారణ

సంబద్ధములగు బాహ్యాధ్యాత్మిక భావము లనేకములను జీవుడు కల్పించుకొనుచున్నాడు. ఈ విషయమొక యుదాహరణచే స్పష్టము కాగలదు. అన్నపానాదుల కుపయోగము గలుగుచుండగా తృప్తి గలుగుచున్నది. వాని యుపయోగము లేనపుడు తృప్తి లేదు. ఇది అందరకు తెలిసిన విషయమే. ఇందువలన భోజనాదికము తృప్తికి హేతుభూతమగు చున్నదను విజ్ఞానము ముందు కల్పింపబడుచున్నది. మరునాడు హేతువగు భోజనాదికము యొక్కయు, ఫలమగు తృప్తి యొక్కయు స్మృతిగలుగుచున్నది. ఈ స్మృతి ననుసరించి మరునాడన్న పానాదుల నాయత్తము చేసికొనవలయునను జ్ఞానము, ఆయత్తము చేసినదానిని భుజించుట, తిరిగి దానివలన తృప్తియు సంభవించుచున్నవి. అభిలషించబడిన తృప్తియను ఫలమున కుపకారకములగు పాకాది క్రియలు, తండులాదులు, అవి లభించుటకు తగిన ప్రయత్నము, మొదలగు విశేష విజ్ఞానములు కలగుచున్నవి. ఇట్లొకదానికొకటి హేతువై కల్పనల కన్నింటికిని హేతు హేతుమద్భావము పొసగునట్లు కనబడుచున్నది. ఇట్టి కల్పనలకు సరిపోవు బాహ్య పదార్థములు లేకుండనే యాంతరంగిక కల్పనలు సంభవించుచున్నవి. జీవునికి కర్మాచరణము, తత్ఫలభోగము, భోగార్థము, తిరిగి కర్మాచరణము, తత్ఫలభోగము ఈ విధముగ కర్తృత్వ భోక్తృత్వము లన్యోన్యము, హేతు హేతుమద్భావ పూర్వకముగ సంభవించుచున్నవి. ఆత్మకు చెందిన మాయ వలననే వికల్పములన్నియు కలుగుచున్నవి. ఈ మాయ దురత్యయము దానిచే నాత్మగూడ సంమోహితుడయినట్లు కనబడుచున్నాడు. మాయచే నాత్మకనేకత్వ మాపాదింపబడినను నతని ఏకత్వమునకు భంగము లేకున్నది. పరిదృశ్యమానమగు ఆత్మయొక్క యనేకత్వం చూపరుల అజ్ఞానకల్పితమగు దృష్టిలోపముచే కలిగినది గాని యతని యేకత్వ మనేకమగుటవలన కాదు. ఆత్మ సర్వకల్పనమున కాధారము. దానియందు కల్పింపబడిన భావములు. దానికంటె భిన్నములు కావు. రజ్జువునందు కల్పింపబడిన సర్పము రజ్జువు కంటె భిన్నము కాదు. తత్త్వము తెలిసికొనిన వానికి ప్రాణాదికల్పన లధిష్ఠానము కంటె భిన్నములు కావు. ఆత్మ సర్వానన్యము, సర్వ వికల్పాస్పదము, శుద్ధమని తెలిసికొనినవాడే వేదార్థమును కర్మజ్ఞానకాండ విభాగమును

గ్రహించగలడు. చలమనగా వికారాత్మకమగు శరీరము. అచలమనగా నిర్వికారమగు ఆత్మ. ఈ రెండే జీవన్ముక్తునికి ఆశ్రయములు. సర్వకర్మ సన్యాసియగుటచే నతడాచరింపదగు శ్రాద్ధాది కర్మలు లేవు. పితృకర్మలలో చేయబడు హోమములందు మంత్రాంతమున "స్వధా" యని చెప్పి హోమద్రవ్యము నగ్నియందు వదులుదురు. కామ్యముల సత్యమని వైరాగ్యమును పొంది, సమస్తగునేషణల నుండి తొలగి యుండును. వేదాంత విజ్ఞాన రహితులగువారు అద్వైత తత్త్వము తమ శ్రోత్రియత్వ బ్రాహ్మణ్య నాశనమునకు హేతువగుచున్నదని తలంచెదరు. అభయ నిమిత్తమగు తత్త్వజ్ఞానము మిధ్యాజ్ఞాన వశముచే వారలకు భయనిమిత్తమగుచున్నది. అభయమగు ఆత్మ తత్త్వమునందు భయ నిమిత్తమగు ఆత్మ నాశదర్శన శీలులగు వారవివేకులు. అధిష్టానమగు రజ్జువు లేనిదే ఆరోపితమగు సర్పభ్రాంతి కలుగనట్లే అధిష్ఠానమగు బ్రహ్మము లేనిదే మాయారోపితమగు జగద్భ్రాంతి సంభవము కాదు. బ్రహ్మము జగత్కారణమనుమాట కిదియే యర్ధము.

ఘటాకాశమునకును, మహాకాశమునకును భేదము లేదు. ఘటముచే నీయాకాశము క్రొత్తగ పుట్టింపబడలేదు. అటులనే ఆత్మయే జీవరూపమున భాసించునే గాని క్రొత్తగా జీవునియుత్పత్తి చేయలేదు. పరమాత్మ వలన ప్రపంచము, జీవులుత్పన్నమగుచున్నారను మాటకిదియే భావము. సృష్టిగాని యభివ్యక్తిగాని పరమార్ధము గాదు.

మానుష బుద్ధి విషయమై కార్యరూపమున మనస్సునకును, వాక్కునకును గోచరమగు దానినంతను నిషేధించుటచే శ్రుతి ఆత్మ యొక్క అజత్వమును, అదృశ్యత్వమును ప్రదర్శించుచున్నది. ఆత్మయందారోపితమైన సర్వము నిషేధించుట వలన ఆరోపితమగు దానికి స్వతంత్రముగా వస్తుత్వము లేదను నిశ్చయము వలన, ఉపాయముచే ప్రతిపాదితమగు నద్వితీయ బ్రహ్మము ఏకరూపము, కూటస్థము నిత్యదృక్స్వ భావమునని తెలిసికొనిన యుత్తమాధికారికి నితర సహాయము లేకయే ఆత్మతత్త్వము అజమై స్వయముగా ప్రకాశించును.

**శ్లో॥ జీవో బ్రహ్మాత్మనా జ్ఞేయో బ్రహ్మజ్ఞేయం జీవాత్మనా పరమ్ ।**
**ముక్తి స్తద్వైక్య విజ్ఞానాత్ ఇతి వేదాన్త డిణ్డిమః ॥** **వే.డి.15**

జీవుని బ్రహ్మస్వరూపునిగను, బ్రహ్మమును జీవస్వరూపునిగను గ్రహింపనగును. ఉభయుల ఐక్యవిజ్ఞానమునకే ముక్తి. అని వేదాంత డిండిమము. కాన జీవభావనవీడి బ్రహ్మభావన చేయుము.

ఓం తత్ సత్.

# గీతలోని కూటశ్లోక వివరణము

భగవద్గీత 9వ అధ్యాయము

అక్టోబరు 1986 సం॥ గీతావాణిలో ప్రకటితమైనది

**శ్లో॥ మయా తత మిదం సర్వం జగ దవ్యక్తమూర్తినా ।**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తే ష్వవస్థిత: ॥** **భ.గ.అ.9.శ్లో.4**

అ॥ జగత్తంతయు, అవ్యక్తరూపుడనగు నాచే విస్తరింపబడి యున్నది. మూలప్రకృతి మొదలు స్థూలమువరకు గల చరాచరములైన సకలభూతములును నాయందున్నవి. గాన మత్‌స్థాని అనబడును. కాని నేను భూతలములయందు లేను.

**శ్లో॥ న చ మత్స్థాని భూతాని పశ్యమే యోగ మైశ్వర్యం ।**
**భూతభ్రు న్నచ భూతస్థో మమాత్మా భూత భావన: ॥**

అ॥ భూతములు నాయందున్నవని చెప్పుటయు పూర్ణసత్యము గాదు. ఈశ్వరుడనగు నా యోగమహిమను గనుము. నా ఆత్మ భూతములను బుట్టించును. దానియందు భూతములుండును. గాని అది భూతముల యందుండదు.

నాల్గవ శ్లోకములో భూతములు నాయందున్నవని చెప్పి 5వ శ్లోకమున నిజానికి భూతములు నాయందు లేవు అని భగవానుడెందుకు చెప్పుచున్నాడు? భగవంతుడు స్వస్వరూపమున కార్యకారణ, దేశ, కాలముల కతీతుడు. అతడు పురుషోత్తముడు. దేశ కాలములు అవస్థలలో చేరినవి. కనుక అతనియందు భూతములున్న వనియు చెప్పుట తగదు.

భగవంతుని ప్రథమ విస్తారము ఆత్మ. భగవంతుడు దేశరహిత, కాలరహిత అనంతుడు కాగా భగవదాత్మ దేశసహిత కాలసహిత అనంతము. ఈ ఆత్మ స్వయం స్థితసత్త. ఈ ఆత్మయే సర్వభూతములను బహిర్గతము గావించును. ఈ భూతములు

ఆత్మసత్త పై ఆధారపడియుండును. ఆత్మయందుండును. ఇట్లు భూతములు సరాసరి భగవంతునియందు గాక (పురుషోత్తమునియందు గాక) అతని ప్రథమావిర్భావమైన ఆత్మయందు (అక్షర పురుషుడు) ఉండును. అందువలననే "మమాత్మా" నా ఆత్మయందుండును అని భగవాను డనుచున్నాడు. ఇట్లు భగవంతుడు విశ్వాతీతుడ య్యును, కేవల విశ్వబాహ్యుడు గాడు. తన ఆత్మరూపమున అనగా సచ్చిదానంద రూపముగ విశ్వాన ఉన్నాడు. వసుధయందు వాసుదేవుడై యున్నాడు. ఇదియే అతని ఐశ్వర్యయోగము; యోగమాయామహిమ; ఏకమై అనేకమై యుండగల మహిమ.

మాయావాదమునందు అంతరాత్మ (వ్యష్టి) ఆత్మ (సమష్టి) పరమాత్మ (దేశ, కాల, కార్య కారణాతీతుడు) ఏకస్వరూపముగా చిత్రించి దానియందు తోచు నామ రూపాత్మకమైన వ్యష్టి, సమష్టి రూప జాగ్రత్, స్వప్న ప్రపంచములను అరోసితములుగా అనగా అనిర్వచనీయమైన (మిథ్యా) రూపములుగా నిరూపించును.

ఈ శ్లోకములలో భూతముల యొక్క ఉనికిని వివరించు చున్నారు. 15వ అధ్యాయము పురుషోత్తముని వివరించును. అనగా అపరా పురుషుడు, పరా పురుషులకన్న విలక్షణుడని పురుషోత్తముని వివరించును. దేశకాల కార్యకారణాతీత స్థానము పురుషోత్తమీ స్థానము (పరమాత్మ). ఆయన ప్రథమావిర్భావమే పరా పురుషుడు అనగా ఈశ్వరుడు. తన సత్తా స్ఫూర్తులతో ప్రకృతియందు సచ్చిదానంద స్వరూపుడుగా ఆవిర్భావము పొంది సూక్ష్మ పంచభూతాత్మకముగా వ్యక్తీకరించుటయే. ఇది గుణసామ్య స్థితి. అపరా పురుషుడనగా గుణవైషమ్యమును పొంది వైవిధ్య రూప చరాచరరూపంగా అభివ్యక్తీకరించుటయే. ఇతడే విరాట్పురుషుడు.

కనుక భూతములు నాయందున్నవి అను సందర్భమున, నా (పురుషోత్తముని) ప్రథమ అభివ్యక్తి రూపమైన ఆత్మ (సచ్చిదానందాత్మయందు) ఉన్నవి. అందువలననే "మమాత్మా" నా ఆత్మయందున్నవి. కాని నా స్వరూపమైన అనగా దేశ, కాల, కార్య కారణాతీతమైన స్వరూపమున సర్వాధారమైన పురుషోత్తముని యందు లేవు. అని వ్యాఖ్యానించినచో గీతాసారమును క్రమముగా గ్రహించినవార మగుదుము.

మాయావాదమునందు బాధితానువృత్తితో అంతరాత్మ ఆత్మయే అనియు, ఆత్మ పరమాత్మయే యనియు వివరించును. ఉపహిత చైతన్యమునకు ఏకత సాధించును. ఉపాధులు వేరువేరుగా అనేకంగా కల్పించినను ఆత్మ చైతన్యమునందు భాసించి అభాసమాత్రములు అనియు, అవిద్యాజనితము లనియు చెప్పుచూ, భూతములుగా కన్పించుట, భూతములు భగవంతునియందు ఉండుట ఇది అంతయు అభాస మాత్రమే యనియు చెప్పుచూ "మమాత్మా" అను పదమునకు సరియైన వివరణ అందించినట్లు అగుపడదు.

దృష్టి సృష్టి వాదపరముగా విచారించినట్లైన దృష్టిని విడిచి సృష్టికి స్వత: సత్తాస్ఫూర్తులు లేవు గనుక అంతయు సత్తాస్ఫూర్తులే యగును. కాని సృష్టి దృష్టివాదమున విచారించినచో గీతావాక్యమునకు పైవివరించిన వ్యాఖ్యానము సమంజసమని అవగతమగును. వివాదగ్రస్తమగు పైశ్లోకములను విచారించు మానవుని ఆధ్యాత్మిక శక్తికి పై రెండును క్రమముగానే కన్పించినను గీతాశ్లోకార్థము ననుసరించి చూచినచో సృష్టి దృష్టి వాదతయా విచారించిన వివరణయే క్రమముగా కన్పించుచున్నది.

ఓం తత్ సత్.

# ఆత్మస్వరూపము

**మూ॥ అస్తినాస్త్యస్తి నాస్తీతి నాస్తినాస్తీతి చాపున:।**
**చలస్థిరో భయాభావై రావృణోత్యేవ బాలిశ: ॥**

భావము:- ఆత్మయున్నదని యొకవాదము, లేదని మరియొక వాదము; ఉన్నదియును, లేనిదియును అని యింకొకవాదము; ఎంత మాత్రములేదని నాల్గవ వాదము; ఇట్లు చలము, స్థిరము, చలస్థిరము అత్యంతమ భావమను వివిధ విశేషములచే అజ్ఞులాత్మ స్వరూపమును గప్పిపుచ్చుచున్నారు.

అస్తి నాస్తి మొదలగు స్వస్వాభిని విష్టములగు నాలుగు కక్ష్యలచే ఆత్మ భగవానుడ సంస్పృశ్యుడగు చున్నాడు. అతని యందు అస్తి నాస్తి మొదలగు వికల్పనలు లేవు. ఇట్లుపనిషత్తులచే ప్రతిపాదింపబడిన పరమాత్మ తత్త్వము నెవడు గ్రహించునో యతడే సర్వజ్ఞుడు, పరమార్ధ పండితుడు నగుచున్నాడు. సర్వజ్ఞమగు బ్రహ్మ పదమును పొందినవాడు బ్రాహ్మణుడు. ఈయనే మహాజ్ఞాని. పరమహంస పరివ్రాజకాచార్య పదము బ్రాహ్మణశబ్దమునకు ముఖ్యార్ధము. ఆ పదము ఆదిమధ్యాంతరహితము. అట్టి పదము జ్ఞానస్వరూపము గనుక నది పొందినవాడు సర్వజ్ఞుడగుచున్నాడు. ఇట్టి యాత్మ లాభము కంటె నుత్కృష్టమగు మరియొక పదమేదియు లేదు.

ప్రపంచాత్మకమగు నానారూప ద్వైతము స్వతంత్రముగా సిద్ధించుచున్నదా? లేక ఆత్మ తాదాత్మ్యమును బొంది యట్లు భాసించుచున్నాడా? నానారూపమగు ప్రపంచ మాత్మ తాదాత్మ్యమును బొంది యనేకముగ గాన్పింప సాధ్యముగాదు. ప్రపంచము జడాత్మకము. ఆత్మ చేతనాత్మకము. విరుద్ధ స్వభావములుగల జడాజడముల రెండింకిని తాదాత్మ్యభావము ఘటింప శక్యముగాదు. ఆత్మ భేదశూన్యము. ద్వైతమట్టి యాత్మ తాదాత్మ్యమును బొందిన యెడల దానికి నానాత్వమెట్లు సంభవమగును. కరదీపిక కాంతిచేత రజ్జువని నిర్ధారణ చేయబడినపుడు దాని యందు కల్పింపబడిన

సర్పదండాది నానారూపములు కాన్పించుట లేదు. ద్వైతమున కాత్మతో సంబంధము లేక స్వతంత్రమగు యునికిగాని, ప్రతీతిగాని లేదు. రజ్జుని రపేక్షకమగు సర్పమెన్నడును సంభవింపదు. మరియు ననేకముగా కాన్పించు ద్వైత మొకదానికంటె మరియొకటి వేరుగా నున్నదా? ఒకదానికంటె మరియొకటి వేరుగా నుండశక్యము గాదు ఒకదానికంటె భిన్నమగునది మరియొకటి యున్నపుడే యొకదాని కంటె మరియొకటి భిన్నమగుచున్నది. రెండవది లేనపుడు ఒకదాని కంటె మరియొకటి లేదను పార్ధ్యప్రతీతి సంభవము కాదు. పార్థక్య ప్రతీతి వస్త్వంతరాధీనము గాని స్వతంత్రము గాదు. పార్దక్యము లేని యెడల నానాత్వము సిద్ధింపనేరదు. అపుడు ఘటపటములు రెండు నొకటియే యగుచు సర్వ వ్యవహారలోపము సంభవించును.

ఇట్లు ద్వైతమాత్మ స్వరూపమని గాని, తద్భిన్నమని గాని పార్ధక్యమే ముఖ్య లక్షణముగాగల నానాత్వము సిద్ధించునని చెప్ప శక్యము గాదు. ఏ విధముగా జూచినను ద్వైతము వాస్తవముగా నిరూపింప సాధ్యము గాదు. ఆరోపితమగు జగత్తు అధిష్టానమగు పరమార్ధబుద్ధిచే నాలోచించినపుడు యసన్మాత్రమే గావలసివచ్చును. రజ్జు సర్పము దీపకాంతియందు రజ్జువుకంటె వ్యతిరేకముగ నుండ నటుల జగత్తు కూడ పరమాత్మ కంటె వేరుగా నుండనేరదు. ద్వైతమనునది లేదు. నానాత్వమున కన్యోన్యముగా గాని, పరమాత్మ తోడయునికి గాని సిద్ధింపనేరదు. ఆత్మ అద్వితీయము గనుక నానాత్వ మాత్మయని భావింపలేము. ఆత్మ భావములేని నానాత్వమున కునికియేలేదు గనుక నిరాత్మకమగు నానాత్వము జడమాత్రమగునని తాత్పర్యము. భావధర్మపదము లేక కార్ధకములు. అద్వైతులు ధర్మిధర్మములకు, గుణిగుణములకు, జాతివ్యక్తులకు తాదాక్మ్యమంగీకరింతురు. వానికి భేదములేదని వారి మతము. ప్రకృతి కన్యథా భావము ఏ విధముగను సిద్ధింపదు. ఏ వస్తువు స్వస్వభావము నెన్నడును వదలిపెట్టదో అయ్యది ప్రకృతి యనబడును. ఏ స్వరూపముచే నే వస్తువు నిశ్చయించబడినదో అది వ్యభిచరించ కుండుటయే దాని ప్రకృతి. సిద్ధపురుషులకు యోగబలముచే సిద్ధమగు అణిమాది శక్తులు ఎపుడును విపర్యయము నొందవు. ఇది వారికి సంసిద్ధమైన ప్రకృతి.

అగ్ని మొదలగువానియొక్క ఉష్ణప్రకాశత్వ స్వభావములు కాలాంతరమున గాని దేశాంతరమందు గాని మార్పును జెందవు. అది వాని స్వభావమగు ప్రకృతి. పక్షులకు పుట్టుక తోడినే ఆకాశమున కెగురుట మొదలగు లక్షణము లేర్పడుచున్నవి. వానికది సహజమగు ప్రకృతి, జలమునకు నిమ్నగమనము మొదలగు కొన్ని లక్షణము లేర్పడుచున్నవి. ఇవి వాని కకృతమగు ప్రకృతి. మిధ్యా కల్పితములగు లౌకిక వస్తువులందు గూడ ప్రకృతి మార్పు జెందుట లేదు. జన్మాది వికారరహిత స్వభావమగు పరమార్ధ వస్తువును గూర్చి చెప్పనేల? అమృతమే లక్షణముగా గల దాని ప్రకృతి యెంతమాత్రము వితధము గానేరదు. దానికెన్నడు నుత్పత్తి కలుగనేరదు.

**మూ॥ యధాస్వప్నే ద్వయాభాసం చిత్తం చలతిమాయయా**
**తథా జాగ్రద్ద్వయాభాసం చిత్తం చలతిమాయయా ।**
**అద్వయంచ ద్వయాభాసం చిత్తం స్వప్నేన సంశయ:**
**అద్వయంచ ద్వయాభాసం తథా జాగ్రన్న సంశయ: ॥**

భావము:- ద్వైతాభావమును చూచుచున్న చిత్తము స్వప్నమునందు మాయచే చోదితమయి చలించుచున్నది. ఆ తీరుననే జాగ్రత్తునందలి ద్వైతాభాసమును చూచుచున్న చిత్తముగూడ మాయ చేతనే ప్రేరితమగుచున్నది. స్వభావముగా అద్వయమైన చిత్తము స్వప్నమునందు ద్వైతాభాసముగ కాన్పించుచున్నది. సందేహము లేదు. అదే విధముగ జాగరితమందు గూడ నద్వయమగు చిత్తము ద్వైతాభాసమును గలిగియున్నది.

పరమార్ధముచే నద్వయమగు విజ్ఞానమును శబ్దములచే వర్ణించుటకు అజ్ఞానకల్పితమగు మానసిక స్పందనము మాత్రమే కారణం. అద్వయమగు నాత్మను వర్ణింప శబ్దములు ప్రయత్నించుట లేదు. బ్రహ్మతత్త్వము మౌనవ్యాఖ్య చేతనే ప్రకటితమగుచున్నది. కార్యకారణ సంబద్ధమగు ద్వైతమును వివరించుటకు మాత్రమే శబ్దములు ప్రయత్నించుచున్నవి.

విగతాశేష దోషులును, పండితులును, వేదాన్తార్థతత్పరులును సర్వకర్మ సన్యాసులు అగు వారలకే పరమాత్మోప లబ్ధి సాధ్యముకాని రాగద్వేషాది కలుషిత చిత్తులు, స్వపక్షపాతాభి నివిష్టులనగు తార్కికాదులకది శక్యము కాదు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# భిన్నత్వములో ఏకత్వము

**శ్లో॥ యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**
**తస్యాహం న ప్రనష్యామి స చ మే న ప్రణశ్యతి ॥** **భ.గీ.అ.6.శ్లో.30**

అర్థము:- ఎవరు సర్వత్ర నన్ను (ఈశ్వరుని) దర్శించుదురో, మరియు సర్వమును నాయందు దర్శింతురో, వారికి నేను కన్పడకపోను. వారు నాకు కన్పడకపోరు. సర్వమనగా శబ్ద స్పర్శ రూపరస గంధాత్మకమగు ప్రపంచము శ్రోత్ర, త్వక్కు, చక్షు:, జిహ్వా, ఘ్రాణేంద్రియములు పై విషయములతో సంబంధపడుటయే వ్యావహారిక ప్రపంచము. ఇట్లు ప్రమాతతోగాని, వృత్తితోగాని, విషయమునకు గల అభేద తాదాత్మ్య సంబంధమే, విషయమునందుగల అపరోక్షత్వమునకు హేతువగును. విషయము యొక్క పరోక్షత్వమే జ్ఞానము యొక్క అపరోక్షత్వమునకు హేతువగుచున్నది.

శ్రోత్రేంద్రియ మాకాశముయొక్క సత్వాంశము వలన బుట్టినది. శ్రోత్రమునకు శబ్దముతో శ్రోత్రసంయుక్త తాదాత్మ్య సంబంధము గలుగుచున్నది. ఈ శబ్దము ధ్వనాత్మక శబ్దమనియు, వర్ణాత్మక శబ్దమనియు రెండు విధములు. భేర్యాదివస్తువులతో, దండాదుల సంయోగము వలన గలుగునది ధ్వన్యాత్మక శబ్ద మనబడును. ఈ ధ్వన్యాత్మక శబ్దమునందు తారత్వమందత్వాది ధర్మములున్నవి. కంఠాద్యష్ట స్థానముల యందు వాయుసంయోగముచే కలుగునది వర్ణాత్మక శబ్దమనబడును. ఈ వర్ణాత్మక శబ్దమునందు కత్వాది ధర్మములున్నవి. ఈ ధ్వన్యాత్మక వర్ణాత్మకములగు సమస్త శబ్దములతో శ్రోత్రేంద్రియమునకు సంబంధము గలుగుచున్నది. ఇట్లు వైవిధ్యరూప ధ్వన్యాత్మకశబ్దములు, లౌకిక, శాస్త్రీయమైన సమస్త వైవిధ్య వర్ణాత్మక శబ్దజాలము యొక్క జ్ఞానము, ఒక్కటియైన శ్రోత్రేంద్రియ స్థానమందే తెలియబడి వ్యవహారము జరుగుచన్నది.

త్వగింద్రియము వాయువు యొక్క సత్వగుణాంశము వలన బుట్టినది. త్వగింద్రియము వలన, స్పర్శము, స్పర్శాశ్రయము, స్పర్శాశ్రితమగు స్పర్శత్వజాతి,

స్పర్శత్వవ్యాప్యమైన, కఠినత్వాదులు మొదలగు వాని జ్ఞానము కలుగుచున్నది. వైవిధ్య స్పర్శజ్ఞానములు, ఒక్కటియగు త్వగింద్రియమున తెలియబడి వ్యవహరించబడుచున్నవి. చక్షురింద్రియము అగ్నియొక్క సత్వాంశము వలన బుట్టినది. కాన సమస్త వైవిధ్యరూప నీలపీతాది జ్ఞానములను బొందుచున్నది. ఒక్కటియగు చక్షురింద్రియమునకు, రూపవైవిధ్య మంతయు తెలియబడి వ్యవహారయోగ్య మగుచున్నది.

జిహ్వేంద్రియ ముదకము యొక్క సత్వగుణాంశమున బుట్టినది. ఒక్కటియగు యీ జిహ్వేంద్రియమునందు, మధురము, ఆమ్లము, లవణము, కటుకము, కషాయము, తిక్తములను రస వైవిధ్యమంతయు తెలియబడి వ్యవహారయోగ్యమగు చున్నది. ఘ్రాణేంద్రియము పృధివియొక్క సత్వగుణాంశము వలన బుట్టినది. ఒక్కటియగు యీ ఘ్రాణేంద్రియమందు వైవిధ్యరూప సుగంధ, దుర్గంధ వస్తుజ్ఞానము కలిగి వ్యవహారము జరుగుచున్నది. ఇట్లు శబ్దస్పర్శరూప రసగంధ వైవిధ్య ప్రపంచమంతయు, శ్రోత్ర, త్వక్, చక్షః, జిహ్వా, ఘ్రాణేంద్రియములందు ఏకమగుచున్నది. కనుక ఐదు జ్ఞానములు మనస్సునందు ఏకీకృతమగుచున్నవి. మనస్సున్నపుడే ప్రపంచము తోచుచున్నది. మనస్సు లయించిన సుషుప్తియందు స్థూలసూక్ష్మ ప్రపంచమేదియు తోచక, లేనిదైయున్నది.

మనస్సు అంతఃకరణ వృత్తిరూపము. అంతఃకరణము సూక్ష్మ పంచభూతములను సమష్టి సత్వాంశమగుట వలన, జడమగును. చైతన్యమునందే తెలిసికొనుట జరుగును గాని, జడమునందు జరుగదు. ఇట్లు చైతన్యమునందు భాసించబడిన సాభాసాంతఃకరణ వృత్తి రూపమగు మనస్సునందు ఈ ప్రపంచము తెలియబడి వ్యవహారయోగ్య మగుచున్నది.

**శ్లో॥ ప్రతిబోధ విదితం మత మమృతత్వంహి విన్దతే।**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విందతేఽమృతమ్ ॥** **కే.ఉ.ద్వి.మం.4**

అర్థము:- మనస్సుయొక్క ప్రతివికారము (వృత్తి) ద్వారాను దానిని స్ఫూర్తిని గోచరము చేసుకున్నవాడు అమరత్వాన్ని పొందుతాడు. ఆత్మద్వారా అతడు నిజమైన

బలాన్ని పొందుతాడు. జ్ఞానముద్వారా అమరత్వాన్ని పొందుతాడు. ఇట్లు చైతన్యరూపుడగు ఈశ్వరునియందే సమస్తము తెలియబడి వ్యవహారము జరుగుచున్నదని గుర్తించినచో, సర్వమునందున, ఈశ్వర చైతన్యమును జూచిన వారమగుదుము. ప్రతివృత్తియందు జడభాగమున విడిచిన సమస్త వృత్తులు తెలియబడునట్టి జ్ఞానము ఏకమయే నున్నది. ఇట్లు సర్వమునందున ఈశ్వరుని జూచువారు ఈశ్వరునికి కన్పించకపోరు.

ఏకమైన సాక్షి చైతన్యము. అంతంకరణమందు భాసించగా "అహం" వృత్తి పుట్టును. అనగా ''నేను'' అను వృత్తి ద్వారా జ్ఞానం అభివ్యక్తమైనది. అభాససహిత వాసనాంత:కరణము నుండి, సర్వ వృత్తులు పుట్టి ఆయా యింద్రియములద్వారా బహిర్గతమై ఆయా విషయ సమీపమునకు పోయి, విషయావరణనను తొలగించి, విషయ జ్ఞానమును కలిగించుచున్నవి. ఇట్లు ఏకమైన సాక్షి చైతన్యమునందే, మనస్సునందు గలుగు వృత్తిరూప ఆంతర ప్రపంచ జ్ఞానముగాని, మనస్సు ఇంద్రియములద్వారా పొందు శబ్దస్పర్శ రూప రస గంధాత్మకమగు బాహ్య వైవిధ్యరూప స్థూల ప్రపంచ జ్ఞానముగాని కలుగుచున్నది. ఇట్లు ఏకరూప సాక్షి చైత్యమునందే సర్వమును దర్శించగలవారికి ఈశ్వరుడు కన్పించకపోడు. ఈ విధముగ బాహ్య జగద్రూప సర్వమునందు ఏకరూప జ్ఞానమును దర్శించుట, ఏకరూపమైన సాక్షిరూప చైతన్యమందే, వాసనాంత:కరణము లందు గలుగు భిన్నవృత్తులచే సర్వభిన్న ప్రపంచము తెలియబడుచు వ్యవహార యోగ్యమై యున్నదనియు తెలియుటయే పై గీతా శ్లోకార్థము. ఇదియే ఉపనిషత్సారమైన అనేకత్వములో యేకత్వ దర్శనము చేయుటయే బ్రహ్మసాక్షాత్కారమని యెరుంగ వలయును.

ఓం తత్ సత్

# శాంతిమంత్రము (సదసద్వివేకము)

## ఓమ్

**అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా మృతంగమయ॥**

పై మంత్రము పరమశాంతి కొఱకగుచున్నది.

అర్థము:- ఓ భగవానుడా! అసత్తు నుండి సత్తునకు తీసికొని పొమ్ము. తమస్సు (చీకటి) నుండి జ్యోతి (వెలుగు) లోనికి తీసికొనిపొమ్ము. మృత్యువు నుండి అమృతత్త్వమును పొందింపజేయుము.

సత్తు అసత్తు అని లోకములో రెండు పదార్థములు గలవు. సత్తంటే ఉన్నదని, అసత్తంటే లేనిదని అర్థము. ఇందు ఉన్నదేదో ఎప్పుడు ఉన్నది. లేనిదెప్పుడు లేదు. ఉన్నది లేక పోవటంగాని లేని పదార్థముండడం గాని ఎన్నటికిని సంభవింపదు. ఇది సర్వవిదితము. విచారించినచో మనము ఉన్నదానిని లేదని, లేనిది ఉన్నదని భావించుచున్నాము. ఆత్మచైతన్యము సర్వత్రా సర్వదాయున్నది. దానిని అవిచారితులు లేదనుకుంటున్నారు. అట్లే యీ నామ రూపాత్మక జగత్తు పరిశీలన దృష్టితో జూచినచో లేనిదైనను అనుక్షణమున్నట్లు చూచుచున్నాము. అనగా అసద్రూపముగానున్న నామరూపములలో కన్పించుచున్న కరచరణాద్యవయవరూప సంఘాతము, మనో బుద్ధేంద్రియాది రూపసూక్ష్మ దేహములను సద్రూపముగా భావించి వాటికి సహజముగానున్న "పుట్టుట, ఉండుట, వృద్ధిపొందుట, మారుట, కృశించుట, నశించుట, అను ఆరు పరిణామములకు గురియగుచు, దుఃఖముల పాలగుచున్నాము. ఇట్టి దుఃఖము మార్పు జెందుచున్న అసత్పదార్థమునకున్నది కాన మార్పు చెందని సత్పదార్థము దుఃఖము లేనిదగును. ఏదైన యొకవస్తువును పరిశీలించినచో సదసద్వి భాగము మనకు అర్థమగును. ఉదాహరణకు ఘటమను వస్తువున్నది. అది దానికి కారణమగు

మృత్తికకంటె వ్యతిరిక్తముగాదు. గదా? కాన ఘటమను నామము, రూపము అసత్తే. మృత్పిండమును విచారించిన అది పృథ్వీ పరమాణువుల సంయోగమే. పృథ్వి జల వికారము, జలము తేజ: కార్యము, తేజస్సు వాయుజనితము, వాయువాకాశ జన్యము, కాన భౌతిక పదార్థములు ఆకాశముకన్న వేరుగ లేవు. ఆకాశమచేతనము. కానదానిపాటికది సిద్ధించదు. దానికి విలక్షణమైన, పరాధీనము గాని స్వతస్సిద్ధమైనది యొకటుండవలెను. అలాంటిదొక చైతన్యమే.

శ్రుతి:- **"అజ్ఞానాద్ బ్రహ్మణో జాత మాకాశం బుద్ బుదోపమమ్, ఆకాశాద్ వాయురుత్పన్నో వాయోస్తే జస్తత:పయ: అద్భ్యశ్చ పృథివీజాతా తతోవ్రీహియ వాదికమ్"**

అర్థము:- ఆకాశము నుండి వాయువును, దానినుండి తేజస్సును, దానినుండి జలమును, దానినుండి పృథివియును, దానినుండి వ్రీహియవాది సస్యములును కలిగినవి. కాబట్టి చైతన్యమే అన్ని భావాలకు చివరి భావము. దానికి కారణం లేదు. కాన అది దేనికి కార్యం కాదు. కాన అది అవ్యభిచారి అనగా మార్పు లేక వికారము లేనిది. కనుక అది సత్తు. నామరూపాది ప్రపంచమంతా ఆకాశం వరకు వ్యభిచరించే కార్యరూపాలేయని తెలియగలదు. కాబట్టి మూలకారణమైన శుద్ధ చైతన్యమునకంటె భిన్నముగా లేవు. కనుక చరాచర జగత్తంతా అసత్తే. ఇది కన్పించుచున్నను, అది స్థూలముగ కన్పించనప్పటికిని యీ మనోబుద్ధేంద్రియాదులకు, స్థూలసూక్ష్మములగ గోచరించునదంతయు అదేకాని ఇది కాదు. ఎట్లన బల్ల ఉన్నది, ఘటమున్నది, కట్టు యున్నది, అని భావించునపుడు బల్ల, ఘటము, కట్టు అను భావములు, ఉన్నది, ఉన్నది, ఉన్నది అను భావములు సమానాధికరణములుగా కన్పించును. వానిలో బల్ల, ఘటము, కట్టు అను భావములు మారుతూ పోతాయి. కాని ఉన్నది అను భావము మార్పు చెందక సదాయున్నది. ఈ ఉండుట అను భావము బల్ల వగైరాలు నశించినచో లేదు గదాయని ఊహించవచ్చును. ఈ సద్బుద్ధి బల్ల వగైరా నామరూపములు గోచరించినపుడు ఉన్నదియని తెలిసికొనును. అవి లేనపుడు అనగా విశేష నామరూపములు నశించునపుడు సత్ అనే ఉనికికి క్షతి లేదు. ఏలయనగా బల్ల

వగైరాలు ఉన్నవని ఎలా చూచావో వాటి యభావమును గూడ ఉన్నదనే చూస్తూ యున్నాము. కాన వస్తుగా నున్నపుడు లేనపుడు సద్బుద్ధియుండనే యున్నది. బల్లయను బుద్ధి యొకచోట యున్నది. మరియొక చోట లేదు. ప్రపంచములో అణువు మొదలు ప్రతివస్తువుల నామరూప భావనలు మార్పు జెందుచున్నవి. గాన అంతా ఆసత్తే. అనగా వాని వాని విశేషరూపాలలో అవి లేవు. అన్ని సద్రూపంగా మాత్రము ఏకంగానున్నవి. ఎండమావుల్లో నీరు కన్పించుచున్నను, వివేకి ఎట్లు సూర్యకిరణాలే అట్లు భావించుచున్నవని తలంచునో, అట్లే నామ రూపములుగా విశేషించి వేరు వేరుగా కన్పించుచున్నను, వివేకి ఆధారమైన సత్పదార్ధమునే చూచును. సత్పదార్ధమునకు రూపము లేదు. అసత్పదార్ధమునకు రూపముగలదు. కాన సత్తనే దాని వివిధ రూపాలే యీ నామరూపాత్మక ప్రపంచము. సద్రూపముగా యివి సత్యంగాని, తద్రూపంగా కావని సమన్వయించుకున్నచో **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** (చా.ఉ.3.14-1) యను శ్రుత్యర్ధమును తెలిసిన వారమగుదుము. అన్ని విశేషరూపము లందు అనువర్తించియున్న చైతన్యమును గుర్తించుటయే **"తత్త్వదర్శనం యద్భావం తద్భవతి"**. దేనిలో తాదాప్యము బొందితే అదే అవుతాడు మానవుడు.

మనమందరము అసద్రూపమైన దేహముతో తాదాప్యము పొందియున్నాము. అందుచే దాని వికార లక్షణములే మనకు సంక్రమించినవి. కాన ఆ వికారములకు దు:ఖించక తప్పదు. సత్పదార్ధము లేక ఆత్మానాత్మ విచారణ చేసిన తర్వాత విశేష నామ రూపములుగా కన్పించు మనమందరము ఏకరూపమైన, మార్పు చెందని నిత్యమైన స్వప్రకాశమైన సర్వప్రకాశమైన సద్రూపమే అయి వున్నామని తెలియగలము. ఇట్టి బ్రహ్మరూపమును తెలిసికొన్నవాడు "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి" అని శ్రుతి చెప్పుచున్నది. ఇప్పుడు దు:ఖమునకు స్థానము లేదు. నిత్యానంద స్వరూపమేయైయున్నది. ఇట్టి విచారణ చేత మాత్రమే పై శాంతిమంత్రములోని **"అసతోమా సద్గమయ"** అనుదానిని అనగా అసద్రూప నామరూప భావతాదాప్యము నుండి సద్రూపమైన, మన నిజరూపమైన చైతన్య భావన యందు తాదాప్యం బొందుట వలన మాత్రమే గాని వేరు మార్గము లేదని గ్రహించవలెను.

రెండవ చరణము **"తమసోమా జ్యోతిర్గమయ"** అనగా చీకటి నుండి (తమస్సు నుండి) వెలుగులోనికి (ప్రకాశములోనికి) తీసికొని పొమ్ము. ఆత్మజ్ఞానికి ఏది పగలుగా నుండునో ఆజ్ఞానికది రాత్రిగా నుండును. అజ్ఞానికి ఏది పగలుగా నుండునో ఆత్మజ్ఞానికది రాత్రిగా నుండును.

**శ్లో॥ యానిశా సర్వభూతనాం తస్యాం జాగర్తి సంయమీ।**
**యాస్యాం జాగ్రతి భూతాని సా నిశాపశ్యతో మునే: ॥** **భ.గీ.అ.2.శ్లో.69**

ప్రాణికోట్లు జాగ్రదవస్థయందు స్థూలదేహమునను, స్వప్నావస్థ యందు సూక్ష్మదేహమునను, సుషుప్త్యవస్థయందు కారణదేహమందున విహరింతురు. పిదప సుషుప్తి నుండి స్వప్నములోనికి స్వప్నము నుండి జాగ్రత్తలోనికి వచ్చుచుందురు. మాండూక్య కారికలయందు

**మూ॥ దక్షిణాక్షిముఖే విశ్లోమనస్యన్తస్తు తైజస:।**
**ఆకాశేచహృదిప్రాజ్ఞస్త్రిదా దేహవ్యవస్థిత: ॥**

అని గలదు.

టీ॥ విశ్వుడు దక్షిణాక్షిద్వారమునను, తైజసుడు మనస్సునను, ప్రాజ్ఞుడు హృదయా కాశమునను వ్యవహరించుచున్నారు. ఇట్లాత్మ యొకడే దేహమునందు మూడు విధములుగా యున్నాడు. ఈ మూడును మాయాలోకములు. అనగా సుషుప్తియందు ఆత్మా గ్రహణము, స్వప్న జాగ్రతులయందు ఆత్మాగ్రహణమే గాక అన్యధా గ్రహణము కూడ కలిగియుండును. ఇంద్రియ నిగ్రహము గలిగిన వానికి విలక్షణమైన, స్వప్రకాశమైన, సర్వ అవస్థాప్రకాశకమైన తురీయమునందు యోగి యుండును. పగలంటే ఇక్కడ నిజముగా పగలుగాదు. మనము పగలని మన భావం లేని ప్రపంచాన్ని మన అజ్ఞానం చేత ఉన్నట్లు దర్శించుచున్నాము, వ్యవహరించుచున్నాము. స్వప్నములో మనమనేకమైన చిత్ర విచిత్ర దృశ్యాలు చూచెదము. వ్యవహరించెదము. అప్పుడదియంతా తాత్కాలికంగా పగలే. అయినా అది పగలు కాదు.గదా! అనగా రాత్రినే పగలుగా

భావించి చూచి వ్యవహరించుచున్నాడు స్వప్నదృక్కు. కాని మేలుకొనియున్న వానికి అది రాత్రి. అట్లే అజ్ఞాని ప్రపంచమని చూచు దానిని జ్ఞాని బ్రహ్మముగా జూచును. అజ్ఞానికి యీ ఆరోపిత నామరూపాత్మకమైన ప్రపంచము గోచరిస్తే జ్ఞానికి అస్తిభాతి ప్రియరూపముగ బ్రహ్మమే గోచరించును. ఈ సమస్తము బ్రహ్మతత్త్వముగా దర్శించుటయే యోగము. స్వతస్సత్తారహితమై, ఆత్మయందారోపితమై, వికారవంతమైన అనాత్మ పదార్ధమును సత్యమని నమ్మి దు:ఖముల పాలగుట "తమస్సు"గా చెప్పబడినది. స్వసత్తాస్ఫూర్తి గలిగి, స్వయం ప్రకాశమై, సర్వప్రకాశకమైన ఆత్మను పరమార్ధ సత్యముగా భావన చేసి, నిత్యానందముగ నుండి పరమశాంతిని బొందియుండుట "జ్యోతి"గా వచించడమైనది. అనగా అనాత్మయందు సత్యభావనను వదలి ఆత్మయందు సత్యభావన చేయుట.

మూడవ చరణము:- "మృత్యోర్మాన్ అమృతంగమయ" అనగా మృత్యువు నుండి అమృతత్వమును పొందింప జేయుము. అసద్రూపమైన, తమోరూపమైన, వికారవంతమైన, నామరూప సత్యత్వ భావము వలన అనగా శరీర సంఘాతమునందు సత్యత్వ భావన యున్నపుడు శరీరపు చివరి వికారమగు మరణము పొందుచున్నాము. కాన శరీరమునందు సత్యభావన చేయుట మృత భావన. నిత్యసత్యమైన జరామరణ రహితమైయున్న ఆత్మభావన అమృతభావన. కాన శరీర భావనను వీడి ఆత్మభావన చేయుటయే అమృతత్వమును బొందుటయని గ్రహించవలెను.

గమనించవలసిన విషయములు:- సత్తు = ఆత్మ, అసత్తు = శరీరము. ఆత్మ ఎల్లపుడును ఉండునది, శరీరము ఎప్పుడు లేనిది. అని చెప్పి వాని మధ్య విరోధము చూపగూడదు. ఇది మనస్సుకు గన్పించు విరోధము మాత్రమే. "ఇది అంతయు మున్ముందు అసత్తుగానే యుండెను. దానినుండియే సత్తు జనించెను" (త.ఉ.2-7) అని ఉపనిషత్తు చెప్పుచున్నది. అసత్తు సత్తునకు నిషేధకము గాదు అని యీ వాక్యము చెప్పుచున్నది. నిషేధకమైనచో అనగా అసత్తు కేవలము శూన్యమేయైనచో దానినుండి సత్తు జనింపజాలదు గదా! కనుక సత్తును గురించి మనకు గల అత్యంత అమూర్త

భావనను సైతం మించిన ఒక అజ్ఞేయ సత్తే అది (అసత్తు) కావలెను. ఇక్కడ మనకు స్పష్టపడున దేమనగా బ్రహ్మము అసత్తు అనబడునపుడు ఈ అసత్తు శబ్దం బ్రహ్మం సత్తు కాదని చెప్పదు. అసత్తు బ్రహ్మం యొక్క వాస్వ అభివ్యక్తి కాదని చెప్పదు. కాని బ్రహ్మము తన అభివ్యక్త సత్తు చేత పరిమితము కాదు అని మంత్రము తెలుపును. తనను తాను అభివ్యక్తం చేసుకొనగల బ్రహ్మము యొక్క స్వేచ్ఛను "సత్తు" శబ్దం తెలుపగా ఆ అభివ్యక్తి నుండి బ్రహ్మమునకు గల స్వేచ్ఛను "అసత్తు శబ్దము తెల్పును. ఇక స్వేచ్ఛ ఒక సద్భావము గాన సత్తు అసత్తు శబ్దములు రెండును బ్రహ్మము యొక్క రెండు సద్భావములనే తెల్పును. వివేక బుద్ధితో సత్తును మారని ఆత్మగాను, ఆ సత్తును మారుచుండుదాని విస్తారముగాను దర్శించగలము. అసత్తు ఆత్మకు అభివ్యక్తి సాధనమగు స్వీయశక్తి. "అట్టి నాయందనాదిగా నాత్మశక్తి యలరు నవ్యక్తమయి జగదాదియగుచు" అని సీతారామాంజనేయము చెప్పుచున్నది. కాని అసత్తును లేనిది యనుకొనుట ఉచితముగాదు.

**శ్లో॥ నాతతో విద్యతేభావో - నాభావో విద్యతే సత:।**
**ఉభయోరపిదృష్టోంత-స్త్వనయోస్త్వ దర్శిభి: ॥** **భ.గీ.అ.2.శ్లో.16**

అసత్తునకు ఉనికియే లేదు. సత్తునకు లేమియులేదు. తత్త్వదర్శులు యీ రెంటియొక్కయు యిట్టి తత్త్వమును దర్శించియున్నారు. అన్నింటిలోను అనువర్తించి యుండు ఆత్మను దర్శించి పట్టుకోవడమే తత్త్వదర్శనము, అప్పుడు యీ అనాత్మ ప్రపంచము గూడ ఆయా విశేషరూపాలుగా ఆత్మరూపంగానే గోచరిస్తుంది. అప్పుడు ఆత్మానాత్మల రెండింటిని ఆత్మరూపముగా జూచినట్లు **"ఉభయోరపి దృష్టోంత:"** అంటే ఈవిధముగా తెలియవలెను.

మరి

**"శ్రుతి సత్యంచాన్నృతంచ సత్యమభవత్ యదిదంకిఞ్ఞ తత్సత్యమిత్యా చక్షతే"**

**లై.ట.2-6**

సత్యమే సత్యము, అసత్యమూ అయినది. ఇది అంతా అదే అయినది. ఆత్మయొక్కటే సత్యమైనప్పటకి జనులు సత్యము, అసత్యము (సత్తు, అసత్తు) అని వ్యవహరించు రెండును గూడ ఆత్మయే అయివున్నదని చెప్పెను.

ఆధ్యాస్య భాష్యమునందు గూడ **"సత్యానృతం మిథునీకృత్యాలోక వ్యవహార:"** అని చెప్పబడినది. అనగా సత్తు, అసత్తు కలసియే లోక వ్యవహారము. కాన సత్, అసత్, తమస్సు, జ్యోతి, మృతం, అమృతం అను అన్ని భావనలు విచారించి, ఆధారమును, ఆరోపితమును వివేచించి, ఆరోపిత భావమును విడిచి, ఆధారభావమునందు నిధిధ్యాసనము చేసికొని, సర్వభావములకు మూలమగు పరమాత్మయందు భావరహితముగా నుండుటయే పరమశాంతి. అట్టి పరమశాంతినే పై శాంతి మంత్రము మనకు శ్రుతి యుక్తి, స్మృతి అనుభవములతో వేనోళ్ళ చాటుచున్నది.

ఓం తత్ సత్

# ప్ర తి ది న స్మ ర ణీ య ము లు

## గాయత్రీ మంత్రము

**ఓమ్ భూర్భువ:స్సువ: తత్స వితుర్వరేణ్యం,**
**భర్గోదేవస్య ధీమహి ధియో, యోన: ప్రచోదయాత్. ॥**

అను బ్రహ్మ గాయత్రీ మంత్రమును ప్రతి రోజు ఉదయము అరగంట (30నిముషములు) నిశ్చల మనస్సుతో జపింతురుగాక, అట్లనే సాయంత్రము జపించవలెను.

## ప్రాత: స్మరణమ్

**ప్రాత:స్మరామి హృదిసంస్ఫురదాత్మతత్త్వం**
**సచ్చిత్సుఖం పరమహంసగతిం తురీయమ్ ।**
**యత్ స్వప్నజాగర సుషుప్తి మవైతి నిత్యం**
**తద్బ్రహ్మ నిష్కలమహం న చ భూతసఙ్ఘ॥ 1**
**ప్రాతర్భజామి మనసాం వచసామగమ్యం**
**వాచో విభాన్తి నిఖిలా యదనుగ్రహేణ ।**
**యన్నేతి నేతి వచనైర్నిగమా అవోచం**
**స్తం దేవదేవ మజమచ్యుత మాహురగ్ర్యమ్ ॥ 2**
**ప్రాతర్నమామి తమస: పరమర్కవర్ణం**
**పూర్ణం సనాతనపదం పురుషోత్తమాఖ్యమ్ ।**
**యస్మిన్నిదం జగదశేషమ శేషమూర్తౌ**
**రజ్వాం భుజంగమ ఇవ ప్రతిభాసితంవై ॥ 3**
**శ్లోకత్రయమిదం పుణ్యం లోకత్రయ విభూషణమ్ ।**
**ప్రాత:కాలే పఠేద్ యస్తుస గచ్ఛేత్ పరమం పదమ్ ॥ 4**

# బ్రహ్మైను సంధానము

అహమేవ పరంబ్రహ్మ వాసుదేవాఖ్య మవ్యయమ్ ।
ఇతి స్యాన్నిశ్చితో ముక్తోబద్ధ ఏవాన్యధా భవేత్ ॥ 1

అహమేవ పరంబ్రహ్మ నిశ్చతం చిత్త చిన్త్యతామ్ ।
చిద్రూపత్వాదసజ్గత్వాద బాధ్యత్వాత్ ప్రయత్నత: ॥ 2

అహమేవ పరంబ్రహ్మ న చాహం బ్రహ్మణఃపృథక్ ।
ఇత్యేవం సముపాసీత బ్రహ్మణో బ్రహ్మణి స్థితం: ॥ 3

సర్వోపాధివినిర్ముక్తం చైతన్యం చ నిరన్తరమ్ ।
తత్ బ్రహ్మహమితి జ్ఞాత్వా కథం వర్ణాశ్రమీ భవేత్ ॥ 4

అహం బ్రహ్మస్మి యోవేద స సర్వం భవతి త్విదమ్
నాభృత్యా ఈశతే దేవాస్తేషామాత్మా భవేద్ది స: ॥ 5

అన్యోఽ సావహ మన్యోఽ స్మీ త్యుపాస్తే యోఽ న్య దేవతామ్ ।
న స వేద నరో బ్రహ్మ స దేవానాం యథా పశు: ॥ 6

అహమాత్మా న చాన్యోఽ స్మి బ్రహ్మైవాహం న శోకభాక్ ।
సచ్చిదానన్దరూపోఽ హం నిత్యముక్త స్వభావవాఽ ॥ 7

ఆత్మానం సతతం బ్రహ్మ సంభావ్య విహరన్తియే ।
న తేషాం దుష్కృతం బ్రహ్మ సంభావ్య విహరేత్ సుఖమ్ ।
క్షణం బ్రహ్మహమస్మీతి య: కుర్యాదాత్మచిన్తనమ్ ॥ 8

తన్మహాపాతకం హన్తితమ: సూర్యోదయో యథా ।
అజ్ఞానాద్ బ్రహ్మణో జాత మాకాశం బుద్‌బుదోపమమ్ ॥ 9

ఆకాశాద్ వాయురుత్పన్నో వాయోస్తే జస్తత: పయ: ।
అద్భ్యశ్చ పృథివీ జాతా తతో వ్రీహియావాదికమ్ ॥ 10

పృథివ్యప్సు పయో వహ్నౌ వహ్ని ర్వాయౌ నభస్యసౌ ।
నభోఽ ప్యవ్యాకృతే తచ్చ శుద్ధేఽ స్మ్యహం హరి: ॥ 11

అహం విష్ణు రహం విష్ణు రహం విష్ణు రహం హరి: ।
కర్తృభోక్త్రాదికం సర్వం తదవిద్యోత్థ మేవచ ॥ 12

అచ్యుతోఽ హ మనన్తోఽ హం గోవిన్దోఽ హ మహం హరిం: ।
ఆనన్దోఽ హమ శేషోఽ హో మజోఽ హోమమృతో స్మ్యవామ్ ॥ 13

నిత్యోఽ హం నిర్వకల్పోఽ హం నిరాకారోఽ హో మవ్యయ: ।
సచ్చిదానన్దరూపోఽ హం పఞ్చకోశాతిగోఽ స్మ్యహోమ్: ॥ 14

అకర్తాహ మభోక్తాహో మసఙ్గ: పరమేశ్వర: ।
సదా మత్సన్నిధానేన చేష్టతే సర్వమిన్ద్రియమ్ ॥ 15

ఆదిమధ్యాస్తముక్తోఽ హోం నబద్ధోఽ హోం కదాచ న ।
స్వభావనిర్మల: శుద్ధ: స ఏవాహం న సంశయ: ॥ 16

బ్రహ్మైవాహోం న సంసారీ ముక్తోఽ హోమితి భావయేత్ ।
అశక్నువా≡ భావయితుం వాక్యమేతత్ సదాభ్యసేత్ ॥ 17

యదభ్యాసేన తద్భావో భవేద్భ్రమర కీటవత్ ।
అత్రాపహాయ సన్దేహమభ్యసేత్ కృతనిశ్చయ: ॥ 18

ధ్యానయోగేన మాసైకాద్ బ్రహ్మహత్యాం వ్యపోహతి ।
సంవత్సరం సదభ్యాసాత్ సిద్ధ్యష్టక మవాప్నుయాత్ ॥ 19

యావజ్జీవం సదాభ్యాసాజ్జీవన్ముక్తోభవేద్ యతి: ।
నాహం దే హో న చ ప్రాణో నేన్ద్రియాణి తదైవ చ ॥ 20

న మనోఽహం బుద్ధిశ్చనైవ చిత్తమహంకృతి: ।
నాహం పృథ్వీ న సలిలం న చ వహ్నిస్తథాఽనిల: ॥ 21

న చాకాశో నశబ్దశ్చ న చ స్పర్శస్తథా రస: ।
నాహం గన్ధో న రూపం చ న మాయాహం న సంసృతి: ॥ 22

సర్వదా సాక్షిరూపత్వాత్ శివ ఏవాఽస్మి కేవల: ।
మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్॥ 23

మయి సర్వం లయం యాతి తద్ బ్రహ్మస్మ్యహ మద్యయమ్ ।
సర్వజ్ఞోఽహ మనన్తోఽహం సర్వేశ: సర్వశక్తిమాన్ ॥ 24

ఆనన్ద: సత్యబోధోఽహమితి బ్రహ్మనుచిన్తనమ్ ।
అయం ప్రపఞ్చో మిథ్యైవ సత్యం బ్రహ్మహమవ్యయమ్ ॥ 25

అత్ర ప్రమాణ వేదాన్తా గురవోఽనుభవస్తథా ।
బ్రహ్మైవాహం న సంసారీ చాహం బ్రహ్మణ: పృథక ॥ 26

నాహం దేహో న మే దేహ: కేవలోఽహం సనాతన: ।
ఏకమేవా ద్వితీయం వై బ్రహ్మణో నేహ కిఞ్చన: ॥ 27

హృదయ కమలమద్యే దీపవత్ వేదసారం,
ప్రణవమయమతర్క్యం యోగిభిర్ధ్యానగమ్యమ్
హరి గురు శివయోగం సర్వభూతస్థమేకం,
సకృదపి మనసావై చిన్తయేద్ య: సముక్త: ॥ 28

# దక్షిణామూర్తి స్తోత్రము

## ధ్యాన శ్లోకములు

శ్లో॥ మౌనవ్యాఖ్యాప్రకటిత పరబ్రహ్మ తత్త్వం యువానం
వర్షిష్ఠాన్తేవ సద్ఋషిగణైరావృతం బ్రహ్మనిష్ఠైః।
ఆచార్యేన్ద్రం కరకలితచిన్ముద్ర మానన్దమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే॥ 1

వట విటపి సమీపే భూమి భాగే నిషణ్ణం
సకల మునిగణానాం జ్ఞానదాతార మారాత్।
త్రిభువన గురుమీశం దక్షిణామూర్తి దేవం
జనన మరణ దుఃఖ చ్ఛేద దక్షం నమామి॥ 2

ఓం నమః ప్రణవార్థాయ శుద్ధ జ్ఞానైక మూర్తయే।
నిర్మలాయ ప్రశాంతాయ దక్షిణామూర్తయే నమః॥ 3

గురవే సర్వలోకానాం భిషజే భవరోగిణామ్।
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః॥ 4

చిత్రం వటతరోర్మూలే వృద్ధా శ్శిష్యా గురుర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయాః॥ 5

ఛిద్రనాయ, మహేషాయ వటమూల నివాసినే
సచ్చిదానందరూపాయ దక్షిణామూర్తయే నమః॥ 6

ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే।
వ్యోమ వృద్వ్యాప్య దేహాయ దక్షిణామూర్తయే నమః॥ 7

# స్తోత్రము

శ్లో॥ విశ్వం దర్పణ దృశ్యమాననగరీ తుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా ।
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మాన మేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 1

శ్లో॥ బీజస్యాన్తరి వాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పున:
మాయాకల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతమ్
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ య: స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 2

శ్లో॥ యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే
సాక్షా త్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్
యత్సాక్షాత్కరణా ద్భవే న్న పునరావృత్తి ర్భవాంభోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 3

శ్లో॥ నానాఛిద్ర ఘటోదర స్థిత మహాదీప ప్రభాభాస్వరం
జ్ఞానం యస్య తు చక్షురాది కరణ ద్వారా బహిస్స్పందతే
జానామీతి తమేవ భాంత మనుభా త్యేతత్ సమస్తం జగత్
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 4

శ్లో॥ దేహం ప్రాణ మపీంద్రియాణ్యపి చలాం బుద్ధిం చ శూన్యం విదు:
స్త్రీ బాలాంధజడోపమా స్త్వహమితి భ్రాంతా భృశం వాదిన:
మాయాశక్తి విలాస కల్పిత మహావ్యామోహ సంహారిణే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 5

శ్లో॥ రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయాసమాచ్ఛాదనాత్
సన్మాత్ర: కరణోపసంహరణో యోఽ భూత్సుషుప్త: పుమాన్
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే య: ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 6

శ్లో॥ బాల్యాది ష్వపి జాగ్రదాదిషు తథా సర్వా స్వవస్థా స్వపి
వ్యావృత్తా స్వనువర్తమాన మహ మిత్యంత: స్ఫురంతం సదా
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం యో భద్రయా ముద్రయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 7

శ్లో॥ విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామి సంబంధత:
శిష్యాచార్యతయా తథైవ పితృ పుత్రాద్యాత్మనా భేదత:
స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయా పరిభ్రామిత:
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 8

శ్లో॥ భూరం భాంస్యనలోఽ నిలోఽ బర మహర్నాథో హిమాంశు: పుమాన్
ఇత్యాభాతి చరాచరాత్మక మిదం యస్యైవ మూర్త్యష్టకమ్
నాన్య త్కించన విద్యతే విమృశతాం యస్మా త్పరస్మాద్విభో:
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥ 9

ఫలశ్రుతి

శ్లో॥ సర్వాత్మత్వ మితి స్ఫుటీకృత మిదం యస్మా దముష్మిం స్తవే
తేనాస్య శ్రవణా త్తథార్థమననా ద్ధ్యానా చ్చ సంకీర్తనాత్
సర్వాత్మత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వత:
సిద్ధ్యేత్ తత్పునరష్టధా పరిణతం చైశ్వర్య మవ్యాహతమ్ ॥ 10

ఓం తత్ సత్

# మృత్యుంజయ మహా మంత్రము

**శ్లో॥ ఓం త్రయంబకం యజామహే । సుగంధిం పుష్టి వర్ధనమ్ ।**
**ఉర్వారుక మివబంధనాన్ । మృత్యోర్ముక్షీయమామృతాత్ ॥**

(ఇది పరమ శివుని మంత్రము. ప్రతి దినము భక్తి శ్రద్దలతో జపించు వారికి అపమృత్యు భయము నుండి కాపాడి దీర్ఘాయువును, శాంతి సౌఖ్యములను ప్రసాదించును. మోక్షప్రధమగు మహా మంత్రరాజము).

ఓం తత్ సత్

# సర్వశాస్త్రసారము

**శ్లో॥ "ధర్మో విశ్వస్య జగత: ప్రతిష్ఠా"**

సమస్త జగత్తునకు ధర్మము ఆధారము.

**శ్లో॥ "యతో ధర్మస్తతో జయ:"**

ఎక్కడ ధర్మముండునో అక్కడ జయముండును.

**శ్లో॥ "ధర్మో రక్షతి రక్షిత:"**

మనము ధర్మమును కాపాడిన మనలను ధర్మము కాపాడును.

**శ్లో॥ "స్వకర్మణా త మభ్యర్చ్య"**

స్వధర్మానుష్ఠానమే పరమేశ్వరారాధనము.

**శ్లో॥ "తస్మాత్ సిద్ధి: తపస:"**

స్వధర్మానుష్ఠాన మనెడి తపస్సు వలన అభీష్టసిద్ధి యగును.
కావున ఎవరి ధర్మములను వారు చక్కగా నిర్వర్తింపవలెను.
దానిచేత లోకక్షేమ మగును.

**శ్లో॥ "న గురో రధికమ్"**

సద్గురువును మించిన దేదియును లేదు.

**శ్లో॥ మా మేకం శరణం వ్రజ"**

నన్నొక్కనినే శరణు జొచ్చుము.

**శ్లో॥ "ఏకం మాం శరణం వ్రజ"**

అఖండముగా నుండు నన్ను శరణు జొచ్చుము.

**శ్లో॥ "తత్త్వమేవ త్వమేవ తత్"**

అదియే నీవు. నీవే అది.

**శ్లో॥ "నేహ నానాऽస్తి కించన"**

ఇచట నానాత్వమేమియు లేదు - ఇందు ఏదియు లేదు.

**శ్లో॥ "స ఆత్మా"**

అదియే ఆత్మ - అదియే నిజరూపము.

**శ్లో॥ అఖండైకరసం సర్వమ్"**

సర్వము అఖండము, ఏకరసము - అభిన్నస్వభావము.